Telugu Classics - Popular Edition Series

ద్విపద

బసవపురాణము

పాల్కురికి సోమనాథకవి ప్రణీతము

[సంక్షిప్తము]

పరిష్కర్త :

గూడ వేంకట సుబ్రహ్మణ్యం ఎం. ఏ.

ప్రచురణ :

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవనము :: హైదరాబాదు-4.

ప్రథమ ముద్రణ :
జనవరి : 1969
ప్రతులు : 4000

మూల్యము : రూ. **2 - 50**

ముద్రణ :

గ్రీన్ ప్రింటింగ్ ప్రెస్,
బాంబే బజార్ సందు,
ఆబిడ్ సర్కిల్, హైదరాబాద్.

తొలిపలుకు

మూఁడు సంవత్సరాలక్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా ఉండిన శ్రీ ఎం. ఆర్. అప్పారావు గారు చేసిన సూచనల ననుసరించి తెలుఁగు భాషలోని సాహిత్యము అందఱికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటించవలెనని అకాడమీ నిశ్చయించినది. తెలుఁగుభాషలోని పూర్వగ్రంథసముదాయము ఈనాడు పాఠకునికి సక్రమముగా సరసమైన ధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడివిడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమీ ఒక ప్రణాళికను సిద్ధము చేసినది. ఈ ప్రణాళిక ప్రకారము ఈ కార్యక్రమము మూఁడు తరగతులుగా విభజించనైనది. మొదటిది ప్రాచీనప్రబంధాల ప్రకటన. రెండవది మహాభారతము, భాగవతము, హరివంశము, భాస్కరరామాయణము, బసవపురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట. మూఁడవది భారత భాగవతాలనుండియు నాచన సోమన, కంకంటి పాపరాజు, కూచిమంచి తిమ్మకవి రచనల నుండియు భాగాలను ఏర్చి కూర్చి ప్రకటించుట. మొదటి తరగతిలో 29 ప్రబంధాలను 29 సంపుటాలుగా, రెండవ తరగతిలోని గ్రంథాలను 13 సంపుటాలుగా, మూఁడవ తరగతిలోని గ్రంథాలను 8 సంపుటాలుగా, మొత్తము 50 సంపుటాలను ప్రకటించు కార్యక్రమము స్వీకరించవలె నని అకాడమీ తీర్మానించినది.

ఈ ప్రణాళిక ప్రకారము ప్రతిసంపుటము 1/8 డెమ్మిసైజులో క్యాలికో బైండుతో 200 పేజీల గ్రంథముగా నుండవలెనని నిర్ణయించనైనది. ప్రతి గ్రంథములో గ్రంథకర్తనుగూర్చి, గ్రంథ ప్రాశస్త్యమును గూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలె నని

నిశ్చయించనైనది. చౌకగా పాఠకులకు అందజేయవలెనను ఉద్దేశముతో ఈ సంపుటాల వెల తక్కువగా నిర్ణయించ నైనది. ఇప్పటివఱకు మొదటి తరగతిలో 29 పుస్తకాలను ప్రకటించి ముద్రించుట జరిగినది. ప్రస్తుతము రెండవ తరగతిలోని పుస్తకాల ప్రకటన ప్రారంభమైనది. మేము కోరినంతనే యీ సంపుటము సిద్ధముచేయు బాధ్యతను స్వీకరించి నిర్ణయించిన గడువులోపల వ్రాతప్రతిని అందజేసిన శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యముగారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు. ఈ తరగతిలోని మిగిలిన పుస్తకాలు ఈ సంవత్సరాంతము వరకు ముద్రితము కాగలవని ఆశించుచున్నాను.

ఈ ప్రణాళికను అమలుచేసి వ్రాతప్రతులను సిద్ధముగావించి ముద్రించుటకు కావలసినడబ్బు మొత్తము అకాడమీకి యిచ్చుటకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వాగ్దానము గావించి యిప్పటివఱకు కొంత డబ్బునుగూడ విడుదల చేసినవి. ఇందుకు అకాడమీ పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. నిర్ణయించిన గడువులోపల ఈ సంపుటా లన్నిటిని ప్రకటించి ఆంధ్ర పాఠకలోకానికి అందజేయగల మని విశ్వసించు చున్నాను.

హైదరాబాదు
6—1—1969

దేవులపల్లి రామానుజరావు,
కార్యదర్శి.

విషయసూచిక

విషయము | పుట

పీఠిక

విషయము		పుట
పురాణములు	...	i
ప్రథమాంధ్ర వీరశైవ పురాణము	...	ii
పురాణ విధము	...	iii
దేశిసంప్రదాయము	...	iv
జైనపురాణ ప్రభావము	...	vi
వస్తుసంవిధానము	...	vii
ద్విపదరచన	...	xvi
జాను దెనుగు	...	xviii
తెలుగుముద్ర	...	xx
ప్రాసవడి	...	xxi
కవి జీవిత విశేషములు	...	xxiii
జన్మస్థలము	...	xxiii
కులగోత్రాదులు	...	xxv
మహిమలు	...	xxix
కాలము	...	xxxi
సోమనాథుని కృతులు	...	xxxii
కవిత్వము	...	xliv
బసవపురాణ ప్రాశస్త్యము	...	xlvi
సంక్షిప్త ప్రతి	...	xlvii

ప్రథమాశ్వాసము

అవతారిక	...	1
కథారంభము	...	10
నారదుఁడు కైలాసమున కేఁగుట	...	11

విషయము		పుట
నారదుఁడు శివునకు భూలోకవృత్తాంత మెఱింగించుట	...	11
శివుఁడు పార్వతితో నందికేశ్వరుని వృత్తాంతము చెప్పుట	...	12
శిలాదుని తపస్సు	...	13
శివుఁడు శిలాదునకు వర మొసంగుట	...	14
నందికేశ్వరుని యవతారము	...	15
శివుఁడు నందికేశ్వరుని మర్త్యమున బసవేశ్వరుఁడుగా జనింపఁ బంపుట		20
బసవేశ్వరుఁడు వడుగు వల దని తండ్రితో వాదించుట		31
బసవేశ్వరుని పెండ్లి	...	37
బసవేశ్వరుఁడు కప్పడి సంగమేశ్వరమున కేఁగుట	...	41
సంగయదేవుఁడు బసవేశ్వరునకుఁ బ్రత్యక్ష మగుట	...	42

ద్వితీయాశ్వాసము

బసవేశ్వరునకు బిజ్జలుఁడు దండనాయక పద మిచ్చుట	...	47
బసవేశ్వరుఁడు కల్యాణకటకము చేరుట	...	48
బసవేశ్వరుని బాస	...	51
బసవేశ్వరుని దర్శింప శివభక్తు లరుదెంచుట	...	53
,, శివాచారనిరతి	...	54
బసవని మేనల్లుఁడు చెన్నబసవని మహిమ	...	56
చెన్నబసవన బసవేశ్వరుని స్తుతించుట	...	57
అల్లమప్రభుని రాక	...	58
అల్లమప్రభునికి విందుపెట్టుట	...	60
అల్లమప్రభువు బసవనికి వరము లిచ్చుట	...	62
వంగకాయలు లింగము లైన కథ	...	63
జొన్నలు ముత్తెము లైన కథ	...	64
సంగమేశ్వరుఁడు బసవని మూఁడవ కన్నడుగు కథ	...	65
బసవఁడు గొల్లెతచల్లకడవఁ బడకుండఁ బట్టిన కథ	...	69
తిరుచిట్టంబలుని కథ	...	70

విషయము		పుట
శివుఁడు తనహృదయమున బసవనిఁ జూపుట	...	72
శివుఁడు పార్వతికి బసవనిమహిమ తెలుపుట	...	73

తృతీయాశ్వాసము

నక్కలు గుఱ్ఱము లైన కథ	...	80
బసవఁడు తనభార్య చీర విప్పించి యొకజంగమునికిచ్చిన కథ	...	80
సూర్యాస్తమయ వర్ణనము	...	84
ముగ్ధసంగయ్య కథ	...	85
చంద్రోదయ వర్ణనము	...	91
రుద్రపశుపతి కథ	...	94
బెజ్జమహాదేవి కథ	...	97
ఉడుమూరి కన్నప్ప కథ	...	103
కళియంబనయనారు కథ	...	122
సకలేశ్వరమాదిరాజయ్య కథ	...	123

చతుర్థాశ్వాసము

మడివాలు మాచయ్య కథ	...	133
బసవఁడు బిజ్జలునకు మాచయ్యమహిమఁ జెప్పుట	...	136
బిజ్జలుఁడు మాచయ్యఁ జంప నేనుఁగుఁ బంపుట	...	139
మాచయ్య యేనుఁగును జంపుట	...	139
బసవన్న బిజ్జలుని మాచయ్యకడకుఁ బిలిచికొనిపోవుట	...	141
మాచయ్య బిజ్జలుని యేనుఁగును బ్రతికించుట	...	141
మాచయ్య బసవని గీతమును విని కోపించుట	...	142
బసవన్న మాచయ్యకడ కేఁగి మన్నింప వేఁడుట	...	142
మాచయ్య బసవన్నకు నిమ్మవ్వ కథ చెప్పుట	...	146
సిరియాలుని కథ	...	146
సంగళవ్వ కొడుకును బిలుచుట	...	150

విషయము		పుట
నిమ్మవ్వ కథ	...	152
నరసింగనయనారు కథ	...	157
కొట్టరువుచోడని కథ	...	159

పంచమాశ్వాసము

కిన్నరబ్రహ్మయ్య కథ	...	162
కిన్నర బసవనియొద్దకుఁ బోవుట	...	163
గొజియ కథ	...	163
కిన్నరబ్రహ్మయ్య పిలువ శివుఁ డో యని పల్కుట	...	170
మోళిగమారయ్య కథ	...	174
కన్నద బ్రహ్మయ్య కథ	...	179
ముసిడి చౌడయ్య కథ	...	185

షష్ఠాశ్వాసము

ఏకాంత రామయ్య కథ	...	198
షొడ్డలదేవు బాచయ్య కథ	...	205

సప్తమాశ్వాసము

శివనాగుమయ్య కథ	...	227
బోయల తగవు	...	235
బసవన్న విష మారగించుట	...	241
జగదేవ దండనాయకుని కథ	...	247
అల్లయ్య మధుపయ్యల కథ	...	250

పీఠిక

తెలుఁగుకవి తొలిసారిగా నిర్మించిన స్వతంత్రపురాణము బసవ పురాణము. అపార శైవమతాభినివేశమునకును, అపూర్వకావ్యరసావేశము నకును సంగమక్షేత్ర మైన పాలకురికి సోమనాథుని హృదయసీమ నుండి యవత రించిన ప్రప్రథమాంధ్ర ద్విపద సాహిత్యభారతి యీ కృతి !

పురాణములు :

సామాన్యముగా నొక జాతియొక్క - లేక - ఒక మతముయొక్క సంప్రదాయములను బలపఱచుటకొఱకు చరిత్ర కందని పురావృత్తములను సముజ్జ్వలాధ్యాత్మిక దృష్టితో సముద్ధరించి వ్యాఖ్యానించు లక్ష్యముతో నిర్మింపఁ బడు సారస్వతగ్రంథములు పురాణములు. సంస్కృత పురాణము లట్టివి. తత్కర్త లైన యార్షమనీషులు పురాతత్త్వ జిజ్ఞాసువు లై సర్గప్రతిసర్గాది మహా విషయములను శ్రుతిస్మృతి పరమార్థానుసంధానవృత్తు లై భావించి, దర్శించి వానిని చతుర్వర్గఫలోపాత్తము లగునట్లు మిత్రసమ్మితములుగాఁ బ్రపంచించిరి ; అనంతకాలస్వరూపుఁడై సృష్టిస్థితిలయాత్మకమైన విశ్వసంసార పరిభ్రమణము నకు సాక్షీభూతుఁడగు పురాణపురుషుని పరతత్త్వమును త్రిభాషల నాశ్రయించి వ్యాఖ్యానించిరి ; ఆగమార్థజలసేచనముచే భారతీయ హృదయక్షేత్రముల నార్ద్రీకరించి యార్షసంస్కృతిసస్యములను బండించిరి ; అమూల్య కథా నిధులను జూపి మురిపించుచు నమోఘ శాస్త్రవిధులను జెప్పి యొప్పించుచు కవిరసిక ముముక్షు జనములయొక్క రచనాప్రసంగ వ్యాసంగముల నుపలాలించు మాతృ మూర్తులుగా పురాణములను దీర్చిదిద్దిరి. కావ్యశాస్త్రములవలెఁ గాక పురాణములు జనసామాన్యము నుద్దేశించి రచింపఁబడినవి. కావున మతవ్యాప్తికి గ్రంథములు శక్తిమంతము లైన సాధనములుగా గుర్తింపఁ బడినవి. శైవవైష్ణవాది మత శాఖాంతరము లన్నియుఁ బురాణముఖమున జనహృదయసీమలందు వ్యాపించి నవి. తత్తన్మతప్రధానదేవతాకములైన పురాణములు ప్రజల మన్ననల నందుకొని నవి. దానిని గమనించిన జైనబౌద్ధములు పురాణతుల్యము లైన మతగ్రంథము లను అవతారకథాసింధువులుగా నిర్మించుకొని జనసామాన్యము నాకర్షించినవి.

ఇట్లు మనదేశమున మతప్రవక్తల ప్రత్యక్ష ప్రవచనములకంటె పురాణకర్తల పరోక్ష హితోపదేశములు మతవ్యాప్తికి మధురమార్గముల నావిష్కరించినవి.

ప్రథమాంధ్ర వీరశైవ పురాణము :

వీరశైవమతము బసవేశ్వర ప్రవర్తితము. 1 క్రీ॥శ॥ 1162-1168 సం॥ల మధ్య కళ్యాణకటకము నేలిన బిజ్జలుని కొలువుకూటమున బసవేశ్వరుఁడు మంత్రిగా, బండారిగా నుండి ప్రభుత్వముతోపాటు భక్తిమహిమలఁ బ్రకటించి తనమతమున కెనలేని ప్రాబల్యము గల్పించెను. దక్షిణాపథమున నాతనిమతము నకు విడిదిపట్టులు విరివిగా లభించినవి. బసవేశ్వరుఁ డెంత తత్త్వవేత్తయో అంత భక్తకవి. అందుచే నతఁడు తనసమకాలికులను స్వీయగంభీరమతప్రవచనము లచే నుత్తేజపఱచుటతో నాగక తన తరువాతి తరములవారికిని భక్తిరసామృత మందింపఁగల తత్త్వవచనములను గన్నడమునందు లిఖించి యమరుఁడైనాఁడు. అతని యుజ్జ్వల జీవితాధ్యాయము ముగిసిన తరువాత అతనియొక్కయు, అతని యనుయాయుల యొక్కయు వచనగీతములే యతని కీర్తికి పతాకలై నిలచినవి; తన్మత పోషణకు మాతృకలై వెలసినవి. బసవేశ్వరభానుఁ డస్తమించిన తరువాత నతని కాంతిసారము గైకొని వెలుఁగొందు భక్తతారకాగణము వెల్లివిరిసినదే కాని సోముఁ డుదయించునంతవఱకు కామతజగత్తున సుధాశరచ్చంద్రికలు లేవు.

బసవేశ్వరుఁడు కన్నడిగుఁడు. పాల్కురికి సోమనాథుఁడు బహుభాషా వేత్తయైన తెలుఁగువాఁడు. ఓరుగల్లునకుఁ బండ్రెండు క్రోసుల దూరమున నున్న పాలకురికి యతని జన్మస్థానము. సోమనాథుఁడు కలము పట్టునాటికి తెలుఁగునాఁట బసవేశ్వర వీరశైవమత సంప్రదాయప్రభావ మున్నను, శైవ పండిత త్రయములోఁ దృతీయుఁడైన మల్లికార్జున పండితారాధ్యుల యారాధ్య సంప్రదాయము బలీయముగా నాటుకొని యుండెను. బసవేశ్వర పండితారాధ్యులు సమకాలికు లయ్యు నొకరినొకరు దర్శించుకొనలేక పోయిరి. బసవేశ్వర మహి

1. వీరశైవము బసవేశ్వరాద్యుపజ్ఞమే యని కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిలవారి యభిప్రాయము. (చూడుడు : బ.పు. పీఠిక పుట.78-79 ఆంధ్రగ్రంథమాల ప్రచురణము). వీరశైవము బసవేశ్వరోపజ్ఞము కాదనియు, అత్యంత ప్రాచీన మనియు, అది క్షీణదశను బ్రాపింపఁగా బసవేశ్వరుఁ డుద్ధరించి సంస్కరించె ననియు శ్రీ బండారు తమ్మయ్యగారి యభిప్రాయము. (చూడుడు : బ. పు. పీఠిక పుట. 139-146, వావిళ్ల ప్రచురణము).

మను బెలిదేవ వేమనారాధ్యాదుల వలన వినిన పండితుఁడు తనజీవిత చరమావస్థలో నతనిని దర్శింప కల్యాణకటమున కేగుచు, బసవన సంగమక్షేత్రమున లింగైక్య మందిన వార్త మార్గమధ్యమున విని, దుఃఖితుఁడై శ్రీశైలమున కేఁగి యచ్చట జీవితశేషమును గడుపుచు స్వల్పకాలముననే యాతఁడును శివైక్య మందినట్లు తెలియుచున్నది. పండితుఁడు రచించిన శివతత్త్వసారము వీరశైవమతాచార సంపత్తిని, ఆరాధ్య సంప్రదాయమును బ్రతిపాదించు ప్రామాణిక గ్రంథము. సోమనాథుఁడు మొదట ఆగ్రంథప్రభావమునకు లోనై 'అనుభవసారము'ను రచించి తన కవితావ్యవసాయమును సాగించినాఁడు. అపైనాతఁడు శివభక్తకూటములకు సంగమక్షేత్రమైన శ్రీశైలమును దర్శించు సందర్భములందు బసవని గీతములను, అతని మహిమలను విని యుండ వచ్చును. క్రమముగా నాతని చిత్త మామహాపురుషుని దివ్యమహిమాభివర్ణనము నం దాయత్త మగుటచే భక్తిప్రపత్తిరూపము లగు పెక్కు లఘుకృతులను జెప్పఁదొడఁగెను. కాని, ప్రసన్న కవితాసుధాధారగల పాలకురికి వాని పలుకుల వెలఁది జిలిబిలియెలుగులతో గడియ కొక్క వృత్తమున నర్తించుచు వస్తుగౌరవము లేని లఘుకృతులతో నాగక మతప్రవక్త మహిమాన్విత జీవితచరిత్రము చిత్రించు పురాణము గానము సేయ సమకట్టినది. దాని ఫలమే ప్రప్రథమాంధ్ర వీరశైవపురాణ మగు బసవపురాణము !

పురాణ విధము :

బసవపురాణము ఏ పురాణమునకును అనువాదము కాదు. ప్రసిద్ధమైన మహాపురాణ సంప్రదాయము ననుసరించి పంచలక్షణవిశిష్టముగా నిర్మింపఁబడినదియును గాదు. కాని పురాణశబ్దముతోఁ బుట్టి ప్రఖ్యాతి నందినది. అది దాని ప్రత్యేకత యైనను పురాణసంప్రదాయజ్ఞులు దానిని విమర్శింపక విడువలేదు. పిడుపర్తి సోమనాథుని బసవపురాణమున నిట్లొక యైతిహ్యము కలదు :

సీ. "ఒకనాఁడు శివభక్తు లోరుఁగంటను స్వయం
భూదేవుమంటపమున వసించి
బసవపురాణంబు పాటించి విను వేళ
హరుని గొల్వఁ బ్రతాపుఁ డచటి కేఁగి
యాసంభ్రమం బేమి యనుడు భక్తులు బస
వనిపురాణం బర్థి వినెద రనిన

వినఁ నాపురాణంబు విధ మెట్లొకో యన్న
ధూర్తవిప్రుం డొక కర్త చేరి
ఆ. పాలకురికి సోమపతితుఁ డీనడుమను
బెనచె మధ్య (ప్రాస) వళ్లు పెట్టి ద్విపద
యప్రమాణ మిది యనాద్యంబు పద మన్న
నరిగె రాజు" ... ... (పీఠిక. 28 ప.)

ఇందలి విప్రుఁడు వీరశైవులను ధూర్తుఁడు కావచ్చును. కాని, యతఁడు పురాణ సంప్రదాయజ్ఞుఁడు. అతనికి పాలకురికి సోమనాథుఁడు పతితుఁడు కావచ్చును. కాని, అతఁడు దేశి సంప్రదాయము ననుసరించి పురాణము నిర్మించిన పరమ మాహేశ్వరుఁడు.

పైకథలో రాజు "ఆపురాణము విధ మెట్టి ?" దని ప్రశ్నించెను. "ఆపురాణమును సోమన యీనడుమ ప్రాసవళ్లు పెట్టి ద్విపదలో రచించె" నని విప్రుఁడు పేర్కొనెను. అది యప్రామాణిక మనియు, ననాద్య మనియు విమర్శించెను. ఈ విమర్శ ద్విపదకు మాత్రము పరిమిత మైనది కాదు. ఛందము కావ్యరచనాంగములలో నొక్కటి మాత్రమే. పురాణవిధ మనఁగా పురాణనిర్మాణవిధమును, తద్వస్తు నిర్వహణ విధమును, తల్లక్షణ విధమును గూర్చియు ప్రశ్నించెనని భావించుటకు వీ లున్నది. కావున నావిప్రుఁడు బసవపురాణము సంస్కృతపురాణములవలెఁ గాక వేదప్రామాణ్యము లేని దనియు, అనార్ష మనియు, వానివలెఁ బ్రాచీనము కా దనియు, నవీన మనియు విమర్శించె నని గ్రహింప వచ్చును. ఈ లక్షణములు ప్రాచీన (మార్గ) పురాణసంప్రదాయజ్ఞునకు దోషములుగాఁ దోప వచ్చును కాని దేశి (పురాణ) సంప్రదాయజ్ఞునకు నవీనగుణములుగా స్ఫురింప వీ లగుచున్నది.

దేశిసంప్రదాయము :

పురాణ లక్షణము లన్నియు సంస్కృతపురాణము లన్నింటియందును బాటింపఁబడి యుండ లేదని విమర్శకులు భావించుచున్నారు. మహాపురాణముల విధమే యిట్లుండ వాని యుత్సవ విగ్రహము లైన యుపపురాణముల సంగతి వేఱుగాఁ జెప్పవలసిన దేమున్నది? ఏమైనను పురాణములలో నత్యంతప్రాచీనము లైన వానియందు సర్గప్రతిసర్గముల కధికప్రాముఖ్య ముండెడిది. క్రమముగా

వంశ మన్వంతరములకును, రాజవంశ చరిత్రములకును ప్రాధాన్యము వచ్చినది. ఆ పైన మతప్రబోధైకదృష్టితో నిర్మింపఁబడిన పురాణోపపురాణముల యందు దేవతా మహిమాభివర్ణనాత్మకము లైన కథలును, అవతారగాథలును, మతధర్మ బోధలును, భక్త చరిత్రములును విశేషముగాఁ జోటు చేసికొనినవి. బౌద్ధులును జైనులును ఇట్టి పురాణసంప్రదాయమును కొంత పరోక్షముగా ననుసరించి జాతక కథలను, జైనపురాణములను నిర్మించుకొనిరి. వీరిలో పురాణ శబ్దమును విరివిగా వాడుకొని వాఙ్మయ నిర్మాణము చేయుటయే కాక ప్రసిద్ధ సంస్కృతేతిహాస కావ్య పురాణకథలను జైనమతానుగుణముగా మార్చి తిరుగవ్రాయుటకును వెను కంజ వేయనివారు జైనులు. కేవలజ్ఞాన సిద్ధిచే ముక్తు లైన తీర్థంకరుల జన్మ మహిమాది విశేషములఁ బ్రతిపాదించుచు తన్మతప్రచారానుగుణముగా నిర్మింపఁ బడినవి జైనపురాణములు. ఇట్టివి సంస్కృత ప్రాకృతములందు కొన్ని వెలసి యున్నను సామాన్యజనుల కందుబాటులో నుండునట్లు వానిని జైనకవులు దేశీయ భాషలలో ననువాదము గావించిరి. ఇట్లు పురాణము పంచలక్షణవిశిష్ట మను ప్రసిద్ధినిఁ గోల్పోయి మత ప్రవక్తలను భగవన్మూర్తులుగా భావించి, భజించుట కును, తన్మతానుయాయు లగు మహాత్ముల వైశిష్ట్యమును, మహిమలను గ్రహించు టకును, పరమతఖండన, స్వీయమత పోషణానుసరణాదుల కైన పరిజ్ఞానము నందించుటకును నేర్పడిన కథాకావ్యములుగా రూపొందినవి. ఇందు చరిత్ర కందని సనాతనుల చరిత్ర లుండక పోవచ్చును. ప్రతీకాత్మక సృష్టి కనుపడక పోవచ్చును. సమకాలికులే పురాణపురుషులుగాఁ గీర్తింపఁబడవచ్చును. పురాణగౌరవము నభిలషించెడి నవీనమతముల యాకాంక్షలు నామశ్రవణమాత్రముననే పౌరాణి కత్వము స్ఫురింపఁజేయు నిట్టి నవీన కావ్యలతికలకు దోహదక్రియ లొనర్చినవి.

దక్షిణ దేశభాషా సాహిత్యములలో నిట్టి పురాణములు మతవాఙ్మయముల కెత్తిన కీర్తిపతాక లై విరాజిల్లు చున్నవి. కన్నడమున ప్రసిద్ధజైనకవులు తీర్థం కరుల చరిత్రలను పురాణములుగా వెలయించిరి. 'ఆదికవి' యని ప్రసిద్ధిగాంచిన పంపకవి (క్రీ. శ. 941) జైనప్రథమ తీర్థంకరుఁ డైన పురుదేవుని చరిత్రమును 'ఆదిపురాణ' మనుపేర చంపువుగా ననువదించెను. అది జినసేనుని సంస్కృత కృతి కనుకృతి. ఇట్లే 'ఉభయకవి చక్రవర్తి' యైన పొన్నకవి పదునాఱవ జైన తీర్థంకరుని జీవిత చరిత్రమును చంపువుగా శాంతిపురాణ మను పేర రచిం చెను. 'కవిచక్రవర్తి' రన్నఁడు ద్వితీయ తీర్థంకరుని చరిత్రను అజితపురాణ

మను పేర చంపూ గ్రంథముగా నిర్మించెను. ఇవికాక నాగచంద్రకవి మల్లినాథపురాణము, నయసేనుని ధర్మనాథపురాణము, జన్నకవి అనంతనాథపురాణము మొదలగునవి ప్రసిద్ధ కన్నడ జైనపురాణములు. ద్రావిడవాఙ్మయమునందు అఱువత్తుమూవురు నయనారు లను శివభక్తుల చరిత్రములను గూర్చి 'శేక్కిళ్ళార్' అను కవి రచించిన 'పెరియపురాణము' కడు ప్రసిద్ధి కెక్కి యున్నది. ఇట్లు మతాచార్యుల యొక్కయు భక్తుల యొక్కయు కథలను గుదిగ్రుచ్చి కూర్చి యొక కథాహారముగా సంతరించి పురాణ మను పేరఁ బ్రవర్తిల్లఁ జేయుట కర్ణాట ద్రవిడ కావ్యవస్తు నిర్మాణ పద్ధతులలో నొకటిగా క్రీ. శ. 10వ శతాబ్దమునుండియే గుర్తింపఁబడి యున్నదని తెలియుచున్నది. ఇది ఆర్షము, ఆద్యము నైన సంప్రదాయము కాక దేశీయము, నవీనము నైన కావ్యనిర్మాణ ప్రక్రియగా రూపొందిన దని గ్రహింప వీలగుచున్నది. బసవపురాణ మీసంప్రదాయము ననుసరించి 'పురాణాఖ్య'ను ధరించి ప్రప్రథమ వీరశైవపురాణ మై వాసి కెక్కినది. ఇట్టి రచనల కిదియే తెలుఁగున శ్రీకారము చుట్టినది.

జైనపురాణ ప్రభావము :

సోమనాథుఁడు జైనపురాణ సంప్రదాయముల నెఱుంగుటకు ఓరుగల్లు ప్రాంత మెంతయో తోడ్పడియుండును. ఓరుగల్లు బహువిధమతస్థుల కావాస మైన మహాంధ్రనగర మని విఖ్యాతి నందినది. నన్నయనాటికి తూర్పుచాళుక్య రాజుల వైదికమతాభినివేశముచే వేంగిదేశమున జైనబౌద్ధముల ప్రాబల్యము సడలినది. కాని తెలంగాణమున నంతగా తగ్గలేదు. అందుల కప్పు డాప్రాంతము నేలు రాజులు తూర్పుచాళుక్యులవలె వైదికమతపోషకులు కాకపోవుటయే ప్రధానకారణము. అనుమకొండలోఁ గాకతీయసామ్రాజ్యము సుమారు పదునొకండవ శతాబ్ద్యారంభముననే మొదటి బేతరాజు స్థాపించి యుండెను. అతఁడు జైన మతావలంబుఁడుగాఁ గానవచ్చుచున్నాఁడు. అతని తరువాతివాఁడగు మొదటిప్రోలరాజును జైనుఁడే. కాకతీయ ప్రభువులలో మొట్టమొదట శైవము నవలంబించినవాఁడు రెండవబేతరాజు. అతఁడు పరమమాహేశ్వరుఁడని కీర్తింపఁబడినాఁడు. అతఁడు 11వ శతాబ్ది చరమపాదమునఁ బాలనకు వచ్చినవాఁడు. అప్పటినుండియు నోరుగల్లున శైవమునకు ప్రాబల్య మేర్పడినది. అది శైవజైన మతముల సంఘర్షణములకు దారి తీసినది. గణపతిదేవ చక్రవర్తి వీరశైవాచార దీక్షావ్రతుఁడగుటచే జైనులను, వారి మతమును క్రూరముగా హింసించినట్లు తెలియుచున్నది.

తిక్కన యోరుగల్లు దర్శించినప్పుడు ఆ రాజు జైనబౌద్ధులతో సోమయాజిని వాదుచేయించెనఁట ! తిక్కన వారి నోడించి వైదికమతమును స్థాపించెనఁట ! అప్పుడు గణపతిదేవుఁడు "జినసమయార్థుల శిరములఁ దునిమె"ననియు, "విద్వేషబౌద్ధుల విలుమాడె" ననియు సిద్ధేశ్వరచరిత్రవలనఁ దెలియుచున్నది. ఓరుగల్లు పతనమునకు జైనమతస్థుల పగయు నొకకారణ మని చారిత్రకులు భావించుచున్నారు. ఇట్లు కాకతీయుల పాలనమున నోరుగల్లులో రాజమతముగా దాదా పొక శతాబ్ది వెలసిన జైనము తన పూర్వగౌరవము నిలుపుకొనుటకొఱకు మఱి యొకటిన్నర శతాబ్దికాలము శైవమతముతో నెదురొడ్డి పోరుచు నంతరించినది. జైనము నెదురించి విజయము సాధించుచున్న శైవము సోమనాథునకు క్రొత్తశక్తిని పుట్టుకతోనే ప్రసాదించి యుండును ![1] జైనమతము జనబాహుళ్యమునందు వ్యాపించుట కుపయుక్తమైన వారి పురాణముల విధము సోముని చిత్తముపై కొంత ప్రభావము వైచియుండును. తత్సంస్కారముతో వీరశైవమున కాంధ్ర కర్ణాట జనహృదయసీమలయందు సువర్ణపీఠము కల్పించు బసవపురాణ నిర్మాణము చేపట్టినాఁడు.

వస్తుసంవిధానము :

బసవేశ్వరచరిత్రమే బసవపురాణ ప్రధానేతివృత్తము. సోమనాథుఁడు తన పురాణకథావస్తువును సేకరించుకొనిన విధము నిట్లు చెప్పుకొనినాఁడు.

"ఆతత బసవపురాతన భక్త- గీతార్థసమితియే మాతృక గాఁగఁ
బూరితం బై యొప్పు పూసలలోన-దారంబుక్రియఁ బురాతనభక్తవితతి
చరితలలోపల సంధిల్ల బసవ-చరితమే వర్ణింతు సత్కృతి యనఁగ." ![2]
"ప్రస్తుతింపంగ సద్భక్తి విస్ఫురణఁ-బ్రస్తుతి కెక్కిన బసవని చరితఁ
జెప్పితి భక్తులచే విన్నమాడ్కి - దప్పకుండ గను యథాశక్తిఁ జేసి."[3]

ఈ వాక్యములవలన బసవపురాణమున కెట్టి నిర్దిష్టమైన గ్రంథము మాతృక కా దనియు, శివభక్తుల వాక్కులయందును, పురాతన భక్త గీతార్థముల

1. "జైన మస్తక విన్యస్త శాతశూల కలిత బిజ్జలతలగుండుగండ బిరుదశోభితుఁడు పాల్కురికి సోమనాభిధుండు" (పీఠిక-25) అని పిడుపర్తి సోమనాథుఁడు తన బసవపురాణమునఁ గీర్తించెను.
2. బసవపురాణము (సంక్షిప్తము). ప్రథమ. ఆ. పం. 179-184.
3. బసవపురాణము (సంక్షిప్తము)-సప్తమ. ఆ. పం. 903-906.

యందును వ్యాపించి యున్న బసవకథార్థములను ప్రోగుచేసి, స్వీయప్రతిభతో వానిని రసవత్తరము లొనరించి, సంవిధానము చెడకుండ వానిని గుదికూర్చి సోమనాథుఁడు పురాణనిర్మాణమొనర్చెననియు స్పష్టమగుచున్నది. సోమనాథుఁ డీపురాణమును భక్తజనకథామంజరిగా సంతరింప భావించినను అంగ దైక్య మను సూత్రమును బసవని చరిత్రముతో సాధించుటచే నాతని కావ్యవస్తువునకు ప్రబంధ సౌందర్య మబ్బినది. సోమనాథుఁడే పండితారాధ్యచరిత్రమున భక్తులు తన బసవ పురాణ నూతనత్వమును, అం దితిహాసఘటనవలన కథాకథనమున కేర్పడిన ప్రాబంధ్యమును గీర్తించి నట్లు ప్రత్యేకముగఁ జెప్పుకొనెను.1

బసవపురాణమును సప్తపర్ణి వలె నేడాశ్వాసముల కావ్యముగా సోమనాథుఁడు భావించెను. అందు ప్రథమాశ్వాసమున 'నందికేశ్వరుఁడు బసవేశ్వరుఁడుగా భువి నవతరించుటయు, నుపనయనసంస్కారమును ద్యజించి వీరమాహేశ్వర వ్రతనిష్ఠుఁ డగుటయు, వివాహితుఁ డై సంగమేశ్వరుని శరణువేఁడుటయు వర్ణింపఁబడినవి. ద్వితీయాశ్వాసమున బిజ్జలుఁడు బసవేశ్వరునకు దండనాయక పద మిచ్చుటయు, కళ్యాణకటకమున బసవేశ్వరుఁడు శివాచారనిరతుఁ డగుటయు, చెన్నబసవఁడు బసవు నారాధించుటయు, అల్లమప్రభువు బసవనివిం దారగించి వరము లిచ్చుటయు, బసవేశ్వరుఁడు తన మహిమలు ప్రదర్శించుటయు, జెప్పఁ బడియున్నవి. తృతీయాశ్వాసము జంగమునకు బసవేశ్వరుఁడు తనభార్యచీర నిప్పించి తన జంగమసేవానిరతిని ప్రకటించిన కథతో నారంభ మై, సంగయ్య యను ముగ్ధభక్తుని చరిత్రమునకు ముగ్ధుఁడైన చెన్నబసవనికి బసవేశ్వరుఁడు ముగ్ధభక్తుల కథల నెఱింగించుటతో విస్తరించినది. చతుర్థాశ్వాసము మడివాలు మాచయ్య కథతో నారంభ మగును. వీరశైవులు తమబాసలను భక్తి మహిమతో పాటించి జంగమలింగరూపు లై అనన్యసాధ్యు లై వెలుగొందెద

1. "ఖ్యాతిగా సద్భక్త గణలాలనముగ
నూతనంబుగ జగన్నుతముగా మున్న
"బసవపురాణ" మొప్పగ రచించితివి;
బసవపురాణ ప్రబంధంబునందు
ప్రథిత పురాతన భక్తగుణాను
కథనంబు లితిహాస ఘటనఁ గూర్చితివి;"

—పండితారాధ్యచరిత్ర - దీక్షాప్రకరణము, పుట 11.

(ఆం.గ్రం.మా. 30. పరిష్కర్త: డా. చి. నారాయణరావుగారు (1939)

రనుట కాభక్తుని కథ తార్కాణము. బసవఁ డాతనిని సాక్షాచ్ఛివునిగా భావించి సేవించెను. అతఁడే యొకసారి బసవని గీతములో వినవచ్చిన యహంకారమును గర్హించి భక్తివలన భక్తున కత్యంత వినయసంపద యేర్పడవలయు నని ప్రాచీనభక్తుల చరిత్రములను పెక్కింటిని దృష్టాంతములుగాఁ బేర్కొనినట్లు వర్ణించుటచే నీయాశ్వాసము కడు దీర్ఘ మైనది. బసవని సమకాలికు లగు కిన్నరబ్రహ్మయాది భక్తుల మహామహిమలను బ్రతిపాదించుటతో పంచమాశ్వాస మైనది. షష్ఠాశ్వాసము జైనులతో వాదుపడి శిర మిచ్చి మహిమాతిశయములను బ్రదర్శించిన ఏకాంతరామాదులవంటి శివభక్తుల కథలతో నిండియున్నది, సప్తమాశ్వాసము కులమున కంత్యజుఁడయ్యు మహిమచే నున్నతుఁ డైన శివనాగుమయ్య వంటి భక్తుల చరిత్రలతో సాగి, బిజ్జలుఁ డకారణముగా నల్లయ్య మధుపయ్య లను భక్తులకన్నులు తీయించుటచే బసవేశ్వరున కాగ్రహము గలిగి కల్యాణకటకమును శపించి, భక్తమండలితోఁ గూడి సంగమేశ్వరమున కేఁగి లింగైక్య మందుటయు, జగదేవాదులు బిజ్జలుని వధించుటయు, నసతికాలములో నా రాజసంతతియు, రాజ్యమును నాశన మగుటయు నను కథాంశములతో ముగియుచున్నది.

మతాచార్యుని నవతారపురుషునిగా నిరూపించుటయే కాక, తత్పూర్వజన్మవిశేషముల నభివర్ణించి ఆదిమూల మైన యతనిస్వరూపము నెఱిఁగించి, ప్రస్తుతావతారహేతువును నిర్దేశించిన కథాభాగ మీ పురాణేతివృత్తమున ప్రస్తావనగా నలరారుచున్నది. బసవేశ్వరుఁడు తొలుత సృష్ట్యాదియం దున్న ధర్మస్వరూపుఁ డగు నాదివృషభేంద్రుఁడు. ఆపైన శిలాదుని తపఃఫలముగా నాతఁడు నందీశ్వరుఁ డై జన్మమెత్తి ద్వితీయశంభుఁ డని కీర్తిఁగాంచెను. నందీశ్వరుఁడే శైవమతోద్ధరణకై బసవేశ్వరాఖ్యతో భువియం దవతరించెను. దీనికి సూత్రధారుఁడు పరమేశ్వరుఁడు. ఇంతకంటె పురాణమున కుదాత్తారంభ మేమి యుండును ? సృష్ట్యారంభాఖ్యసర్గాదికథన మార్షపురాణారంభ మై యుండగా ఆచార్యపూర్వావతార కథాకథన మీ పురాణ ప్రస్తావన మై పరిఢవిల్లినది.

జైనపురాణములయందలి తీర్థంకర చరిత్రలలో పంచజినమహాకల్యాణ

ములు వర్ణింపబడు నని అజితపురాణమునఁ జెప్పఁబడియున్నది.[1] అవి: 1. సురలోకావతరోత్సవము – లేక – గర్భావతరణ కల్యాణము 2. జన్మాభిషేకోత్సవము–లేక–జన్మాభిషేకకల్యాణము. 3. పరినిష్క్రాంతి మహోత్సవము–లేక–పరినిష్క్రమణ కల్యాణము 4. కైవల్యబోధోత్సవము – లేక – కేవలజ్ఞాన కల్యాణము 5. పరినిర్వాణ మహోత్సవము – లేక – పరినిర్వాణకల్యాణము. ఇందు ప్రథమకల్యాణకథాసందర్భములందు తీర్థంకరజీవక్రమ వికాసవ్యంజకములగు పూర్వజన్మకథలు వర్ణితములగుచుండును. వీనిని "భవావళి"యని పిలిచెదరు. తీర్థంకరుల జన్మలకు పూర్వరంగము లైన యిట్టి కథలు పురాణకథావస్తువునకు పూర్వరంగము లై సురలోకావతరోత్సవము ప్రస్తావనాంగతుల్య మై జైనపురాణములందు కానవచ్చుచుండుటచే బసవేశ్వరపూర్వజన్మవృత్తాంత సంవిధానముపై వాని ప్రభావ మున్న దనుటలో విప్రతిపత్తి యుండదు, ఐనను జైన శైవమత సిద్ధాంతములలో సహజముగా నున్న భేదము ననుసరించి తీర్థంకరులు మానవస్థితినుండి దేవస్థితి కారోహణక్రమమున గమించి సిద్ధు లైనట్లుగను, బసవేశ్వరుఁడు ఆదివృషభరూపదేవస్థితినుండి కారణజన్ముఁడైన మానవుఁడుగా నవతరించినట్లును నిరూపింపఁబడెను. స్వీయమతానుగుణముగా పురాణనిర్మాణము చేయగల సమర్థుఁ డగుటచే సోమనాథుఁ డీ కల్పనను ప్రశంసావహముగా నిర్వహించెను. ఇఁక మిగిలిన నాలుగు కల్యాణములును జైనతీర్థంకర జీవితవిధానానుగుణములే. కాని సోమనాథుఁడు వానిని కూడ కథానుగుణముగా మార్చుకొని మతానుగుణముగా కల్పించుకొనెను. అచ్చటి జన్మాభిషేకోత్సవపు తంతువేరు. ఇచ్చటి తంతు వేఱు. సంగమేశ్వరుఁడు ప్రత్యక్ష మై "ఈ భవమున కేన చూ గురుఁడ" నని చెప్పి లోకహితార్థ మైన యాతని యవతారవిశేషము నుగ్గడించుట, జంగమార్చనాది విశేషోత్సవములు జరుపఁబడుట మొదలగునవి బసవేశ్వరుని జన్మాభిషేకోత్సవ విశేషములు. అందలి పరినిష్క్రాంతికి బదులిం దుపనయనము మాని బసవన వీరశైవవ్రతదీక్షను గ్రహించుట వర్ణింపఁ బడినది. కైవల్యబోధోత్సవమునకు బదులు సంగమేశ్వరుఁడు బసవన కొనర్చిన ప్రబోధకథాఘట్టము నిర్వహింపఁ బడినది.

---

1. "సురలోకావతరోత్సవం, పరికృతం జన్మాభిషేకోత్సవం, పరినిష్క్రాంతి మహోత్సవం, ప్రవిమలం కైవల్యబోధోత్సవం, పరినిర్వాణ మహోత్సవం, జినమహా కల్యాణ మైదుం సవిస్తర దిందిర్పువు." —రన్నకవి.
(చూడు:– ఆదిపురాణ సంగ్రహపీఠిక. పుట. 56. సంపాదకుఁడు: ఎల్. గుండప్ప. ఎం. ఏ.

పరినిర్వాణ మహోత్సవస్థానమున బసవని లింగైక్యము వర్ణింపఁబడినది. ఇవి యిట్లుండగా శైవమత సంబంధము లైన పంచాచారములును, అష్టావరణము లును బసవ జీవిత వృత్తాంతమున బ్రతిబింబించునట్లు సోమనాథుఁడు కథాకల్పనలు గావించెను. ఇట్లు తీర్థంకర జీవిత కథాకథనమునందలి జైనపురాణ లక్షణము లను స్థూలముగా గ్రహించి, ప్రజాదరణ సంపాదనార్థము వీరశైవ ప్రథమ పురాణమునందు ప్రవేశపెట్టినను బసవేశ్వర చరిత్రమును పాల్కురికి సోమ నాథుడు స్వతంత్రప్రతిభతోఁ దీర్చిదిద్ది తన వ్యక్తిత్వము ప్రదర్శించెను.

బసవపురాణమున శివభక్తుల కథలు పెక్కు వర్ణింపఁబడినవి. ఆ భక్తు లలో బసవేశ్వరునకు సమకాలీను లైన వారున్నారు. వారిలో అల్లమప్రభువు, ముగ్ధ సంగయ్య, మడివాలు మాచయ్య, సిద్ధ రామయ్య, సకలేశ్వరమాది రాజయ్య, కిన్నర బ్రహ్మయ్య, కన్నద బ్రహ్మయ్య, కలకేత బ్రహ్మయ్య, మోళిగ మారయ్య, ముసిడి చౌడయ్య, సురియ చౌడయ్య, తెలుగు జొమ్మయ్య, ఏకాంత రామయ్య, షోడ్డలదేవు బాచయ్య, సివనాగుమయ్య మొదలగువారు ముఖ్యులు. వీరుకాక పురాతన భక్తులు పెక్కు రీపురాణమున కెక్కియున్నారు. వారిలో చాలమంది ద్రవిడ దేశమున నయనార్లుగాఁ బ్రసిద్ధి చెందియున్న 'యఱువత్తు మూవురి' లోనివారే. వారిచరిత్రలు తమిళమున పెరియపురాణమునందే కాక కన్నడమున హరీశ్వరుని శివగణదరగళె యనుగ్రంథమునందును, గాన నగు చున్నవి. వీనిని సోముఁడు యథావకాశముగాఁ దన పురాణమునఁ బొందుపఱచెను. అయినను సోమన భక్తకథ లన్నియు నొక మూలమునకుఁ గట్టుబడినవికావు; స్వతంత్ర కల్పనా ప్రాయములు.1

శైవసాహిత్యమున 'నఱువత్తు మూవురు' భక్తుల కథ లెట్లున్నవో జైనపురాణములందు త్రిషష్టి శలాకాపురుష చరిత్రము లట్లున్నవి. జినధర్మమును నమ్మి సద్గతి వడసిన మహాపురుషులు అఱువది మువ్వురు కలరని జైన సంప్రదాయము. వారు 24 మంది జైన తీర్థంకుల కంటె భిన్నులు; వారు: 12 మంది చక్రవర్తులు; 24 మంది కామదేవులు; 9 మంది బలదేవులు; 9 మంది వాసుదేవులు ; 9 మంది ప్రతి వాసుదేవులు. వీరికంటె తీర్థంకరులు శ్రేష్ఠులు. వారి చరిత్రలు వర్ణింపఁ బడునప్పుడు పైశలాకా పురుషుల చరిత్రలు యథావకాశముగా

1. బసవపురాణ పీఠిక : శ్రీ వే. ప్రభాకరశాస్త్రిగారు. పుట 29.

జెప్పఁబడుట జైనపురాణవస్తులక్షణములలో ప్రధాన మైన దని విమర్శకులు పేర్కొని యున్నారు.1 ఇట్టి జైనపురాణ సంప్రదాయమును గమనించిన సంస్కారముతో, నఱువత్తుమూవురిలో నందఱు వీరశైవులు కాకపోయినను, పురాణ ప్రాశస్త్య సంపాదనార్థము వారి కథలను గైకొని దేశీయ మైన సంప్రదాయముతోపాటు శివభక్తాభీష్టమును సోమనాథుఁడు పాటించె నని తలంప వీలగు చున్నది.

సమకాలీన భక్తుల చరిత్రములు బసవనితో ముడివడియున్నట్లును, పురాతన భక్తచరిత్రములు తత్కథాసందర్భములందు దృష్టాంతరూపములుగాఁ జెప్పఁబడినట్లును కూర్చుట సోమనాథుని కథాసంవిధాన నైపుణ్యము. పురాతన భక్తులలో ముగ్ధభక్తులు కొందరు కలరు. "నిక్కమీశ్వరుఁగాని నిజమెఱుంగమిని, ముక్కంటి భక్తులు ముగ్ధులుగారె!"2 అని బసవఁడు ముగ్ధభక్తుల స్వభావమును బేర్కొనెను. వీ రితరభక్తులవలె వీరమాహేశ్వర వ్రతపారీణులై యున్నను అధికముగా సమాయకులు, నిరాడంబరులు, స్నిగ్ధ ప్రవృత్తి గలవారు. స్వచ్ఛమైన వాత్సల్యము, పారవశ్యముతోఁగూడిన భక్తిభావము, వెన్నవంటి హృదయము. శివుని గాంచినంతనే ఆప్తునివలె, మిత్రునివలె, పుత్రునివలె భావించి ముగ్ధభావముతో గీర్తించి, సేవించి లాలించెడి స్నేహస్వభావము వారికి వెన్నతోఁ బెట్టిన సుగుణజాలము. వీరు శివునికొఱకై ప్రాణములనైనను త్యజింపసిద్ధమై త్యాగోత్సాహభక్తివీరులై యొప్పువారు. రుద్రపశుపతి, నక్కనైనారు, బెజ్జమహాదేవి, గొడగూచి, దీపదకళియారు, నాట్యనమిత్తండి, ఉడుమూరి కన్నప్ప, కళియంబ నయనారు, సకలేశ్వర మాదిరాజయ్య, ముగ్ధసంగయ్య మొదలగు ముగ్ధభక్తుల చరిత్రము లీ పురాణ తృతీయాశ్వాసమున వర్ణింపఁ బడియున్నవి.

వీరశైవము భక్తిప్రధాన మైన మతము. ఆభక్తి ఆవేశప్రధాన మై సాహసోపేతము లైన యద్భుతకార్యములచేఁ బ్రపంచిత మగు చుండును. వీరశైవులందు స్వీయమతాభినివేశ మెంత కలదో పరమతద్వేష మంత కాన

1. ఆదిపురాణ సంగ్రహ పీఠిక. పుట 154 సంపాదకుఁడు : ఎల్ గుండప్ప ఎం.ఏ. మైసూరు విశ్వవిద్యాలయ కన్నడ గ్రంథమాల 29. (1959).
2. బసవ పురాణము (సంక్షిప్తము) తృతీయ. 451-452 పంక్తులు.

వచ్చుచుండును. వీరశైవలక్షణములైన పంచాచార, అష్టావరణాదులను గ్రహించిన జంగముఁ డేకులములకు, ఏ వృత్తికిఁ జెందినవాఁడైనను శివునివలె పూజ నీయుఁడే; సహపంక్తిభోజనాదుల కర్హుఁడే. ఇట్టి భక్తి సంప్రదాయము వీరశైవ మత ప్రత్యేకతను వ్యక్తీకరించుచున్నది. సోముఁడు వీరశైవమతస్వరూప స్వభావ పములను స్పష్టపఱచునట్టి విధముగా భక్తకథాసంవిధానమును బసవపురాణమున నిర్వహించెను. వారందఱిలో సాత్త్వికుఁడుగా, అత్యుత్తముఁడుగా మహామహిమాన్వితుఁడుగా బసవేశ్వరుఁడు కానవచ్చుచున్నాఁడు. బసవేశ్వరుఁడు జంగమారాధన మొనర్చు వీరమాహేశ్వరవ్రతాచార్యుఁ డయ్యును అవతారపురుషుఁ డనియు, శివునకును బసవనికిని భేదము లేదనియు నిరూపించుట యీ పురాణ తాత్పర్యము. శివభక్తి యన్నను, బసవభక్తి యన్నను భేదము లేదు. పరమ శివుఁడే "తప్పదేనతఁడని తర్కించిచూడ!" అని పల్కియున్నాఁడు. శివుఁ డవ్యక్తలింగము; బసవఁడు సాకారలింగము. ఇట్లు బసవని శివునితో నభేద మొనర్చుటకై యీపురాణము పుట్టినది. సాకారలింగరూపుఁడైన బసవేశ్వరుఁడు వీరశైవులకు పరమ ప్రామాణికుఁడు; వారిపురాణమున కతఁడే నాయకుడు. అతనియందు భక్త్యావేశము పరాకాష్ఠ నొందినట్లు సోమనాథుఁడు చిత్రించెను.

"వడిఁబారు జలమున కొఁడ లెల్ల కాష్ఠ-పడిఁగాలు చిచ్చున కొడలెల్ల నోష్ఠ
వడివీచు గాడ్పున కొడలెల్లఁ దలలు-వడిచేయు బసవన కొడలెల్ల భక్తి.

ఇట్టినాయకుని వీరశైవ భక్తి చరిత్రము వర్ణింపఁబడిన పురాణము "భక్తివీర" రసప్రధాన మనదగి యున్నది. 1 తద్రసపుష్టి సర్వాంగ సుందరముగా నిర్వహింపఁ బడునట్లు సోమనాథుఁడు కథలను తీర్చిదిద్దెను.

మతమునకు విశ్వాస మాధారము; శక్తి భక్తి. విశ్వాసము వీరశైవ భక్తుల యద్భుత మహిమల వలనను, వారు సాధించిన మతివాద విజయముల వలనను పఠితచిత్తమునం దేర్పడును. శివభక్తుల శివారాధన విధాన విశేషముల వలన భక్తి పఠితకు స్ఫురించును. అందును ముగ్ధభక్తుల చరిత్రములు హృదయ వాదులను, వీర భక్తుల చరిత్రలు బుద్ధివాదులను అధికముగా నాకర్షింపఁగలుగును. సోమనాథుఁడు బసవపురాణమున బసవని యుదాత్తచరిత్రము ముందుగా కొంత వర్ణించి యతనియందు ప్రామాణ్యబుద్ధిని పఠితకు కల్పించి, ముగ్ధభక్తుల చరిత్ర

1 వీరరసము- జి. వి. సుబ్రహ్మణ్యం, పుట. 253.

లచే పతిత హృదయము నార్ద్రపఱచి భక్తి బీజములను నాటి, మడివాలు మాచయ్య వంటి వీరభక్తుల కథలు చెప్పి శివభక్తిసిద్ధివలన గలిగెడు మహిమలను గీర్తించి, అహంకార విరహిత మైన భక్తి ప్రవృత్తిని పోషింపఁగలుగు దృష్టాంత రూప భక్తకథలను జెప్పియు, కిన్నర బ్రహ్మయ్య వంటిభక్తులకు శివుఁడు పిలిచిన పలుకు మహిమలు కలవనియు, ముసిడి చౌడయ్యవంటి భక్తులు ప్రాణప్రదాన సమర్థు లనియు, ఏకాంత రామయ్య వంటి భక్తులు జైనాదులగు పరమతస్థులను స్వీయమహిమలచే నిగ్రహింపఁ గలుగుదు రనియు, షోడ్డలదేవు బాచయ్య కథ వలన పరమతఖండన శైవమత సంస్థాపన రూపమైన పరిజ్ఞానమును, శివనాగు మయ్యవంటి వారు శివభక్తి సిద్ధి కంత్యకులజు లైనను అర్హు లగుదు రనియు నిరూ పించెను. భక్తియుక్తము లైన చిత్తములందే విశ్వాసము నిశ్చలమై నిలుచును. నిశ్చల మైన విశ్వాసము భక్తిని ప్రదీప్త మొనర్చును. కావున పరస్పరాశ్రితము లైన భక్తి విశ్వాసములను సోమనాథుఁడు క్రమవికాస రమణీయముగా నిందు పొందుపఱచెను.

బసవపురాణమున నాయకుఁడు బసవేశ్వరుఁ డైనచోఁ బ్రతి నాయకుఁడు బిజ్జలుఁ డగును. బిజ్జలుఁ డొక వింతప్రకృతికలవాఁడు. బసవని వెలుఁగుక్రింది క్రీనీడవంటివాఁ డాతఁడు. వీరమాహేశ్వరాచారుల మహిమలు చెవులార వినుచు, కన్నులార గాంచుచు, బసవని పూజించుచు, తన్మతమును గౌరవించియు నాతఁడు మాత్రము వీరశైవుఁడు కాలేదు. అగుటకుఁదగిన మౌలికగుణము – విశ్వాస– మతనికి లేదు. దానివలన భక్తి జనింప లేదు. లేనిచో విసమూరగించి యపరగరళ కంఠునివలె నొప్పారిన బసవని చరితము ప్రత్యక్షముగఁ జూచిన తరువాత కూడ వీరశైవులకు నిష్కారణహాని తలపెట్టఁగలఁడా? మహారాజైనను, మహాభక్తుని దనకొలువున బండారిగా నిలిపికొనిన పుణ్యాత్ముఁ డయ్యును, భక్తి బీజములు మొల కెత్తఁ జాలని శుష్కకఠినహృదయక్షేత్రము కలవాఁడు. అతనికిఁ గలిగిన కావ్యాంతమరణము సార్థకమే. శివాపరాధమునకు వీరశైవమున మరణమే దండనము కదా! మతపురాణమున మతమూలప్రకృతులైన భక్తి విశ్వాసములు లేని కఠినునిఁ బ్రతినాయకునిగాఁ జిత్రించుట సోమనాథుని కథానిర్మాణ రహస్యము.

బసవపురాణమున బిజ్జల సంహార ఘట్టము చిత్రముగాఁ దీర్పఁబడినది. శివ భక్తుల కపచారము కావించిన బిజ్జలుని శపించి కల్యాణకటకమును వీడి బసవేశ్వ రుఁడు సంగమేశ్వరము చేరుకొనెను. జగదేవదండనాయకు నదివఱకే బిజ్జలసంహా

రార్ధము బసవఁడు నిర్దేశించి యుంచెను. అతఁడాపని చేసి, బాసను కాపాడుకొనెను. శాపానుగ్రహశక్తియుక్తుఁడును, ప్రాణప్రదానోపసంహరణ సమర్థుఁడు నైన బసవఁడే బిజ్జలునిఁ జంపి వీరశైవ ధర్మమును గాపాడుకొని యుండవచ్చును కదా! సోముఁ డట్లేల కల్పింపలేదు? సమాధానముగా చరిత్ర అడ్డము వచ్చె నని యైనను చెప్పవలెను. లేక బసవని యుదాత్తచరిత్రము నౌచిత్య సంభరితము చేయ నెంచె నని సమాధాన పడవలెను. లేనిచో కథ నిట్లు మార్చుటలో జైన పురాణ ప్రభావ మున్న దని యూహింపవలెను. మునిసువ్రతుఁ డను నిరువదియవ జైనతీర్థంకరుని చరిత్రమున బలదేవుఁ డగు రామచంద్రుఁడును, వాసుదేవుఁ డగు లక్ష్మణుఁడు నన్నదమ్ము లైనట్లును, ప్రతి వాసుదేవుఁడు రావణుఁ డైనట్లును జెప్పఁబడి యున్నను, రామచంద్రుఁ డాసన్నభవ్యుఁ డగుటచే రావణసంహారము చేయ నొల్లక దూరభవ్యుఁడైన లక్ష్మణునిచే తత్సంహారము నిర్వహింపఁ జేసె ననియు గల్పింపఁ బడినది. జైనులలో దూరభవ్యుల కంటె నాసన్నభవ్యులు కర్మ బంధవిముక్తి నధికముగా సాధించి మోక్షసిద్ధి కతి సన్నిహితు లై యున్నవారుగాఁ బరిగణింపఁబడుదురు. కావున నట్టివారి కెట్టి హింసాకాండ నంటకట్టరు. ఇట్టి జైన పురాణ కథావిధాన సంస్కారమును సోమన గ్రహించి లింగైక్యమందఁబోవు చున్న బసవనిచే బిజ్జలుని సంహారము గావింపఁ జేయక, వైదిక కర్మాసక్తికలిగియు బసవని పూజించిన జగదేవ దండనాయకుని ద్వారమున దానిని నిర్వహింపఁజేసి బసవని విశుద్ధసాత్త్వికశీలసంపదను పరిపోషించె ననుటకు వీలున్నది.

కర్ణాటాంధ్రములయందు 1 జైనపురాణములు వైదికపురాణముల కెదురు నిలిచి ప్రజాదరణ పొందుటకు యత్నించినవి. కన్నడమున కొంతకాల మాపురాణ ములు ప్రజలహృదయసీమలపై రాజ్యము చేసినవి. వానికి పోటీపడి జనాదరణము నొందుటకై వీరశైవులు ప్రథమపురాణ నిర్మాణయత్నము గావించిరి. సోమనాథుని పై నాధార ముంచిరి. అతఁడు జైనపురాణ నిర్మాణములోని లోగుట్టులు తెలిసి

1. చూ॥: ఆంధ్రకర్ణాట సారస్వతములు-పరస్పర ప్రభావము-శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు. అధ్యా: తెలుఁగు వాఙ్మయము, నన్నయపూర్వయుగము. ఇందు శ్రీ వేంకటరావుగారు పద్మకవి జినేంద్రపురాణము, (క్రీ. శ. 941) సర్వదేవుని ఆదిపురాణము (క్రీ. శ. 953) మొ॥ జైనపురాణములు నన్నయకుఁ బూర్వమే వెలసిన యాంధ్రానువాదము లని పేర్కొనినారు. పద్మకవియే పంపకవి యనియు, సర్వదేవుఁడే పొన్నకవి యనియు నిరూపించినారు. (కాని వారు జైన పురాణ రచనాప్రభావము బసవపురాణముపైఁ గలదని గుర్తింపలేదు.)

వానిని ప్రచ్ఛన్నముగాఁ గొల్లకొట్టి వీరశైవపురాణము ప్రజల నాకట్టుకొనగల్గు నట్లు నిర్మించెను. ఇట్లనుటచే జైనపురాణలక్షణము లన్నింటిని సోముఁ డనుకరించె నని తాత్పర్యము కాదు. తన గ్రంథప్రణాళిక కొదిగినంతవఱకు వానిని నిపుణముగా గ్రహించి స్వీయప్రతిభతో స్వతంత్ర పురాణ రచనా విధానము నాతఁ డేర్పఱచుకొనెను. బసవపురాణము పుట్టుటతో నాంధ్రమున నార్ష పురాణ రచనా సంప్రదాయ మంతరించుచున్న దనియే కాఁబోలు తిక్కనగారి శిష్యుఁ డైన మారన యోరుగల్లులోనే మఱల పురాణధ్వజ మెత్తెను. ఆ పైన పోతన భాగవతము వెలయించెను. సోమనాథుని పుణ్యమా యని దేశిమార్గ సంప్రదాయములలోఁ బుట్టిన పురాణ తరంగిణుల కోరుగల్లు సంగమ తీర్థమై తారసిల్లినది!

ద్విపదరచన :-

పైనఁ బేర్కొనఁబడిన యైతిహ్యమున విప్రుఁడు పాల్కురికి సోమనాథుఁడు ద్విపదలో ప్రాసవళ్లను గూర్చి రచించె నని విమర్శించెను. తెలుఁగుసాహిత్యమున కావ్యరచనమున ద్విపదచ్ఛందమును జేపట్టిన మొదటి కవి సోమనాథుఁడు. తత్కారణమును, తత్సార్థక్యమును సోమనాథుఁడే తనకృతులయందు పేర్కొనియున్నాఁడు.

"ఉరుతరగద్య పద్యోక్తుల కంటె - సరసమై పరగిన జానుఁదెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ - గూర్చెద ద్విపదలు గోర్కిదైవాఱఁ;
దెలుఁగు మాట లనంగవలదు, వేదముల - కొలఁదియకాఁ జూడుఁ డిల నెట్లు లనినఁ
బాటి తూమునకును బాటి యౌ నేని - బాటింప సోలయుఁ బాడియ కాదె?" 1

"తేట తెనుంగున ద్విపద రచింతుఁ - బాటిగాఁ దత్కథా ప్రౌఢి యెట్లనిన :-
జాతులు మాత్రానుసంధాన గణవి - నీతులు గాన 'యనియతగణై'ర
నియును, 'బ్రాసోవా' యనియు, 'యతిర్వా' య-నియుఁ జెప్పు ఛందోవినిహితోక్తిగాన
ప్రాస మైనను యతిపై వడి యైన - దేసిగా నిలిపి యాదిప్రాసనియతి
దప్పకుండఁగ ద్విపదలు రచియింతు - నొప్పదు ద్విపదకావ్యోక్తి నావలదు;
ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ - పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబు గామిఁ - జానుఁదెనుఁగు విశేషము ప్రసన్నతకు;
అట్టునుగాక కావ్యము ప్రౌఢిపేర్మి - నెట్టన రచియింప నేర్చినఁ జాలు
నుపమింప గద్యపద్యోదాత్తకృతులు - ద్విపదలు సమమ భావింప"...... 2

---

1. బసవపురాణము (సంక్షిప్తము), ప్రథమాశ్వాసము, పం, 165-172.

2. పండితారాధ్య చరిత్ర - దీక్షాప్రకరణము, పుట 18.

"దేసిగా వచియింతు ద్విపదకు వళ్లఁ - బ్రాసంబులునుఁ బొందుపడఁగఁ దావలయు
ననుచుఁ దదీయ సూక్తాక్షరపంక్తిఁ - జెనకక యింతొప్పఁ జెప్పనే యనుచు
సన్నుతిఁ జేయుచు సత్కవు లలరఁ - దిన్ననిసూక్తుల ద్విపద రచింతు ;
నదియునుగా కైహికాముష్మికద్వి - పద హేతువవుట ద్విపదనాఁగఁ బరగు
ద్విపదాంబురుహముల ధృతి బసవేశు - ద్విపదాంబురుహము లతిప్రీతిఁ బూన్తు.[1]

విప్రుని విమర్శనమును, సోమనాథుని యాదర్శమును బొందుపఱచుకొని చూచినచో నిట్లేర్పఱుపవచ్చును : మార్గపద్ధతి ననుసరించువారు గద్యపద్యాది సంస్కృతభూయిష్ఠ రచనతో నొప్పారు చంపూపద్ధతి వలన కావ్యకళాప్రౌఢి యేర్పడు ననియు, తేటతెలుఁగు మాటలకు తత్సమ పదములకు వలె సర్థశక్తి లేదనియు, వానివలనఁ గావ్యమున కుదాత్తత సిద్ధింపదనియు, ద్విపదచ్ఛందము మహాకావ్యరచన కనువైనది కాదనియు, ద్విపదయందుఁ బ్రాసవళ్లు కూర్చుట లక్షణ విరుద్ధ మనియు భావించుచుండిరి. దేశిసంప్రదాయజ్ఞులు - లేక - సోమనాథాదులు సంస్కృత పదభూయిష్ఠమైన గద్యపద్యాత్మక ప్రబంధరచనము సర్వసామాన్యము కాదనియు, కావ్యము సర్వజనసుబోధము కావలయు నన్నచో నది ప్రసన్నము, సరసము నైన తెలుఁగుపలుకుబడితోఁ గూడి, తిన్నని సూక్తులతో నొప్పారు జానుఁదెనుఁగున వ్రాయఁబడవలె ననియు, వేదములందు సంస్కృత మెట్లో, తెలుఁగు కృతులందు తెలుఁగుపలుకు లట్లే గణనీయము లనియు, దేశీయ చ్ఛందములలో గానయోగ్యమై, ఆబాలగోపాలమున కాదరపాత్ర మగు ద్విపదలోఁ గావ్యరచన మొనర్ప వచ్చుననియు; కావ్యకళాప్రౌఢి ఛందమును బట్టికాక 'అల్పాక్షరముల ననల్పార్థరచనము' చేయఁగల కవి దక్షతను బట్టి యేర్పడును గావున గద్య పద్యములవలె ద్విపదలుకూడ నుదాత్త కావ్యరచన కుపకరించు ననియు, మాత్రానుసంధానగణవినీతు లగు జాతు లనియత గణము లనియు, అందు దేశిసంప్రదాయము ననుసరించి యాదిప్రాసతోపాటు యతినిగాని, ప్రాసయతినిగాని పాటించిన దోసము లేదనియు, భక్తిప్రధానము లగు కృతులం దైహికాముష్మిక ద్విపద హేతువుగా ద్విపద సార్థక మగు ననియు, తత్కావ్యరచనపఠనాదు లొక యారాధన విశేష మనియు దలంచు చుండిరి. మార్గకవులు దేశికవులను ప్రామాణికులుగా గ్రహింపరు. దేశికవులు మార్గకవులను సరకుసేయరు.

---

1. పండితారాధ్య చరిత్ర. దీక్షాప్రకరణము. పుట. 21 - 22.

సోమనాథుఁడు ప్రజాసామాన్యము నుద్దేశించి ద్విపదలో పురాణము నిర్మించెను. దానిని కొందఱు విమర్శించిరి. దానికి సమాధానము విపులముగాఁ బండితారాధ్య చరిత్రలోఁ జెప్పెను. ప్రాసయతి ప్రయోగమునకు ప్రమాణము చూపించెను. పైనఁ జేర్కొనఁబడిన యైతిహ్యము పండితారాధ్య చరిత్ర రచనకుఁ బూర్వమే సంఘటిల్లె నని తెలియుచున్నది.

జనబాహుళ్యమున కందుబాటులో నుండునట్లు సంస్కృతమునం దనుష్టుప్పులవంటి సులభగ్రాహ్యము లైన శ్లోకములలో పురాణములు రచింపఁబడి యున్నవి. తెలుఁగున నిట్టి సరళసుందర మైన ఛందము ద్విపదగా నెఱింగి సోమనాథుఁడు పురాణము నందులో రచించెను. మతము ప్రజాసామాన్యమునందు వ్యాపింపవలె నను లక్ష్యముతో నిర్మింపఁబడు సారస్వతమున ప్రౌఢకావ్యకళా సృష్టికంటెఁ బ్రజాదరణపాత్ర మగు దృష్టియే యధికముగాఁ గాంచ నగును. సంస్కృతసాహిత్యమర్యాదల నాదరించి యనుసరించు మార్గకవులు తెలుఁగున వెలయునాఁటికే సంస్కృత సాహిత్యమున మహాకావ్య రచనము పరిపక్వ దశ నంది యున్నది. కావున వా రితిహాసము చేపట్టినను, పురాణము ననువదించినను, కావ్యము నంతరించినను వానిని కావ్యాలంకారకళాబంధురములుగాఁ దీర్చ నమకట్టిరి. అందువలనఁ దెలుఁగున కావ్యము తత్కళావిదులను మెప్పించి మనుగడ సాగింపవలసి వచ్చెను. అందుచే జనసామాన్యము కొఱకై న తెలుఁగు ద్విపద పురాణము వారి కాదరపాత్రము కాలేదు. అట్లని సోమనాథుఁడు తన మార్గము వీడలేదు. తన లక్ష్యమును, ఆదర్శమును తేటపఱచి తనకావ్యము నాదృక్కోణముతోఁ జూడు మనినాఁడు. అట్లు చేయనిచో మూలవిచ్ఛేద రూప మగు పాండిత్యమును వెలార్చినట్లే యగునుగదా!

జానుఁదెనుఁగు :

పై సోమనాథుని స్వతంత్రాశయములు ముఖ్యముగా భాషాసంబంధ మైనవి: ఛందస్సంబంధ మైనవి. 'ఆరూఢగద్యపద్యాది ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠ రచన సర్వసామాన్యము కాదు కావున ప్రసన్నతకు జానుఁదెనుఁగు విశేష మని యతని యభిప్రాయము. జానుఁ దెనుఁగునకు తుల్యార్థకములుగా తేట తెనుంగు, తెలుఁగు మాటలు, తిన్నని సూక్తులు అను సమాసములను సోమన వాడియుండెను. అంతియకాక తన వృషాధిప శతకమున జానుఁ దెనుఁగునకు లక్ష్య మగు పద్యము నిట్లు రచించెను.

"చ. బలుపొడతోలు సీరయును బాఁపసరుల్ గిలుపారు కన్ను వె
న్నెలతల సేఁదుఁగుత్తుకయు నిండిన వేలుపుటేఱు వల్గుపూ
సలు గల ఱేని లెంక వని జానుఁదెనుంగున విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా బసవా బసవా వృషాధిపా !"

ఇందుఁ దత్సమపద విరహిత మైన తేట తెనుఁగు కలదు. దీని నచ్చ తెనుఁగని మనము పిలిచెదము. కావున జానుఁదెనుఁ గనఁగా నచ్చతెనుఁగనియే యొకరు భావించిరి. ఒకరు 'సొంపైన తెనుఁ'గనిరి. మరియొకరు 'సర్వ సామాన్యమగు ప్రసన్నమైన తెనుఁ'గనిరి.1 మరియొకరు కేతన ఆంధ్రభాషా భూషణములో నచ్చతెనుఁగునకును, దేశికి నిచ్చిన యుదాహరణములను బోల్చి చూచి జానుఁదెనుఁగునకును వానికిని భేదము లే దనిరి.2 ఇంకొకరు కన్నడ కవులు పేర్కొనిన "పొసదేసె" "జాణ్నుడి" వంటిది జానుఁదెనుఁ గనియు, 'జాణత్వముతో చమత్కార యుక్తముగాఁ బ్రయోగింపఁబడిన తెనుఁ' గని యర్థము చెప్పవచ్చు ననియు నూహించిరి.3 ఇంకొకరు 'జానుఁదెనుఁగునందు సంస్కృతపదములు లేకుండ నుండవలయు ననికాదు. దేశీయపదము లధికముగా నుండుటయు, సంస్కృతపదములు మృదువులును సులభములునై యుండుటయు జానుఁదెనుఁగు కవిత్వ లక్షణ' మనియు నెఱిఁగించిరి.4 ఇట్లు జానుఁదెనుఁగును గూర్చి పండితులు బహువిధములుగా భావించుచుండుటచే దాని నిదమిత్థ మని తేల్చి చెప్పుటకు వీలు లేకున్నది. కాని జానుఁదెనుఁగున కవిత్వము వ్రాసెద నని సోమనాథుఁడు చేసిన ప్రతిజ్ఞకు బసవపురాణ పండితారాధ్య చరిత్రములు లక్ష్యములు కావలసియుండఁగా పై పద్య మొక్కటి మాత్రమే దానికి సమగ్రోదాహరణము కాఁజాలదు. ఏలయన బసవపురాణము పై పద్యమువలె నచ్చతెనుఁగున వ్రాయఁబడలేదు. అట్లని అందలిది జానుఁదెనుఁగు కాదనుట కవి ప్రతిజ్ఞకు విరుద్ధము. కావున వీనిని సమన్వయింపవలెను. సోమనాథుఁడ

---

1. కుమారసంభవము - (మద్రాసు విశ్వవిద్యాలయ ప్రచురణము. 1948) పీఠిక. సంపాదకులు : శ్రీ కోరాడ రామకృష్ణయ్య, యస్. లక్ష్మీపతి శా గారలు - పుః 29-30.
2. నన్నెచోడుని కవిత్వము - శ్రీ వేదము వేంకటరామశాస్త్రిగారు. పుట 109-11
3. కుమారసంభవము. (మ. వి. ప్ర.) పీఠిక. పుట 30.
4. ఆంధ్రకవితరంగిణి. శ్రీ చాగంటి శేషయ్యగారు. సంపుటము 13. పుట 104.

బసవపురాణ పండితారాధ్య చరిత్రలందు ప్రధానముగా సంస్కృత సమాస భూయిష్ఠమైన యోజోబంధమును గర్హించెను. కావున తత్సమ, తద్భవ, దేశ్యాది భేదముచే నొప్పారు తెనుఁగు పదజాలమున నతఁడు తత్సమ వైరళ్యమును, దేశ్యబాహుళ్యమును, ఉక్తిసారళ్యమును వరించె ననియు, నట్టి లక్షణముల సంయోజనరూప మైన రచనమే జానుఁదెనుఁ గనియు, నది సర్వజన సామాన్య మనియు సోమనాథుఁడు భావించె నని తలంప వచ్చును.

తెలుఁగుముద్ర :

దేశిరచనా సంప్రదాయము నుద్ధరించిన సోమనాథుఁడు జానుఁదెనుఁగున ద్విపదకావ్యములు రచించి తెలుఁగు దనమును పోషించె నని కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగా రిట్లు పేర్కొనిరి. "తెలుఁగునకుఁ దోడిభాష యగు ద్రవిడ భాషలో దేశిరచన లెక్కువగా నెక్కొన్నవి. ద్రవిడదేశీయు లగు జైనులయు, శైవులయు, వైష్ణవులయు దేశిచరిత్రములు ద్రవిడభాషా సహజము లగు దేశి వృత్తములలో రచితము లై వెలసియున్నవి. కర్ణాటకమున నంతగా నట్టి రచనలు లేవుగాని తెలుఁగున కంటెఁ గొంత హెచ్చుగా నున్న వనవచ్చును. ఆదికాలమునఁ దెనుఁగు గ్రంథములు ప్రాయికముగా సంస్కృతభాషలో నున్న పురాణాద్యార్యగ్రంథముల కనువాదములుగానే వెలయుటచే నాంధ్రసహజము లైన దేశిరచనల కాదరువు సన్నగిల్లెను. మన పూర్వులు పౌరాణికము లయిన యార్య కథల మీఁదను, సంస్కృతచ్ఛందస్సు మీఁదను, సంస్కృతప్రాయ మయిన తత్సమభాష మీఁదను నభిమానము గలవారయి దేశియేతివృత్తములను, దేశియ చ్ఛందస్సులను, దేశిభాషను జితుకఁద్రొక్కిరి. నేఁడు మనము స్త్రీపామరాదుల గేయరచనము లని యనాదరమునఁ జూచు పదరచనముల వరుసలే ద్రవిడభాష లోని ప్రౌఢకావ్యములందలి వృత్తములుగా నెలకొన్నవి. తరువోజ, ద్విపద, రగడ, అక్కర, గీతి, సీసము మొదలగు పరిమితజాతులే దేశిచ్ఛందో జనితములు మనగ్రంథములం దాదృతము లయ్యెను. ఈ దోషముచే మన తెలుఁగు ప్రబంధములం దాంధ్రతాముద్ర యంతగాఁ గానరాకున్నది. కొంతవఱ కాంధ్రతాముద్ర నచ్చొత్తి ప్రబంధముల రచించిన వారిలో నగ్రగణ్యుఁ డీ సోమనాథ కవియే. ఈతఁడు దేశియ కథలను దేశిచ్ఛందోజనిత మగు ద్విపదమున దేశి తెనుంగు బాసలో రచించినవాఁ డగుటచే నీతని కవితలో నాంధ్రతాముద్ర సక్కఁగా నత్తికొనెను".1

1. బసవ పురాణము. (ఆంధ్ర గ్రంథమాల) - పీఠిక - పుట 54-55.

ప్రాసవడి :

సోమనాథుఁడు ద్విపదలో వాడిన 'ప్రాసయతి'ని సమర్థించు శ్రీ బండారు తమ్మయ్యగారి వాక్యములు స్మరింపఁదగినవి : "ఆంధ్రభాషలో సోమనాథుని కాలమునాఁటికి ఛందోవ్యాకరణలక్షణ గ్రంథము లేమైన వెలసినవో లేదో యెవ్వరు నింతవఱకు రూఢిగాఁ జెప్పఁజాలకున్నారు. ఇప్పటి కుపలబ్ధము లైన వానిలోఁ బ్రాచీనము లని మనము గణించు కవిజనాశ్రయము, కావ్యాలంకార చూడామణి, ఆంధ్రశబ్ద చింతామణి, ఆంధ్రభాషాభూషణము మున్నగునవి యెల్ల సోమునకుఁ దరువాతివే గాని ముందరివి గావు. ద్విపదలలోఁ బ్రాసయతి చెల్లదను లక్షణము సోముని తరువాతఁ జాలఁగాలమునకు వెలసిన చిన్నన్నలు చెప్పినదే కాని యాతనికి ముం దుండిన తొల్లింటి పెద్ద లేర్పరచినది గాదు. కవిజనాశ్రయములో నిందుఁగూర్చి యేమియుఁ జెప్పియుండలేదు. ద్విపదలలోఁ బ్రాసయతి చెల్లుననుటకు సాధకముగ "అనియతగణైః" "యతిర్వా" "ప్రాసోవా" యను ప్రాచీనచ్ఛందస్సూత్రముల నాంధ్రభాషా చ్ఛందోలక్షణములఁ జెప్పు చు సంస్కృతభాషలో రచిత మైన యేఛందోగ్రంథమునుండియో సోమనాథుఁడు పేర్కొనియే యున్నాఁడు. యతిప్రాసనియమము లేని సంస్కృతశ్లోక రచనము లకుఁగాని, యతినియమము లేని కర్ణాట పద్యరచనములకుఁగాని యీ సూత్రములు సంబంధించినవి గావని చెప్పనక్కరలేదు. అక్షరగణబద్ధము లై, చతుష్పాదనియతి గల వృత్తములందును, అనియతగణబద్ధము లయ్యుఁ, జతుష్పాదనియతి గల కందము, ఉత్సాహము, అక్కర మున్నగు జాతులందును పాద ద్వితీయాక్షర ప్రాస నియమ మున్నదన్న కారణమునఁ గాఁబోలు వీనిలోఁ బ్రాసయతి పనికి రాదనియుఁ జతుష్పాద నియతిగల్గియుఁ బాదద్వితీయాక్షర ప్రాసనియమము లేని సీసము, తేటగీతి, ఆటవెలఁది మున్నగు నుపజాతులందు, సంగీతమునందు నది చెల్లుననియుఁ దలంచు సంప్రదాయ మాంధ్రచ్ఛందోలక్షణగ్రంథములలో నేర్పడినది. అక్షరగణబద్ధము లై చతుష్పాదనియతి గల లయగ్రాహి, లయహారి, లయవిభాతి, త్రిభంగి మున్నగు కొన్ని వృత్తముల విషయమున మాత్రమందు లయప్రాధాన్య మున్నదన్న కారణమునఁ గాఁబోలు మరల నీ లక్షణ గ్రంథకర్తలు ప్రాసయతినే విధించియున్నారు. ఇవియన్నియు నర్వాచీన లక్షణములే యని తలంపఁదగును. అనియతగణబద్ధ రచనములలోఁ జతుష్పాద నియతితోపాటు పాదద్వితీయాక్షర ప్రాసనియమ మున్న జాతులమాట యెట్లున్నను, ఇట్టి ప్రాస

నియమ ముండియు ద్విపాద నియతి మాత్రమే గల ద్విపద, రగడ, అట్టి ప్రాస నియమము లేని మంజరీ ద్విపద మున్నగునవి పాటలుగాఁ బాడుకొనుట కనువగు గేయకృతు లగుటచే సంగీతమునందు వలె వానిలోఁగూడఁ బ్రాసయతిని వాడ వచ్చు ననుటయే ప్రాచీనచ్ఛందోలక్షణకర్తల మతముగా గోచరించును. మనభాషలో గ్రంథస్థము గాక తరతరములనుండి పారంపర్యముగ జనుల నోళ్లలోఁబడి ప్రవారమందున్న యలేఖ్య గేయ వాఙ్మయ మెంతయో యున్నది. ప్రాఁతపాట లనుపేరితోఁ గొందఱు భాషాభిమానులు వీనిని సేకరించి యిప్పు డందందుఁ బ్రకటించు చున్నారు. ఇవి చాలవఱకు ద్విపదరూపములుగనో, తద్వికృతులుగనో యుండును. వీనికాలమును నిర్ణయించుట దుస్తరము. నన్నయకు ముందునుండియు వెలసినవిగూడ నిందుఁ బెక్కులు చేరియుండును. వీనిలో నందందుఁ బ్రాసయతి గాననగును. మచ్చునకుఁ గొన్ని యుదాహరింతును.

> "అత్తింటి కోడలు ఉత్తమురాలు – చేట జొన్నలు బోసి చేనిద్రబోను."
> "చక్కనాన్నగారి ముక్కుపై చెమట – చేరుడేసి ముత్యాలు చెదరినట్లుండు."
> "చలికి వెఱచినట్టు పులికి నే వెఱవ – అలికి వెఱచినట్లు అమ్మకే వెఱవ."
> "కొడుకులఁ గనని వాళ్లకడు పేమికడుపు–కుల ముద్ధరించని కొడు కేమి కొడుకు."

కావున నిట్టి ప్రాచీనమతము ననుసరించియే సోమనాథుఁడు ద్విపదలందు రగడ లందుఁగూడఁ బ్రాసయతిని వాడి యున్నాఁడు".1 "ప్రాసమైనను యతిపై వడి యైన – దేసిగా నిలిపి యాదిప్రాసనియతి – తప్పకుండగ ద్విపదలు రచియింతు" నని యెలుగెత్తి చెప్పిన సోమనాథుని హృదయమును తమ్మయ్యగారు చక్కఁగా నావిష్కరించినారు.

బసవపురాణము నిట్లు పురాణకల్పనమునందును, వస్తుసంవిధానము నందును ఛందోనిర్వహణమునందును, భాషాప్రయోగమునందును దేశీయము లైన సంప్రదాయములను, నవీనగుణములను మేళవించి ప్రథమాంధ్ర స్వతంత్ర ద్విపద పురాణముగా సోమనాథుఁడు నిర్మించెను.

---

1. బసవ పురాణము (వావిళ్ల ప్రచురణము) పీఠిక – పుట 99–102 (గౌరన రంగనాథాదులు కూడ ప్రాసయతిని క్వాచిత్కముగాఁ పాటించి రని వీరు పేర్కొని యుండిరి.

కవి జీవిత విశేషములు :

ప్రాచీనకవు లందఱి వలెనే పాల్కురికి సోమనాథుఁడును స్వీయ చరిత్ర నేమియు తనకావ్యములలోఁ జెప్పలేదు. కాని యెడనెడ నాతఁడు తననుగూర్చి చెప్పుకొనిన మాటలనుబట్టి యతనికథను మన మూహింప వలసి వచ్చుచున్నది. ఇట్లూహించుట కతని కృతులే కాక ఏకామ్రనాథుని (క్రీ.శ. 14వ శతాబ్దము) ప్రతాప చరిత్ర మను వచనగ్రంథము, పిడపర్తి సోమనాథుని (క్రీ.శ. 15వ శ.) పద్య బసవపురాణము, శైవకవియొకఁడు రచించిన అన్య వాదకోలాహల మను సీసపద్య శతకము, తుమ్మలపల్లి నారనారాధ్యుని ద్విపద బసవ విజయము, తోంటదసిద్ధ లింగకవి (క్రీ. శ. 16వ శ.) కన్నడమున రచించిన పాలకురికి సోమేశ్వరపురాణము, ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని స్థానిక చరిత్రములు మొదలగునవి కొంత తోడుపడుచున్నవి. వీనిలో చాలవఱకు ప్రతాపచరిత్రయందు సోమునిగూర్చి చెప్పఁబడిన యంశములే పునరావృత్తము లైనవి. చారిత్రకులు వీనిని ప్రామాణికములుగా గ్రహింపరు. కాని పరం పరగా వచ్చుచున్న యీ కథలన్నియుఁ బుక్కిడి పురాణము లని త్రోసివేయు టకును వీలులేకున్నది. కావున కొందఱు విమర్శకులు కావ్యాంతర సాక్ష్యములు చారిత్రక నిదర్శనములు, శాసనాధారములు, ఆంధ్రకర్ణాటక కవిస్తుతులు మొద లగువానిని ప్రాతిపదికలుగాఁ గైకొని వాని కనువైనంతవరకీ కథార్థములను సమన్వయించుకొనుచున్నారు. ఏమైనను పాల్కురికి కవినిగూర్చి తెలిసిన పరిమిత చరిత్రలోఁ బ్రధానాంశము లన్నింటిపైనను వాదోపవాదములు వెలసి యున్నవి. వాని నన్నింటిని జెప్పి, వాని యారంభసంరంభాదులను, వాద ప్రతివాదములను నిరూపింపఁ బూనినచో నదియు నొక పురాణము కాఁగలదు. కావున నాయంశములను దిఙ్మాత్రముగా నిందు పొందుపఱచుట యైనది.

జన్మస్థలము :

గ్రామనామమే గృహనామముగాఁ గలవాఁడు పాల్కురికి సోమనాథ కవి.[1] ఆపాల్కురికి[2] తెలంగాణమున నోరుగల్లునకుఁ బండ్రెండు క్రోసుల దూరమున జనగామతాలుకాలో నున్న నేటి 'పాలకుర్తి' యనియు, అదియే కవి

1. చాగంటి శేషయ్యగా రీవిషయము నిదమిత్థమని నిర్ణయింప వీలులే దనిరి.

2. దీనికి పాల్కురికి, పాలుకురికి, పాలకురికి యనియు – కురికికి – కుఱికి యనియు రూపములు కలవు.

జన్మస్థాన మనియు విమర్శకులు గాఢముగా విశ్వసించుచున్నారు. కాని కీ. శే. చిలుకూరి నారాయణరావు పంతులుగారు మైసూరు రాష్ట్రమున తుముకూరు జిల్లాలో నున్న "హాలకురికె" యను గ్రామమే "పాలకురికి" యై యుండవచ్చు ననియు, కన్నడమునందలి "హ" వర్ణము తెనుఁగున "వ" గా మారుట సహజ మనియుఁ, బేర్కొని యుండిరి. 1 కర్ణాటకవి చరిత్రకర్త లగు శ్రీ నరసింహాచార్యులుగారును, కన్నడ సారస్వత (Kanarese Literature) మను గ్రంథమును రచించిన రైసుదొరగారును పాలకురికి గోదావరి జిల్లాలో నున్న దని యూహించిరి. ఈ రెండు వాదములును నేఁ డంగీకరింపఁబడుటలేదు. పై పాలకురికి తెలఁగాణము నందున్న దే యని నిశ్చయించుటకు తోంటద సిద్ధలింగకవి సోమేశ్వర పురాణమును, అన్యవాదకోలాహల శతకమును, ప్రతాప చరిత్రమును, పిడుపర్తి సోమనాథుని బసవపురాణమును2 జెప్పెడి మాటలు తోడు పడుచున్నవి. ఇంకను పాలకుర్తిలో వెలసియున్న స్వయంభు వగు సోమేశ్వరుని యాలయము, సోమనాథుని యాశ్రమస్థలి (సమాధి ?) పై నతని శిష్యులచే స్థాపింపఁబడిన 'సోమనాథుని లింగము,' సాక్ష్యము పలుకుచున్నవి. పాలకుర్తి ప్రసిద్ధ శైవక్షేత్ర మగుటయు, బసవపురాణావతారికలోఁ బేర్కొనఁబడిన కట్టకూరి పోతిదేవర నివాసస్థల మగు కట్టకూరు పాలకురికి సమీపముననే యుండుటయు నీ వాదమునకు బలము చేకూర్చు చున్నవి. నేటి పాలకుర్తికి సమీపమున నున్న ఎలకుర్తి, ఉఱుకుర్తి యను గ్రామములు కాకతీయుల కాలమున ఎలకురికి,

1. పండితారాధ్య చరిత్ర (ఆంధ్రగ్రంథమాల) పీఠిక- పుట 1-7. వీరి వాదము ననుసరించిన వారిలోఁ బ్రముఖులు శ్రీ చాగంటి శేషయ్యగారు, చూడు : కవితరంగిణి సంపు. 3. 117-119.

2. "పిడుపర్తి బసవన బసవపురాణమున నీవిషయము గానరా దని కొంద అనవచ్చును. అందు "కలిమలభంగచంగ శివగంగకుఁ జెంగటఁ గల్కొమన్పురిన్" అనియుండవలసినచోట నచ్చుతప్పు, "శివగంగకుఁ జెంగటఁ గల్గుమత్పురిన్"అని పడిన దని కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బసవపురాణ పీఠికాధస్సూచికలో పేర్కొనిరి. (పుట. 8); అంతియకాక పైనఁ బేర్కొనఁబడిన యైతిహ్యా మోరుగల్లున జరిగిన దనియు, శివభక్తు లోరుగంటికి తత్సమీపగత మగు పాలకురికి నుండి పాల్కురికి సోమనాథుని బిలుచుకొని వచ్చి రనియు స్పష్ట మగుచున్నది.

ఉఱుకురికి యని వ్యవహరింపఁబడుచున్నట్లు శాసనాధారము లుండుటచే[1] పాల కుఱ్ఱియు నాకాలమున పాలకురికి యని పిలువఁబడుచుండె నని భావింప వీలగు చున్నది. ఇవి యిట్లుండ దేశిమార్గ పురాణధ్వజము లెదురెదురుగా నిలువఁబెట్టిన సోమనాథమారనలు ఓరుగల్లు ప్రాంతమువా రనుటయే సంభావ్యము !

శ్రీ నిడుదవోలు వేంకటరావుగా రన్నట్లు:— "ఇంతకు సోమనాథుఁడు కన్నడదేశమున తెనుఁగుదేశమున కంటె విశేష ప్రసిద్ధి గడించిన వాఁడు కదా ! అతని నెందరో కన్నడకవులు స్తుతియించి యున్నారు. అతఁడు నిజముగా కన్నడదేశస్థ మైన హాల్కుఱికి గ్రామనివాసి యైనచో నొక్కకవి యైన యాతని పాల్కుఱికి సోమనాథుఁ డని పేర్కొనలేదు. ఇది యొకటియే యతఁ డాప్రాంతమువాఁడు కాఁడని నిర్ణయించు చున్నది...మఱియు సోమనాథుఁడు తొలుత గోదావరీ మండలమున దాక్షారామ నివాసి యగు మల్లికార్జున పండితుని సంప్రదాయము వాఁడు. కన్నడదేశమున ప్రసిద్ధి నొందిన బసవని వృత్తాంతమే తెలియని వాఁడు సోమనాథుఁడు. కన్నడదేశమున హాల్కుఱికి వాస్తవ్యుఁ డైనచో బసవని చరిత్రి నాతఁ డితరులవలన తెలిసికొన నగత్యము లేదు. అతఁడు కన్నడభాష లోనే బసవపురాణము వ్రాసియుండునుగాని, తెనుఁగుభాషలో మొదట వ్రాసియుండఁడు...ఆవెనుక కన్నడభాషలోనికి ననువదింపఁబడుటయు గూడ పాల్కుఱికి వాదమునే బలపఱచుచున్నది." 2

కులగోత్రాదులు :

సోమనాథుఁడు పాలకురికి గ్రామమున శ్రియాదేవియు, విష్ణురామిదేవుఁడు నను బ్రాహ్మణదంపతులకు జన్మించిన పుణ్యమూర్తి. ఇహపర సుఖ సిద్ధిని గోరి ద్విపదలో బసవపురాణము రచించుచు నందు తన మాతాపితరులను బేర్కొని[3]

1. "రెండు పాడ్లు ఎలకుర్కి ప్రసన్న విశ్వేశ్వర దేవరకు సమర్పించినందుల విని యోగము భోగము వారు..."...కాకతీయ రుద్రదేవుని ధర్మసాగరశాసనము.
"శ్రీచౌండ సైన్యపతి రారవీందుతారం గ్రామం సమగ్రమ ప......న్నుఱకుఱ్కి సౌంజ్ఞం..."...గణపతిదేవుని కొండిపర్తి శాసనము. శా.శ. 1136.
చూడు: బసవపురాణ పీఠిక శ్రీ బండారు తమ్మయ్యగారు. పుట. 25 – 26.
2. తెనుఁగుకవుల చరిత్ర. (మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణ. 1953)పుట.313.
3. భ్రాజిష్ణుఁ డగు విష్ణురామిదేవుండు దేజిష్ణువగు శ్రియాదేవి యమ్మయును గారవింపఁగ నొప్పు గాదిలి సుతుఁడ:". బ. పు. (సంక్షిప్తము) 1. 151–152.

ఋణవిముక్తుఁ డైనాఁడు సోమనాథుఁడు. జన్మచే నీతఁడు బ్రాహ్మణుఁ డయ్యు నూతనముగాఁ దెలుఁగునాట వ్యాప్తినొందిన వీరశైవమతమునం దనురక్తుఁడై తన్మతదీక్షను గైకొని వీరమాహేశ్వర వ్రతాచారుఁ డైనట్లు కానవచ్చుచున్నాఁడు. "పాశముక్తుండ కేవల భక్తిగోత్రుండ" నని తన కులగోత్రపాశవిముక్తిని, శైవ భక్తిపారవశ్యమును బ్రకటించుకొనినాఁడు. ఈతని కామతమునం దంతభక్తి కుదురుటకు సమీపగ్రామమునం దున్న కట్టకూరి పోతిదేవర ప్రబోధము కారణ మైయుండవచ్చును. అందువలననే "ఖ్యాత సద్భక్తి మైఁగల కట్టకూరి, పోతి దేవర పదాంబుజ షట్పదుండ" నని చెప్పుకొనినాఁడు. అతనికి దీక్ష నిచ్చి దివ్య పునర్భవమును బ్రసాదించిన గురువర్యుఁడు గురు లింగార్యవరుఁడు. అటనుండి యతనికి గురువే తండ్రి. అతని కరమే జన్మస్థానము. కావుననే "శరణాగతా శ్రయ సకలస్వరూప-గురులింగవర కరోదర జాతుండ"1 నని వినమ్రుఁడై చెప్పు కొనినాఁడు. అతని భక్త్యావేశమే యతనిలోని కవిత్వావేశమును మేల్కొల్పినది. అట్టి తరుణమున కరస్థలి విశ్వనాథయ్యగారి సాన్నిహిత్యము, శిష్యత్వము లభిం చుటయు నతనివలన బ్రకట పరప్రసాద కవిత్వయుతుఁ డగుటయు సంభవించి నది. కవితామధువాని సహజసంగీతశాస్త్ర పాటవముతో నాత్మభక్తి గీతము లాలపించుచున్న సోమనాథుఁడు కవికోకిల యై చెన్నరాముఁడు, గోడగి త్రిపురారి మొదలగు భక్తుల సంభావనకు పాత్రుఁడై, వారికి ప్రాణస్నేహితుఁడు కాఁగలిగి నాఁడు. ఆపైన భక్తకారుణ్యాభిషిక్తుఁ డైనాఁడు. అతనియందు భక్తియు, కవి తయు, మతాచారసంపత్తియుఁ బరిపక్వదశ నందుటకు పెద్దకాలము పట్టియుండదు. అంతట 'భవిజన సమాదరణ సంభాషణాది సంసర్గదూరుఁ డై నిర్మలచరిత్రుఁ' డని వాసి కెక్కెను. సహజపండితుఁడైన సోమనాథుఁడు శైవాగమధర్మశాస్త్ర ములను పుక్కిట పట్టి పరమ విజ్ఞాని యై వెలుఁగొంది

---

1. బ. పు. (సంక్షిప్తము.) 1. 148-149. ఇట్లు ఇట్టి గురుప్రశంస పండితారాధ్య చరిత్రమునందును గలదు: "పేరెన్నఁబడిన శ్రీబెలిదేవివేమ - నారాధ్యులను పర మారాధ్యదేవు-మనుమని శిష్యుండ''. ఇచ్చట మనుమఁ డనఁగా అచార్యవంశమున మనుమఁడని భావించి "ప్రశిష్యు"నిగా గ్రహింపవలెనని కీ॥శే॥ వే. ప్రభాకరశాస్త్రి గారు బ పు. పీఠిక పు.14. 'గురులింగ'ము సంజ్ఞకాదనియు గురువనులింగమనియు శ్రీ బండారు తమ్మయ్యగారు, దీనిని శ్రీ చాగంటి శేషయ్యగారు ప్రత్యాఖ్యానించిరి. (చూడు: కవితరం. 3 సం. 95-98) అనుభవసారమున జెప్పిన గోడగి త్రిపురారి దీక్షాగురువగు గురులింగమే సోమనాథుని దీక్షాగురు వని వారు తలంచిరి.

"ధర 'సుమామాతా పితాసుద్ర' యనెడు
వర పురాణోక్తి నీశ్వరకులజుండ !" [1]

నని చెప్పికొని తన పండిన మత సంస్కారమును బసవపురాణమున నొలుక బోసినాఁడు.

సోమనాథుఁడు పుట్టుకచే బ్రాహ్మణుఁడా? జంగముఁడా? యను సంశయముపై విమర్శకులలో వాదము లున్నవి. శ్రీ బండారు తమ్మయ్యగారు సోమనాథుఁడు జంగమకులజుఁ డనియు,[2] కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగా రాతఁడు శిష్టాచార సంపన్న మైన బ్రాహ్మణకులమున జన్మించినవాఁ డనియు,[3] కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగా రతఁడు ఆరాధ్య బ్రాహ్మణుఁడనియు, శ్రీ చాగంటి శేషయ్యగా రాతఁడు నియోగి బ్రాహ్మణుఁ[4] డనియు నభిప్రాయపడిరి. వీ రందరికిని విమర్శకులలో అనుయాయు లున్నారు.

సోమనాథుఁడు తన ప్రథమకృతి యైన అనుభవసారమున తాను

కం. "భృంగిరిటి గోత్రుఁడను[5] గురు
లింగతనూజుండ శివకులీనుఁడ దుర్వా౽
సంగవివర్జిత చరితుఁడ
జంగమ లింగప్రసాద సత్ప్రాణుండన్. (22 ప.)

అని చెప్పుకొనినాఁడు. ఇందు భృంగిరిటి గోత్రుఁడ నని చెప్పిన వాక్యమును బట్టి సోమనాథుఁడు పంచాచార్య సంప్రదాయమునకు సంబంధించిన భృంగిగోత్రజుఁ డైన సహజవీరశైవుఁ డనియు, జన్మచే జంగముఁడనియు, నతని తల్లిదండ్రులును జన్మచే జంగము లనియు శ్రీ తమ్మయ్యగారి వాదము. కాని, "సోమనాథుఁడు జన్మతః జంగముఁడు కాఁడని యాతని తల్లిదండ్రుల నామములే వేనోళ్ల చాటు చున్నవనియు "భృంగిరిటి గోత్రుఁడను" అనుచోట "గోత్రుఁ డగు" అని

1. చూడు: బసవపురాణము (సంక్షిప్తము) అవతారిక. 1. 145–164.
2. బసవపురాణ పీఠిక. పుటలు. 28–50 (వావిళ్ల ప్రచురణ).
3. బసవపురాణ పీఠిక. పుటలు. 8–13 (ఆంధ్ర గ్రంథమాల ప్రచురణ).
4. కవిత్రరంగిణి. సం. 3 పుటలు. 122–136.
5. పిడుపర్తి సోమనాథుఁడు తన పద్యబసవపురాణమున:

క. భృంగిరిటి గోత్రసంభవ, జంగమ లింగార్చనా విశారద ! విలస, త్సంగీత శాస్త్ర పారగ, గంగోత్పత్తి ప్రకార కావ్య ధురీణా ! 3. 451.

యుండఁదగు ననియు, నప్పు డది సోమనాథుని గురువునకు విశేషణ మగు ననియు, దీక్షానంతరము గురుగోత్రము శిష్యుఁడు తాల్చుట మతాచారమే యనియు తలంచి, 'ఈ పద్యమును బట్టి సోమనాథకవి కేవలము సహజ జంగముఁ డని నిర్ధారణము చేయరాదనియు, బసవపురాణ మందలి తల్లిదండ్రుల నామములను బట్టి యాతఁడు జన్మతః జంగమేతరుఁడై భృంగిరిటి గోత్రుఁ డగు వానిచే శైవదీక్ష నంది భృంగిరిటి గోత్రుఁడ నని యనుభవసారమునఁ జెప్పుకొనె ననియు, గురులింగ హస్త తనూజాతుఁడ నని చెప్పుకొనినవాఁడు భృంగిరిటి గోత్ర సంభవుఁడ నని చెప్పుకొనుటకు సందేహింపఁడనియు నిశ్చయించుటయే యుభయ గ్రంథసమ్మత మగు ననియు"6 విమర్శకులు భావించుచున్నారు. సోమనాథుఁ డారాధ్యబ్రాహ్మణుఁ డని నిరూపించుచు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారిట్లు రచించి యుండిరి : "సోమన తాను మాత్రము భృంగిరిటి గోత్రుఁడనని చెప్పియున్నాఁడు గాని బసవన పండితారాధ్యులకు నేగోత్రమును చెప్పలేదు. జన్మముచే బ్రాహ్మణులైనప్పుడు వారి కేదో గోత్ర వ్యవహారము తప్పదు. సోమనాథుఁడు చెప్పకపోయినను, పండితుఁడు గౌతమగోత్రుఁడని తరువాతి గ్రంథములు చెప్పుచున్నవి. పండితారాధ్య చరిత్ర శ్రోత పాల్కురికి సూరనామాత్యుఁడు హరితసగోత్రుఁ డని సోమనాథుఁడే చెప్పియునాఁడు. అట్లే సోమనాథునికి గూడ అర్షేయమగు గోత్రముండియే తీర వలయును. అతఁడు జన్మముచే బ్రాహ్మణుఁడని యంద రంగీకరించినదే కదా! ఇక, పరంపరాయాత మగు జనశ్రుతిని బట్టి యాతఁడు కౌండిన్య గోత్రజుఁ డని తెలియవచ్చు చున్నది. మఱియు నాకాలమున జంగమ శబ్దము జాతివాచకము కాదు. శివభక్తు లేజాతివారైనను జంగములే. నన్నెచోడకవి గురువు "జంగమ మల్లికార్జునుఁడు" "భూసురకులతిలకుఁడు". పాల్కుఱికి సోమనాథుని గురు వగు బెలిదేవ వేమనారాధ్యుఁడు భూసురుఁడే యని పండితారాధ్య చరిత్రమునఁ గలదు. కావున బసవన, పండితారాధ్య, వేమనారాధ్యుల వలె సోమనాథుఁడును "భూసుర తిలకుఁడైన జంగముఁడే కాని వేరుకాదు. కులగోత్రముల ప్రసక్తిలేని వీరమాహేశ్వరాచారము స్వీకరించిన వెనుక సోమనాథుఁడు తత్సంప్రదాయము ననుసరించి తానీశ్వరకులజుఁ డనియు, భక్తి గోత్రుఁడ ననియు, పార్వతీపరమేశ్వరులు తల్లిదండ్రు లనియు, చెప్పుకొన్నాఁడు. మఱియు భృంగిరిటి గోత్రుఁడ ననియు, గురులింగతనూజుఁడ ననియు ననుభవసారమునఁ జెప్పినాఁడు... ప్రప్రథమ

1. కవితరంగిణి. సం. 3. పుట. 125, 126, 129.

గ్రంథ మగు ననుభవసారమున గురులింగతనూజుఁడ నని చెప్పిన సోమనాథుఁడు బసవపురాణమున తండ్రి విష్ణురామదేవుఁడని యేల చెప్పెనో యోజింపఁదగినది. ఇది ప్రజాసామాన్యమున ప్రచారము గావలసినది. సోమనాథుఁ డిందు శైవమత దీక్షగొని వెనుకధరించిన నామమును చెప్పక, తనజన్మమునకు హేతుభూతులగు తలిదండ్రుల పేళ్లు చెప్పుట యాతనిలోకజ్ఞతయే కాక తలిదండ్రుల యందలి యాతని పూజ్యభావము గూడ సూచించు చున్నది. భక్తి తన్మయత్వము చేతనైన పండితారాధ్య చరిత్రమున "మును బసవపురాణమున నెన్నఁబడిన పెనుపారు భక్తుల పెంపుడు కొడుక" అని వారిని స్మరించియే యున్నాఁడు. కాబట్టి సోమనాథుఁ డారాధ్య బ్రాహ్మణుఁ డని యంగీకరించుట సమంజసము"[1]

మఱియు 'పండితారాధ్య చరిత్రము, చతుర్వేపసారము, బసవరాజీయము మొదలగు గ్రంథములు పరిశీలించినచో వానియందు వేదమంత్ర భాష్యము లుదాహృతమై యుండుటచేతను, వైశ్వదేవాది శ్రౌతకర్మల రహస్యము లెన్నియో విమర్శింపఁబడుటచేతను, "చతుర్వేద పారగుఁడ" నని సోమనాథుఁడే పండితారాధ్య చరిత్రమునఁ జెప్పుకొనుటచేతను, బ్రాహ్మణేతరు డు వేదము చదువరా దను ప్రమాణములను సోమనాథభాష్యమున నుదాహరించుటచేతను, పలువురు కర్ణాటాంధ్ర కవులు సోమనాథుని నారాధ్యనామముతో బేర్కొనియుండుట చేతను,[2] శైవులైన బ్రాహ్మణులకే యీ నామము చెల్లుచుండుటచేతను, సోమనాథుని బ్రాహ్మణత్వము నిర్వికల్పముగా నిలువగల' దని ప్రభాకరశాస్త్రిగారు స్థాపించినారు.[3]

మహిమలు :

బసవపురాణ రచనముతో సోమనాథుని మతదీక్షతోపాటు, కవితాదీక్షయు పండబారినది. ఆతఁడు పురాణనిర్మాణదక్షుఁ డగుటచే నవ్యవ్యాసుఁడుగా వాసికెక్కినాఁడు.

---

1. తెనుఁగు కవుల చరిత్ర. (మ. వి. ప్ర.) పుట 324_325.
   డా. చిలుకూరి నారాయణరావుగారు సోమనాథుఁడు శివబ్రాహ్మణుఁడనియే భావించిరి.
   చూడు: పండితారాధ్యచరిత్ర పీఠిక. పుట. 80_85.
2. ఉదాహరణమునకు పిడుపర్తి సోమనాథుని బసవపురాణాశ్వాసారంభ పద్యములను గమనించునది.
3. బసవపురాణము. పీఠిక పుటలు 8_13.

క. "బసవేశ్వర ముఖ్య ప్రమథ
ప్రసృమర మాహాత్మ్యయుక్త బసవపురాణా
ద్యసమ శ్రీగంథ నిబం
ధ సమంజస వాగ్విలాస ! నవ్యవ్యాసా !" 1

అని పిడుపర్తి సోమనాథుఁడు కీర్తించియుండుట దానికి సాక్ష్యము, అంతియకాదు. సోమనాథుఁడు "పరమతనిర్ధూమధామ భాసురపతి" యనియు, వాదిజైత్రాగ్రగణ్యుఁడనియు "సారవీరవ్రతాచారపారంగతుఁ"డనియు చతుర్నిగమ సారవాఙ్నిధియుక్త సత్కావ్యనిర్మిత ప్రణవశిష్యకామిత విశిష్టముక్తిప్రదుఁ"డనియు, రసనాగ్రస్థానకృత్యత్ప్రవిమల శివశాస్త్రస్థితాశేష గోష్ఠ్యార్థ ... వచన సంధాన నైపుణ్య' భాసితుం డనియు, 'యతి' యనియు, 'సుజ్ఞాని' యనియు, 'సమహిత మహిమాఢ్యుఁ' డనియుఁ గీర్తింపఁబడెను. 2 పిడుపర్తి సోమనాథుఁడు పాల్కురికి సోమనాథుని కవిత్వమహిమను, శివవ్రతాచార మహిమను వికాసక్రమమున నాశ్వాసాద్యంత పద్యములందు వర్ణించి యాతని పరిపూర్ణజ్ఞాన స్వరూపమును సప్తమాశ్వాసమున "పరిపూర్ణానందమూర్తి ! భరిత దశదిశా ప్రాంత విశ్రాంతకీర్తీ !" 3 అని సంబోధించుటలో వ్యంజించెను.

ఇట్టి మహనీయవ్యక్తి యొక్క మహిమలు తెలుపు నద్భుతకథ లనేకము లున్నవి. అవియన్నియుఁ జరిత్రకారులు నమ్మకపోయినను అతని కాలనిర్ణయమున కుపకరించు పూర్వోక్తైతిహ్యమును మాత్రము విశ్వసించుచున్నారు. అట్లు విప్రుని వాక్యములు విని యచ్చటి శైవభక్తులు చెవులను చేతులతో మూసికొని యా బాపని వధింప నుంకించియుఁ బాల్కురికిలో నున్న సోమనాథున కెఱింగింప నేఁగిరి. సోమనాథుఁడు వారి మాటలు విని భవులతో వాదము చేసి గెలువఁదలంచి, భవిపర్శన వివర్జన దీక్షితుఁడుగాన తృణ మానవునితో వాదు గెలిపింతు నని ప్రతిజ్ఞచేసి, లింగముద్రలుగల యెడ్లు పూన్చిన గుడారుబండి నెక్కి యోరుగల్లుకు పయన మయ్యెను. అతనిరాక నోరుగల్లులోని భవు లెఱింగి యల్లరిమూకకు లింగముద్రలు తగిలించి యతని కెదురు పంపిరి. వారు సోమేశ్వరుని కెదురేగి మ్రొక్కినంతనే యతని మహిమవలన వారు ధరించియున్న కృతకలింగ చిహ్నములు సహజములై పోయెను. అంత వా రామహిమ కచ్చెరువంది సోమనాథుని శిష్యులై పోయిరి. ఇట్లు మహిమలు ప్రదర్శించుచు నోరుగంటి కోట వాకిటఁ బ్రవేశించు నవసరమున గవనిపై గజలక్ష్మి విగ్రహము గాంచి యెడ్లు

1. పిడుపర్తి సోమన బ. పు. 1.156.
2. పిడుపర్తి సోమన బసవపురాణము పీ. 79, 4.322; 2.213, 3.452; 4.320; పీ. 79, 82; 6.373;
3. పి. సో. బ. పు. 7.388.

ముందు కడుగుపేయ వయ్యెను. సోమనాథుఁ డది యెఱింగి లక్ష్మిని 'తొలఁగు' మని యానతిచ్చెను. అంత నా విగ్రహము తునియలై నేలఁబడెను. ప్రతాపుఁ డది యెఱింగి భయపడి విప్రులతోఁ గూడివచ్చి సోమనాథునికి మ్రొక్కెను. అతఁడు వారలను దయాదృష్టితోఁ గాంచి, శివభక్తుల సమాదరణము పొంది యచ్చట కొన్నిదినము లుండెను. అంత త్రికాలవేది యగు సోమనాథుఁడు పిడుపర్తి శివరాత్రికొప్పయ్య మొదలగు శివభక్తులను జేరఁబిలిచి "ఈ దేశం బింకఁ దురుష్కులచే నాక్రాంతము గాఁగలదు; మాబోటి మతస్థులకిం దునికి పొందువడ దని చెప్పించి," ప్రతాపుని మంత్రియు తనశిష్యుఁడు నైన ఇందుటూరి అన్న యను బిలువఁబంచి, శివమతస్థులకు డోకిపఱ్ఱుగ్రామము నగ్రహారముగా నిప్పించెను. అందు భక్తులతోఁగూడి కొన్నాళ్లు సోమనాథుఁడుండి, వార్ధకము గదియ వచ్చె ననియు, సమాధిగతుఁడు కావలె ననియు తలంచి కల్యాణపురి కేఁగి, అందు విభూతితో నింపిన గర్తమున సమాధిగతుఁ డై, భక్తులు చూచుచుండ ప్రత్యక్ష శివాకృతిలో లింగైక్య మందెను.[1]

కాలము :

పాల్కురికి సోమనాథకవి ప్రథమ ప్రతాపరుద్రుని కాలమున నున్న వాఁడని కొందఱును,[2] రెండవప్రతాపరుద్రుని కాలమున నున్నాఁడని కొంద ఱును[3] భావించుచున్నారు. ఇట్లు భావించుటకు పైనఁ బేర్కొనఁబడిన యైతిహ్యమునఁగల ప్రతాపప్రశంసయే ముఖ్యకారణము. ఒక విధముగా సోమనాథుని కాలవాదచక్రము ప్రతాపరుద్రుఁడను కేంద్రము నాధారముగాఁగొని పరిభ్రమించు

1. చూడు: పిడుపర్తి సోమనాథుని పద్య బసవపురాణము. పీఠిక ప. 28-46. పాల్కురికి సోమేశ్వర పురాణాదులలో నున్నకథలను గూర్చి కీ. శే. వే. ప్రభాకర శాస్త్రులవారి పీఠికలో పు. 22-26. చూచుకొనునది.

2. క్రీ. శ. 1190 ప్రాంతము వాఁడని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు; 1190-1260-70 నడుమ నున్నవాఁడని నిడుదవోలు వేంకటరావుగారు. 1160-1240 నడుమ నుండె నని బండారు తమ్మయ్యగారు :

3. బసవపురాణ, పండితారాధ్య చరిత్రల రచనాకాలము క్రి. శ. 1-90-1320 మధ్య నుండునని మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ; 1240 తరువాతి వాఁడని చిలుకూరి నారాయణరావుగారు; క్రీ. శ. 1240-1320 నడిమివాడని చాగంటి శేషయ్యగారు.

చున్నది. మొదటి ప్రతాపరుద్రుని (క్రీ. శ. 1185_1195) కాలమున నున్నవాఁడనువారు పైకథలోని ప్రతాపరుద్రనామ సంబంధము తప్ప నితరాంశముల నన్నింటిని ప్రమాణములుగా గ్రహింపరు. పాల్కురికి సోమనాథునకును పిడుపర్తి సోమనాథునకును కాలాంతర మధిక మగుటచే నీతని మాటలలో సత్యదూరము లైన పుక్కిడిపురాణములు చేరియుండవచ్చు నని భావించి పాల్కురికివాని గ్రంథాంతర సాక్ష్యములు, అతని సమకాలీనుల రచనలు, కర్ణాట కవి చరిత్రకారుల రచనలు మొదలగు వానిని ప్రధానసాక్ష్యములుగా గైకొని కాలనిర్ణయము చేసెదరు. రెండవపక్షమువారు ప్రతాపునికాలమందును (క్రీ.శ. 1295_1326) పిడుపర్తి సోమనాథుని వాక్యము లందును ప్రమాణబుద్ధి నుంచి సోమనాథుని కావ్యాంతర సాక్ష్యములను, ఇందుటూరి అన్నయామాత్యుఁడు డోకుపర్రు దానమిప్పించిన వృత్తాంతమును సమన్వయించి కాలనిర్ణయము చేసెదరు.

మొదటి పక్షమువారి ప్రధాన వాద ప్రమాణములలో నొకటి సోమరాజను కర్ణాట కవి రచించిన యుద్భట కావ్యమునఁ బేర్కొనఁబడిన యీ క్రింది పద్యము.

మ. ప్రమథానీకకథార్ణవేందు హరిదేవాచార్యనం ధైర్యనం
సముదంచద్వృషభస్తవామర మహీజారామనం సోమనం
విమలజ్ఞాన సుదీపికాస్ఫురితచేతస్సద్మనం పద్మనం
క్రమదిందం బలగొండు పేళ్వెనౌ సెదా నీ కావ్యమం సేవ్యమం.

ఇందు వృషభస్తవ మొనర్చిన కవిగా స్తుతింపఁబడిన సోమనయే పాల్కురికి సోమనాథుఁ డని వీరి విశ్వాసము. సోమరాజకవి తన రచనా కాలము నీ క్రింది విధముగాఁ బేర్కొనినాఁడు.

మ. జననాథోత్తమ సోమరాజను సిర్ది కావ్యం వలం శాలివా
హన శాకాబ్దమదెయ్దె సాసి రదనూఱిం సంద నాల్వత్తు నా
ల్కనె యారంజిత చిత్రభానువ వరాశ్వీజోల్పి తైకాదశీ
వనజారాతితనూజవాసర దొ ళాదత్తల్ల మంగర్పితం.

ఇందలి "నూఱింసందనాల్వత్తు నాల్కనె" అను మాటలను బట్టి సోమరాజుకవి శ. 1144 (క్రీ.శ. 1222) సం॥ ప్రాంతమువాఁ డని తెలియుచున్నది. కావున నతనిచేఁ బ్రశంసింపఁబడిన సోమనాథుఁడు నంతకుఁ బూర్వమే బసవ పురాణము రచించియుండనోపు నని భావించిరి, కాని "నూఱిన్ సంద" అనుపాఠ

మొక ప్రతియందు మాత్రమే కలదనియుఁ బెక్కు ప్రతులలో "నానూఱ్సంద" యని యున్నదనియు కీ. శే. వా. చిలుకూరి నారాయణరావుగారు తెల్పియున్నారు.1 1144, 1444 ఈ రెండు సం॥లును చిత్రభానులే కాని ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి – బుధవార మగుట 1444 సం॥ననే పొసగుచున్నది. కావున వారి వాదమును బట్టి సోమరాజు శ. 1444 అనఁగా క్రీ.శ. 1522 ప్రాంతమువాఁ డగుచున్నాఁడు. అప్పుడు కన్నడ సోమరాజకవి మనకెంత విశ్వాసార్హుఁడో పిడుపర్తి సోమనాథుఁడు నంతే యగుచున్నాఁడు.

పై పక్షము వారి వాదమున గానవచ్చు ముఖ్యాంశములు మూఁడని శ్రీ చాగంటి శేషయ్యగారు పేర్కొనియుండిరి. అవి : (1) బెలిదేవ వేమనారాధ్యుని మనుమని శిష్యత్వకథ. (2) మల్లికార్జున పండితారాధ్యుల వంశ పరంపరగాథ. (3) కరస్థలము సోమనాథయ్యకథ. వీనిని సవిమర్శముగా శ్రీ శేషయ్యగారు పరిశీలించి సోమనాథుని కాలమునకు సమన్వయించిరి. సోమనాథుఁడు క్రీ.శ. 1240 – 1320 సం॥ మధ్యకాలమున నుండియుండవచ్చు నని వారు నిర్వహించిన వాదము[2] యుక్తియుక్త మని నాకుఁ దోచినది. ఓరుగల్లులో ఈశ్వరాలయమున బసవపురాణ శ్రవణము, సోమనాథుఁడు తనశిష్యుఁడైన ఇందుటూరి అన్నయామాత్యుని చేత చెప్పించి పిడుపర్తి శివరాత్రి కొప్పయ్యకు డోకిపఱ్ఱు నగ్రహారముగా నిప్పించుటయు నొకే ప్రతాపరుద్రుని కాలమున జరిగియుండుట నిర్వివాదాంశ మనియు, అన్నయామాత్యుఁడు రెండవ ప్రతాపరుద్రుని పినతల్లియైన రుయ్యాంబయొక్క భర్త యగుటచే ప్రతాపుఁ డనఁగా రెండవ ప్రతాపరుద్రుఁడే యనియు, అందులకు శాసనాధారము లున్న వనియు, డోకిపఱ్ఱు దానకథ అసత్య మనుటకు వీలులే దనియు, అగ్రహారము వడసిన వంశీయులలోనివాఁడగు పిడుపర్తి సోమనాథుని వ్రాతలు సత్యములని గ్రహించుట యుక్తమనియు అందు శివరాత్రి కొప్పయ్య వంశమువాఁడైన పెదసోమయ్య తన తాత సంపాదించిన యగ్రహారమున కభ్యంతర మేర్పడఁగా ప్రౌఢదేవరాయల (రెండవ దేవరాయలు క్రీ.శ. 1419–1449) నాశ్రయించి డోకిపఱ్ఱు నతనిచే మరల పొందె నను కథ ద్వితీయప్రతాపరుద్ర కాలవాదమున కనువుగా నున్న దనియు, సోమనాథుఁడు ప్రథమ ప్రతాపరుద్రుని కాలమున నున్నచో బసవపురాణమున

1. పండితారాధ్యచరిత్ర పీఠిక. పుట 8–11.

2. ఆంధ్ర కవి తరంగిణి సం. 3. పుట 136–154.

వర్ణించిన యేకాంతరామయ్య యతని సమకాలీనుఁ డగు ననియుఁ బేర్కొనుచు నిట్లు నిశ్చయించిరి :

"సోమనాథుని కాలము వెనుకకు నెట్టవలయు నని ప్రయత్నించిన వారుకూడఁ బ్రతాపరుద్రుని వదలిపెట్టలేకున్నారు. దానికిఁ గారణ మీ కథలయందు వారికిఁగూడ నమ్మక ముండుటయే. లేకున్న సోమనాథుని కాలనిర్ణయమునకుఁ బ్రతాపరుద్ర మహారా జెందులకు ? పైనఁ జెప్పిన మూడుకథలు తప్ప ప్రతాపరుద్రునితో సోమనాథునకు సంబంధమును గలుపు కథ లేవియును లేవు. పైనఁ జెప్పిన గాథలను నమ్మి, కర్ణాటకవి చారిత్రమునందలి కథను సత్య మని భ్రమించి, సోమనాథుని బ్రతాపరుద్రుని కాలములోని వాఁ డనుకొని చరిత్రకారు లందుల కనువుగ నుండునట్లు బెలిదేవ వేమనారాధ్యులతో సంబంధించిన కథల నెట్లో సరిపెట్ట యత్నించుటచే నీ వివాదము పెద్ద దయినది. సోమనాథునకు దాదాపు 150 సం॥ కాలములో నుండి సోమనాథుని ద్విపద బసవ పురాణమును బద్య బసవ పురాణముగా రచించి యీ గ్రంథమును సోమనాథునికే కృతి యిచ్చినట్టియు, సోమనాథుని శిష్యుఁ డైన కొప్పయ్యకు మనుమని మనుమని కుమారుఁడైనట్టియు, పిడుపర్తి సోమనాథకవి చెప్పిన వాక్యములందు మనము గౌరవ ముంచితిమేని, సోమనాథుఁడు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలములోనివాఁ డని యనకతీరదు". 1

చారిత్రకపురుషుఁ డై, మతప్రవర్తకుఁడై వీరశైవభక్తులకు పరమేశ్వరకల్పుఁడైన బసవేశ్వరుని చరిత్రము ప్రత్యక్షప్రమాణప్రతిపత్తి నుండి, ఐతిహాసికకథాకథనస్థాయి కెక్కి, పురాణకల్పనామహనీయవియన్మండల మందుకొని, సోముని కవితాసుధామందిర మగుట కొక శతాబ్దము పట్టినది. పట్టుట సహజము కూడ! నందీశ్వరావతార మని బసవేశ్వరుని కీర్తించి యతనిని పురాణవ్యక్తిగా నిరూపించి నవ్యవ్యాసుఁ డని వాసికెక్కిన సోమనాథుని బసవపురాణము దేశిచ్ఛందమునఁబడి జనావళి నాకర్షించినను, పండితావళి ప్రమాణబుద్ధుల కెక్కకపోవుటచే కాబోలు దానినే మారనాదుల పురాణరచనామార్గము ననుసరించి గద్యపద్యాత్మకముగా వచింపఁ బూనుకొనిన పిడుపర్తి సోమనాథునకు పురాణకర్త యగు సోమనాథుని పురాణవ్యక్తిగా మార్చుటకు మఱి యొకటిన్నర శతాబ్దము పట్టినది. అప్పటికి సోమనాథుఁడు—నందీశ్వరుఁ డగు బసవేశ్వరుని మతమును పునరుద్ధరించుట కవతరించిన భృంగీశ్వరుఁడు. 2 అతీత భూతార్థమితిహాస 3 మగునప్పుడు చిరభూతార్థముకదా పురాణమై పుట్టునది!

---

1. ఆంధ్ర కవి తరంగిణి సం. 3. పుట. 153, 152.
2. పిడుపర్తి సోమనాథుని బసవపురాణము. పీఠిక. పద్య. 23, 45.
క్రీ. శ. 1560 ప్రాంతమున తోంటద సిద్ధలింగకవి కన్నడమున పాలకురికి సోమేశ్వర పురాణమే రచించెను.
3. భోజుని సరస్వతీ కంఠాభరణము: "అతీతార్థ ప్రాధాన్యా దితిహాసః" 2_368.

సోమనాథుని కృతులు :

సోమనాథుఁడు మతోద్ధరణకై తన కవితాశక్తిని వినియోగించిన కవిశేఖరుఁడు. అతఁ డెంత భక్తకవియో అంత పండితకవి. వీరశైవమతోద్ధరణ కతని బసవభక్తి యెంత సహకారి యైనదో అతని పాండిత్య మంత యవసరమైనది. ఎట్లన: బసవేశ్వరుఁడు భక్తి ప్రధానమైన వీరశైవమును కర్ణాటక దేశమున వ్యాప్తిఁ జేసినాఁడు. అందతఁడు భక్తిగీత సాహిత్యమును సృష్టించినాఁడు. పెక్కుమంది భక్తులామార్గము ననుసరించి యా మత ప్రచారము చేయ మొదలిడిరి. కాని కాలము గడచినకొలఁది బసవనినాఁటి జిగి కాని బిగి కాని కర్ణాటముననే కానరాలేదు. అట్లుండ ఆంధ్రదేశము మాటయేమి? ఇచ్చట వేంగీప్రాంతములందు వైదికము పునర్విజృంభణము చేసినది. భారతము వెలసినది. రాజసభలలో, పండితపరిషత్తులలో వాదసదస్సులలో వైదికమతము పరమతములను తన పాదాక్రాంతముల నొనర్చుకొనుచున్నది. ఇట్టి తరుణమున పండితారాధ్యాదులాంధ్రమున బ్రాహ్మ్యమును వీడక, వేదపారగత్వమును భజించి శైవమునకు వేదపురాణేతిహాసశాస్త్ర ప్రమాణవాదబలమును సిద్ధపఱచు పండితమార్గముఁ దీర్చిదిద్దియున్నారు. మతము బ్రతుకవలె నన్నచోఁ బ్రజల మనస్సు లందును బుద్ధు లందును విశ్వాసము పడయవలెను. సంఘ మనస్స్థానీయు లైన సామాన్య ప్రజ భక్తికి వశ మై, మహిమలకు ముగ్ధ మై విశ్వాసమును బెంచుకొనవచ్చును. కాని సంఘబుద్ధిస్థానీయ మైన మేధావివర్గము మాత్రము కర్కశతర్క పరీక్షలకు నెగ్గి, బుద్ధి వికాసము నిచ్చెడి జ్ఞానమతమునే గౌరవించుచుండును. వారికి భక్తి ప్రథమసోపానము; జ్ఞానము ఉత్తమసోపానము. భక్తితో బ్రజల నాకర్షించిన వీరశైవము పండితుల నాశ్రయించి జ్ఞానపుష్టిని గాంచు పద్ధతి తెలుఁగునాట వ్యాపించినది. దాని కాలంబన మైనదే ఆరాధ్య సంప్రదాయము. ఇది బసవేశ్వరుని వెన్నంటి పరమేశ్వరుని సన్నిధానమున కేఁగిన పండితారాధ్యుల తరువాత నాంధ్రమునఁ గొంత మందగించినది. దానికి తిక్కన సోమయాజి వైదికనిష్ఠ మగుమహాకవిత్వోద్యమము, ఓరుగల్లున నతఁడు సాధించిన మతవిజయము మొదలగునవి బలమైన కారణములు. యథావాక్కుల అన్నమయ్య వంటి కవులు కొందఱు గొంతెత్తి శైవకవిత్వ మాలపించినను మతమునకు బలము చాలలేదు. దానితో నటు పండితులలో నిటు పామరులలో వీరశైవము నిలువఁద్రొక్కుకొనునట్లు చేయవలసిన భారము సోమునిపైఁ బడినది. అతఁడు భక్తి కవితచేఁ

ప్రజలను పరవశింపఁ జేయఁగలఁడు; పాండితీమండితము లైన రచనలచే పండితుల చిత్తములు పట్టగలఁడు. మెత్తగాఁ జెప్పవలసివచ్చినప్పుడు నాల్కను వత్తిగాఁ జేసి మతమార్గమున తేటమాటల వెలుఁగులు నింపఁగలఁడు. పరమతముల నొత్తవలసి వచ్చినప్పుడు డానాల్కనే కత్తిగా వాడి ప్రౌఢోక్తులతో పరసిద్ధాంతఖండనము గావింపఁగలఁడు. ఆకాలమున నా మతము బ్రతుకుట కతఁడు కావలసివచ్చెను. అతఁ డామతముకొఱకే తన కలమును, కాలమును అంకితము చేసెను.

అరాధ్య సంప్రదాయము నాకళించుకొనిన యువసోమనాథునకు — "ఏక ఏవరుద్రో న ద్వితీయాయతస్థే'' ఇత్యాది శ్రుతివాక్యముల నన్వయించి శివతత్త్వసార గద్య పద్య సమితిని నిర్మించి శివమహిమను లోకమునఁ జాటిన — మల్లికార్జునపండితుఁడే మనస్సున తత్త్వగురులింగ మై శివానుభవమును ప్రసాదించినాఁడు. ఆ అనుభవసారమే సోమనాథుని ప్రథమకృతి "అనుభవసారము.'' అం దాతఁడు త్రికరణశుద్ధిగా పండితారాధ్యులను గీర్తించుచున్నట్లు మూఁడు సీస పద్యములలో నతనిని వర్ణించెను. (7–9) మఱియు–

క. అనుభవసారం బనఁగా
మనసిజహరు శుద్ధభక్తి మార్గము వేదో
క్తనిరూఢిఁ బురాణ రహ
స్యనియుక్తిని విస్తరింతు నది యెట్లనినన్"– (30)

అని పండితారాధ్య మార్గమును పునరుద్ధరించెను. ఇట్టి పవిత్రకార్యము నతఁడు కావ్యరూపముగా నావిష్కరించుటకుఁ దగిన కవితాశక్తినిఁ బ్రసాదించి ప్రోత్సహించిన కవితాగురువు కరస్థలము విశ్వనాథయ్య. అతనియెడఁ గల గురుభక్తిని కావ్యమునఁ బ్రదర్శించి సోముఁడు కృతకృత్యుఁ డైనాఁడు. (33–34). గోడగిత్రిపురారి యీకృతికి నొడయఁడు (25). అతఁడు బహుశః సోమనాథునకు శివతత్త్వసారాది శైవమతగ్రంథ సంప్రదాయ రహస్యములను విప్పిచెప్పిన విజ్ఞాని యగుటచే నాతని కాతఁడు కృతిసమర్పణ మొనర్చియుండును.

ఇది 243 పద్యముల లఘుకృతి. గురుభక్తిమహిమ, గురులింగ జంగమ శరణ ప్రసాదభక్తస్థలములు మొదలగు శైవమత సంబంధాంశము లిందు వర్ణింపఁబడినవి. ఇందు కందపద్యము లధికముగా నున్నను, సామాన్య వృత్తములతోపాటు త్రిభంగి, క్రౌంచపదము, తరువోజ, వనమయూరము మొదలగు

విశేషవృత్తములు కూడ వాడఁబడినవి. త్రిభంగిని కావ్యమున వాడిన తెలుఁగు కవి ఈతఁడేనేమో ! ఈతని యీ కావ్యనిర్మాణ పద్ధతి కన్నడ 'చత్తాణ' కావ్య మర్యాద ననుసరించుచున్న దనవచ్చును.[1] ఇతఁడు చతుర్విధ కందము లను చిత్ర కవిత్వ రచనమందును, ద్విత్రిప్రాసల ప్రయోగమునందును, అనుప్రాసాది శబ్దాలంకారములఁ గూర్చుటయందును మక్కువ యెక్కువగా నిందుఁ జూపించెను. సమతగల సీసపద్యరచనమును, ప్రథమదళమున యతిపాటించిన క్రౌంచపద వృత్తరచనము నీతని ప్రత్యేకత.

ఇందు సోమనాథుఁడు బసవనిఁ దలంపలేదు. అతని మహిమ లీతని చెవుల నప్పటి కింకను పడలేదు కాఁబోలు. కాని బసవనిభక్తి బీజములు నాటఁబడుట కనువైన యుత్తమ తత్త్వసంస్కార మితని చిత్తమున కల్గినది.

ఉ. ఏపుర శుద్ధ భక్తి రతి నేడ్తెఱ నూల్కొన నేకలింగ ని
ష్ఠాపర యుక్తి నివ్వటిల సజ్జనభావము పొంగలింప ను
ద్దీపిత తత్త్వదృష్టి మతిఁ దేజ మెలర్పఁగ సచ్చరిత్రయం
దోపి వెలుంగు భక్తుఁడు మహోన్నతి నుండు జగజ్జనాశ్రయా ! (167)

అనెడి యాతని వాక్కున నా సంస్కారము గుబాళించుచున్నది. ఇట్టి తత్త్వ దృష్టి పండితారాధ్య సాహిత్యరససిద్ధిచే నాతఁడు సాధించిన శివానంద పదసిద్ధి.

ఇట్టి యనుభవసారముతో నాతఁడు శివభక్తగణ సందర్శనార్థము దేశ సంచారము చేసియుండును. భక్తకూట మగు శ్రీశైలకూట మతని చిత్తౌన్నత్యమును గుర్తించి బసవనిభక్తిని అందు ప్రతిష్ఠాపించెను. అతని కప్పుడది యొక నూతనానుభవసార మైనది. అనుభవసారము నాటికే అతఁడు—

శా. "వ్రాలున్ వ్రాలు శివార్చనాపరవశవ్యాప్తిన్ బ్రమోదంబునన్
గ్రాలున్ గ్రాలు నహర్నిశంబు శివలింగధ్యాన సంపన్నుఁడై
సోలున్ సోలు నపారసార వివిధ స్తోత్రప్రలాపంబులన్
దేలున్ దేలు మహానుభావసుఖవార్ధిం భక్తుఁ డుద్యద్గుణా !" (166)

అని చెప్పఁగలిగిన అనుభూతి గలవాఁడు. ఆపైన బసవభక్త్యనుభూతి క్రొత్త రుచుల నిచ్చుటచే నాతఁ డంత భక్తి పారవశ్యము నందును బ్రకటించినాఁడు. పండితుని మార్గముకన్న ప్రాచీన మైన బసవనిమార్గము పురాణమార్గముగా

1. కవిరాజమార్గము. 1.34, 35 చూడు: (భాషాసారస్వతములు దేశి : శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు. పుట 126).

నతని చిత్తమున హత్తుకొనినది. అట్టి చిత్తము బసవపురాణ రచనాయత్త మైనది.

బసవపురాణము బసవని విశుద్ధభక్తి మార్గమును బ్రతిపాదించుట కేర్పడిన ప్రప్రథమ వీరశైవపురాణము. దానిని భక్తులు పాడుకొనవలె ననియు, పామరులు పురాణశ్రవణము చేయవలె ననియు, జనులహృదయములు భక్తచరిత్రముల కార్ద్రము లై బసవని భక్తిబీజములకు ఫలక్షేత్రములు కావలె ననియు రచించెను. అందువలననే అది సర్వసామాన్య మైన జానుఁదెనుఁగున జాలువారినది. దాని ప్రయోజన మది అనతికాలములోనే సాధించినది. ఆంధ్ర కర్ణాట దేశము లా పురాణమును పూవులలోఁ బెట్టి పూజించినవి; పుక్కిటఁ బట్టి కీర్తించినవి. ఇంతటి పురాణము రచించిన భక్త సోమనాథుఁడు బసవ కీర్తనమునఁ దృప్తిపడలేదు.

"ఇదియుఁ గోటికిఁ బడగ గెత్తిన వానిఁ
బదివేల కాప వై బ్రదుకు మన్నట్టు
లా పరంజ్యోతిస్స్వరూపంబునకును
దీపకంభంబు లెత్తించినయట్లు
భవనిర్మితము లైన పత్రపుష్పములు
భవునకుఁ దగ సమర్పణ సేయునట్లు
గాక కీర్తింపఁగా నాకుఁ దరంబె
ప్రాకటంబుగ భక్త బందారి చరిత!" (ప్ర. 243-250)

అని బసవపురాణానంతరము కూడ బసవగుణమతకీర్తనాత్మకము లైన కృతుల నాతఁడు రచించుట మానలేదు. పుంఖానుపుంఖముగా నతని కలమునుండి బహువిధ సాహిత్య ప్రక్రియలు లాస్యముచేయుచు లోకమున కవతరించినవి.

సోమనాథుఁడు నిర్మించిన భక్తిసాహిత్యమున నొక విశిష్ట లక్షణము కానవచ్చుచున్నది. అది యాతని వ్యక్తిత్వమును గొంతవఱకు వ్యక్తీకరింపఁ జేయుచున్నది. అతఁడు వస్తుతః కవి. అందువలన నిరంకుశుఁడు; ఆవేశపరుఁడు. ఆపైన భక్తుఁడు. అందుచే నతఁడు కవిత్వమును శివార్పితము, బసవార్పితము చేసెను. అతఁ డుద్దండ పండితుఁడు. అందువలస వాదములు చేసెను. వివిధ భాషలయందు, వివిధచ్ఛందములయందు, వేదవేదాంగములయందు అతఁ డార్జించిన పాండిత్యమును బహువిధ సారస్వత గ్రంథములుగా నాతఁడు నిర్మిం

చెను. అతఁడు భక్తుఁ డగుటచే జంగమలింగరూపు లగు భక్తులు కోరినప్పుడు లోకహితార్థమై సర్వసామాన్య మగు ద్విపదలో కావ్యము నిర్మించెను. లేనిచో నతని యిచ్చకువచ్చిన ఛందములలో నిచ్చవచ్చిన విధముగా భక్తికృతులు లిఖించు కొనెను. భక్తికృతులతో నాగక శాస్త్రవాఙ్మయమును గూడ నిర్మించి మతము నకుఁ బుష్టి చేకూర్చెను. శ్రీశైలమున భక్తుల యాదేశానుసారము సోమనాథుఁడు రెండు బృహద్గ్రంథములను నిర్మించెను. ఒకటి పురాణము. మఱియొకటి చరిత్రము. ఒకటి భక్తి సోపానము. మఱియొకటి జ్ఞానసోపానము. ఒకటి భక్తిరసతరంగిణి. మఱియొకటి మతశాస్త్రవిజ్ఞానమహాంబుధి. ఈ యుభయరస జగత్తుల నడుమ పూఁదోటలుగా, వనజాకరములుగా, గిరిశృంగములుగాఁ గన వచ్చు భక్తికృతులు కొన్ని కలవు.[1] అవి ప్రధానముగా గద్యలు, రగడలు, ఉదాహరణములు, అష్టకపంచకములు, స్తవములు, శతకములు, భాష్యములు.

1. గద్యలలో పంచప్రకారగద్యయు, నమస్కారగద్యయు, అక్షరాంకగద్యయు, అష్టోత్తరశతనామగద్యయు, ముఖ్యములైనవి. చిత్తసమాహితార్థమును, అక్షరమాలారూపుఁడైన భగవంతుని స్తుతించుటకు నుద్దేశింపఁబడి నామ కీర్తనైక లక్షణవిశిష్టములై, ఆంధ్రగీర్వాణ కర్ణాటచ్ఛంద సంప్రదాయ ముల ననుసరించి మాత్రాగణబద్ధములై విలక్షణముగా నిర్మింపఁబడిన కృతు లివ్వి. అక్షరాంకగద్యమున అక్షరాంక పద్యమును సోముఁడు రచించెను. అం దచ్చులతోఁ గూర్చిన యొక పద్యము గమనింపుడు ;

చ. "అమితయశస్క ఆద్యయన ఇద్రుచి ఈశ్వర ఉగ్ర ఊర్జిత
క్రమ ఋషభాంక ౠజహార ఌస్థిత ౡస్మిత ఏకరుద్ర ఐం
ద్రమహిత రూప ఓమితి పదద్యుతి ఔర్వలలాట అంబికా
సమరసభావ అఃకలిత వర్ణనుతం బసవేశ పాహిమాం॥ "

ఇట్లే కకారాది క్షకారాంతము గల యొక్కొక్క యక్షరమున కొక్కొక్క పద్యముచొప్పున నిందు కూర్చుట యొక భక్తివిశేషము.

2. రగడలలో బసవరగడ, బసవాఢ్య రగడ, సద్గురురగడ, గంగోత్పత్తి రగడ యనునవి – తెనుఁగుకృతులో కర్ణాటకకృతులో స్పష్టముగాఁ జెప్పఁజాలని రచనలు – కలవు.

1. విశేషములకు శ్రీ బండారు తమ్మయ్యగారి 'పాలకురికి సోమనాథకవి' యను గ్రంథ మును జూచునది.

3. సోమనాథుఁడు రచించిన సంస్కృతాంధ్ర బసవోదాహరణములు ప్రసిద్ధములై తత్సాహిత్యశాఖకవి ప్రథమములై యాచార్యపీఠములుగా రాజిల్లుచున్నవి. విశిష్ట భక్తిస్ఫోరకము లగునట్లు విభక్తి ప్రత్యయములకు ప్రాధాన్య మిచ్చి నిర్మించు విచిత్ర భక్తికావ్య ముదాహరణకావ్యము. పద్యము, కళిక, ఉత్కళిక – అను వానిని క్రమముగా నొక్కొక్క విభక్తి యందును రచించి, సార్వవిభక్తిక శ్లోకము (సం) (పద్యము–తెలుఁగు) తోడను, అంకితాంక శ్లోకముతోడను నాయకునిఁ గీర్తించు లఘుకృతు లివ్వి. విద్యానాథుఁడితని సంస్కృత బసవోదాహరణమునే తన ప్రతాపరుద్రీయమున నుదాహరించెను. తెలుఁగు బసవోదాహరణమున నంకితాంకపద్యము కానరాదు. ప్రాచీనాంధ్రభాషా విశేషములు, ఛందో విభక్తిసంప్రదాయముల నెఱుంగుటకీ కృతులు భాషావేత్తల కుపయుక్తము లగుచున్నవి. సోమనాథుని ప్రసన్నభక్తి కవిత్వ మీకృతులయందు విభక్తుల నాశ్రయించి విశేషముగా జాలువారినది. ఉదాహరణమునకు; సార్వవిభక్తికము. (బ. ఉ.)

ఉ॥ నీవు దయాపయోనిధివి నిన్ను నుతించినఁ గల్గుఁ భక్తి నీ
చే వరవీర శైవరతి చేకుఱు నీకయి యిత్తుఁ గబ్బముల్
నీ వలనం గృతార్థత జనించును నీకు నమస్కరింతు నీ
భావమునందునుండి నను బాయకుమీ బసవయ్య! వేడెదన్.

ఈమధ్య సోముని పండితారాధ్యోదాహరణమును డా॥ బి. రామరాజుగారు తొలిసారి వెలుఁగునకుఁ దెచ్చిరి. (సా. వ. వ. 54. 3).

4. సోమనాథుఁడు పంచరత్నము లని ప్రసిద్ధి నందిన మాలినీవృత్త పంచకమును బసవపంచక మను పేర వెలయించెను. అట్లే వసంతతిలక వృత్తములందు వృషభాష్టకమును, మాలినీవృత్తములలో బసవాష్టకమును గూడ రచించెను. ఇష్టభావలింగములను త్రివిధలింగముల నొక్కొక్కదాని నెనిమిది అనుష్టుప్ శ్లోకములలో వర్ణించుచు మఱియొక సంస్కృత భక్తికృతి నొనర్చెను.

5. సోమనాథ స్తవ మనియు, భక్త స్తవ మనియు లఘుద్విపద స్తుతి కృతులు సోమనాథుని పేర వినఁబడుచున్నవి.

6. సోమనాథుని వృషాధిపశతకము భక్తిరస శతకవాఙ్మయహారమున నాయక మణివలె వెలుగొందుచున్నది. అష్టభాషావిశారదుఁడైన యీకవి సంస్కృతాంధ్ర ద్రవిడ కర్ణాటక మహారాష్ట్రీయమణి ప్రవాళాది భాషలలో చంకోత్పలమాలావృత్తములు రచించి బసవని గీర్తించి తనభాషా

పాండిత్యమును సార్థక మొనర్చుకొనెను. "బసవా! బసవా! వృషాధిపా!" యను మకుటమును, అష్టోత్తరశతసంఖ్యానియమమును పాటించిన ప్రప్రథమాంధ్రశతక మని దీనిని విమర్శకులు కీర్తించుచున్నారు. ఇందు యమకము, అనుప్రాసము, ముక్తపదగ్రస్తము మొదలగు శబ్దాలంకార వైచిత్ర్యములను సోమనాథుఁడు గుప్పించివైచినాఁడు. శతకమున సందర్భానుసారముగా బసవేశ్వరుని యద్భుత మహిమలను మఱికొందఱు భక్తుల కథలను బొందుపఱచి శతకనామమును సార్థకపఱచినాఁడు. సోముని భక్తి పారవశ్యమున కీశతకము చక్కని యుదాహరణము!

7. వీరశైవభక్తి సవైదికముగా వివరించుటకై ప్రామాణికస్తోత్ర గ్రంథమును నిర్మించుతలంపున "చతుర్వేదసార" మను 357 సీసపద్యముల లఘుకృతిని సోముఁడు రచించెను. దీనికి బసవలింగశతక మను నామాంతరము కలదు. ఇందు బసవశబ్దవిచారము, బసవనామోచ్చారణ మహిమ, ప్రకృతి పురుషనామములు, అశుచినిరసనము, చరలింగస్తుతి; శీలలక్షణము, శివానుభవసూత్ర వివరణములు మొదలగు నంశములు బహుశ్రుతిస్మృతి ప్రమాణములతో నిరూపింపఁబడినవి. అతని వేద వేదాంగపారగత్వమున కీకృతి యొక తార్కాణము!

8. "చెన్నమల్లు" అను మకుటముతో సోముఁడు 32 సీసపద్యములను రచించెను. శ్రీశైల చెన్నమల్లికార్జునుఁ డతని యిష్టదైవ మనియు, బసవనిభక్తి కుదిరిన తరువాత నాతనినే బసవఁ డని భావించి యభేదభక్తితో నీ పద్యములు సోముఁడు రచించె ననియు విమర్శకుల యభిప్రాయము. కల్కొములో జీవసమాధిగతుఁ డగునెడ సోమనాథుఁడు ముప్పదిరెండు సోపానములను గ్రమముగా నవరోహించుచు మెట్టున కొక్క పద్యము చొప్పున నీ సీసములు చెప్పె నని ప్రతీతి యొకటి కలదు. బసవేశ్వరుని మేనల్లుఁ డైన చెన్నమల్లు పేర నీ పద్యము లాతఁడు రచించె ననియు వాడుక కలదు. ముముక్షువైన భక్తుని చిత్తసంస్కార మీ పద్యములందుఁ గానఁబడుచున్నది.

9. వీర శైవమతమునకు బ్రమాణ భాష్యగ్రంథములుగా సోమనాథుఁడు రెండింటిని వెలయించెను. 1. రుద్ర భాష్యము. ఇది యజుర్వేద

మందలి శతరుద్రీయ మను రుద్రాధ్యాయమునకు (నమక చమకములకు) భాష్య మైయుండు నని విమర్శకులు భావించుచున్నారు. 2. సోమనాథ భాష్యము : దీనికి 'బసవ రాజీయ' మనియు, 'వీరమాహేశ్వర సారోద్ధార' మనియు నామాంతరములు గానవచ్చుచున్నవి. శైవ సంప్రదాయ సర్వస్వమును సంస్కృతమున నిరువదియై దధ్యాయములలో శ్రుతిస్మృతి పురాణేతిహాస ప్రమాణ యుక్తముగా నిందు సోముఁడు నిరూపించెను. గాయత్రీ మంత్రము శివపరముగా నిరూపిత మగుటయు, లింగార్చన ప్రాధాన్యము నుగ్గడించుటయు నీ గ్రంథ విశేషము. వైదికాచార గర్హణ మిందుఁ చేయఁబడక పోగా దాని ప్రాధాన్య ముగ్గడింపఁ బడిన దనియు ప్రభాకర శాస్త్రుల వారు పేర్కొని యున్నారు. హరదత్తాచార్యుల చతుర్వేద తాత్పర్య సంగ్రహమునుండి సోముఁడు పెక్కు శ్లోకములను గ్రహించి యిం దుదాహరించెను. దీనికి మనోహరుఁ డను శైవాగమవేత్త సులభ వ్యావహారికాంధ్ర భాషలో రచించిన వ్యాఖ్యానము పదియవ ప్రకరణము వఱకు లభించుచున్నది.

10. ఇవికాక అన్యవాద కోలాహల మను పేరుగల సోమనాథలింగ శతకము, మల్లమదేవి పురాణము, మొదలగు తెలుఁగు కృతులు 'శీలసంపాదనము, శివగణ సహస్రనామ' యను కన్నడ కృతులను గూడ సోముఁడు రచించె నని విమర్శకులు భావించుచున్నారు.

పై రచనలలోఁ గొన్ని స్తవములు సామాన్యుల కందుబాటులో నున్నను సంస్కృత గద్య పద్యాష్టకములు గీర్వాణ సంస్కార మున్న వారికిఁ గాని యందవు. శతకోదాహరణములు సంస్కార మున్న భక్తుల నాకర్షించినను అనుభవసారాదులు సోమనాథ భాష్యాదులు శాస్త్ర పాండిత్య మున్న పండితులకు గాని యవగాహనము కావు. కావున నీ రచనలతో సోమనాథుఁడు మేధావివర్గమును మతమువైపు మఱలించుకొనుటకు యత్నించినాఁడు. పండితారాధ్య సంప్రదాయ మాతనిలోఁ బండించిన పరిపక్వ ఫలసమూహ మీకావ్య కదంబము !

సోమనాథుని సాహిత్య జీవితమునకు భరతవాక్యముగా పరిఢవిల్లినది పండితారాధ్య చరిత్రము. దీని రచనకును బ్రోత్సాహ మిచ్చినది శ్రీశైలభక్త

కూటమే : సోమనాథుఁడు వీరశైవమునకు పండితత్రయ సంప్రదాయము వలన గల్పించిన యౌన్నత్యమునకు వారి గుర్తింపే యీసత్కృతి.

"ఖ్యాతిగా సద్భక్త గణలాలనము గ-నూఁతనంబుగ బసన్నుతముగా మున్ను
'బసవపురాణ' మొప్పఁగ రచించితివి; బసవపురాణ ప్రబంధంబునందు
ప్రథిత పురాతన భక్తగణాను-కథనంబు లితిహాస ఘటనఁ గూర్చితివి;
వరవీరభక్తి సవైదికంబుగను-విరచించితివి 'చతుర్వేద సారము'న;
బసవన్న మహిమ శుంభద్భక్తియుక్తిఁ-బ్రసరించితివి గద్యపద్యాదికృతుల;
నర్ణవావృత ధాత్రియం దొప్పు బసవ-వర్ణనల్ సేసితి వదుసన వీను
లారంగ గురుమల్లికార్జున పండి-తారాధ్యుల చరిత్ర మర్థి వర్ణింపు;
పరిశిష్ట పరిమిత ప్రాక్తన భక్త-చరితంబు లితిహాస సంగతి నొలయ
సంధింపు పండిత చరితంబునందు-" (పండితారాధ్య చరిత్ర—అవతారిక)

అని భక్తుల యాజ్ఞ. పూర్వము "రచియింపు బసవపురాణంబు నీవు" అనిన వారు ఇప్పుడు "సంధింపు పండిత చరితంబు" అనినారు. జంగమలింగా కృతులుగా బసవ పండితులు శివాకృతు లయ్యును జన్మచే నొకరు బసవావ తారులు; మఱియొకరు ప్రమథావతారులు. శివుఁ డన్నను బసవఁ డన్నను భేదము లేదని వీర శైవ మత తాత్పర్య మగుచుండగాఁ బండితుని బురాణ పురుషుఁ డగు బసవనిగా నిరూపింపరాదు. కావున నాతని చరిత్ర మొక యితిహాసము కావలె నని వారి నిష్కర్ష. ఇతిహాసము "శాస్త్రరూప కావ్యచ్ఛాయాన్వ యిని" కావలె ననికదా ధ్వన్యాలోక మతము. అప్పు డది యుపదేశోపరంజ కత్వ సామర్థ్యము సంతరించుకొనును. పండితారాధ్య చరిత్ర మట్టి పాకమునఁ బడినది. వృద్ధ సోమనాథుని పండిన బుద్ధి దానిని సర్వతోముఖ శేముషితో సమలంకృత మొనర్చినది.

పండితారాధ్య చరిత్రము దీక్షాపురాతన వాద మహిమ పర్వత ప్రకరణ ములుగా విభక్త మై యున్నది. వీరమాహేశ్వరాచారుని జీవితము పంచాచార పంచావరణ నిబద్ధమైనట్లే పండితారాధ్య చరిత్రమును పంచప్రకరణ ప్రసిద్ధ మైనది. ఇందు పండితచరిత్రము ప్రధాన ప్రతిపాద్య మైనను బసవని యొక్కయు పరిశిష్ట భక్తుల యొక్కయు చరిత్రములు కీర్తితము లైనవి. పాండిత్య వీరమున కాలంబన మైన ఆరాధ్య జీవితమున చతుర్వేద పారగుఁ డైన సోముఁడు సార్థకముగా మతశాస్త్రార్థసంపత్తిని నింపిపెట్టినాఁడు. దీనికి

శ్రోత్రిత పాల్కురికి సూరామాత్యుఁడు. సవైదిక మైన వీరశైవ భక్తితత్త్వ మిందు పరమతాత్పర్యము. అదియే బసవనితత్త్వమని వ్యాఖ్యానించినవాఁడు పండితుఁడు. తచ్చరిత్రమున దానిని మిత్రసమ్మితముగా నుపదేశించినవాఁడు సోమనాథుఁడు :

కవిత్వము :

సోమనాథుని కవిత్వము ప్రసన్న గంభీర మయ్యు ధారావేగము గలిగినది. పాంచాలీవైదర్భీరీతులు గల్గి, ద్రాక్షా కదళీ పాకముల నితని రచనము చవులూరించు చుండును. రసానుగుణ మైన గుణసంవిధాన మీతని కావ్యములందు సర్వత్ర కాననగును. భక్తి సర్వసాధారణ రస మగుటచే నీతని కవితకు ప్రసాదము సాధారణ గుణము. వీరత్వ మీతని పాత్రలకు సహజ లక్షణ మగుటచే నోజోగుణ మచ్చటచ్చట సమయోచితముగా సంతరింపఁబడును. ముగ్ధభక్తుల చరిత్రలలో మాధుర్యగుణ మప్రయత్నముగాఁ బ్రత్యక్ష మగును. బసవని పేరు తలంచిన మాత్రముననే యొడలెల్ల నాలుక లై కీర్తించు సోమనాథుఁడు బసవకీర్తనమున కవిత్వమును పరవళ్లు త్రొక్కించును. తా ననుభవించెడి భక్త్యావేశమును పఠితయందు గల్పించుటకై తన రచనమునే ప్రత్యక్ష విభావముగా రూపొందింపఁగల సామర్థ్య మీతనికి సహజసిద్ధము. పాత్రల బహిరంతఃప్రవృత్తుల నచ్చు గ్రుద్దినట్లు చిత్రింపఁగల నేర్పును, స్వాభావిక ప్రకృతి వర్ణనలను రమణీయముగాఁ దీర్చిదిద్ది కథానుగుణముగా సంధించు కౌశల్యమును, శ్రవణసుభగముగా శబ్దాలంకారములను, సహజసుందరముగా నర్థాలంకారములను సంతరించుటయును, సూక్తులను, లోకోక్తులను, జాతీయములను సార్థకముగా వాడుటయును, అల్పాక్షరముల ననల్పార్థ రచన మొనర్చుటయును సోమనాథుని కవితాగుణములు.

రసభావముల నాయువుపట్టు లెఱింగి వానిని బోషించి కథా ఘట్టములను రక్తికట్టించుట సోముని విద్య. బెజ్జమహాదేవి శివుని లాలించు నెడ వత్సల భావమును, కన్నప్ప శివుని సేవించునెడ ముగ్ధమగు భక్తిభావమును సోమనాథుఁడు మూర్తికట్టించిన విధ మనన్యసాధ్యము. మాదాంబ వేఁకటి వర్ణనము (1. 644–680) ; బసవేశ్వరుని శిశులీలలు ; (1. 810–850); సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనములు (3. 181–210); (3. 365–405); సంగళవ్వ కొడుకును పిలుచు ఘట్టము (4. 495–540) వృషభ వర్ణనము (5. 780–810); కపటగోపాల వర్ణనము (6. 1400–1425); బసవని విషభక్షణ ఘట్టము (7. 400–580) మొదలగునవి బసవపురాణమున రసవద్వర్ణనాఘట్టములు. పఠిత యూహ కేమియు వదలక సమగ్రముగా విభావస్వరూప స్వభావములను స్వభావోక్తులలో వర్ణించుట సోముని కవితలో సాధారణముగాఁ గాననగును. ఇందుల కితని ప్రసిద్ధ కుక్కుటవర్ణన ముదాహరణము.

"తొలికోడి కను విచ్చి నిలిచి మై వెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కునఁ గాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
నిక్కించి, మెడసాచి, నిక్కి మున్సాచి
కొక్కొరో కుర్రని కూయక మున్న"— (పండితారాధ్య చరిత్రము)

బసవపురాణ పండితారాధ్య చరిత్రలలోని ద్విపదలలో పురాణశైలి సరళముగను, చరిత్రశైలి ప్రౌఢముగను గానవచ్చును. వస్తుగౌరవమును బట్టి సుదీర్ఘ సంస్కృత సమాసభూయిష్ఠమైన రచనము నాతఁడు చరిత్రలో చేసెను. ప్రాసవళ్లను గూడ పండితారాధ్య చరిత్రలో నెక్కువ వాడినాఁడనియు, నైనను మితిమీరి పోలేదనియు, అతఁడు రచించిన ముప్పదిరెండువేలకు పైఁబడిన ద్విపద పంక్తులలో నించుమించు నిన్నూరింటిలో మాత్రమే ప్రాసయతిని వాడినాఁడనియు, నందును బసవపురాణమునఁ జాలతక్కువ వాడె ననియు చిలుకూరి నారాయణరావుగారు పేర్కొనియుండిరి. సోమనాథుఁడు బసవపురాణమునకంటె పండితారాధ్య చరిత్రమున ద్విపదను బహుభంగులలో, గతి విశేషములతో నడిపించి యుండెను. మొత్తమునకు ద్విపదచ్ఛందమునకు సోమనాథుఁడు కావ్యమునఁ బట్టము గట్టి చేశి సంప్రదాయమునకుఁ దెనుఁగున ఘంటాపథము వైచిన గౌరవము గడించినాఁడు :

సోముని కందములు మాకందములవలె తిక్కన కందములను బోలి యున్నవి. సీసములు సమతాగుణముతో నైన యొక తూగును గడించి యే పాదమున కాపదము విఱుగుచు శ్రీనాథాదుల సీస రచనలకు మార్గదర్శకము లైనవి. ఇతఁడు ప్రయోగించిన ముక్తపదగ్రస్తాదులు పోతనాదుల నాకర్షించినవి. పోతనగారి "మందారమకరంద" అను సీసపద్యమునకుఁ తోవఁజూపిన సీసము చతుర్వేదసారమునఁ గలదు. ఇతని రచనలపై పండితత్రయ ప్రభావమును, ఆంధ్రభారత ప్రభావమును కలదు. అనుభవసారముపై శివతత్త్వసార ప్రభావము సుస్పష్టము. "వైదికు లిది శుద్ధవైదికం బని యన" అను సీసపద్యముపై (చతుర్వేదసారము 23) నన్నయగారి "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని" అను పద్య (ఆదిప, 1.31) ము యొక్క ప్రభావము తేటతెల్లము. తెలుఁగు నుడికారమును, వ్యవహారమున నున్న దేశ్యపదములను తన రచనయం దపరిమితముగాఁ జేర్చుటచే నీతఁడు తెలుఁగున కెనలేని సేవ చేసినవాఁ డయ్యెను.

సోమనాథుని కావ్యములందలి ఛందోభాషా వ్యాకరణాది విశేషములను బేర్కొనవలె నన్నచో నదియొక గ్రంథము కాఁగలదు. ఈ యంశములను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి నారాయణరావుగారు, బండారు తమ్మయ్య

గారలు రచించిన పీఠికలలోను, వ్యాసములలోను, గ్రంథములలోను వివరముగాఁ గాంచవచ్చును.

బసవపురాణ ప్రాశస్త్యము :

వీరశైవ ప్రథమ పురాణ మైన యీ బసవపురాణము కర్ణాటాంధ్ర సాహిత్యములపై బలమైన ప్రభావము వైచినది. దానికి మతనుకంటె సోమనాథుని కవిత్వమే ముఖ్యకారణ మనుట సత్యదూరము కాదు. కర్ణాటదేశమున నీ గ్రంథమును బవిత్రమతగ్రంథముగా భావించి పారాయణ చేయుచుండిరి. ఇందలి కథ లనేకము లా సాహిత్యమునఁ బ్రబంధములుగా రూపొందినవి. భీమకవి (క్రీ.శ. 1369) షట్పదివృత్తములలో మూలానుసారముగా దీనిని గన్నడమున ననువదించెను. ఆ తరువాత క్రీ.శ. 1500 ప్రాంతమున సింగిరాజనుకవి మహా బసవరాజ చరిత (సింగిరాజపురాణ) మను పేరను, వృషభాంకకవి (క్రీ.శ. 1655) బసవరాజ విజయ (చంపువు) (వషభేంద్ర విజయ) మను పేరను అనువదించియుండిరి. ఇంకను పెక్కురీకృతినిఁ గీర్తించి యుండిరి. తమిళమునందును బసవపురాణానువాదము వెలసెనఁట !

ఆంధ్రమునఁ బిడుపర్తి సోమనాథుని పద్యానువాదము మొదట పేర్కొనఁదగినది. అది సోమనాథునకే అంకిత మైనది. ఇదికాక బెజవాడ వాస్తవ్యుఁడును శ్రీపతి పండితారాధ్య వంశ్యుఁడును నగు మహాదేవారాధ్యుఁ డొక యనువాద మొనర్చెను (అముద్రితము). నాగారాధ్యుఁడును తుమ్మలపల్లి నాగభూషణ కవియు బసవవిజయ మను పేర బసవని చరిత్రమును రచించిరి. ద్విపదలుగా యక్షగానములుగా నింకను బెక్కుండ్రు తెలుఁగున నీ పురాణమును, తత్కథలను వర్ణించియుండిరి. హరవిలాసమున శ్రీనాథుఁడు సిరియాళునికథను గైకొని యుండుట ప్రసిద్ధముకదా ! ఏలూరులో నారాధ్యబ్రాహ్మణు లగు కందుకూరి వారి పూర్వులెవ్వరో సోమనాథుని బసవపురాణమును స్కంధాగస్త్య సంవాద రూపమున నగస్త్యప్రోక్తముగా సంస్కృతమున రచించిరి. (అముద్రితము). శంకరకవి యను నాతఁడు సంస్కృత బసవపురాణము రచించె నని కర్ణాటకవి చరిత్రము చెప్పుచున్నది. బసవపురాణమువలెనే సోమనాథుని పండితారాధ్య చరిత్రము వాసికెక్కినది. శ్రీనాథుఁడు దీనిని పద్యకృతిగా రచించెను. నాగులూరి శేషనారాధ్యుఁడు పర్వతప్రకరణమునకుఁ బద్యానువాదము సంతరించెను. దీనినిబట్టి చూచినచో సోముని కృతులలో బసవపురాణమున కెనలేని ప్రతిష్ఠ సాహిత్యజగత్తునఁ గలదని దెలియుచున్నది.

ఇతనిని చెన్నలూరి బసవపురాణకర్త అత్తలూరి పాపయామాత్యుఁడు ''పరసర్వజ్ఞశిఖామణి'' యనియు, పిడుపర్తి సోమనాథుఁడు ''జైనమస్తకవిన్యస్త శాతశూల కలిత బిజ్జల తలగుండు గండ బిరుద శోభితుఁ డనియుఁ,"

గీర్తించిరి, కర్ణాటకవి చంద్రకారు లితనికి "ప్రత్యక్షభృంగీశావతార" "తత్త్వ విద్యాకలాప'' "అన్యవాదకోలాహల" ''కవితాసార'' మున్నగు బిరుదము లున్నట్లు చెప్పిరి. పై బిరుదము లన్నియు సోమనాథుని సమగ్ర వీరశైవ జీవిత మును వ్యంజించుచున్నవి.

వీరశైవ వాఙ్మయము మహనీయ మయ్యును పరమత దూషణ మా కృతు లలోఁ గొన్నియెడల నవధి మీరి యుండుటచే నా మతస్థుల కిది మోదావహ మయ్యు సర్వజనామోద దాయకము మాత్రము కాఁజాలక పోయినది. అందువలననే సోమ నాథుని కావ్యగుణములు మెచ్చుకొని తమ రచనలలో నచ్చుపడునట్లు వానినిఁ బాటించిన పలువు రాంధ్రకవు లాతనిని బాహాటముగా స్తుతించుటకు మాత్రము ముందుకు రాలేదు. నవ్యులగు విమర్శకు లాతని మతదృష్టిపైఁగాక సాహిత్య దృష్టిపైనను, భాషాదిశాస్త్ర దృష్టిపైనను తమ పరిశోధనలను కేంద్రీకరించిరి. దేశిమార్గాచార్యుఁడైన సోమనాథుఁడు ఒక సాహిత్య సంప్రదాయ ప్రవంతికి భగీరథకల్పుఁడై పండితుల భక్తిపూజల నందుకొనుచున్నాఁడు.

పాల్కురికి సోమనాథుని సాహిత్యముపై మౌలికమైన విమర్శనలు జరి పిన మహనీయులు తెలుఁగు దేశమునఁ బెక్కండ్రు కలరు. వారిలో శ్రీయుతులు బండారు తమ్మయ్య, వేటూరి ప్రభాకరశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, నిడుద వోలు వేంకటరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, కాశీనాథుని నాగేశ్వరరావుగారల వంటి పండితులు ఈ సందర్భమున ప్రధానముగా స్మరింపఁదగినవారు. వీరేశ లింగముపంతులుగారి నుండి ఆరుద్రగారి వఱకు నున్న వాఙ్మయ చరిత్రకారులును, బ్రౌను దొరగారినుండి వీరశైవ సాహిత్యముపై వ్యాసములు వ్రాయుచున్న సాహిత్య విమర్శకులును, చిలుకూరి వీరభద్రరావుగారు మొదలగు దేశచరిత్ర రచయితలును, ఈ కవినిగూర్చి ప్రశంసించినవారే.

సంక్షిప్త ప్రతి :

ఇట్టి పాల్కురికి సోమనాథుని బసవపురాణమును మొదట క్రీ. శ. 1896 లో ఏలూరు వాస్తవ్యులు శ్రీ కందుకూరి శ్రీశైల వీరభద్రవరప్రసాద రావుగారు ప్రచురించిరి. ఆపైన 1926 లో నది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే బరిష్కరింపఁబడి శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారిచేఁ బ్రచురింపఁబడినది. దాని ద్వితీయముద్రణప్రతిని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు పరిష్కరిం చిరి. 1952 లో శ్రీ బండారు తమ్మయ్యగారు బరిష్కరించిన బసవపురాణము శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారిచేఁ బ్రకటింపఁబడినది.

ఈ నడుమ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రసిద్ధ మహా కావ్యములఁ గొన్నింటికి సంక్షిప్తప్రతులను సిద్ధము చేయించి, ప్రచురించి, ప్రజల కందుబాటులో నుండు సరస మైన ధరలకు వాని నందింపవలె నని తల

పెట్టిన కార్యక్రమములో బసవపురాణ సంక్షిప్తప్రతివి సిద్ధము చేసి, పీఠికను పొందుపఱచు భారము నాపై నుంచినారు. శక్తి చాలని వాఁడ నయ్యు సాహిత్యముపై నున్న భక్తిచే నే నీ గురుతర మైన బాధ్యత నంగీకరించితిని. ఈ సంక్షిప్త ప్రతి కాధార మైనది శ్రీ బండారు తమ్మయ్యగారిచేఁ బరిష్కృతమై వావిళ్ల వారిచే క్రీ. శ. 1966లోఁ బ్రచురితమైన ముద్రిత ప్రతి. అందలి 12610 ద్విపద పంక్తులలో 5380 పంక్తులను తగ్గించి, 7230 ద్విపద పంక్తులతో నీ సంక్షిప్త ప్రతిని సిద్ధపఱచుట యైనది. ఈ సంక్షిప్త బసవపురాణమున బసవేశ్వరుని చరిత్రమును, అతని సహచరులును, సమకాలీనులు నైన భక్తుల చరిత్రములును చాలవఱకు యథాతథములుగా, నుంచఁబడినవి. దృష్టాంతరూపమున జెప్పఁబడిన ప్రాచీనభక్తులకథలలో వస్తుతత్త్వము చెడకుండ, కథాసంవిధానము కుంటువడకుండ కొన్ని కథలను తీసివేయుట జరిగినది. అచ్చటచ్చట దీర్ఘము లైన వర్ణనములను తగ్గించుట యైనది. కావున నీ సంక్షిప్తప్రతిలో సోమనాథుని బసవపురాణ ప్రధాన ప్రతిపాద్యవస్తువు చెక్కుచెదరక యున్న దని చెప్ప వచ్చును. సంక్షిప్త మొనర్చిన భాగమును "*"-గుర్తులతో నిందు సూచించుట యైనది. శ్రీ బండారు తమ్మయ్యగారు పై ముద్రితప్రతిలో పొందుపఱచియున్న 'అర్థవివరణ పట్టిక'లోని యర్థములను గైకొని పాఠకసౌకర్యార్థ మీ గ్రంథమున నథస్సూచికలలో నందించుట యైనది. విరామచిహ్నములఁ గూర్చుట యైనది. శ్రీ తమ్మయ్యగారి కందులకు నాకృతజ్ఞతలు. పండితప్రకాండు లెందఱో కృషిచేసిన సోమనాథుని సాహిత్యక్షేత్రమున వారి బాటలలోనే వారి మాటలలోనే నేనును నడచియు, సోమనాథుని బసవపురాణ సంవిధానమున దేశిపురాణ సంప్రదాయము కలదని కొంత స్వతంత్రించి నిరూపించుటకు యత్నించితిని. విజ్ఞులు దీనిని సహృదయభావముతో గ్రహింతు రని నమ్ముచున్నాను. నే నీ పీఠికలో సోమనాథుని గూర్చి వ్రాసినదానికంటె వ్రాయక మిగిలినదే యధికముగా నున్నది! క్షయము లేని కళాపూర్ణుఁడీ సోముఁడు! అతనినిగూర్చి యెంత వ్రాసినను చంద్రుని కొక నూలుపోగు సామెతకే వచ్చును!

నా కీసదవకాశము కల్పించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికిని, ప్రత్యేకముగా అకాడమీ కార్యదర్శులును, విద్వజ్జన పక్షపాతులును, సాహిత్యసేవాధురంధరులు నైన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికిని నా హృదయపూర్వక కృతజ్ఞతా వందనములు!

హైదరాబాదు
1-1-1969

గూడ వేంకట సుబ్రహ్మణ్యం

శ్రీరస్తు

బసవపురాణము

ప్రథమాశ్వాసము

అవతారిక

శ్రీ గురుదేవు సంచితగుణోత్తంసు,
యోగీంద్రహృదయపయోజాతహంసుఁ,
బరమకృపామూర్తి, భక్తజనార్తి
హరుఁ, ద్రిజగత్స్ఫూర్తి, నానందవర్తి,
భవరోగవిచ్ఛేది, భక్తవినోది,
శివతత్త్వసంపాదిఁ, జిరతరామోది,
నిత్యస్వరూపు, సునిర్మలత్ప్రతాపుఁ,
బ్రత్యయగతపాపు, భక్తప్రదీపు,
భావనాతీతు, సద్భావనోపేతు,
సావయవఖ్యాతు, నమితు, నజాతు,
నాద్యంతరహితు, వేదాంతార్థసుహితు,
విద్యాత్మసహితు, సంవిత్సౌఖ్యమహితు,
భక్తపరాధీను, భక్తనిధాను,
భక్తసమాధాను, భక్తావధాను,
భక్తపరంజ్యోతి, భక్తవిభూతి,
భక్తదుఃఖారాతి, భక్తానుభూతి,
భక్తవ్రజత్రాణు, భక్తధురీణు,
భక్తజనప్రాణుఁ, బరమకళ్యాణు,

మన్మనోరమ్యు, నిర్మలభావగమ్యుఁ,
జిన్మయు, సౌమ్యు భజించి, కీర్తించి ;
యుల్లమున మదీయవల్లభుఁ జెన్న
మల్లికార్జునదేవుఁ డెల్లగా నిలిపి ;
సముదితసారూప్యశాశ్వతతనులఁ
బ్రమథులఁ ద్రిభువనప్రథములఁ దలఁచి ;
ప్రకటలింగైక్య పురాతనభక్త
నికరంబు శివునంద నిష్ఠించి కాంచి ;
వ్యక్తలింగముల సద్భక్తిరసాభి
షిక్తుల నూతనభక్తులఁ దలఁచి ;
బసవచరిత్ర యివ్వసుమతి మీఁదఁ
బసరింతుఁ దత్కథాప్రౌఢి యెట్లనిన :—
శ్రీమన్మహాదేవుసింహాసనంబు,
హైమవతీశువిహారస్థలంబు,
హరునిభక్తులకు నేకాంతవాసంబు,
పరమయోగులకు హృత్ప్రమదావహంబు,
నరులకుఁ గర్మసంహరణైకహేతు,
వరయంగ సురలకు నాశ్రమభూమి,
సకలతీర్థములకు జనయిత్రి యగుచుఁ
బ్రకటింప నొప్పు శ్రీపర్వతేంద్రంబు ;
ఉర్విఁ దత్పర్వతసార్వభౌమునకుఁ
బూర్వవక్త్రాంకవిస్ఫురణ దొలాౄడ
నొలసి కుమారశైలోత్తంసలీలఁ
దిలకించి పెంపారుఁ ద్రిపురాంతకంబు ;
తత్త్రిపురాంతకస్థానవాస్తవ్యుఁ
డై త్రిపురాంతకుం డభినుతిఁ బేర్చు;
నాపురసంహారు నపరావతార
రూపితఖ్యాతినిరూఢిఁ దలిర్చు;
నాసదాశివమూర్తి యవితథైశ్వర్య

భాసురచరలింగపటుదీప్తిఁ బరఁగు
నాకాలకంధరు ననవద్యహృద్య
సాకారవిభ్రమవ్యాప్తిఁ బెంపారు
నా దేవువీరవ్రతాచారసార
మేదురస్ఫురణమై మించి వెలుంగు
జంగమరత్నంబు శరణసమ్మతుఁడు
లింగైక్యవర్తి గతాంగవికారి
పండితారాధ్య కృపాసముద్గతుఁడు
మండితసద్భక్తిమార్గప్రచారి
విలసితపరమ సంవిత్సుఖాంభోధి
నలిఁ గరస్థలి సోమనాథయ్యగారు ;
బసవనికారుణ్యరససుధావార్ధి
నసదృశలీల నోలాడుచు నిత్య
నియమవ్రతాచారనిరుపమనిష్ఠ
క్రియఁగొనఁ దత్త్వనిర్ణయము సంధిల్ల
నతులగోష్ఠీసుఖస్థితిఁ బేర్చుభక్తి
మతినియమంబుల మల్లినాథుఁడును ;
నాదివేదాంతసిద్ధాంతపురాణ
వేదశాస్త్రాగమవిహితమార్గములఁ
దనుమనోధననివేదనసమగ్రతయుఁ
బనుగొన జంగమార్చనలు సేయుచును
నోలిమై 1 గ్రామసీమాలంఘనవ్ర
తాలంకృతిని బేర్చి యాచారలీల
యనలారఁగాఁ గుమారాద్రికిఁ దూర్పు
దెసను సోపానముల్ దీర్చి పొల్పార
మహితసద్భక్తి సమంచితవృత్తి

1. తానుండు గ్రామముయొక్క పొలిమేరను దాఁటి చరింపక, యున్న గ్రామమునందే నిత్యము తన యాచారవిధుల నిర్వహించుట. ఇది వీర శైవుల చతుష్షష్టి శీలములలో నొకటి.

మహిఁ జను రెంటాల మల్లినాథుఁడును ;
నిరతిశయప్రీతి నిత్యంబు నైదు
శివవీటపుష్పముల్ హరున కర్పింప
నొక్కనాఁ డొక పువు తక్కువ యైన
గ్రక్కున దననేత్రకమల మర్పించి
భవునిచే నసదృశంబవు కన్ను వడసి
ధ్రువకీర్తిఁ బేర్కొన్న దోచమాంబయును ;
ధీరుండు మున్నయ దేవయోగీశు
కూరిమిశిష్యుండు నారయాంకునకుఁ
బుత్త్రుండుఁ బరమపవిత్రుండు విమల
గాత్రాంచితుఁడు నీలకంఠాగ్రజుండు
జగదభినుతుఁడు ప్రసాదావధాని
నిగమార్థవేత్త గోడగి త్రిపురారి ;
లోనుగా సకలభక్తానీక మెలమి
మానితభక్తిసామ్రాజ్యసంపదలు
సిరివిరి వోవంగఁ జిరతరమహిమ
నలరారుచుండంగ నం దొక్కనాఁడు
మండితాసంఖ్యాతమాహేశ్వరులకు
దండప్రణామంబు దగ నాచరించి,
భక్తదయారసపరమామృతాబ్ధి
షిక్తుండ నగుచు గోష్ఠీప్రసంగతిని
''నసదృశం బై యొప్పు బసవపురాణ
మెసకంబుతోఁ జెప్ప నిష్ట మయ్యెడును
వరకథాసూత్రంబువెర వెఱిఁగించి
చరితార్థుఁ జేయరే కరుణతో'' ననుచు
సన్నుతి సేయుచు సప్రహ్వత్వమున
విన్నవించుఁడు, భక్తవితతి హర్షించి
సముదితప్రీతిఁ బ్రసాదావలోక
నము నివ్వటిల్లంగ నన్ను వీక్షించి

"బసవపురాణంబుఁ బసరించుశక్తి
ససలార నొసఁగితి మటు గావునను
రచియింపు బసవపురాణంబు నీవు
సచలితభక్తహితార్థంబుగాఁగ"
నావుడు,—భక్తజనావలియాజ్ఞ
వావిరిఁ దల మోచి వర్ణింతుఁ గవిత :
పాటింపఁ దగిన కర్ణాటభూమికిని
గోటీర మై యొప్పు గొబ్బూరిసంగ
నాయగ్రహారమహాజనోత్తమని
కాయపూజితపాదకమలద్వయుండు
శాంభవ వేధదీక్షాసద్విశేష
సంభావితాశ్రితజనసముత్కరుఁడు
సురుచిరప్రణవవిస్ఫురితోపదేశ
చరితార్థనిఖిలశిష్యప్రతానుండు
కింకరనిచయహృత్పంకేరుహాంత
రాంకిత వరసచ్చిదానందమూర్తి
పాత్రుండు భవలతాదాత్రుండు విషయ
జైత్రుండు విమల చరిత్రుండు సకల
భువనపావనమూర్తి బుధచక్రవర్తి
ప్రవిమలకీర్తి సద్భక్తిప్రపూర్తి
యని వినుతింపగ నాచార్యమహిమ
మనుచుండు మండెఁగ మాదిరా జనఁగ ;
నామహాత్ముని సముద్యత్కృపాపూరి
తామృతహస్తకృతావతారుండు
నా గురుదేవు పాదాబ్జ సౌరభ్య
భోగలీలా వరపుష్పంధయుండు
నాశివయోగి యుదాత్తమూర్తి ప్ర
కాశితహృత్పద్మ కర్ణికాంతరుఁడు
నాదివ్యదేహు దయాకలితప్ర

సాదపాదోదకాస్వాద తత్పరుఁడు
గురుపరతంత్రుండు గొబ్బూరి విభుఁడుఁ
బరమశివాచారపథవర్తనుండు
లింగైక్యనిష్ఠావిలీనమానసుఁడు
సంగనామాత్యుండు జగదుపకారి
యని యిట్లు భక్తసభాభ్యంతరాళ
మున నిన్నుఁ జెప్పంగ విని లసత్ప్రీతి
వసరింప జంగమభక్తుండ వనియు
బసవపురాణైకపాత్రుండ వనియు
నచలితప్రీతి మా కనుగులం బనియు
రచియింతు బసవపురాణసత్కవిత
యవధానవంతుండ వై నెమ్మి వినుము
సవిశేషభక్తిమై సంగనామాత్య !
ధర "నుమా మాతా పితా రుద్ర" యనెడు
వరపురాణోక్తి నీశ్వరకులజుండ ;
శరణగణాశ్రయ సకలస్వరూప
గురులింగవరకరోదరజనితుండ ;
భక్తకారుణ్యాభిషిక్తుండఁ, బాశ
ముక్తుండఁ, గేవలభక్తిగోత్రుండ ;
భ్రాజిష్ణుఁ డగు విష్ణురామిదేవుండుఁ
దేజిష్ణు వగు శ్రియాదేవి యమ్మయును
గారవింపఁగ నొప్పు గాదిలిసుతుఁడ ;
వీరమాహేశ్వరాచారవ్రతుండ ;
ఖ్యాత సద్భక్తిమైఁ గలకట్టకూరి
పోతిదేవరపదాంబుజషట్పదుండ ;
సకృపాత్ముఁ డగు కరస్థలి విశ్వనాథు
ప్రకటవరప్రసాదకవిత్వయుతుఁడ ;
వడగాము రామేశువరశిష్యుఁ డనఁగఁ
బడు చెన్నరాముని ప్రాణసఖుండ ;

సంభావితుఁడ; భవిజనసమాదరణ
సంభాషణాది సంసర్గ దూరగుఁడ ;
నలిఁ బాల్కురికి సోమనాథుఁ డనంగ
వెలసినవాఁడ; నిర్మల చరిత్రుండ ;
నురుతర గద్య పద్యోక్తులకంటె
సరస మై పరఁగిన జానుఁదెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱఁ ;
దెలుఁగుమాట లనంగ వలదు ; వేదముల
కొలఁదియ కాఁజూడుఁ డిల నెట్టు లనినఁ ;
బాటి తూమునకును బాటి యౌనేనిఁ
బాటింప సోలయుఁ బాటియకాదె ;
అల్పాక్షరముల ననల్పార్థరచన ;
కల్పించుటయె కాదె కవివివేకంబు :
అలరుచు బసవనిఁ దలఁచుతలంపు
బలుపునఁగాఁ జేసి భావమ్ము మెఱసి
యకలంక లింగ రహస్యసిద్ధాంత
సకల వేద పురాణ సమ్మతం బైన
యాతత సకలపురాతనభక్త
గీతార్థసమితియే మాతృక గాఁగఁ
బూరితం బై యొప్పు పూసలలోన
దారంబుక్రియఁ బురాతన భక్తవితతి
చరితలలోపల సంధిల్ల బసవ
చరిత మే వర్ణింతు సత్కృతి యనఁగ ;
నసదృశలింగదేహస్థుఁ డై యున్న
బసవని వేఱొక్కభావంబు గాఁగఁ
దగిలి వర్ణించుట దప్పనవలదు
తగు భక్తివర్ధనార్థంబు దా నగుట.
బసవని శరణన్నఁ బాపక్షయంబు ;

బసవని శరణన్నఁ బరమపావనము ;
బసవని శరణన్నఁ బ్రత్యక్షసుఖము ;
బసవని శరణన్న భవరోగహరము ;
బసవని శరణన్న భక్తి సేకూరు ;
బసవని శరణన్న బంధము ల్వాయు ;
బసవని శరణన్న భాగ్యము ల్వొందు ;
బసవని శరణన్నఁ బరఁగు శీలంబు ;
బసవని శరణన్నఁ బాయు నాపదలు ;
బసవని శరణన్నఁ బ్రబలు సంపదలు ;
బసవని శరణన్న నసలారుఁ గీర్తి ;
బసవని శరణన్న ఫలియించుఁ గోర్కి ;
బసవని శరణన్న నెసఁగు వాక్సిద్ధి ;
బసవని శరణన్న భ్రాజిల్లు బుద్ధి ;
వే యేల తగ "బసవా" యనఁ బరఁగు
నీయక్షరత్రయం బిటు లొక్కమాటు
చదువు నెవ్వండేని ముదముతో నతని
పదనంబు శివునకుఁ గుదురు దా ననఁగఁ ;
బాయక బసవనిఁ బ్రస్తుతించినను
బాయుట సోద్యమే భవబంధనములు ;
బసవండు కేవలభక్తుండే తలఁప
నసమాక్షుఁ డారూప మై నిల్చెఁగాక ;
బసవఁడు వసుధపైఁ బ్రభవించు నంత
బసవని నరుఁ డని పలుకంగఁ దగునె ?
హరుఁడు నిరాకారుఁ డైనచో బసవఁ
డరయంగ సాకారుఁ డై చరియించు ;
హరుఁడు సాకారుఁడై యలరుట సూచి
శరణుఁడై బసవండు సందు లేకుండు ;
శరణుఁ డై పరముండు సరి నెలకొన్నఁ
బరమభక్తస్థితి బసవన్న గొలుచు ;

భక్తుఁ డై లింగంబు ప్రకృతి సేకొన్న
వ్యక్తిగా బసవన్న వఱవుఁడు సేయుఁ ;
బరమాత్మరూప మాబసవఁడే యెఱుఁగుఁ ;
బఱమేశుఁ డెఱుఁగు నా బసవనియనువు ;
సాలోక్యసామీప్యసారూప్యపదవు
లోలిని బొంద సాయుజ్యంబుఁ జెంద
వచ్చుఁ గా కిల బసవస్వామి గాఁగ
వచ్చునే పెఱపెఱవారల కెల్లఁ ?
బ్రమథాగ్రగణ్యుండు బసవఁ డీశునకు ;
సమశీలభక్తుండు జంగమంబులకు,
లింగదేవునకు ననుంగు బసవఁడు,
జంగమకోటికి సడిసన్నదాసి,
యెక్కంగ వాహనం బెప్పు డీశ్వరున,
కెక్క సింహాసనం బీశుభక్తులకుఁ,
గాలకంధరు కరవాలు బసవఁడు ;
శీలంబు భక్తులచేతి యద్దంబు ;
బసవని నెవరికొఁ బ్రస్తుతి సేయ ;
వసమె యెవ్వరికైన బసవని నెఱుఁగ ;
సంపన్నుఁ డై లింగజంగమంబులను
బొంపిరిగొని పువ్వుఁగంపు నై యుండుఁ
గావున బసవని గణుతింపరాదొ
దేవాసురుల కైనఁ దెల్లమై యుండు ;
నెన్నంగ 1 వేడ్కకాఁ డెఱుఁగునే దోస
మన్నట్లు గాక యాహవణి గీర్తింప
నిదియుఁ గోటికిఁ బడ గెత్తినవానిఁ
బదివేలకాఁప వై బ్రదుకు మన్నట్టు
లాపరంజ్యోతి స్స్వరూపంబునకును
దీపకంభంబు లెత్తించినయట్లు

1. విటుఁడు.

భవనిర్మితము లైన పత్రపుష్పములు
భవునకుఁ దగ సమర్పణ సేయునట్లు
గాక కీర్తింపఁగా నాకుఁ దరంబె
ప్రాకటంబుగ భక్తబండారి చరిత !
మైనను లోకహితార్థంబు గాఁగ
నానేర్చుకొలఁది వర్ణన సేయువాఁడ
నవరస రసికత భువిఁ బేరుగొన్న
శివకవిప్రవరులచిత్తంబు లలర ;
నిప్పాట నితరులఁ జెప్పెడి దేమి ?
తప్పడు దారులు దడఁబడఁ బలికి
వెలసిన చదువులు వీటిఁబో రిత్త
పొలిసిపోయిరి తమపురులు దూలఁగను
మృడుమహత్త్వముఁ గానమిని బొంకు లనఁగఁ
బడుఁ "గవయః కిం న పశ్యంతి" యనుట
యనుచుఁ గుకవుల గీటునఁ బుచ్చి పేర్చి
వినుతింతుఁ దత్కథావిధ మెట్టు లనిన :

కథారంభము

శ్రీకీర్తిసంచితాంచితవరభక్తి
సాకార ! వినమితామాత్య సంగాఖ్య !
శ్రీరజతాచలశృంగంబునందు
మారారి యుమయును మానితక్రీడఁ
దగిలినసుఖసంకథావినోదమున
సొగయుచు నున్నెడ శుద్ధశివైక
మానసు లగు నుపమన్యుఁడు భృంగి
యానందికేశ్వరుఁ డాదిగాఁ గల్గు
ప్రమథులు గొలువంగఁ బరిమితం బైన
సమయోచిత మెఱింగి చనుదెంచి ప్రీతి

—: నారదుఁడు కైలాసమున కేఁగుట :—

నారదుం డను మునినాయకోత్తముఁడు
భూరిసర్వాంగముల్ భువిఁ బొంద మ్రొక్కి
ముకుళితహస్తుఁ డై మొక్కుచు మఱియు
సకలలోకాలోక చరితంబులెల్ల
విన్నవింపఁగ నున్న కన్నెర్గి శివుఁడు
వెన్నెలఁగలకంట వీక్షింపుచున్న
యవసరోచితమున నంబికాదేవి
శివుననుమతమునఁ జేసన్నఁ బిలిచి
"పోయివచ్చినకార్యములు విన్నపంబు
సేయు మీ వున్నట్లు శివునకు" ననిన
నమ్మునీశ్వరుఁడు మహాలింగదేవు
సమ్ముఖుఁ డై కరాబ్జమ్ములు మొగిచి

—: నారదుఁడు శివునకు భూలోకవృత్తాంత మెఱిఁగించుట :—

"సకలలోకాలోకచరితంబు లెల్లఁ
బ్రకటితభక్తి నెప్పటియట్ల పరఁగు
నరలోకమున నుమానాథ ! మీభక్తి
చరిత మేమియును విస్పష్టంబు గాదు.
తవిలి శివాచారతత్పరు లగుట
భవులతోఁ గొందఱు పలుక కున్నారు ;
లోకప్రపంచంబులోఁ గొంద ఱుండి
లోకబోధకు లోను గాకున్న వారు ;
మఱికొంద ఱానందమగ్నులై తమ్ము
మఱచి లోకములకు మఱపడ్డవారు ;
ఉన్నతసద్భక్తియుక్తులై కొంద
ఱున్నారు తమతమయొడళులు డాఁచి ;
యిది కారణము గాఁగ నీశ ! మీభక్తి
తుద మొద లిది యనఁ దోఁప దెవ్వరికి ;

నందు దృష్టప్రత్యయంబులవలన
సందియంబులు ఉక్కి సద్భక్తియుక్తి
సుస్థిరలీల లింగస్థలజంగ
మస్థల తత్ప్రసాదస్థలంబులను
సంపన్నులై జగజ్జను లెల్ల భక్తి
సొంపునఁ జొబ్బనఁ జాలఁ దేల
నీవ ప్రసన్నుండవై వచ్చి లోక
పావనంబుగ భక్తిఁ బాలింపవలయు"

—: శివుఁడు పార్వతితో నందికేశ్వరుని వృత్తాంతము చెప్పుట :—

నని విన్నపించిన నద్దేవదేవుఁ
డనురాగచిత్తుఁడై యతని కిట్లనియె :—
"నందికేశ్వరునకు నాకు నొక్కింత
సందు లేకునికి నిస్సందేహ మగుట
నీతనిఁ బుత్తెంతు ; నితనిచేఁ బరమ
పూతమై లోకంబు బోధంబు వడయు."
ననవుఁడు గిరిరాజతనయ ప్రాణేశుఁ
గనుఁగొని ముకుళితకరకంజ యగుచు
"నందికేశ్వరునకు నాకు నొక్కింత
సందు లేకునికి నిస్సందేహ మనుట
భక్తైకతనుఁడవై పలికిన విధమొ ?
వ్యక్తిగా నతఁడు నీవై యున్నవిధమొ
యానతి యి"మ్మని యంబిక యడుగ
నానారదుఁడు విన నభవుఁ డిట్లనియె :
"అగు నగు నట్టిద యంబుజనేత్రి !
తగుఁదగు భక్తైకతనుఁడ నట్లగుదుఁ ;
జెప్పెద వినుము విశేష మింకొకటి :
దప్ప దే నతఁ డని తర్కించి చూడ
నేమికారణ మనియెదవేని వినుము
తామరసానన ! తత్కథాయుక్తి :—

—: శిలాదుని తపస్సు :—

యాది ననేకయుగాలనాఁడు
నాదరికమున శిలాదుఁ డనఁగఁ
దాపసముఖ్యుండు దప మొనరించె;
శ్రీపర్వతంబు నైరృత్యభాగమునఁ
గందమూలాదులు గాలియు నీరు
నిందురశ్ములును దినేశరశ్ములును
నాహారముగఁ ద్రికోట్యబ్దముల్ సలిపి,
సాహసంబున మఱి శతకోటియేఁడు
లావంతశిల తన కాహారముగను
భావించి ఘోరతపం బర్థిఁ జేయ
నతనికిఁ బ్రత్యక్షమై యేము నిలిచి
"మతి నిష్ట మెయ్యది మము వేఁడు" మనిన
నత్తఱి నతఁడు సాష్టాంగుఁ డై మ్రొక్కి
చిత్తంబులోఁ బ్రీతి సిగు రొత్తి నిగుడ
"సర్వజ్ఞ! పశుపతి! శంకర! శర్వ!
సర్వలోకేశ్వర! శాశ్వత! సాంబ!
అవధారు వేదవేదాంతావగమ్య!
అవధారు విన్నపం బాశ్రితసులభ!
శ్రీమన్మహాదేవ! శివలింగమూర్తి!
యేమిటఁ గొఱఁతయే స్వామి! మీకృపను
నైనను నా కొక్కయభిమతం బైన
దాని వేఁడెద మహాదాని! యాక్షణమ;
నీయట్టివానిని నిజభక్తజనప
రాయత్త! సుతుఁగా దయామతి నొసఁగు"
మనవుడు నతనికి నభిమతార్థంబు
నొనరింప నున్నంత వనజాక్షి! వినవె!
అంతటఁ బోవక యాశిలాదుండు
నెంతయు భక్తితో నిలఁ జాఁగి మ్రొక్కి

"యభిమతం బగు పుత్త్రు నర్థి నిత్తేని
యభవ ! నీ భక్తియం దణుమాత్ర మైనఁ
దక్కువ గలిగినఁ దల ద్రుంచివైతు
నక్కుమారునకు నీ వడ్డ మై యున్న ;
నట్టేని గొడుకు ని; మ్మటు గానినాఁడు
నెట్టణ నే నొల్ల నీయిచ్చువరము ;"

—: శివుఁడు శిలాదునకు వర మొసఁగుట :—

నంచు విన్నప మాచరించుడు నతని
సంచితభక్తికి సంప్రీతిఁ బొంది
యాదిసృష్టికి మున్న నాది యై పరఁగు
నాది మదీయాంశ మగు వృషభంబు
ధర్మరూపమునఁ గృతయుగంబు నందు
ధర్మంబు నాల్గుపాదంబుల నడచు ;
రమణతోఁ ద్రేతాయుగమునను ధర్మ
మమరఁగ మూఁడుపాదములను నడచు ;
జగములో ద్వాపరయుగ మందుఁ బాద
యుగమున ధర్మనియుక్తిమై నడచుఁ ;
బొనరుచుఁ గలియుగంబున నొక్కపాద
మునను జరించు ధర్మనిరూఢి వెలయఁ ;
దగిలి యిమ్మాడ్కిని ధర్మస్వరూప
మగుట లోకహితార్థుఁ డగు నట్లుఁగాక
పూని ద్వితీయశంభుం డనుపేరఁ
దా నిత్యుఁ డై పరమానందలీల
మాకు వాహన మై ప్రమథముఖ్యుఁ డయ్యు
గోకులపతి యయ్యు శ్రీకరమహిమ
వెలసిన యయ్యాదివృషభేంద్రుఁ జూచి
"నలి శిలాదునకును నందీశుఁ డనఁగఁ
బుట్టుము; నీవొండెఁ బుట్టంగవలయు
నట్టుగా కేనొండెఁ బుట్టంగవలయు ;

రూపించి ధర్మస్వరూపు లై మహిమ
నేపారుప్రమథగణేంద్రులం దెల్ల
మక్కువ పెక్కువ మద్భక్తియుక్తి
యెక్కువగాఁగ నీ కిచ్చినవాఁడఁ;
గాన మిక్కిలిభక్తి గలయట్టిపుత్త్రుఁ
గాని శిలాదుండు దా నొల్ల ననియె;
నిచ్చినవర మింక నేఁ దప్పనేర;
నచ్చెరు వంద మా యనుమతిఁజేసి
పుట్టు ద్వితీయ శంభుం డనఁ బుడమి"
"నట్టిద కా"కని యానందలీలఁ

—: నందికేశ్వరుని యవతారము :—

బుట్టె నయోనిసంభూతుఁ డై యతని
కిట్టలంబుగ నందికేశ్వరుఁ డనఁగఁ;
బుట్టఁగఁ దోడనె పుట్టె మద్భక్తి;
పుట్టక యటమున్న పుట్టె మచ్చింత;
పరమతత్త్వామృతం బయ చన్నుఁబాలు
గురుపదధ్యానవిస్ఫురణయ వెన్న
వేదాంతసూక్తుల వెడ దొక్కుఁబల్కు
లాదిశివాచార మదియ వర్తనము
గాను మదీయాంఘ్రికమలంబు లాత్మ
లో నిడుకొని భక్తిలోలత్వ మెసఁగ
బలువిడిఁ బాఱునేఱుల నట్టనడుమఁ
జలికాల మెల్లఁ బుక్కిలిబంటి నిలిచి,
యేకపాదాంగుష్ఠ మిలమీఁద మోపి,
యాకసంబునకు ముఖాంబుజ మొగ్గి,
వర్షంబు ఘోరన వఱుగొని కురియ
హర్షంబుతోడ నల్లాడక నిలిచి,
మేదినిఁ దల మోపి మీఁదికి రెండు
పాదంబులను నెత్తి, పంచాగ్నినడుమఁ

దలఁచిన డెందంబు దాపంబుఁ బొందఁ
బలికిన నోరెల్లఁ బటపటఁ బగులఁ
జూచినతెప్పలు సుఱచుఱఁ గమర
నేచినయెండల నెడపక నిలిచి.
భువియు వడంక నంభోనిధు లింక
దివిజుల్ గ్రుంకఁ గూర్మంబు దలంక
దిక్కరీంద్రులు ద్రుంగ దిక్కులు గ్రుంగ
నక్కులాద్రులు వ్రగ్గ నహిపతి మ్రొగ్గ
దిక్పతుల్ బెదర నద్దివియెల్ల నుదర
వాక్పతి యదర నధ్వరములు సెదర
హరి తల్లడిల్ల బ్రహ్మాండముల్ డొల్ల
ధర నుల్కలును డుల్ల సురలు భీతిల్ల
నపరిమితం బైన యతివీర ఘోర
తప మాచరించెఁ జిత్రము చిత్ర మనఁగ ;
నంత భయభ్రాంతు లై యజాచ్యుతులు
సంతాపచిత్తు లై సకలదేవతలు
గ్రక్కున మాయున్నకడకు నేతెంచి
మ్రొక్కి సాష్టాంగు లై మోడ్పుఁగే లమర
"దేవ ! దేవేశ్వర ! దేవతారాధ్య !
దేవచూడామణి ! దేవాధిదేవ !
పరమభట్టారక ! పరమస్వతంత్ర !
పరమేశ ! పరమాత్మ ! పరమ ! పరుండ !
శంకర ! పంకజసంభవాద్యమర
శంకర ! దురితభయంకర ! యభవ !
యక్షయ ! సర్వజ్ఞ ! యఖిలలోకైక
రక్షక ! దక్షమఖక్షయ ! దక్ష !"
యని మమ్ముఁ గీర్తింప నచ్యుతాదులను
గనుఁగొని యేమును గన్నుల నవ్వి,
"యింత సంతాపింప నేఁటికి మీకు

భ్రాంతిఁ బొందిన పెఱ్ఱిపశుజీవులార !
నందీశ్వరుఁడు సేయు నవ్యతపంబు
చందంబు సూచియో శంకించి రాక ;
చిరికిఁ గైకొన్న శ్రీప ! నీపదవి ;
కోరునే బ్రహ్మ ! నీ కొండికపదవి ;
ఓరి దేవేంద్ర ! నీ యొడఁబడుపదవి
పేరతఁ దెఱుఁగునే పెక్కు లేమిటికి ?
ననుఁగాని యాతండు నాపదం బైన
మనమునఁ దలఁపడు మాభక్తులాన”
యనుచుఁ బ్రసన్నుండ నై యేను వారి
మనముల దిగులెల్ల మాన్పంగఁ దలఁచి
యందఱుఁ గొలిచిరా నచటికిఁ బోయి
నందికేశ్వరు డాయ ముంచట నున్న
నతఁ డంతరంగంబునందు నన్ గాంచు
గతి దేటతెల్లమై కానవచ్చుటయు
నప్పు డచ్చెరువుఁ బ్రహర్షంబు భక్తి
ముప్పిరి గొని మనంబున నుల్లసిల్ల
సాష్టాంగ మెఱఁగి మదంఘ్రికంజములు
హృష్టుఁ డై నెన్నుదు రిఱియంగ మ్రొక్కి
యానందబాష్పపూర్ణాస్యుఁ డై కలయ
మేనురోమాంచసమ్మిళితమై తనర
గద్గదకంఠుఁ డై కరములు మొగిచి
తద్గతచిత్తుఁ డై తాఁ బ్రస్తుతింప
“మెచ్చితి వరము నీ కిచ్చితి వేఁడు
మిచ్చ యెయ్యది నందికేశ్వర !” యనిన
దరహాసకాంతి వక్త్రమునఁ దుల్కాడ
నరుదొంద మాకు ని ట్లని విన్నవించెఁ ;
“బెన్నిధి యుండఁగ మ న్నడుగుదురె ?
ని న్నొండు వేఁడెదు నిర్గుణి గలఁడె ?

పదవులు గిదవులు పనిలేదు ; నీదు
సదమలభక్తిఁ బ్రసాదింపు దేవ !"
యనిన గాఢాలింగనావలి నతని
తనువు నాతనువునఁ బెనఁగొల్పి యంత
"భవదీయగాత్రసంస్పర్శన సుఖము
నవక మెక్కఁగ వాహనం బగు మిట్లు
ఆది మదీయవాహనమవు నీవు
వేదాంతనుత ! మహావృషభేంద్ర !" యనుచుఁ
బ్రమథేంద్రపదవికిఁ బట్టంబు గట్టి
యమిత సర్వజ్ఞత్వ మప్పు డిచ్చుడును—
నంతట శ్రీధరుఁ డంతట నజుఁడు
నంతట దేవేంద్రుఁ డంతట సురలు
ధరఁ జాఁగఁబడి మ్రొక్కి కరములు మొగిచి
శరణంచు నందికేశ్వరునిఁ గీర్తింప
నతఁడు దయామతి నల్లన నగుచు
[1] నతగులౌ సురలను నరవిరికంటఁ
జూచె భయంపడు సురలుఁ దొల్లింటి
యేచిన భీతివోఁ జూచినయట్లు ;
శ్రీగిరినైరృత్యభాగంబు పుణ్య
భాగ మాక్షేత్రంబు పరమపావనము.
నందికేశ్వరుని పుణ్యతపంబుచేత
'నందిమండల' మను నామంబుఁ దాల్చె ;
నచట వర్తించు నఖిలజీవులకు
నిచ్చితి నపవర్గ మిందీవరాక్షి !
దొరకొను నందికేశ్వరుచరితంబు
విరచించువారికి విన్నవారికిని
నచలితబుద్ధి దృష్టాదృష్టసిద్ధి
ప్రచురవచశ్శుద్ధి భక్తిసమృద్ధి

1. అల్పులు, దుర్బలులు.

యిట్టిద కావున నీ నందికేశుఁ
డెట్టున్న నేన కా కేల యొండొకఁడె ?"
యని యానతిచ్చుడు నఖిలాండపతికి
ననురాగమున జగదంబ కేల్మొగిచి
య న్నందికేశు నందంద చూచుచును
మన్నన దైవాఱ మఱియు ని ట్లనియె :
"ఈనిరహంకార మీసదాచార
మీనిరంతరభక్తి యీప్రభుశక్తి
యీసిద్ధపాండిత్య మీనిత్యసత్య
మీసుకుమారత్వ మీయాత్మతత్త్వ
మీశుద్ధచారిత్ర మీపుణ్యగోత్ర
మీశుభాంచితమూర్తి యీలసత్కీర్తి
యేరికిఁ గల్గునే యెన్నిభంగులను
గారవింపఁగ నీవు గానివారలకు
నిన్ను ధరింపంగ నీకె కా కొరుల
కెన్నంగ శక్యమే యీశ ! సర్వేశ !
అట్టిద కాక నీయంశంబు గాని
యట్టివాఁ డింత నీ కనుగులం బగునె !"
యనుచున్న గిరిరాజతనయవాక్యములు
విని ముదితాత్మఁ డై విశ్వేశ్వరుండు
నారదుదెసఁ జూచి నందికేశ్వరుని
గౌరవమహిమ విఖ్యాతిని వింటె ?''
యనుచు నానందీశు నధికదయార్ద్రి
వనధిఁ దేల్చుచుఁ గనుఁగొనుచున్న యెడను
నెంతయు భయము నొక్కింతయుఁ జూపు
నెంతయు సిగ్గు నొక్కింతయు ముదముఁ
దనకు భూషణము లై తనరారుచుండ
గనుఁగవ హర్షాశ్రుకణములు దొరుగ
సులభరోమాంచకంచుకితాంగుఁ డగుచు

దలఁపున డెందంబు దటతట నదర
మస్తకవిన్యస్తహస్తుఁ డై తన్నుఁ
బ్రస్తుతింపుచు నున్నప్రభు నందికేశుఁ
గనుసన్నఁ జేసన్నఁ గదియంగఁ బిలిచి
తననిర్మలప్రసాదముఁ గృపచేసి
నెయ్యంబుఁ గరుణయు నిండి వెల్విరియ
నయ్యంబికాధవుఁ డతని కి ట్లనియె :

—: { శివుఁడు నందికేశ్వరుని మర్త్యమున బసవేశ్వరుఁడుగా జనింపఁ బంపుట : } :—

"ఇది శ్రుతిస్మృతిమూల మిది ధర్మశీల
మిది విమలాచార మిది తత్త్వసార
మిది సుమహాతత్త్వ మిది కృతార్థత్వ
మిదియాదిపథ మని విదితంబు గాఁగ
నీకతంబునన నిర్ణీత మై భక్తి
లోకంబునం దవలోకింపఁ బడియెఁ ;
బ్రమథాధిపతులకుఁ బార్వతీసతికి
విమలమదీయతత్త్వముఁ బ్రబోధించు
తెఱఁగునకంటెను దెల్లంబు గాఁగ
నెఱిఁగించితిమి నీకు నెక్కుడుఁ గూర్మి
నట్టిద ; సర్వజ్ఞుఁ డనుపేరు నీకు
నిట్టటు నా వల దెల్లచోఁ జెల్లుఁ
గాన యామర్త్యలోకమ్మున కరిగి,
పూని ద్వితీయశంభుం డన మహిమ
వ్యక్తిగా లోకహితార్థంబు సకల
భక్తహితార్థంబు పరమార్థముగను
మావినోదార్థంబు మర్త్యంబుఁ బరమ
పావనంబుగఁ జేయుఁ బసవఁ డన్పేర"
నావుడుఁ గేల్మోడ్చి నందికేశ్వరుఁడు
దా విన్నపము చేసె దేవదేవునకు :

"మీయాజ్ఞఁ దలమోచి మెయికొని పనులు
సేయుదు నన్నింత సెప్పంగ నేల ?
మర్త్యలోకమునకు మఱి వేఱె యొకఁడు
గర్త యున్నాఁడె లోకత్రయవరద !
ఇం దున్న నేమి ? నా కం దున్న నేమి ?
యెం దున్న నేమి ? నీయంద నాయునికి—"
అని విన్నవించిన యానందికేశు
వినయోక్తులకు జగద్విభుఁ డిట్టులనియె :
"గురులింగమూర్తిఁ జేకొని వచ్చి యేన
పరమతత్త్వార్థతత్పరుఁ జేయువాఁడఁ ;
బ్రాణలింగంబ నై భ్రాజిల్లి నీదు
ప్రాణాంగముల నొడఁబడి యుండువాఁడ ;
రూఢిగా జంగమరూపంబుఁ దాల్చి
వేడుక నినుఁ గూడి విహరించువాఁడఁ ;
దనుమనోధనములు 1 దారవోకుండఁ
దనుఁ జేర్చికొనువాఁడ ననఁగి పెనంగి ;
నా ప్రాణములకుఁ బ్రాణం బగుచున్న
నా ప్రమథులకుఁ బ్రాణం బగు నీకు
నాకును సం దొక్కనాఁడు లేకునికి
నీకుఁ దెల్లముగాదె లోకపావనుఁడ !"
అని యాఱడిలఁ బల్కి నాశంకరునకుఁ
దనువెల్లఁ జేతు లై తా మ్రొక్కి నిలిచి
"విన్నపం బేఁ బనివినియెద" ననుచు
న న్నందికేశుఁడు సాష్టాంగ మెరఁగి
ప్రమథసన్నిహితుఁ డై భ్రాజిల్లు శివుని
నమితతేజోమూర్తి నాత్మలో నిలిపి
నరలోక మల్లదె నా నింతనంత

1. వ్యర్థముగాకుండ.

నరుడెంచె రయమున ; నంత నిక్కడను ;
గురుతరం బైన శ్రీగిరి పశ్చిమమున
నరనుతం బగుచుఁ గర్ణాటదేశ మనఁ
గడు నొప్పు నందుఁ బ్రఖ్యాతసద్భక్తి
నడి సన్నహింగుళేశ్వరభాగవాటి
యను నగ్రహారంబునందు విఖ్యాతి
మనుచుండు మండెఁగ మాదిరాజనఁగ ;
నతని పరమసాధ్వి యతివ మాదాంబ
సతతశివాచార సంపన్న ధన్య
1 కొత్తడి నెల్లను గొండొక్క పెద్ద
యుత్తమురాలు ధర్మోపేతగాత్రి ;
యెల్లవారలకంటె మొల్లంబునందు
నల్లవో యనుజీవనంబునఁ బొదలి
కొడుకులు లేమికిఁ గడు దుఃఖి యగుచు
వెడనోము లన్నియు వేసర నోమి,
యాద్యులు వొత్తంబులందెల్ల వెదకి
"హృద్యంబుగా నందికేశ్వరునోము
కామ్యార్థసిద్ధికిఁ గారణం" బనుచు
సమ్యగ్వ్రతస్థితి సతికిఁ జెప్పుటయు
నమ్మహాత్ములు సెప్పినట్లుగా గుడికి
నిమ్ములఁ జని నందికేశ్వరుఁ జూచి
సర్వాంగములు ధర సంధిల్ల మ్రొక్కి
'సర్వజ్ఞ నందికేశ్వర ! దయాంభోధి !'
యంచుఁ బ్రస్తుతి చేసి యతిభక్తి మ్రొక్కి
యంచితవ్రతచర్య లాచరింపుచును
నిమ్మల సోమవార మ్మాదిగాఁగఁ
దొమ్మిదిదినము లుత్సుకవృత్తి నోఁచి,

1. (రూ. క్రొత్తడి) పతివ్రతాసమూహము.

మఱునాఁడు నందిని మజ్జనం బార్చి,
గుఱుతైన చందనకుసుమంబు లిచ్చి,
మెత్తనివస్త్రముల్ మెయినిండఁ గప్పి,
యుత్తమాభరణంబు లురుగజ్జియలును
నందెలు గంటలు నలవడఁ గూర్చి,
పొందుగాఁ బసిఁడికొమ్ములు గొరిజియలు
వెట్టి, ఫాలంబునఁ బట్టంబు వెలయఁ
గట్టి, నందికి నలంకారంబు సేసి,
యక్షతధూపదీపాదు లొనర్చి,
యాక్షణంబునఁ బంచభక్షముల్ కుడిపి,
పులగంబు ముందటఁ బ్రోవుగాఁ బోసి,
పులకండమును నెయ్యిఁ గలిపి యర్పించి,
పరమమాహేశ్వర ప్రతతికి నెల్లఁ
బరిణామ మంద సపర్యలు సేసి,
"నందీశ ! నందీశ ! నవనందినాథ !
ఇందుకళాధరు నెక్కుడుఁగుఱ్ఱ !
నాయన్న ! నాతండ్రి ! నాయాలతేఁడ !
నీయట్టిసద్భక్తు నీయట్టిపుత్త్రు
ఖ్యాతిగా నొక్కనిఁ గరుణించితేని
ప్రీతి యెలర్ప నీపే రిడుదాన"
ననుడు నప్పుడు మాదమాంబకు నంది
జను లెల్ల నెఱుఁగఁ బ్రసాదంబు వెట్ట
నక్కన మోమున నాప్రసాదంబు
మక్కువ నెక్కొల్పి మఱి మౌళిఁ దాల్చి
మ్రొక్కి నిజావాసమునకు నేతెంచె ;
నెక్కుడు శుభచేష్ట లెదురుకొనంగ
నంత నెప్పటికంటె ననురాగరసము
వింతవేడుక పుట్టి వెలఁదియుఁ బతియు
లీల వర్తిల్ల, ము న్భూలోకమునకు

బాలేందుశేఖరుపనుపునఁ జేసి
వచ్చిన నందికేశ్వరుఁ డాత్మలోన
నచ్చెరువంది తా నరుదెంచుపనికి
ననుగుణంబుగఁ దన్నుఁ దనయునిఁ గాఁగ
వనజాక్షి నోమె నే మని చెప్పవచ్చుఁ !
దలఁచినకార్యంబు దలకూడె ! ననుచు
వెలఁదిగర్భమునఁ బ్రవేశింపఁ దడవ
మగువ కంతట నెల మసలెఁ దోడ్తోన
తగ గర్భచిహ్నముల్ దా నంకురించె ;
నమృతాంశుఁ డగుపుత్త్రుఁ డతివగర్భమున
నమరి యుండుట నొక్కొ యాఁకలిగాదు ;
జలజాక్షికడుపున సద్భక్తిరుచికుఁ
డలరుటనో రుచు లరుచులై తోఁచె ;
బాండురాంగునిమూర్తి పడఁతిగర్భమున
నుండుటనో 1 వెలరొందె మైదీఁగ ;
పడఁతి శీలపుఁజూలు భవపాకములకు
నొడఁబడ కునికినో యోకిళ్లు పుట్టెఁ ;
గ్రాలుచు సుతునిరాకకు నోరు దెఱచు
లీలనో సతి కావులింతలు పుట్టె ;
శివమూర్తి దనకు లోనవుటనో తవిలె
శివయోగనిద్ర నాఁ జెలువకు నిద్ర;
కాలకంధరుమూర్తి గడుపున నునికి
నో లలితాంగి చన్మొనలు నల్పెక్కెఁ ;
బెనుపుగ శివమూర్తి వనితగర్భమునఁ
దనరనో నడుము పేదఱిమి వోనాడె ;
యోగీంద్రహంసుఁ డయ్యువిదగర్భమున
రాగిల్లుటనొ నడ వేగంబు వదలె ;

1. వెల్లనయ్యె.

ననఁగ మానినిగర్భ మంతకంతకును
నినుపారి తనుపారి పెనుపారి పొదలి
నవమాసములు నిండ నందీశమూర్తి
నవకమై కడుపులోనన మవ్వమొందె.
జనని గర్భావాసమను గుహాంతరమ
తనసమాధికి సుఖస్థానమై పరఁగ
సిద్ధపద్మాసనాసీనత నతివి
శుద్ధాత్ముఁడై భూతశుద్ధికిఁ జొచ్చెఁ;
గడవ నూకుచు నుదకముఁ బాఱఁజల్లి
యడర నెబ్బంగినో యగ్ని దా నేర్చె;
బూది దా రాఁజదు పొగయదు తాను
నూఁదండు ముట్టించె నొక్కదీపంబు;
నొప్పుదీపమునఁ దా నున్నయిల్లెల్లఁ
గప్పు గాలకయుండఁ గాల్చె లోపలన;
"యిలఁ గాలు మోపండు నిట్టిబిడ్డండుఁ
గలఁడమ్మ!" యనుచు శత్రులును మిత్రులును
దమతమ పట్లను దా రుండ నోడి
భ్రమితులై కనుకనిఁ బాఱుచునుండ
నచ్చుగాఁ దాఁ జౌదశాబ్దంబుఁ గడచి
వచ్చి త్రికూటంబు వసుధపై నిలిచి
సచ్చరిత్రత సుప్తసర్పంబుఁ జోఁపి
క్రచ్చఱ షడ్దళకమలంబు నొంది
కర మర్థి దశదళకమలంబుఁ బొంది
పరగ ద్వాదశదళపద్మంబుఁ జెంది
షోడశదళపద్మసురుచిరసౌఖ్య
క్రీడావిలోలుఁడై కేరియాడుచును
దాఁటి యాద్విదళపద్మంబునఁ దన్ను
నాఁటించి సచ్చిదానందంబు నూని
చను నధోముఖ మగు షట్కమలములు

మునుకొని యు ట్లూర్ధ్వముఖము లై తనర
నిశ్చలకోదండ నిజగతి నున్న
పశ్చిమనాళ సంభవ మైనయట్టి
నాదంబునకుఁ జొక్కి నగముపై మ్రొక్కి
మోదంబునకుఁ జిక్కి ముందఱ నిక్కి
సరినూర్ధ్వముఖసహస్రదళాంబుజాత
మరయ నధోముఖ మై మించి వెలుఁగ
దివ్యుఁ డై షోడశాంత వ్యోమచంద్ర
భవ్యసుధాపానపారవశ్యమున
నాతతంబుగఁ బరంజ్యోతిస్స్వరూప
మై తనవెలుఁగ వెల్గై వెల్గుచుండఁ
బలుగుటాప్రతిమగర్భంబులోపలను
వెలిఁగెడుదీపంబు విధమునుబోలెఁ
బాండురాంగం బైన పడఁతిగర్భమునఁ
బోఁడిగా వెలుఁగుచుఁ బుత్త్రుఁ డీక్రియను
దగిలి శివధ్యానతత్పరత్వమున
మొగిఁ దల్లికడుపులో మూఁడేఁడు లున్న
సుతభరాక్రాంత యై మతి శ్రమం బంది
సతి దొంటి నందికేశ్వరుగుడి కేఁగి
"నోములు గీములు వేములఁ గలిపి
నీమర్వ నొచ్చితి నిఖిలలోకేశ !
మఱుఁగునొచ్చినయట్ల మన్నించి నన్ను
మెఱయింపు సుతు నీగి మే లయ్యె నేఁడు
పున్నెంబు సేసిన పొలఁతులు నెలల
నెన్నఁ దొమ్మిది మోచి కున్నలఁ గంద్రు ;
అల్లన మూఁడేఁడు లయ్యె న న్నింత
యల్లటపెట్టె దోయన్న ! నే నెఱుఁగ
దుర్భరం బైన యీయర్భకు వలని
గర్భంబు కర్కటిగర్భంబు వోలె
నరయంగ నీయిచ్చు వరములు సాలు

[1] నెరవు మాన్పింపవే యేమియు నొల్ల
న న్నెంత కెత్తుకో నున్నదో కాక
యెన్నఁడు విందుమే యిట్టిగర్భముల !"
యనుచుఁ దా నచ్చోట నచ్చోట నిలిచి
తనువు శ్రమంపడఁ దనయింటి కరిగి
పాన్పుపై నున్నని పరితాప మంది
తన్పుగా నార్ద్రచందనవారిఁ దోఁగి
నెవమునఁ గనుమూసి నిద్రఁ బొందుడును
నువిదకుఁ గలవోలె నుక్షవల్లభుఁడు
[2] జంగమలింగవేషం బొప్పఁ దాల్చి
యంగన కి ట్లని యానతి యిచ్చె :
"నీమనస్తాపంబు నీవగ మాన్పఁ
గా మించి వచ్చితిఁ గమలాయతాక్షి !
నీకడుపులో నున్నయాకుమారుండు
లోకపావనమూర్తి గాక కేవలుఁడె ?
యాదివృషభము శిలాదునికొడుక ;
యాదేవదేవుని యానతిఁ జేసి
భక్తహితార్థమై ప్రభవించు నీకు
వ్యక్తిగాఁ జెప్పితి వగవకు మింకఁ
బుట్టెడుఁ బుత్త్రుండు ; పుట్టఁగఁ దడవ
పెట్టుమా బసవఁడ న్పేరు పెంపార"
నని యానతిచ్చిన నంత మేల్కాంచి
కనువిచ్చి చూచుచుఁ గాన కెవ్వరిని
"ఈతఁడు మననందికేశుండు దాన
యేతెంచెఁ గానోపు నింతయు నిజము
బ్రదికితి ; నాజన్మఫల మెల్ల నేఁడు

---

1. బాధ. 2. చరలింగము ; జీవరూపమునఁ జరించు శివుఁడు ; శివభక్తుఁడు; జంగమ జంగమ లింగశబ్దములు కేవల శివభక్తవాచకములుగనే పూర్వవాఙ్మయమున నుపయుక్తము లైనవి.

తుదముట్టె'' ననుచు సంతోషాబ్ధిఁ దేలి
చెలులుఁ జుట్టములు నచ్చెరువంది వినఁగఁ
గలతెఱఁ గంతయుఁ గడువేడ్కఁ దెలిపి
యున్నెడఁ గోమలియుదరంబులోన
నున్నమహాత్మునిహృన్నలినంబు
దాన యై వెలిఁగెడు తత్పరంజ్యోతి
వానిఁ బ్రబోధించి ''వచ్చినపనులు
మఱచితే'' యనవుఁడు నెఱిఁగి సద్భక్తి
1 యఱుకువ గాకుండ సాష్టాంగ మెరఁగి
ప్రీతిఁ బుత్త్రుఁడు మోడ్పుఁజేతులతోడ
నాతల్లిగర్భంబునం దుదయించె ;
నర్ధోదయమునంద యతనిలో నున్న
యర్ధేందుమౌళి గుప్తాకృతిఁ దాల్చి
యంగంబుపైఁ గడు సాంగంబు గాఁగ
లింగసాహిత్యంబు లీల నొనర్చె ;
''వచ్చిన త్రోవ యెవ్వరుఁ గానకుండ
నెచ్చోట నుండియో యేతెంచెఁ దపసి
యిది యేమొకో !'' యని యింటివారెల్లఁ
బదరుచు నంత విభ్రాంతు లై చూడ
ముడిచినమడుపుఁ గెంజడముడినడుమ
మృడునిచందంబులు వెడవెడ దోఁపఁ
గట్టిన వెలిపొత్తి కచ్చడం బెందుఁ
బుట్టనిరుద్రాక్షభూషణంబులును
రాగికుండలములు రత్నకంబళియు
యోగదండంబును నొకచేత గొడుగు
బూదిబొక్కసమును బొలుపారుమేను
బూదిపై నొప్పు త్రిపుండ్రరేఖలును
దళతళ మను మెర్గుపలువరుసయును

1. తక్కువ.

గలయ నొత్తిన వాలుగడ్డంబుఁ దనరఁ
దపసులరా జొక్కతపసిచందమున
నపుడు మాదాంబకు ననురాగ మెసఁగ
[1] "నిల్ల [2]కప్పడిసంగమేశ్వరం బందు
నెల్లప్పుడును నుక్కి; యెట్టు లంటేని
యేను గూడలి సంగమేశ్వరు పేర
కాన యాగుడిలోనఁ గదల కుండుదును;
నాకొడు కొక్కజన్మమున నితండు;
లోకహితార్థమై నీ కుదయించెఁ
గాన వచ్చితిఁ జూడఁగా; నీభవమున
కేన చూ గురుఁడ నిం కిటమీఁదటికిని
నీనందనునకు లింగానర్పితంబు
లాన సుమీ యించుకంతైనఁ గుడుప"
ననుచు నదృశ్యుఁ డై యరిగె నతండు.
మనసిజహరుఁడు దాఁ జనఁగ నంతటను
బాలార్కకోటుల ప్రభలు గీడ్పఱచు
బాలునితేజంబు వర్వ్వటఁ జేసి
సూచీముఖంబైనఁ జొనుపంగ రాని
యేచినతిమిరంబు నెల్లమానవుల
యజ్ఞానతిమిరంబు నావంత లేక
విజ్ఞానమయుఁ గని వేగంబ పాయ
వేగక వేగినవిధ మైనఁ జూచి
రాగిల్లె నిఖిలంబు రవి [3]పాఁగె ముడిగె
జననియు జనకుండు సత్పుత్త్రుఁ జూచి
యనురాగరసవార్ధి మునిఁగి యాడుచును
భక్తులఁ బిలువంగఁ బనిచి యిర్వురును

1. ఇచ్చటి. 2. జీర్ణవస్త్రములు దాల్చు పరివ్రాజకుఁడు. (అచ్చటి సంగమేశ్వర క్షేత్రమందలి శివలింగమునకు కప్పడి సంగమేశ్వరుఁ డని వ్యవహారము.)
3. ప్రభ; పొంకము.

భక్తిఁ బ్రణామ మేర్పడ నాచరించి,
యిమ్ముల సింహాసన మ్మిడి, తత్క్ష
ణమ్మ విభూతి వీడ్యమ్ము లర్పించి,
పాదోదకంబులు వట్టి మైఁ గడిగి,
బూది ఫాలంబునఁ బూసి పైఁ జల్లి,
పంచమహావాద్యపటలంబు లులియ
నంచితాగణ్యపుణ్యాత్ముఁ దత్సుతుని
బసవ నామం బిడి, పతియును సతియు
నెసక మెక్కఁగ నున్నయెడఁ గుమారుండు
వెనుకఁ జీఁకటి యుండఁ దన కేటితేజ
మనుగతి దీపంబుఁ గనుఁగొని నవ్వు ;
సన్నుతలింగప్రసాదమగ్నతన
యున్నట్లు చనుగుడ్చు నూరక యుండు ;
శివసుఖామృతమును జేఁ గ్రుమ్మరించి
చవి సూచుమాడ్కి హస్తము లారగించు ;
శివపదధ్యాననిశ్చేష్టితావస్థఁ
దవులుచందంబునఁ దా వెఱఁ గందు ;
బిలిబిలిసంసార ములఁ బాఱఁ దోలి
చెలఁగి యాడెడుగతిఁ జేతు లాడించు ;
మాయాప్రపంచంబు డాయంగనీక
పాయఁ దన్నెడురీతిఁ బాదంబు లార్చు ;
వడి మోయిఁ దనపూనివచ్చినపనులు
దడ వయ్యె ననుచు నుల్కెడుభంగి నులుకు ;
భవుఁ బాడ నానందబాష్పంబు లొలుకు
పవిది నేడుచుఁ గనుఁగవ నశ్రు లొలుక ;
భవబాధలకు 1 నగపడి మొఱవెట్టు
భవుల కు య్యాలించుభాతి నాలించు ;
నొడయలయడుగులఁ బడి మొఱ ల్వెట్టు

1. లోనయి.

పడువునఁ బుడమిపైఁ బడి బోరగిల్లు ;
నిలఁ 1 మఱపడ్డ నిర్మలశివభక్తి
తలయెత్తువడువునఁ దాఁ దలయెత్తు ;
నరు దొందఁ బద్మాసనాసీనవృత్తిఁ
బొరి నభ్యసించుపోల్పునఁ గూరుచుండుఁ ;
బూని ద్వితీయశంభుం డను నంది
నే నను భావన నిలఁ దోఁగియాడు ;
నావీరమాహేశ్వరాచార మెల్ల
బ్రోవయి నిల్చినపోల్కి నిల్చుండుఁ ;
గడఁకతో నాదిమార్గము దప్పకుండ
నడుగిడులీలఁ దప్పడుగులు వెట్టు ;
మఱహరుఁ బేర్కొనుమాత్ర గద్గదము
లలరుకై వడిఁ దొక్కుఁబలుకులు పలుకు
బల్లిదు ల్మాశివభక్తులే యనుచుఁ
గ్రేళ్లువాఱుచు నాడుక్రియఁ బాఱి యాడు ;
నంత-వినోదంపుటాటప్రాయమున
సంతతంబును శివార్చన మాచరించు ;
బుద్ధు లెఱుంగు లేఁబరులుప్రాయమున
సిద్ధంబు భక్తుల శివునిగాఁ దలఁచు ;
సర్వజ్ఞుఁ డైన వృషభమూర్తిగాన
సర్వవిద్యలు సహజంబ పాటిల్ల
గతభక్తియుక్తుఁ డై గర్భాష్టమమున
సుతు నుపనయనంబు శుభముహూర్తమునఁ
జేయుదు నని తద్దఁ జిడిముడిపడఁగ,
నాయెడ బసవఁ డి ట్లనియెఁ దండ్రికిని :—

—: బసవేశ్వరుఁడు వడుగు వల దని తండ్రితో వాదించుట :—

“వడు గని యిది యేమి గడియించె దీవు ?
జడుఁడ వెట్లయితి వీశ్వరునిఁ గొల్చియును ?
బరమాత్ము గురునిగాఁ బడసి దుర్నరుల

1. మఱుగుపడ్డ ; తార్మాఱయిన.

గురు లని కొలుచుట నరకంబు గాదె ?
గతపూర్వజన్మసంస్కారుఁ డై తలఁప
వితతద్విజత్వంబు పతితంబు గాదె ?
నిర్మలగురుకృపాన్వితజన్మనకుఁ
గర్మజన్మంబు దుష్కర్మంబు గాదె ?
యగ్గురుపాదంబు లర్చించునతని
కగ్గిలో హవి వేల్చు టది దప్పు గాదె ?
మలహరాత్మక మగు మంత్రంబుఁ గఱచి
పలుమంత్రములు గొనఁ బాపంబు గాదె ?
శూలి భక్తుల కెత్తుకే లది 1 త్రాటి
మాలల కెత్తుట మఱి తప్పు గాదె ?
కర్మపాశంబు లొక్కటఁ దెగ నీల్గి
కర్మంబుత్రాళ్ళు దాఁ గట్టుకోఁ దగునె ?
రుద్రాక్షభసితాదిముద్రలు దాల్చి
క్షుద్రముద్రలు దాల్పఁ గూడునే చెపుమ ?
యీరీతిఁ 2 ద్రాటికి దూర మై యున్న
వీరమాహేశ్వరాచారదీక్షితుని
నిర్మితోభయకర్మనిర్మూలు నన్నుఁ
గర్మాబ్ధి ముంచుట ధర్మమే నీకుఁ ?
గ్రచ్చఱఁ గన్నులఁ గానవు గాక
వచ్చునే బసవని వడుగు సేయంగ
బ్రహ్మశిరోహరుఁ బ్రమథైకవంశ్యు
బ్రహ్మవంశ్యుం డని భావించె దెట్లు ?
జాతిగోత్రాతీతు సద్గురుజాతు
జాతిగోత్రక్రియాశ్రయుఁ జేసె దెట్టు ?
లకులస్థుఁ డై యున్న యభవుని భక్తు
నికి నేకులం బని నిర్ణయించెదవు ?
కావున నెన్నిమార్గములను వడుగు

1. కర్మపాశబద్ధు లయిననీచులు. 2. కర్మపాశమునకు.

గావింపఁగా రాదు కథ లేమి చెప్ప ?"
ననవుఁడు దండ్రి యి ట్లనియెఁ బుత్త్రునికి :
"వినవయ్య ! బసవయ్య ! విప్రమార్గంబు
నాగమవిధిఁ బదునాఱుకర్మంబు
లాగర్భసంస్కార మాదిగాఁ గలవు ;
వానిలో నొకఁడైన నూన మానేని
కానేరఁ డాతఁ డగ్రకులోత్తముండు ;
అందు విరుద్ధ మెయ్యది ? రుద్రగణము
నాంది ముఖ్యం బుపనయనపూజకును
బనుగొనఁ బ్రణవంబు భర్గుఁడే దైవ
మనుటయు మంత్రంబు ; నట్లును గాక
పెట్టినసూత్రముల్ భీమసర్పములు,
పట్టినపాత్రంబు బ్రహ్మశిరంబు,
పాలాశదండంబు వంకజోదరుని
కోలెమ్ము, దలచుట్టుకూఁకటుల్ జడలు,
నఱితికృష్ణాజిన మది గజాజినము,
వఱలు మేదావియే నెఱిభూతి గాఁగ
హరుఁడు భిక్షాటన మాచరింపంగ
నరిగినవేష మింపారఁ దాల్చినను
నట్టైనఁ గాని బ్రాహ్మణుఁడు గాఁ డనిన
నిట్టు విరుద్ధమే యీశుభక్తునకు ?
వడుగు చేసిన భక్తి వట్టిపా టగునె ?
నొడువరితనమునఁ గడవ నాడెదవు.
పసిబిడ్డమాటలు పనియు లే దింక
మసలక చేయుమీ మాచెప్పినంత ;
యిట్టిచోద్యంబు లే మెఱుఁగ మేనాఁటఁ ;
బట్టి ! మాకడుపునఁ బుట్టితికాక
'ప్రాలు గల్గునుపుత్త్రుఁ బడసితి మింక
మేలయ్యె' నని యేము లీల నున్నెడను

బుట్టినాఁడ కులము పురులు వోనాడ
నెట్టయ్య ! తలఁచెదు పట్టి మాయయ్య !
కులదీపకుఁడు పుట్టఁ గులము వర్ధిల్లుఁ ;
గులనాపకుఁడు పుట్టఁ గులమెల్లఁ ద్రుంగుఁ ;
గులమున కెల్లను గుద్దలిఁ గొంటి
వెలిసేయరే నన్ను విప్రులు విన్న ?
నిన్నుఁ జేపట్టి యనీతిమైఁ గులము
చెన్నఁటి ! పోనాడి చెడ నెట్లు వచ్చు ?
యుక్తి సెప్పితి మిప్పు డొల్లవైతేని
భక్తియు నీవును బడ్డట్లు పడుము—"
అని నిష్ఠురోక్తుల నందంద పలుక
విని పొంగి బసవఁ డి ట్లనియెఁ గోపమున :
"బ్రాహ్మ్యంబు భక్తియుఁ బలికెదు కూడ
బ్రాహ్మ్యంబు వేఱెదర్శన మయియుండు ;
వేఱదైవంబును, వేఱె మంత్రంబు,
వేఱె యాచార్యుండు, వేఱె వేషంబు,
ధ్యానంబు వేఱె, బ్రాహ్మ్యక్రియ ల్వేఱె,
మానుగా నాచార్యమార్గంబు వేఱె ;
కాదేని నగ్నిముఖము, బ్రహ్మశిరము,
నాదిరుద్రుఁడు శిఖ, హరి యుదరంబు,
ప్రాణాదివాయువు ల్ప్రాణంబు, యోని
క్షోణి, దా శ్వేతంబు నూవె వర్ణంబు,
నసమాక్షువిధమె గాయత్రి? సాంఖ్యాయ
నసగోత్ర, మిరువదినా ల్గక్షరములు
దానికి, మఱి త్రిపాదంబు, షట్కుక్షి,
పాన లొండును గావు పంచశీర్షంబు
నని చెప్పఁగాదె మీయాజ్ఞికంబులును ;
వినుము దైవం బది వేఱౌనొ కాదొ ?
కావున నిదియు సాంఖ్యాయనమతము

దైవం బనఁగ లేదు తా బహురూపు,
దాని కాచార్యుండు ధరఁ గర్మజడుఁడు,
దానికి మంత్రంబు దాను గాయత్రి,
ప్రతిదిన క్రియ కర్మబంధంబు వేష
మితరేతరము మోక్షహేతువే తలఁప ?
నది కాక షడ్దర్శనాతీత మైన
మదనారిసద్భక్తి మార్గంబు వినుము :
శ్రుతి "విశ్వతశ్చక్షురుత" యంచుఁ బొగడు
స్తుతుల మీఱి యతిసూక్ష్మరూపంబు
ఆదికి నాది నిత్యానందమూర్తి
శ్రీదివ్యలింగమూర్తియ సుదైవంబు ;
నట్టియీశ్వరు నాత్మఁ బట్టించి చేతఁ
బెట్టంగఁ జాలిన పృథుదయామూర్తి
ప్రకటింప "నగురో రధిక" మనఁ బరగు
సకలస్వరూప మాసమయసద్గురుఁడు
మంత్రంబులకు రాజమంత్రమై వెలయు
మంత్రంబు దానికి మఱి షడక్షరియు
భవదూర మగు జటాభసితరుద్రాక్ష
సవిశేషమోక్షానుసారి వేషంబు
భువి జన్మపాపౌఘభూజకుఠార
మవిరళసత్క్రియాష్టాంగసద్భక్తి
సందర్శనంబుల సకలపాపములు
డిందు మోక్షాంగన పొందుఁ ; గావునను
నిది ఫలప్రాప్తి యిం కిట మీఁద లింగ
పదసేవనోత్కృష్టభవ్యసౌఖ్యంబు
ఫల మిట్టి దని చెప్ప భావింప శ్రుతుల
తలమె జీవన్ముక్తి తత్త్వాత్మకంబు ;
కావున వేఱె మార్గంబుగాఁ జూడు
భావింప బ్రాహ్మ్యంబు భవునిభక్తియును ;

గలవండ్రు దర్శనంబులు నాఁగఁ గొన్ని ;
కలిసియుండునె మున్నొకండొకఁ డందు
దర్శనంబులు గల్గఁ దలఁచిరేనియును
దర్శనం బది వేఱె తత్త్వరూపంబు ;
తలప నీశ్వరపదతల్లీయసౌఖ్య
ఫలకారణమె కర్మపాశబంధంబు ?
నిటు గాక యుభయము నేక మండ్రేని
యటుగాదు వో నిటలాక్షభక్తునకు
"ధర నన్య దేవతాస్మరణమాత్రమున
నిరువదెన్మిదిగోట్లు నరకంబు లొందు'
నన శ్రుతు లందును వినరె ? బాపనికి
దినకరపావకదిక్పాలకులను
హరివిరించ్యాదుల నఖిలదేవతల
ధర మూఁడు సంధ్యలఁ దాఁ గొల్వవలయుఁ ;
గొలువక తక్కినఁ బొలిసె బ్రాహ్మ్యంబు ;
కొలిచెనేనియు భక్తి వొలిసెఁ గావునను
బ్రాహ్మణుఁ డేనియు భక్తుఁ డె ట్లగును ?
బ్రాహ్మణుఁ డె ట్లగు భక్తుఁ డేనియును ?
మావిడిబీజంబు మహిమీఁద విత్తఁ
గా వే మగునె పెక్కుగథలేమి చెప్ప ?
సహజలింగైక్యనిష్ఠాయుక్తి భక్తి ;
బహుదేవతాసేవ బ్రాహ్మణపథము ;
కులసతియట్లు నిశ్చలయుక్తి భక్తి ;
వెలియాలియట్టు లవ్విప్రమార్గంబు ;
కాదేని నందిముఖ్యస్థితిఁ గొలిచి
యాదిదేవుఁడ దైవ మనుమంత్ర మెఱిఁగి
తా రుద్రవేషంబుఁ దాల్చెనేనియును
వారక యట్ల తా వర్తింపవలదె ?
యిలువేలుపైన సర్వేశ్వరుఁ డుండఁ
బలువేలుపులఁ గొల్వఁ బాడియే చెపుమ ?

కాన యిన్నియుఁ జెప్పఁగాఁ బని లేదు
దాన సందియమె గౌతముని దధీచి
వ్యాసుని శాపంబు వహ్నిపాలైన
భూసురులకు భక్తి వొలుపొంద నగునె ?
యురవడిచేసి భక్త్యుద్రేకమునను
బరమార్థ మెడలంగఁ బలికె నా పలదు ;
ఇది శ్రుతిస్మృతిమూలమేకాని యొండు
1 పదకవాదం బని భావింపఁ జనదు ;
కర్మమార్గం బగుఁగాక బ్రాహ్మ్యంబు
నిర్మలశివభక్తి నిష్ఠితం బగునె ?
ఇట్టి బ్రాహ్మణమార్గ మిది దథ్యముగను
బట్టి యాడెద వేని పనియు లే దింకఁ ;
గాకులు పెంచిన కోకిలపిల్ల
కాకులఁ బోలునే కావుకా వనుచు;
నెక్కడితల్లి మీ రెక్కడితండ్రి
ఎక్కడితోడు ధర్మేతరులార !
చెన్నయ్య మాతాత చేరమ తండ్రి
పిన్నయ్య కక్కయ్య బిడ్డ నే ననుచు
వేడుక సద్భక్తి విధి నుండువాఁడ ;
నేడుగడయు మాకు నిది నిక్కువంబు ;
మీయంత నుండుఁడు మీరును, నేను
నాయంత నుండెద వేయును నేల ?"

—: బసవేశ్వరుని పెండ్లి :—

యనుచు సహోదరి యగు నాగమాంబ
యును దాను నచ్చోట నుండఁగా దనుచు
నరుదెంచె మఱి 2 ఫణిహారియింటికిని
నరు లిది సోద్య మనంగ నంతటను
వడుగున కని మున్న వచ్చినయతఁడు
వడఁతి మాదాంబకు భ్రాత సజ్జనుఁడు

1. వ్యర్థవాదము. 2. (ఆయూరియందలి) శివాలయమునకు.

పాండురాంగుని భక్తిపరుఁడు బిజ్జలుని
బండారి బలదేవదండనాయకుఁడు
"శివభక్తునకుఁ బెండ్లి సేయుదుఁగాని
భవికి నీ" ననుతొంటిబాసఁ దలంచి
"ఇట్టిభక్తున కిప్పు డీక నాకూఁతు
నెట్టివానికి నిత్తు నింక నే" ననుచు
బసవకుమారునిపాలికిఁ బోయి,
యెసక మెసఁగ గూఁతు నిచ్చి తా మ్రొక్కి
"నా బిడ్డఁ జేకొని నన్ను రక్షింప
వే బసవన్న ! మాహేశ్వరతిలక !"
యనుచుఁ బ్రార్థన చేసి యాబసవయ్య
యనుమతంబునఁ బుర మభిరమ్యముగను
మకరతోరణములు మణితోరణములు
ముకరతోరణములు మును గట్టఁ బనిచి,
"గలయంగ వీథులఁ గస్తూరి యలుకుఁడు,
దెలుపు ముక్తాఫలంబుల ముగ్గు లిడుఁడు,
రండు, భక్తులఁ బిలువుండు. మీ రెదురు
వోండు వేగమ తోడి తెండు తెం" డనుచు
నిట వచ్చునయ్యల కెదురు వచ్చుచును
నట వచ్చునయ్యల కర్థి మ్రొక్కుచును
సింహాసనస్థులఁ జేసి, యాకర్మ
సంహారమూర్తుల చరణము ల్గడిగి,
యవిరళనవ్యపుష్పాంజలు లిచ్చి,
ప్రమిమలధూపదీపంబు లొనర్చి,
యమ్మహాత్ములకు సాష్టాంగులై యాక్ష
ణమ్మ విభూతి వీడ్యమ్ము లర్పించి
కోలాటమును బాత్ర గొండ్లి పేరణియుఁ
గేళిక జోకయు లీల నటింపఁ
బాయక "చాఁగు ! బళా !" యను శబ్ద
మాయతి నాకసం బంది ఘూర్ణిల్ల

నలరేఁగి వేణువీణావాద్యవితతు
లులియుచు లీలతో నొక్కట మ్రోయ
నానందగీతంబు లగ్గించువారు,
పూని శంకరగీతములు వాడువారు,
జతిగీతములమీఁదఁ జప్పట లిడుచు
నతిశయశివభక్తి నాడెడువారు,
నాదిపురాతనాపాదితస్తుతులు
వేదార్థములు గాఁగ వివరించువారు,
నెఱి శివమరులున గుఱిలేనివేడ్క
నఱిముఱి మిన్నంది యాడెడువారు,
మ్రొక్కి శివానందమునఁ దమ్ము మఱచి
నిక్కపుసుఖమున నిద్రించువారు,
నిఖిలమాహేశ్వరనికరంబు నిట్లు
సుఖలీలఁ గొలువున్నచో బసవయ్య
యప్పాదజలముల నభిషిక్తుఁ డగుచు
నొప్పుదివ్యాంబరయుగ్మంబు సాతి
భసితంపునెఱపూఁత పలుచఁగాఁ బూసి,
నొసలఁ ద్రిపుండ్ర మొప్పెసఁగ ధరించి,
మౌళిఁ బ్రసాదసుమంబులు దుఱిమి,
వ్రేలఁగ రుద్రాక్షభూషలు దాల్చి,
సారమై లింగపసాయితం బనెడు
పేరను గల్గుకఠారంబు గట్టి,
యానందబాష్పంబు లలుఁగులు వాఱ
మేను రోమాంచసమ్మిశ్రిత మై తనర
"బగుతులపాదుకాప్రతతులు నాకు
నగపడె" నంచు నందంద మ్రొక్కుచును
నొడయల కడుగులు వొడసూప నోడి
మడఁచి వెన్కకు డాఁచి మహి నప్పళించి
యూరుల మోఁచేతు లూఁది కేల్మొగిచి
వారక యొక్కింత వంగి యుప్పొంగి

తనతొంటిభావంబుఁ దాల్చినయట్టు
లనిమిషుఁ డై కన్నులారఁ జూచుచును
భక్తిశృంగార మేర్పడఁ జూఱగొన్న
భక్తికళార్ణవు బసవయ్యఁ జూచి
"యిట్టిధన్యుఁడ నౌదునే యిప్పు" డనుచు
దట్టుఁడు, బలదేవదండనాయకుఁడు
తనకూఁతుఁ గామినీజనతిలకంబు
ననుపమశృంగారవనధి గంగాంబఁ
దోడ్తెచ్చి యట్ల భక్తులకు మ్రొక్కించి,
యేడ్తెఱ శుభచేష్ట లెదురుకొనంగ
శివభక్తవనితలు సేసలు సల్ల
శివబలం బగ్గలించినముహూర్తమున
వేదోక్తశివధర్మవిధి బసవనికి
గాదిలిసుతఁ బెండ్లి గావించె ; నంత
"నట్టిద కాదె ము న్నాదిఁ దలంపు
నిట్టట్టు నావల దిదియె పథంబు
హరునిభక్తులబలం బది లేమిఁ గలిమి
హరివిరించులు ద్రుంగుదురు [1] మండు రనినఁ
దక్కినగ్రహచంద్రతారాబలముల
యెక్కువదక్కువ లెన్న నేమిటికిఁ ?
గరుణఁ జూచుటయ లగ్నంబు సేయుటయు
వరముహూర్తంబు దీవనయ బలంబు
గాన భక్తులకృప గలదు బసవని
కేనాఁట విందుమే యిట్టిపెండ్లిండ్లు"
ననుచు లోకంబెల్ల నాశ్చర్య మంది
వినుతింపఁ జొచ్చిరి వీరు వా రనక.

1. బ్రదుకుదురు.

—: బసవేశ్వరుఁడు కప్పడిసంగమేశ్వరమున కేఁగుట :—

అంత భక్తాళికి నభిమతార్థములు
సంతుష్టిగాఁ బరిచర్య లొనర్చి
సాష్టాంగుఁడై భువిఁ జాఁగిలి మ్రొక్కి
శిష్టభక్తాళికిఁ జేతులు మొగిచి
'యిల్లకప్పడిసంగమేశ్వరంబందఁ
దెల్లంబు మాగురుదేవుఁ డున్నాఁడు
చనియెద వారిశ్రీచరణముల్ గొలువఁ
గనియెద మిక్కిలి కరుణ మీచేత"
ననుచు సోదరియును నాలును దానుఁ
జనియె నాబలదేవుఁ డనుప వేగంబ ;
అప్పురి బసవఁ డల్లంతటఁ గాంచి
తప్పక గురుపదధ్యానాత్ముఁ డగుచు
గురు వున్నపురి దృష్టిగోచరం బైన
ధరఁ జాఁగి మ్రొక్కుచు సరిగె సంతంతఁ
గన్నంత నుండి తాఁ జన్నంతదవ్వు
నెన్న యోజనమాత్ర మెసఁగి మ్రొక్కుచును
'గుదురు గదా మున్న గురుభక్తి శివున
కిది యెంతపెద్ద దా నితని వీక్షింప'
నని యెల్లవారలు నర్థిఁ గీర్తింపఁ
జనఁ జొచ్చెఁ బురి గురు స్తవనంబుతోడ ;
నప్పురిమహిమ దా నది యెట్టి దనినఁ
జెప్పఁగ నలవియే శేషునకైనఁ ?
బురివీథులన్నియుఁ బుణ్యతీర్థములు ;
పరగంగ గుహ లెల్ల హరునివాసములు ;
గిరు లన్నియును హేమగిరులు దలంపఁ ;
దరు లెల్ల రుద్రాక్షతరువులు గలయ
వనము లన్నియుఁ బుష్పవాటిక ; లచటి
గను లన్నియును భూతిగనులు దెల్పార

గొలఁకు లన్నియు నొప్పుజలజాకరములు ;
కల గోవు లన్నియుఁ గామధేనువులు ;
గోడె లన్నియు నందికుఱ్ఱ ; లాపురము
వాడ లన్నియు రంగవల్లివేదికలు ;
నరులెల్ల భక్తులు చిరజీవులెల్లఁ
బరికింపఁ గారణపురుషరూపములు ;
స్త్రీలెల్లఁ బరమపతివ్రతామణులు ;
నే లెల్ల నవిముక్తనిధిసమానంబు ;
పలుకు లెల్లను దత్తభాషలు జనుల
యులి పెల్ల గీతవాద్యోత్సవరవము ;
కల్లరి పతితుండు ఖలుఁడు దుర్జనుఁడు
ప్రల్లదుఁ డఱజాతి భక్తిహీనుండు
వికలుండుఁ గొండీఁడు వెదకిన నైన
నొకఁడు మందున కైన నూరిలో లేఁడు ;
అసమానలీల నిట్లని ప్రస్తుతింప
నెసఁగు కప్పడిసంగమేశ్వరం బందు
సడిసన్న కూడలిసంగమేశ్వరుని
గుడి కేఁగి తన్ను భక్తు లెదుర్కొనంగ
గుడిముందటను నిల్చి గురులింగమూర్తి
యడుగుల కపుడు సాష్టాంగుఁడై మ్రొక్కి
వేదపురాణార్థవిమలసూక్తులను
నాదంబు పూరించి నలిఁ బ్రస్తుతింపఁ

—: సంగయదేవుఁడు బసవేశ్వరునకుఁ బ్రత్యక్ష మగుట :—

దొల్లింటివేషంబుతో వచ్చి తేట
తెల్లగా సంగయదేవదేవుండు
గుడివెలిఁ బొడసూప గురులింగమూర్తిఁ
బొడఁగని బిట్టుల్కిపడి బసవండు
పెద్దయుఁ బ్రమదంబు భీతియు భక్తి
దుద్దెక్కి తనలోనఁ దొట్రుకొనంగ

నంతంత మఱియు సాష్టాంగుఁ డై మ్రొక్కి,
వింతవేడుక వెల్లివిరియ నగ్గురువు
చరణము లానందజలములఁ గడిగి
గురుపూజ తన్న కాఁ గూడ నర్పించి
పడియున్న, నతిదయాభావామృతంబు
కడకంటఁ గెడఁగూడఁ గొడుకు లేనెత్తి
యందంద కౌఁగిట నప్పళింపంగ
ముందట మ్రొక్కుచు మోడ్పుఁ గే లమర
నెలకొన్న తత్స్వరనేత్రాంగవిక్రి
యలు భూషణంబు లై యాదట నున్న
బసవకుమారు సద్భక్తికి మెచ్చి
వెసఁ బ్రసాదం బప్పు డొసఁగి యి ట్లనియె :
"వచ్చినపోయినవారిచే నీదు
సచ్చరిత్రము విని సంతసిల్లుదుము ;
గతకాలవర్తనకంటె సద్భక్తి
మితిదప్పి నడవకుమీ బసవన్న !
శూలిభక్తాలి దుశ్శీలముల్ గన్న
మేలకాఁ గైకొనుమీ బసవన్న !
శత్రు లైనను లింగసహితు లై యున్న
మిత్రులకాఁ జూడుమీ బసవన్న !
పట్టినవ్రతములు ప్రాణంబుమీఁద
మెట్టిన విడువకుమీ బసవన్న !
వేఱెభక్తులజాతి వెదకకుండుటయె
మీఱినపథము సుమీ బసవన్న !
చిత్తజాంతకుభక్తిఁ జెడనాడుఖలుల
మిత్తి వీవె త్రుంపుమీ బసవన్న !
వేదశాస్త్రార్థసంపాదితభక్తి
మేదిని వెలయింపుమీ బసవన్న !
తిట్టిన, భక్తులు కొట్టినఁ, గాల

మెట్టిన, శర ణనుమీ బసవన్న !
యేఁ దప్పువట్టుదు నిలఁ బరస్త్రీల
మీఁదఁ గన్నార్పకుమీ బసవన్న !
సాధ్యమౌ భక్తప్రసాదేతరం బ
మేధ్యంబకాఁ జూడుమీ బసవన్న !
నిక్కంపుభక్తికి నిర్వంచకతయ
మిక్కిలి గుణము సుమీ బసవన్న !
ఏప్రొద్దు జంగమం బేనకాఁ జూడు
మీ, ప్రసాదముఁ గొనుమీ బసవన్న !
నాలుక కింపుగా శూలిభక్తులను
మేలకా నుతియింపుమీ బసవన్న !
యేమైన వలసిన యెడరైనఁ దలఁపు
మీ, మమ్ము మఱవకుమీ బసవన్న !
మోసపుచ్చు శివుండు బాస లేమఱకు
మీ, సత్య మెడపకుమీ బసవన్న !"
అని మృదుమధురాంచితాలాపములను
దనయుఁ బ్రబోధించి తాఁ గౌఁగిలించి
కొడుకుచే మ్రొక్కించుకొని గురుమూర్తి
గుడిఁ జొచ్చి తొంటికై వడిన యున్నెడను-
నందఱు నతివిస్మయాక్రాంతు లగుచు
నిందుమౌళియ కాక యితఁడు మర్త్యుండె ?
యెన్నఁడే గుడికడ నీతపస్వీంద్రుఁ
గన్నవా రెవ్వరుఁ గల రయ్య ! తొల్లి ;
బసవండు తన కెంత భక్తుఁడో కాక
యెసకంబుతో సంగమేశుండు దాన
వచ్చి తాపసిక్రియ మెచ్చి బోధించి
చొచ్చె నగ్గుడియ తా నెచ్చటో యణఁగె ;
అతికృతకృత్యుల మౌదుమే యిట్లు
స్తుతియింపఁ గనుఁగొనఁ జొప్పడె నేఁడు ;

బాపురా! మాయన్న! బసవకుమార!
బాపురా! మాతండ్రి! భక్తివర్ధనుఁడ!
నల్లవో! బసవన్న! నందీశమూర్తి!
నల్లవో! బసవయ్య! ముల్లోకవంద్య!
ఇట్టుండవలవదా పుట్టినఫలము
యెట్టును నున్నార మే మేమికొఱయుఁ?
దసయు నొప్పించి వస్త్రము సమర్పించి
వనిత నియోగించి జనకునిఁ ద్రుంచి
పడసి రాద్యులు దొల్లి బసవఁ డి ట్లిపుడు
పడయునే శివుకృప బట్టక బయల"
అని యెల్లవారును సంకింపుచుండ
సనురాగచిత్తుఁడై యాబసవయ్య
కూడలి సంగయ్య గుడిమంటపమునఁ
గూడి భక్తావలి గొలు విచ్చియుండ
సారాంచితోక్తుల సంస్తుతింపుచును
బూరితంబుగ నాదపూజ సేయుచును
మూఁడుసంధ్యల గురుమూర్తిఁ గొల్చుచును
బోఁడిగాఁ బ్రొద్దులు పుచ్చుచునుండె.
బసవపురాణార్ణవపరిచయస్ఫీత!
బసవపురాణార్థపరిమళాఘ్రాత!
బసవనామావళీ పరమానురక్త!
బసవనామావళీ పాఠకాసక్త!
బసవపాదాంభోజ పరిమళభృంగ!
బసవపాదాంభోజభరితోత్తమాంగ!
బసవకారుణ్యసౌభాగ్యైకపాత్ర!
బసవకారుణ్యసంపత్కళామాత్ర!
బసవసన్నిహిత సద్భక్తాత్మసఖ్య!
బసవసన్నిహిత సద్భావసంగాఖ్య!
ఇది యసంఖ్యాతమాహేశ్వరదివ్య
పదపద్మసౌరభ భ్రమరాయమాణ

జంగమలింగప్రసాదోపభోగ
సంగత సుఖసుధాశరధినిమగ్న
సుకృతాత్మ పాలకురికి సోమనాథ
సుకవిప్రణీత మై శోభిల్లి తనరి
చరలింగ ఘన కరస్థలి విశ్వనాథ
వర కృపాంచితకవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చను బసవపురాణ మనుకథయందు
ననుపమంబుగఁ బ్రథమాశ్వాస మయ్యె. 1268

ద్వితీయాశ్వాసము

శ్రీలింగమథనవిలోలకేలీవి
శాలసౌఖ్యానంద ! సంగయామాత్య !
అక్కడ నంతఁ గళ్యాణంబునందు
నెక్కుడు శివభక్తి కెల్లయై పరఁగు
బండారి బలదేవదండనాయకుఁడు
దండి బసవనికిఁ దనయ నిచ్చుటయుఁ
బ్రమథు లెంతయు మెచ్చిరాఁ బంపఁబోవు
క్రమమునఁ బ్రమథలోకమున కేఁగుడును
బలదేవమంత్రియాప్తుల బంధుజనులఁ
బిలువంగఁ బంచి యాబిజ్జలుం డనియె :

—: బసవేశ్వరునకు బిజ్జలుఁడు దండనాయకపద మిచ్చుట :—

"ఇతని తోఁబుట్టువు సుతుఁ డెవ్వఁడేని
నితనినియోగంబు ప్రతిదాల్పఁ గలఁడె ?"
అనవుడు "కలఁడు మహారాజ ! యతని
తనయప్రాణేశుండు వినయోక్తిపరుఁడు ;
నీరాజ్యమంతయు నిలుపంగఁ గలఁడు ;
దూరీకృతాఘుండు దోర్బలాధికుఁడు
విను మఖిలకళాప్రవీణుఁ డెట్లనిన :
జనులెల్ల నెఱుఁగఁగ సంగమేశ్వరుని
చేఁ బ్రసన్నత వడసెను గాన నీకుఁ
దాఁ బ్రధానిగఁ దగు ధరణీశ !'' యనిన
నిజ్జగం బింతయు నేలినకంటె
బిజ్జలుఁ డెంతయుఁ బ్రీతాత్ముఁ డగుచుఁ
దనవీటఁ దగినప్రధానుల హితులఁ
దనయెక్కు భద్రేభమును నమాత్యులను

బసవనిఁ దోడ్తేరఁ బంచుఁడు, వారు
నెసకంబుతో సంగమేశ్వరం బేఁగి
యక్కడ బసవని నసమానుఁ గాంచి
చక్కఁ జాఁగిలి మ్రొక్కి సరణి ని ట్లనిరి :
"నాకోపభోగాపునర్భవాదులును
నీ కొకలెక్కయే నిజ మట్లకాక !
శివభక్తిసారానుభవభవ్యసుఖికి
నవశంబ కాక రుచ్యములె యిన్నియును ?
నైనను లోకహితార్థుండ వీవు
కాన మాప్రార్థనఁ గైకొనవలయు ;
బిజ్జలక్షోణీశు ప్రియము సల్పినను
నిజ్జగతీతలం బేలవే చెపుమ !
మంత్రిపట్టమునకు, మండలంబునకుఁ,
దంత్రంబునకు, నిజాప్తమునకు, మూల
భండారమునకు భూపతిరాజ్యమునకు
నొండేమి నీవ కా కొడయ లున్నారె ?
యతఁడు పట్టెఁడుకూటి కర్తుండ కాని
క్షితికెల్ల నీవచూ పతివి నిక్కంబు
విచ్చేయు" మని యిట్లు విన్నవించుడును
నచ్చోట భక్తహితార్థంబు దలఁచి
యందఱుఁ గొల్వంగ "నట్లకా" కనుచుఁ
గందర్పహరుభక్తగణముల నెల్లఁ
గొలిచి తత్కారుణ్యజలరాశిఁ దేలి
యలరుచుఁ జనుదేర నంత నిక్కడను

—: బసవేశ్వరుఁడు కళ్యాణకటకము చేరుట :—

"నదెవచ్చె నిదె వచ్చె" నన విని ముదిత
హృదయుఁ డై బిజ్జలుఁ డెదురుకొ న్వేడ్క
నలవడఁ బదియురెండామడ నేల
గలయఁగఁ గళ్యాణకటక మంతయును

శ్రీరమ్యముగ నలంకారింపఁ బంచి,
భూరమణుండు శృంగారంబు సేసి,
మండలాధీశ సామంత ప్రధాన
దండాధినాథమాతంగతురంగ
పరివారసహితుఁడై పరమహర్షమున
నరుదెంచి పదహతి ధరణి గ్రక్కదల
వివిధవాద్యధ్వనుల్ దివి దీటుకొనఁగ
నవనీతలేశుఁ డల్లంతటఁ గాంచె
బసవకుమారు; సద్భక్తిశృంగారు
నసదృశాకారుఁ దత్త్వార్థవిచారు
నేకాంగవీరు దేహేంద్రియదూరు
లోకనిస్తారు నలోకానుసారు
జంగమవ్యాపారు సజ్జనాధారు
లింగగంభీరు గతాంగవికారు
విమలశివాచారుఁ ద్రిమలధిక్కారు
నమితమహాచారు నచలితధీరు
విరహితసంసారు వీరావతారుఁ
బరిహృతాహంకారు భక్తివిహారు
శివభక్తిసారు విశిష్టప్రకారు
నవినాశసంస్కారు నతులితశూరు
విపులక్షమాగారు వినయప్రచారు
సుపథైకవిస్తారు శుద్ధశరీరుఁ
గుజనవిదారు సద్గుణమణిహారు
వృజినతరుకుఠారు విహితోపకారు
నతిదయలంకారు నఘసముత్సారు
హితహృద్గతోంకారు నతసముద్ధారు
శ్రుతిపరిచారు నిర్మోహాంధకారుఁ
గృతరిపుసంహారు ధృతనయాచారుఁ
జారునిర్మలకీర్తి సత్యప్రపూర్తి

సారసద్గుణవర్తి శాశ్వతమూర్తిఁ
గని, పాదచారి యై చనుదెంచి, చేరి,
ఘనతరప్రియపూర్వకంబుగ నపుడు
సముచితసత్కారసంతుష్టుఁ జేసి,
సమదాంధగంధగజంబు లేన్నూఱు
పంద్రెండువేలు శుంభత్తురంగములు
పంద్రెండులక్షలు బలవత్పదాతి
పాటి బండారులు పన్నిద్ద ఱందు,
మేటితనంబు నర్మిలి నిచ్చి, తనదు
నఖిల రాజ్యమునకు నర్హుఁగాఁ జేసి,
సుఖలీల బిజ్జలక్షోణీశ్వరుండు
దానును బసవదండనాయకుఁడు
నా నియోగము గొల్వ నరుదెంచుచుండ—*
జగతీతలేశుండు నగరోపకంఠ
మగుడు నాబసవయ్య నర్థిఁ దోడ్కొనుచుఁ
బరిమితభటమంత్రిపరివృతుం డగుచు
నరుదెంచి భవనాశ్ర యాభ్యంతరమున
మున్నున్నమంత్రులు పన్నిద్దఱకును
[1] గన్నాకుగాఁ బెద్దగద్దియ నునిచి,
వరవస్త్రభూషణోత్కరము లర్పించి,
యరుదొంద బసవయ్య కాతఁ డిట్లనియె :
“సకలసామ్రాజ్యపూజ్యస్థితి కెల్లఁ
బ్రకటింపఁగా నీవ పతి, వట్లుఁ గాక
నాయర్థమునకుఁ బ్రాణమునకుఁ బతివి ;
వేయును నేల ? నీవే నేను బసవ !
నిన్ను నమ్మితి” నంచు నెయ్య మెలర్ప
మన్నన బిజ్జలక్ష్మాధీశుఁ డనిన—

ఇట్టి గుర్తులు పెట్టినచోట గ్రంథసంక్షేపణార్థము కొన్నిద్విపదలు వదలఁబడినవని తెలియనగును. 1. మిన్నగా.

"సకలలోకైకరక్షకుఁ డగుశివున
కాక నిన్ను రక్షించుటకు నెంతపెద్ద ?
కావున మాలింగదేవుభక్తులకు
నేవేళ వెఱచుండు మింతియె చాలు ;
నీరాజ్య మేలించు టిది యెంతపెద్ద
నీరధి మేరగా నిన్ను నేలింతు—"
నని యూఱడిల బసవసదండనాథుఁ
డనుకూలుఁ డై పల్కి నంత బిజ్జలుఁడు
మఱియుఁ గట్టఁగ నిచ్చి మాహసీయలీలఁ
గొఱలుసెయ్యమున వీడ్కొలిపె ; వీడ్కొలుపఁ
గా బసవఁడు భక్తగణములుఁ దాను
నాబలదేవనాయకుని నగళ్ల
తనకు నిజాలయస్థాన మై యుండఁ
దననియోగము గొల్వఁ దాఁ జనుదెంచి,
లాలితలింగకేళీలసన్మతిని
లీలానుకూల సచ్ఛీలసంపదల
ననుదినవర్ధమానైశ్వర్యుఁ డగుచు
జనపతి రాజ్యంబుఁ జక్కవెట్టుచును
దెసలెల్ల సత్కీర్తిఁ బసరింపుచున్న
బసవనిపూనిక బాస యె ట్లన్న:

—: బసవేశ్వరుని బాస :—

శివరాత్రి నిత్యంబు చెల్లించుబాస,
శివభక్తు లెల్లను శివుఁ డనుబాస,
భక్తుల యెగ్గులు పట్టనిబాస,
భక్తులకుల మెత్తిపలుకనిబాస,
మృడు నైన నొకమఱి యడుగనిబాస,
యడిగిన యర్థంబు గడపనిబాస,
చీమంతయైన వంచింపనిబాస,
యేమి వేఁడిన నడుగిడ కిచ్చుబాస,

పలుకట్ల నడవడిఁ బాలించు బాస,
తలఁ బెట్టు లట్టుల పలికెడుబాస,
పలికి బొంకనిబాస వొలివోనిబాస,
చల మెడపనిబాస సలిపెడిబాస,
తప్పఁ ద్రొక్కనిబాస దరలనిబాస,
యెప్పుడు భృత్యత్వ మెడపనిబాస,
కలనైన శివునకు గెలు పీనిబాస,
గెలుపు భక్తుల కిచ్చి కీడ్పడుబాస,
పరసతిపై దృష్టి వఱపనిబాస,
పరధనంబుల కాసపడ కుండుబాస,
పరనింద నెయ్యెడఁ బొరయనిబాస,
పరమర్మకర్మముల్ వలుకనిబాస,
పరసమయంబులఁ బరిమార్చుబాస,
పరవాదులను బట్టి భంజించుబాస,
హరదూషణకుఁ జెవు లాననిబాస,
హరగణానర్పితం బంటనిబాస,
హరగణపరతంత్రుఁ డై యుండుబాస,
హరభక్తు లెట్లన్న నట్లను బాస,
జంగమంబును బ్రాణలింగ మన్బాస,
వెంగలిమనుజుల వేఁడనిబాస,
భవికి మ్రొక్కనిబాస భవి కీనిబాస,
భవబాధలకు నగపడకుండు బాస,
విషయేంద్రియములకు వెన్నీనిబాస,
విషమషడ్వర్గంబు విరియించుబాస,
వేదోక్తభక్తి సంపాదించుబాస,
యాది శివాచార మలరించుబాస,
శిర మట్టఁబాసిన శర ణనుబాస,
శిరమున కట్టవాసిన మ్రొక్కుబాస,
ముట్టినచో వెన్క మెట్టనిబాస,

యిట్టివన్నియుఁ దుదముట్టించుబాస—
బసవనిచరితంబు బసవఁడే యెఱుఁగు
వసమె యెవ్వరికైన వాక్రువ్వఁ దలఁప ?
ధీరంబుకట్ట గంభీరంబుతిట్ట
సారార్థములప్రోక జ్ఞానాగ్ని కాఁక
ప్రతినలగుడ్డ విశ్రుతభక్తిగడ్డ
వ్రతములపంట వైరాగ్యంబుపెంట
సత్యంబుకలను ప్రసాదంబుకొలను
కృత్యంబుతాఁప యకృత్యాబ్ధితేఁప
వేదాంతములపాటి విద్యలమేటి
నాదంబుక్రోలు సమ్మోదంబుకీలు
శాంతతనెలవు యీశ్వరుకట్టినలవు
దాంతతకలిమి నిత్యత్వంబుబలిమి
వినయంబుతేట వివేకంబుకోట
యనురక్తియిల్లు నుదాత్తతవెల్లు
తత్త్వంబుతీఁగ మహత్త్వంబుచేఁగ
సత్త్వంబువెన్ను నాస్థానంబుచెన్ను

—: బసవేశ్వరుని దర్శింప శివభక్తు లరుదెంచుట :—

బసవఁడు కేవలభక్తుండె? యనుచు
వసిగొని లోకముల్ వర్ణనసేయ
నొక్కొక్కనియమంబు నిక్కంబు గాఁగఁ
జక్కన దర్శింపఁ జనుదెంచువారు,
చేకొన్నవ్రతములు చెల్లించువారు,
ప్రాకటవ్రతబుద్ధిఁ బఱతెంచువారు,
"ఖ్యాతుఁడో భక్తిసమేతుఁడో యరసి
చూతముగాక !" యంచును వచ్చువారు,
"బసవనిచేఁ బూజ వడయుద" మనుచు
నెసకంబు దళుకొత్త నేతెంచువారు,

"నతనిఁ జూచినఁ జాలు నభవునిభక్తి
యతిశయం బగు" నని యరుదెంచువారు,
బసవతీర్థం బేఁగు1 పరస యనంగ
వసిగొని యిలఁ గిక్కిఱిసి వచ్చువారు—*
ఖండేందుధరభక్తగణము లిబ్బంగిఁ
దండతండంబులు దా రేఁగుదేర,
విలసితమృగమదకలితమార్గముల
వెలుఁగుముక్తాఫలంబుల ముగ్గు లమర
ముకురపల్లవమణిముక్తాఫలాది
మకరతోరణములనికరంబు లలర
ఖ్యాతిగా వృషభసమేత మై యొప్పు
కేతనానీకముల్ గిక్కిఱియంగ
నాతతవ్యాసహస్తాకృతి నున్న
వాతపూరణములు వడిఁ గాలియాడ
నుడువీథిఁ గప్పి సమున్నతలీల
నడపందిరులు వెలిగొడుగులుఁ దనరఁ
దతవితతాదివాద్యంబులు మోయ
నతిశయంబుగ విన్కు లంతంత నమరఁ
బాయక "చాఁగుబళా!" యనుశబ్ద
మాయతి నాకస మంది ఘూర్ణిల్లఁ
బ్రతిదినంబును భక్త బండారిబసవఁ
డతిభక్తిరతి మతి నంకురింపఁగను
శ్వాశతఘనలింగసంపద మెఱసి
యీశ్వరభక్తుల ని ట్లెదుర్కొనుచు—

—: బసవేశ్వరుని శివాచారనిరతి :—

మంగళహర్షోదితాంగవిక్రియల
సంగతి నాత్మ నుప్పొంగి యుప్పొంగి
భయభక్తియుక్తిఁ దద్భక్తాంఘ్రిచయము
పయిఁ జక్కఁ జాఁగిలఁబడి మ్రొక్కి మ్రొక్కి,

1. యాత్రిక సమూహము.

పటుతరసద్భక్తపాదాబ్జరేణు
పటలపర్యంకంబుపైఁ బొర్లి పొర్లి,
హరభక్తనికరదయామృతవృష్టి
పరిగొని కురియఁ దొప్పఁగఁ దోఁగి తోఁగి,
1 యొడయలదివ్యపాదోదకవార్ధి
నడునీటఁ గడువేడ్కఁబడి తేలి తేలి,
వరభక్తసందోహపరితోషితార్థ
పరమసపర్యసంపద వ్రాలి వ్రాలి,
మతిలింగజంగమోచితపరతత్త్వ
సతతశివార్చనారతి సోలిసోలి,
శరణనిర్మలనిత్యసత్యప్రసాద
వరసేవనక్రీడ వడిఁ గ్రాలి క్రాలి,
చారువచోవిలాసంబులఁ దనర
నోరార వారి సన్నుతిసేసి చేసి,*
నియమవ్రతాధికనిష్ఠితాత్మకులఁ
బ్రియవస్తుసమితి నర్చించి యర్చించి,
బసవఁ డీక్రమమున భక్తిసామ్రాజ్య
మెసకంబుతోఁ జేయునెడ లసత్ప్రీతి
"ముప్పూఁట నోగిరంబులుఁ బదార్థములుఁ
దప్పక కావళ్ల నెప్పుడుఁ బంప
వెండి వేశ్యలయిండ్ల నుండి భోగించు
మిండజంగములు పండ్రెండువే లనిన
నున్నజంగమసంఖ్య మున్ను రూపించి
యెన్నంగ శక్యమే యీశున కైన?"
ననుచు భక్తానీక మచ్చెరువంద
ననయంబు భూతిశాసను లాదిగాఁగ
నెల్లభక్తావళి కీప్సితార్థములు
సెల్లించుచును భక్తి సేయుచున్నెడను;

1. ఒడయలు = మాహేశ్వరులు.

—: బసవనిమేనల్లుఁడు చెన్నబసవని మహిమ :—

బరమేశభక్తియ ప్రాణమై పరఁగు
తరుణి యానాగాంబవరతనూభవుఁడు,
ప్రస్తుతింపఁగ నొప్పుబసవకారుణ్య
హస్తసంభూతప్రశస్తదేహుండు,
నసదృశభక్తియోగాత్ముండు చెన్న
బసవండు గురుభక్తిపాత్రోత్తముండు ;*
"బసవని శ్రీపాదబిసరుహంబులకు
నసలార నిత్యంబు నర్చ లిచ్చుచును
మించినభక్తిమై మేన రోమాంచ
కంచుకం బధికసమించితంబుగను
గద్గదకంఠుఁడై కనుఁగవ నుఖస
ముద్గతాశ్రువు లొల్క నుత్సుకలీల
సప్రాణలింగలింగప్రాణమథన
సుప్రసన్నానుభవప్రాప్తిఁ బొంది,
నలిగొన 1మర్కటన్యాయంబునందు
ఫలమునఁ బొంది సోపానంబులు డిగి
వెసఁ బొందఁగలుగు 2వాయసఫలన్యాయ
మసలారఁగాఁ జరితార్థతఁ బొంది,
గురుభక్తిఫలసారగుహ్యప్రసాద
వరసేవనాసుఖపరవశలీలఁ
గమనీయమొంద లింగంబు ప్రాణంబు
రమణఁ బ్రసాదపూరంబు దేహంబు
దిరమగుశుద్ధభక్తియు మానసంబు
హరగణానుభవసౌఖ్యంబు ధనంబు
నిటు గూడ నన్నియు నేకమై కాదె

1. బయటినిరోధ మెంతయున్నను సరకుకొనక కోఁతి తనకు దొరికిన వస్తువును గట్టిగా బట్టికొని విడువకుండుట. 2. కాకి తనకు దొరికిన పండునందలి సారమును గ్రోలినవెంటనే దానిని విడిచిపెట్టుట.

పటుతరంబుగఁ జెన్నబసవఁడై పేర్చె !
భవ్యలింగమున కేర్పడఁ బ్రాణ మగుచు
నవ్యప్రసాదంబునకు రుచి యగుచు
జంగమభక్తి కాశ్రయపదం బగుచు
మంగళప్రాప్తికి మందిరం బగుచు
గుఱిగా కవాఙ్మనోగోచరం బగుచు
వఱలెడు శివతత్త్వవల్లభుమహిమ
బిలిబిలితలఁపులవలన వర్తిల్లి
మొలచిన తమతమకొలఁదిమాటలను
వినుతించుటెల్లను వెలితియ కాదె
పనుగొన నాచెన్నబసవన్న నెలవు !
కావున బసవండె గణుతింప నెఱుఁగు
భావింప నాచెన్నబసవన్నమహిమ ;
బసవనిమహిమయు భాతిగాఁ జెన్న
బసవండె యెఱుఁగుఁ బెంపెసఁగఁ గుర్తింప ; "
నంచు భక్తానీక మచ్చెరువంద
నంచితభక్తిసమగ్రత మెఱసి,

—: చెన్నబసవన బసవేశ్వరుని స్తుతించుట :—

"శాశ్వత! సర్వజ్ఞ! శశ్వద్గుణాంక !
విశ్వేశ! శ్రీగురవే నమో" యనుచు
"సద్యః ప్రసన్నానవద్యవేదాంత
వేద్యాత్మ! శ్రీగురవే నమో" యనుచు
"దత్తకైవల్య ! యుదాత్తసద్భక్తి
విత్తేశ ! శ్రీగురవే నమో" యనుచు
"నమిత పరంజ్యోతిరాకార దివ్య
విమలాంగ ! శ్రీగురవే నమో" యనుచు
"స్థిరతరసృష్టిస్థితిలయప్రపంచ
విరహిత ! శ్రీగురవే నమో" యనుచు
"సకళ నిష్కళ చరాచరరూపవిగత

వికృతాంగ ! శ్రీగురవే నమో" యనుచు
"నాద్యంతరహితనిత్యామలతేజ !
విద్యాత్మ ! శ్రీగురవే నమో" యనుచు
"నధ్వషట్కాతీత ! యతిపాతకౌఘ
విధ్వంస ! శ్రీగురవే నమో" యనుచు
"మోక్షార్థిరక్షణదక్షకటాక్ష
వీక్షణ ! శ్రీగురవే నమో" యనుచు
"నజ్ఞానతిమిరసంహారార్థదత్త
విజ్ఞాన ! శ్రీగురవే నమో" యనుచు
"ధన్యాత్మశిష్యమస్తకకృపాహస్త
విన్యాస ! శ్రీగురవే నమో" యనుచు
నఘహరణార్థశిష్యజనోపభుక్త
విఘనస ! శ్రీగురవే నమో" యనుచు
నశ్రాంతభక్తజనాత్మాంబుజాత
విశ్రాంత ! శ్రీగురవే నమో" యనుచు
ననఘ గురుప్రసాదామృతహృదయ
వినివాస ! శ్రీగురవే నమో" యనుచు
ఘార్జిల్ల నాచెన్నబసవఁ డబ్బసవ
రాజును దనగురుఁ బ్రస్తుతిసేయ—

—: అల్లమ ప్రభుని రాక :—

నంత నల్లమప్రభు వనుసంయమీశుఁ
డంతకాంతకమూర్తి, యతులితకీర్తి,*
ద్వైతయోగ క్రియాద్వైతయోగక్రి
యాతీతయోగక్రియాన్వితుఁ డనఁగ
ముల్లోకములఁ దేటతెల్లయై, భక్తి
కెల్లయై, స్వేచ్ఛాపిహీనకృత్యమున
లీలఁ గరస్థలలింగవిన్యస్త
లోలేక్షణానందకేళిఁ దన్మఱచి
యిది యేఱు వల్లంబు నిదిసెట్టు గట్టు

నిది వెఱ్వడవి యని మదిఁ దలంపుడిగి
యరుదేఱ నన్నియు నంతంతఁ దొలఁగి
తెరు విచ్చుటకు నరు లరు దని పొగడ
బసవని యసమవిభ్రాజితభక్తి
రసవార్ధి వెల్లివిరిసి నిట్టవొడువ
వచ్చెఁ దద్వీచిప్రవర్తితం బగుచు
వచ్చువహిత్రంబువడువును బోలె ;
నిచ్చ రత్నపరీక్ష యెఱిఁగి చేవట్టు
బచ్చనుబోలె నబ్బసవయ్యప్రభువు
భావంబు సంగయ దేవునియంద
భావనఁ బొరయుడు భక్తిమై మ్రొక్క
రుచిరరత్నప్రభానిచితమై యున్న
యచలితస్వర్ణసింహాసనం బెక్కి
ప్రభు వున్న, సంగప్రభాపటలంబు
లభినుతిఁ బొందె దిశాంతరాళముల ;
నొడల జీవము గల్గియును లేనివాని
నడగల్గియును వర్తనము లేనివానిఁ
గన్నులు వ్రేఁగులుగాఁ గలవాని
మున్ను లింగమ ప్రాణముగ నున్నవానిఁ
జేతనుం డయ్యు నిశ్చేష్టలవాని
ఖ్యాతి లేకయు నుతిఁ గడచన్న వానిఁ
బలుకుల మీఱిన బాసలవానిఁ
దలఁపుదలదాఁటిన తత్త్వంబువాని
గుణహీనుఁ డయ్యును గుణమిచ్చువానిఁ
బ్రణవాత్ముఁ డయ్యు నేర్పడియుండువానిఁ
గని, శరణనుచు గద్గదకంఠుఁ డగుచుఁ
గనుఁగవ హర్షాశ్రుకణములు దొరుగ
బసవఁ డల్లంతటఁ బ్రణమితుం డగుచు
నసలార సముచితాభ్యర్చితుఁ జేసి

లింగతూర్యములు సెలంగ నుప్పొంగి
మంగళారతు లెత్తె; మహిఁ దక్షిణంబ

—: అల్లమప్రభునికి విందుపెట్టుట :—

పళ్లెరం బిడి, పంచభక్ష్యాన్నములును
నెల్లపదార్థముల్ మొల్లంబు గాఁగ
వడ్డించి, యబ్బసవం డర్థి దొడ్డ
దొడ్డకళ్లగఁ జేసి తొడిఁదొడిఁ బట్టి
హరునకు దొల్లి యా సురియచౌడరసు
కరమర్థి నందిచ్చుకరణియుఁ బోలె
నందిచ్చుచుండంగ నర్థిఁ జేసేత
నందికొంచును బ్రభు వారగింపంగఁ
బంబి లక్షయు నెనుబదివేలు జంగ
మంబుల కనుచు సమగ్రత దనర
నటమున్న చేసినయప్పదార్థంబు
లిటుగూడ సమయుడు నెట్లొకో యనక
యేనకా కోగిరం బింక నీ కనుచుఁ
బూని యూఁకింపఁ బ్రభువు మెచ్చి యంతఁ
"గో"యని భక్తునికాయంబు వొగడ
"హో" యని సత్కృపాయుక్తి వొల్పార
"బాపురే! బసవ! సద్భక్తసంత్రాణ!
బాపురే! బసవ! సద్భక్తిధురీణ!
నల్లవో! బసవ! యనశ్వరకీర్తి!
నల్లవో! బసవన్న! నందీశమూర్తి!
అమృతంబునందు దివ్యం బగుచేగ
విమలమాణిక్యగర్భమున దీపంబు
చెఱకునఁ బండు వసిఁడిఁ గమ్మఁదనము
గొఱయైనమలయజకుజమునఁ బూవు
చిత్తరువునకును జీవంబుఁ బసిఁడి
పుత్తళికిని బ్రాణమును నిక్కువముగఁ

బుట్టినయట్టుగాఁ బుట్టితి కొడుక !
నెట్టణ భక్తికి నిలుకడ యగుచు*
బసవయ్య ! బసవన్న ! బసవకుమార !
బసవ ! బసవరాజ ! బసవలింగంబ !
వడిఁ బాలుజలమున కొడలెల్ల గాళ్లు ;
వడిఁ గాలుచిచ్చున కొడలెల్ల నోళ్లు ;
వడి వీచుగాడ్పున కొడలెల్లఁ దలలు ;
వడిఁ జేయుబసవ ! నీ కొడలెల్ల భక్తి !
'బసవా' యనఁగ విన్నఁ బాన లొం డేల ?
పసులకు నైనను బ్రబలదే భక్తి !
'బసవా' యనఁగ విన్నఁ బాన లొం డేల ?
పసిబాలురకు నైన నెసఁగదే భక్తి !
"బసవా" యనఁగ విన్నఁ బాన లొం డేల ?
యసమాక్షునకు నైన నలరదే భక్తి ! *
లింగైక్యసౌఖ్యకేళీలోలభక్తి
జంగమప్రాణానుసంధానశక్తి
యుభయప్రసాదసంయోగోపభుక్తి
త్రిభువనంబుల నున్నదే యితరులకు ?"
నని పెక్కుభంగుల నగ్గింపుచుండ
ననుషక్తి నా బసవనకుమారుండు
మిక్కిలిసద్భక్తి మిక్కుటంబుగను
మ్రొక్కుచు నందంద మోర్పుఁగే లమర
''భక్తవత్సల ! పరాపర ! పరమాత్మ !
ముక్తివల్లభ ! దివ్యమూర్తి ! సర్వజ్ఞ !
ప్రభువ ! జంగమలింగ ! ప్రమథాగ్రగణ్య !
ప్రభువ ! సంగయదేవ ! పరమానురాగ !
కారుణ్యనిధి ! సమగ్రత సూపి నీకు
నారగింపఁగఁ బుట్టునంత భక్తుఁడనె ?*
అట్టిపార్వతియు ము న్నారగింపంగఁ

బెట్టఁ జాలదు విందు విన్నపావనికి*
సర్వకల్యాణ ! సంసారవిదూర !
సర్వజ్ఞ ! జియ్య ! సాక్షాత్సంగమేశ !
నెట్టణ నిష్టించి నీ కారగింపఁ
బెట్ట నాశక్యమే ? పృథుదయాభావ !

—: అల్లమప్రభువు బసవనికి వరము లిచ్చుట :—

యనుచుఁ బ్రశంసింప నల్లమ మెచ్చి
వినుతదయామృతవనధి నోలార్చి,
''సురభి చింతామణి సురభూరుహములు
పరవు లై యుండంగ పరమీగి యెంత
పెద్ద నా'' కనుచు సంప్రీతి సిత్తమునఁ
దద్ద సంధిలఁ బ్రసాదము గృపసేసి,
తలఁచిన పదపదార్థములు సేకూడ
వలె నన్న వస్తువు లిలఁ దాన పొందఁ
బలికిన బాసయుఁ బాటియై తనర
నిలిచినమార్గంబు నిలుకడ గాఁగఁ
బట్టినపద దైన బసిఁడియై వెలుఁగ
ముట్టినబయలైన మూర్తి సేకొనఁగఁ
పెఱిలినశివు నైన వెఱవక గెలువఁ
దఱిమినజంగమధట్టన కోర్వఁ
జాలు నక్షయలింగసంపద లిచ్చి
లీలఁ దత్త్వార్థసమ్మేళనం బొలయ
మోహమాయాదితమోరాశిఁ ద్రుంచి
దేహేంద్రియాది విద్వేషం బడంచి
మున్ను దత్త్వస్థితిఁ దన్నుఁ దానెఱిఁగి
తన్నును సత్క్రియోదాత్తతఁగూర్చి
లీన మై ప్రాణంబు లింగమం దొలయఁ
గా నాథుఁ డాప్రాణలీన మై యుండఁ
గా నిరంతరపరమానందసుఖము

నూనిన శివభక్తియుక్తిమార్గమున
వడి "దివారాత్రౌచ వర్జయే" త్తనఁగఁ
బడు సదాంతర్యోగభాతి గై కొలిపి,
ఘనబహిరంగ శృంగారాంతరంగ
వినుత ప్రమథస సంవిత్సుఖలీల
దివ్యానుభవవార్ధిఁ దేల్చి నబ్బసవఁ
డవ్యయశివతత్త్వ మనువు నెఱింగి,
యుప్పుముల్లియ నీర నుంచినయట్లు
గప్పురంబున నగ్గిఁ గప్పినయట్లు
వడగళ్లవర్షంబు వారాశిఁ గురియు
వడువునఁ దా లేక వర్తింపుచుండెఁ.
బ్రభువు చరిత్రంబు భక్తిమై భక్త
సభలందుఁ జదివిన సంప్రీతి విన్న
సరస సమంచిత సచ్చిదానంద
సురుచిరలింగైక్యసుఖము పట్టిల్లు.

—: వంగకాయలు లింగములైన కథ :—

వెండియు నొకనాఁడు దండనాయకుఁ డ
ఖండితభక్తివికస్వరలీల
జంగమార్చన సేయుసమయంబునందు
దొంగలు బందివెట్టంగ నూహించి,
'లింగవంతులు గాని [1]లెంగుల కతని
యంగణాంతరమున కరుగరా' దనుచు
వంగకాయలు గట్టుకొంగులఁ బొదివి,
లింగసన్నిహితులభంగి వర్తిల్లఁ
గని భయంపడి మ్రొక్కఁ, గన్నుల నవ్వి
"లింగవంతులు గానిలెంగుల కీశ్వ
రాంగణంబున కెట్టు లరుదేర వచ్చు

1. లెంగులు = నీచులు.

నింక భక్తుల కాక యీశ్వరార్చనలు
కొంకక చేయుఁడు గూర్చుండుఁ" డనిన
నుల్లముల్ గలఁగ నొండొరులఁ జూచుచును
జల్లన గుండె దిగుల్లన నవయ
భావించి "మన మెట్టు బందిఁ జిక్కితిమి
దేవర గలిగెనా చావు దప్పెడిని
మన కింక నెమ్మయి మగిడిపోఁ బోల"
దని కృతనిశ్చయులై కూరుచుండి
సరసర మును లింగసహితులపోలెఁ
గరములు సాఁచుడుఁ గట్టుకొంగులను
భంగి నాబసవయ్య భావసంగతిని
వంగకాయలు ప్రాణలింగంబులయ్యె.

—: జొన్నలు ముత్తెములైన కథ :—

మఱియును నొక జంగమం బేఁగుదెంచి
యఱిముఱి నభ్యంజనావసరమున
"నిత్యనేమం బిది నేఁటిముగ్గునకు
ముత్యాలపొడి మాకు 1ముక్కఁస వలయుఁ
గదలక మెదల కీక్షణమాత్రలోనఁ
బదిపుట్లముత్యముల్ బసవ ! యి" మ్మనిన
సరసర లింగపసాయితశస్త్ర
కరతలుఁ డై చూడఁ గనుదృష్టి నున్న
జొన్నల ప్రోఁక విశుద్ధముక్తాఫ
లోన్నతరాశి యై యున్న నవ్వుచును
"సన్నుత ! పదిపుట్లసంఖ్య మీ కేల ?
యెన్ని మీవలసిన వన్ని గైకొనుఁడు"
అనవుఁడు "నట్లకా" కనుచు ముత్యములు
గొనిపోయెఁ 2 బెఱికల దనర నన్నియును.
బసవని దృష్టి సంస్పర్శనంబునన

1. మూఁడు కంచములు. 2. గోనెసంచులు.

యెసఁగు జొన్నలప్రోఁక యిందఱుఁ జూడఁ
బొనరుచు ముత్యాలప్రోఁకయై తనరె."
నని భక్తమండలి వినుతింపుచుండఁ

—: సంగమేశ్వరుఁడు బసవని మూఁడవ కన్నడుగు కథ :—

జెచ్చెర మఱియు నీప్సితవస్తువితతి
నెచ్చుగా బసవఁ డిట్లిచ్చుటఁ జూచి
"వేడు కయ్యెడు నాకు వేఁడంగ" ననుచు
రూఢిగా జంగమరూపంబుఁ దాల్చి
చక్కన సంగమేశ్వరుఁడ యేతెంచి,
గ్రక్కున మూఁడవక న్నడ్గఁ దడవ
నాయతలింగ పసాయితహస్తుఁ
డై "యెఱుఁగనె నీదుమాయ నే" ననుచు
ముకురంబుఁజూపుచు "ముక్కన్ను నీకు
నకలంక ! సహజంబ యదెచూడు" మనిన
నద్దంబులోన ఫాలాక్షంబుఁ గాంచి
యద్దేవదేవుండు దద్ద లజ్జించి
యప్పు డక్కడన నిరాకార మగుడుఁ
జప్పరింపుచుఁ జూచి "చా! పంద ! పంద !
యోడకు మోడకు మోరోరి ! సంగ !
యోడకు మోడకు మొకటియు నొల్ల
నెఱుఁగవే సత్యమాహేశ్వరులిండ్ల
నెఱయంకకానిని నిజగతి నన్ను
దాసయ్యవలె నిన్నుఁ దవనిధి వేఁడ ;
నాసిరియాలున ట్లాత్మజుఁ గోరఁ ;
గనకవృష్టి యడుగఁ గరికాలునట్ల ;
వనితకు నెడవుచ్చు మన నంబిభాతి
వెండియుఁ గుమ్మరగుండయ్య కిచ్చు
మిండప్రాయంబుఁ గామింపఁ ; గాదేని
స్వర్గాపవర్గాది సౌఖ్యంబు లొల్ల ;

భర్గ ! నీప్రమథుల భక్తులయిండ్ల
నలరుచు డించిన యాప్రసాదంబె
కలదు భోగింపగాఁ గలకాల మెల్ల ;
సర్వభక్తాత్మ ! మీజలకంబువాఁడు
గుర్వుగా మాకాటకోటయ్యగారు ;
హర ! మీనగరిమాలకరి పుష్పదంతుఁ ;
డరిదిపూజారి కన్నప్పదేవయ్య ;
యిందెగట్టెడిది మా యిందెరేకవ్వ ;
ఖండదీపమువాఁడుగా నమినంది ;
నెట్టణ దీవించి నీకు విభూతిఁ
బెట్టెడువాఁడు మాపిళ్లనైనారు ;
అనుషక్తిమై గంధ మర్పించువాఁడు
మనసిజసంహర ! మాయణుమూర్తి ;
వరద ! మీధూపంబువాఁడు మాచయ్య ;
వరకీర్తి ! మీగంటవాఁ డోహిళయ్య ;
ధర మంగళారతుల్ దరిసించువాఁడు
వరద ! సోమయగారు శరణవత్సలుఁడు ;
వంటకట్టెలు దెచ్చువాఁడు మారయ్య ;
వంటింపఁ గరికాలు పడివెట్టువాఁడు ;
కఱకంఠ ! [1]యడబాల సిఱుతొండనంబి ;
మఱి బానసమునది మాసంగళవ్వ ;
కరికాలచోడు పళ్లెర మిడువాఁడు ;
గరగ కావటివాఁడు ఘనుఁడు హొన్నయ్య
రమణీయ మగు నోగిరంబుల పరిసె
నమువాఁడు సెన్నయ్య విమలదేహుండ !
యారగింపఁగఁ బెట్టునవసరంబులది
వీరచోడవగారు విశ్వైకవినుత !
అడపంబువాఁడు రేచయ మునుపాలు

---
1. వంటవాఁడు.

పడుప్రసాదులు బిబ్బబాచయ్యగారు ;
మృడుఁడ ! మానాట్యనమి త్తండి వైద్యుఁ ;
డడరంగఁ గల్లి దేవయ్య ! [1] వెండీఁడు ;
మలహర ! సామవేదులు పురోహితులు ;
వెలయఁ బౌరాణికుం డిల మాయిభట్టు ;
కోరి మీపరిహాసకులు గళియంబ
గారు ; నాగీశ నైనారు వారకుఁడు ;
శ్రీపతిపండితుల్ శివుఁడ ! మీ కవులు ;
నాపండితయ్యగా రనుఁగుఁబండితులు ;
నాదివీణెలవాఁడు మాదిరాజయ్య ;
నాదరసజ్ఞుఁడు నలి శంకరయ్య ;
కరణంబు గర్మసంహర ! కేశిరాజు ;
ధర జగదేవుండు దండనాయకుఁడు ;
గణనాథుఁ డిందుశేఖర ! మీ ప్రధాని ;
ప్రణుతించి చూడ మాప్రభువు మీప్రభువు
ఇఱవ త్తుఁడు గజసాహిణి యశ్వసాహి
యొఱపుగాఁ జేరమ యోగియొడయఁడు ;
అనఘ ! రామయ్య యేకాంతంబువాఁడు ;
నొసర బల్లహుఁడు గుంటెన, సఖి నంబి ;
శంకర ! నీబంటు శంకరదాసి ;
యంకంబువాఁడు నేజాధినాథుండు ;
లెంక దా మంచయ్య లీల మీనగరి ;
[2] సుంకీఁడు సుంకేశుబంకయ్యగారు ;
సురియఁ బట్టెడువాఁడు సురియచౌడయ్య ;
పౌరిఁ గులచ్చిరియారు భువి [3] హేళగీఁడు ;
హర ! నీకు బెజ్జమహాదేవి దాది ;
ధర రుద్రపశుపతి దా మంత్రివాది ;

బొమ్మలాడించువాఁడు. 2. సుంకము (పన్ను) వసూలుచేయువాఁడు. 3. కథలు చెప్పువాఁడు.

సువిధాని కక్కయ్య ! భువి జాలగాఁడు
శివరాత్రి సంగయ్య ; సెలి బోగతండె ;
దేవరదాసయ్య దేవ ! దాసీఁడు ;
భావింపఁ గిన్నరబ్రహ్మయ్య బచ్చు ;
మడివాలు మడివాలుమాచిదేవయ్య ;
కడమలనంబి నొప్పడ దివ్వెలాఁడు ;
తెల్లంబు గోడలు దీర్చెడువాఁడు
సల్లీల గోడలమల్లయ్యగారు ;
కుమ్మరి గుమ్మరగుండయ్యగారు ;
బొమ్మయ్య వేఁటకాఁ డిమ్మహిలోనఁ ;
గమ్మరమ్ములవాఁడు ఘనుఁ డిల్లహాళ ;
బొమ్మయ్య [1]గీలారి నెమ్మిఁ జండండు ;
మాయావి ! బల్లేశుమల్లయ్య గొట్టు
బోయీఁడు ; బాచయ్య ఘూరికొటారి ;
పాలువిదుకువాఁడు లీల వంకయ్య ;
పాలుగావంగ నేర్పరి గొడగూచి ;
కావున నీదు సకలనియోగంబు
మావార లై యుండ మన్మనోరమణ !
యేమిటఁ గొఱఁత ? నా కేమిటఁ గడమ ?
యేమైన నడుగు నీ కిచ్చెద నింకె
మానంబు వదలిన మదిఁ దల్లడిలిన
మానుగాఁ బ్రిమథులయాన ! నీయాన !
కాలకూటము గుత్తుకకు రాకమున్న
కాల్రిలుపురంబులు గాలకమున్న
గౌరివివాహంబు గా కటమున్న
యారనజాండంబు లలరకమున్న
తిరిగి మూర్తులు నెన్మిదియు లేకమున్న
భువి హరిబ్రహ్మలు పుట్టకమున్న

1. కీలారి = పసులకాపరి.

యటమున్న యటమున్న యటమున్న మున్న
యిట నీవు నాస్వామి ; నేను నీబంట ;
కఱకంఠ ! యిది యేమి గళవళించెదవు
పఱల నాచేతఁ బోవచ్చునే?” యనుచు
ననమాత్రతోడ మాఱంకమై గెలిచె
బసవఁ డుద్యద్భక్తిభాతిమై నిట్లు.

—: బసవఁడు గొల్లెతచల్లకడవఁ బడకుండఁ బట్టిన కథ :—

పెండియు నిర్మలాఖండితకీర్తి
దండనాథాగ్రగణ్యుండు పుణ్యుండు
సజ్జననుతుఁడు బసవఁ డొక్కనాఁడు
బిజ్జలుకొలువునఁ బ్రీతిఁ గూర్చుండి
“యోడకోడకు”మని యొకకడ వెత్తు
మాడికి బాహుయుగ్మముఁ జాఁపఁ దడవ
“నిసుమంత బూడిద నొసలఁ బూసినను
మసలక కొండంతమరు లెత్తె ననుట
తెల్లం” బనుచు రాజు మెల్లన నగుచుఁ
“జెల్లఁబో బసవయ్య ! శివమరుల్ గొంచె
బ్రమసితే తలకెక్కి భక్తిరసంబు
గుమతివై నిండినకొలువులోపలను
“నోహో” యనుచు “నోడకోడకు” మనుచు
బాహుయుగ్మము సాఁచిపట్టుటే” మనిన
“స్వగుణసంకీర్తన దగదు సేయంగఁ
దగదని యున్నను నగు సభ” యనుచుఁ
“త్రిపురారిగుడితూర్పుదెస నేఱునేలఁ
గపిలేశ్వరంబందుఁ దపసి యొక్కరుఁడు
ఆలింగమునకు నిత్యము నాఱువుట్ల
పాల మజ్జనమార్పఁ గాలువల్ గట్టి
వీదివీదుల వెల్లివిరియ నేనుఁగుల
పాదఘట్టనములఁ బంకంబు రేఁగ

నావీథిఁ జల్లఁ దా నమ్ముచుఁ గణఁకఁ
బోవుచోఁ గాళవ బోయిన దొనఁగఁ
గడురొంపిఁ గాలుజాఱుడుఁ జల్లకడప
పడఁ బోవ గొల్లెత "బసవరో" యనినఁ
బట్టితి నచ్చటఁ బడకుండఁ గడవఁ
జట్టన చేతులు సాఁచి యే" ననుచు
గొల్లెతరూపంబు గొల్లెతయిల్లు
గొల్లెత యున్న యిక్కువయుఁ జెప్పుటయు
రప్పించి గొల్లెత రాజు దా నడుగఁ
దప్పక బసవయ్య సెప్పినయట్ల
చెప్పుచు నొఱగినచేతి రొంపియును
నప్పుడు జాఱంగ నంటినకాలి
రొంపియుఁ జూపి, "యెఱుంగరె యితని
పెంపున కిది సెప్పఁ బెద్దయే ! తొల్లి

—: తిరుచిట్టంబలుని కథ :—

ప్రవిమలభక్తి విభ్రాజితలీల
భువి నఱువత్తాండి మువ్వురిలోన
శ్రీనీలయుఁడు దిరుచిట్టంబలుండు
నా నొక్కభక్తుఁ డనశ్వరకీర్తి
కరమర్థితో వర్ష కాలంబునందు
హరపూజనార్థమై య ట్లొక్కనాఁడు
చని పుష్పములు గోసికొని వచ్చునెడను
వననిధితీరంబునను గాలు జాఱి
పడి వడిఁ బుష్పముల్ వడకుండ భక్తుఁ
డడరుచుఁ "జిట్టంబలాధీశ ?" యనుచుఁ
బరముఁడు భక్తునిఁ బడకుండఁ బట్టు
పరుసున నసుఁ బట్టె బసవలింగంబు
వడి ; నట్టులును గాక వసుధేశ ! వినుము :
పుడమిని సొన్నలి పురవరంబునకుఁ

బోయినచోటఁ దత్పురి సుఖగోష్ఠి
నాయతభక్తసభాభ్యంతరమున
సిద్ధరామునిఁ జూచి శివభక్తవితతి
"సిద్ధుండ ! లోకప్రసిద్ధంబు గాఁగ
నభినవశ్రీగిరి యనఁగ నిప్పురము
నభినవలీల సొంపారఁ రచించి
యాపర్వతము మల్లికార్జునదేవు
నేపారఁ గొనివచ్చి యిచ్చట నిలిపి ;
ధ్రువముగా లక్షయుఁ దొంబదివేలు
శివలింగములను జెచ్చెరఁ బ్రతిష్ఠించి,
దానికిఁ దగఁగ మర్త్యములోనియన్న
పానముల్ ముట్టక భక్తిపెంపునను
సహజమకుటము నొసలికన్నుఁదనర
మహితయోగానందమహనీయలీల
మేనినీడయు భువి మెట్టినయజ్ఞ
గానఁగఁబడ దనఁగాఁ జరిపించును
నమితసమాధియోగాంతంబునందుఁ
బ్రమథలోకమునకుఁ బన్నుగా నేఁగి
యక్కడఁ దత్త్వరహస్యసద్గోష్ఠి
మక్కువ నెక్కొన మసలి యేతెంతు ;
ప్రఖ్యాత మిది మాకుఁ బ్రమథలోకమున
నాఖ్యాతసత్కీర్తి యగుబసవాఖ్యుఁ
బొడగంటిరే భక్తభూరిసద్గోష్ఠిఁ
గడు నొప్ప నిక్కడఁ గలుగు నక్కడను
నతఁ డుండు నా విందు మఖిలలోకముల
సతతసాన్నిధ్యానుషక్తిమై" ననిన
శివభక్తతతిఁ జూచి సిద్ధరామయ్య
"ప్రవిమలగతి నేఁడు ప్రమథలోకమున
నరసి వచ్చెద" నంచు నాక్షణంబునను

నరిగి కైలాసనగాగ్రహర్మ్యమున *
సంబికాసహితుఁడై యాస్థానమంట
పంబునఁ బేరోలగంబున నున్న
శివదేవుఁ గనుఁగొని సిద్ధరామయ్య
యవిరళభక్తిసాష్టాంగుఁడై మ్రొక్కి,
"విన్నపం బవధారు విశ్వలోకైక
సన్నుత!" మర్త్యంబు సద్భక్తజనులు
"ప్రథలోకంబువ బసవండు గలఁడో
ప్రమథేశుకొలువునఁ బరికింపు" మనిరి;
"బసవసంస్తుత్య! సద్భక్తైకదేహ!
యసలార నున్నరూ పానతి" మ్మనిన

—: శివుఁడు తనహృదయమున బసవనిఁ జూపుట :—

నాలోక మీలోక మననేల బసవఁ
డేలోకమునను లేఁ; డెల్ల చో నుండుఁ
బ్రమథులయందు సద్భక్తులయందు
నమరంగ నాహృదయాబ్జకర్ణికను
సతతంబు గురులింగచరములయందు
నతిముదమున నుండు నాదిబసవఁడు
అట్టొట కిటు సూడుమా" యని శంభుఁ
డిట్టలంబుగఁ దనహృదయంబుఁ దెఱవ
సంగతం బగు కరస్థలము లింగంబు
జంగమావళికిని శరణనుకరము
ననిమిషుఁడై చూచు హరుమీఁదిదృష్టి
గనుఁగవహర్షాశ్రుకణవితానంబు
దరహసితాస్యవిస్ఫురణయుఁ దనరఁ
బరమశివధ్యానపారవశ్యమునఁ
బద్మాసనస్థుఁడై పరమేశుహృదయ
పద్మంబునం దున్న బసవనిఁ జూచి,
ప్రమథులు హర్షింప నమరులు మ్రొక్క

నుమబోటి యత్యద్భుతోపేత గాఁగ
నామూర్తిఁ గని సిద్ధరామయ్య యుగ్గ
తామితానందపూర్ణాత్ముఁడై తనరె.
హరుఁడు పర్వతపుత్రి నరవిరికంటఁ
బొరిఁ బొరిఁ జూచుచుఁ "బూర్ణేందువదన !

—: శివుఁడు పార్వతికి బసవనిమహిమ తెలుపుట :—

చూచితే బసవనిసురుచిరమహిమ
యీ చెల్వునిల్కడ యేరికిఁ గలదె?
వెలయఁగ నయ్యాదివృషభేంద్రుఁ డనఁగ
నలి నేన రెండుమూర్తులు ధరించితిని ;
విను "తవపుత్రో భవిష్యామి" యనుచు
నెనయ శిలాదున కేన పుట్టితిని ;
అసలార భక్తిహితార్థమై యేన
వసుధ జనించితి బసవం డనంగ ;
నెసఁగ నిట్టిదకాన యీశుండ నేన
బసవఁ డన్ పేరి సద్భక్తుండ నేన ;
మున్నును మన బసవన్న సద్గుణ మ
హోన్నతి యెఱుఁగవే యొగి నట్లుఁగాక
లోకాధిపతి నేను లోలాయతాక్షి !
ప్రాకటంబుగ లోకపావనుఁ డితఁడు ;
కారణలోకసంహారుండ నేను
కారణలోకోపకారి యితండు ;
భక్తవత్సలుఁడ నేఁ బర్వతపుత్రి !
భక్తరత్నములకు బండారి యితఁడు ;
భక్తైకదేహుండ భావింప నేను ;
భక్తజనప్రాణి బసవఁ డీక్షింప ;
ముక్తికి రాజఁజూ ముద్దియ నేను,
భక్తికి రాజుసూ బసవఁ డీక్షింపఁ ;
బసరింప నే లింగపట్టబద్ధుండ.

బసవండు సద్భక్తిపట్టబద్ధుండు ;
అచరలింగంబ నేనచలేంద్రతనయ ;
సచరాచరక్షోణిఁ జరలింగ మితఁడు ;
నను నాది నాపేరు శంభుం డనంగ
బొనర ద్వితీయశంభుఁడు వీనిపేరు ;
స్థిరభక్తి మమ్ముఁ గొల్చినఁగాని లేదు
ధర వీనిఁ దలఁచినంతనె ముక్తి గలదు.
అలరుచుఁ బ్రాణదేహార్థముల్ నాకు
నిల నిత్తు రఖిలభక్తులు నొక్కయెడను
నచ్చుగాఁ బ్రాణదేహార్థముల్ బసవఁ
డిచ్చుచు నుండుఁ దా నెల్లభక్తులకు ;
నాయతమతి బసవా యనఁ బరఁగు
నీయక్షరత్రయం బి ట్లొక్కమాటు
సదువు నాతని ముఖసదనంబు నందె
కదల కుండుదుము మాగణములు నేము ;
పొదలు నెవ్వని యాత్మ నుదితసద్భక్తి
యదియు బసవనిమహత్త్వంబ కాదె ?
పరికింప నెవ్వఁడు వడయుఁ బ్రసాద
వరముక్తి యది బసవనికృప గాదె ?
మదిలోన నెవ్వఁడు మముఁ దలపోయు
నదియెల్ల బసవనియంశంబ కాదె ?
పసరించు జంగమభక్తి యెవ్వండు
వసుధలో నది బసవనివృత్తి గాదె ?
భక్తి పట్టము దాల్ప బసవఁడు దక్క
శక్తిసమేతులు జగతిపైఁ గలరె ?
యది గాక యొక్కనాయం దేల భక్త
హృదయస్థుఁ డై చూడ ని ట్లున్నవాఁడు"
అంచు వెండియుఁ బ్రస్తుతించుచు శంభుఁ
డంచితమతి బసవయ్యకి ట్లనియె :

"బసవ ! మర్త్యమునందు భక్తులు గలరె ?
యసకమై సంసారి యిష్టమే నీకు ?"
నని యానతిచ్చుడు నద్దేవు హృదయ
వనజస్థుఁ డగు బసవం డిట్టు లనియె :
"ఎందునకైనను మర్త్యలోకమున
నిందుశేఖరుభక్తుఁ డెందును లేఁడు ;
భక్తుండ నేన చూ భక్తు లిందఱును
భక్తాత్మ ! మీస్వరూపంబ కావునను
వెండియుఁ గల దొక్క విన్నపం బింకఁ
జండేశవరద ! ప్రసన్నత వినుము.
జంగమలింగ ప్రసాదోపభోగ
సంగతసుఖసుధాశరధి నోలాడు
నిటువంటిభవము లెన్నేనియు నెప్ప
యిట యపవర్గమహిష్ఠతకంటెఁ ;
గావున శునకసూకరకృమికీట
కావహజన్మంబు లైనఁ గానిమ్ము
సుప్రసిద్ధము జంగమప్రసాదంబ
యేప్రొద్దు భోగింప నెట్లు గల్గినను
జాలుఁబో భవకోటిశతసంఖ్యలందు
నోలి నన్ బుట్టింపు మొకటియు నొల్ల."
ననవుడు గౌరీశుఁ డతిదయాదృష్టిఁ
గనుఁగొని సిద్ధరామునకుఁ జూపుడును
శివునకు మ్రొక్కుచు సిద్ధరామయ్య
భువికి నేతెంచి యద్భుతము నెక్కొనఁగ
భక్తసమూహికి బసవయ్యమహిమ
వ్యక్తిగాఁజెప్పంగ నట్ల నే వింటి ;"
ననవుడు బిజ్జలుఁ "డట్టు లౌటకును
జనులకునెల్ల దృష్టం బిప్పు డిదియ"
యనుచు నమూల్యవస్త్రాభరణములఁ

బొనరంగఁ గాళవ్వబోయిని కొసఁగి
"యవికలాజాండతత్త్వాత్మకుఁ డైన
శివుఁడు గరస్థలాసీనుఁ డై యుండ
సర్వగతుం డైన శంభుభక్తునకు
సర్వగతత్వంబు సహజంబ కాదె!
సర్వమయుం డైన శర్వభక్తునకు
సర్వమయత్వంబు సహజంబ కాదె!
దూరేక్షణంబును దూరశ్రవణము
దూరవిజ్ఞానసిద్ధులు మొదలుగాఁగ
నణిమాదిసిద్ధులు నభవుభక్తునకు
గణుతింప నెంత శ్లాఘ్యంబు దా" ననుచు
సకలమానవులు మస్తకతటన్యస్త
ముకుళితహస్తు లై మ్రొక్కుచు నుండ
"నల్లవో" యనుచు భూవల్లభుఁ డతులి
తోల్లాసచిత్తుఁ డై యెల్లవస్తువులు
దట్టుఁడు బసవనదండనాయకున
కిట్టలంబుగఁ గట్టనిచ్చె సంప్రీతి.
గురుభక్తిశృంగార! గుణగణాధార!
వలదయాలంకార! సురచిరాకార!
ఖ్యాతగంభీర! దుష్కర్మవిదూర!
గీతమహోదార! ధూతసంసార!
అకుటిలచిత్త! శివాచారవేత్త!
ప్రకటతత్త్వాయత్త! ప్రవిమలవృత్త!
అజ్ఞానజైత్ర! యుదాత్తచరిత్ర!
విజ్ఞానపాత్ర! సంవిత్సుఖామాత్ర!
రూఢవ్రతోత్తుంగ! రుచిరాంతరంగ!
గూఢప్రసాదాంగ! గొబ్బూరిసంగ!
ఇది యసంఖ్యాతమాహేశ్వరదివ్య
పదపద్మసౌరభభ్రమరాయమాణ

జంగమలింగ ప్రసాదోపభోగ
సంగతసుఖసుధాశరధినిమగ్న
సుకృతాత్మ పాలకురికి సోమనాథ
సుకవిప్రణీతమై శోభిల్లి తనరి 840
చరలింగఘనకరస్థలివిశ్వనాథ
వరకృపాంచితకవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చను బసవపురాణ మనుకథయందు
ననుపమంబుగ ద్వితీయాశ్వాస మయ్యె. 844

తృతీయాశ్వాసము

శ్రీరుద్రభక్తాంఘ్రిశేఖర ! శుద్ధ
వీరమాహేశ్వరాచార ! సంగాఖ్య !
దండి యై మఱియొక్క పిండజంగమము
వెండియు బసవనదండ నాయకుఁడు
మంత్రులుఁ దానును మహిపతి వనుపఁ
దంత్రంబునకు జీవితము వెట్టునెడను
"వచ్చి యీయర్థంబు వలయు నింతయును
నిచ్చినఁగాని యొం డే నొల్ల" ననుచు
ధట్టించి యడుగుడుఁ బెట్టెలమాడ
ల ట్టున్నభంగి నాయయ్యకు నొసఁగఁ,
దంత్రసమేతు లై ధరణీశుకడకు
మంత్రివర్గం బేఁగి మఱి యిట్టు లనిరి :
"చెప్పినఁ గొండె మాఁ జెప్పకయున్నఁ
దప్పగు నటుగాన చెప్పఁగవలసెఁ ;
బని సేయ వెఱతుము బసవయ్యతోడ ;
ధనమెల్ల నొక్కమిండని కిచ్చె" ననుచుఁ
గొండెంబు సెప్పినఁ గోపించి రాజు
బండారిబసవనదండనాయకుని
రప్పించి, "మాయర్థ మొప్పించి పొమ్మ
ద ప్పేమి ? సాలుఁ బ్రధానితనంబు ;
'దండింప రా' దనుతలఁపున నిట్లు
బండార మెంతయుఁ బాడు సేసితివి ;
పరధనం బపహరింపనిబాస యంద్రు
పరధనం బెట్లొకో బసవ ! కైకొంటి ?
వేయుమాటలు నేల వెఱతుము నీకు

మాయర్థ మొప్పించి నీయంత నుండు"
మనవుడుఁ గించిత్ప్రహసితాస్యుఁ డగుచు
జననాథునకు బసవనమంత్రి యనియెఁ;
''పరమేశుభక్తి యన్సురతరు వుండ
హరుభక్తి యన్ కనకాచలం బుండఁ
గామారిభక్తిచింతామణి యుండ
సోమార్ధధరుభక్తిసురధేను వుండ
బగుతుఁ డాసించునే పరధనంబునకు?
మృగపతి యెద్దెస మేయునే పుల్లు ?
క్షీరాబ్ధిలోపలఁ గ్రీడించుహంస
గోరునే పడియలనీరు ద్రావంగఁ ?
జూతఫలంబులు సుంబించుచిలుక
భ్రాంతి బూరుగుమ్రానిపండ్లు గన్గొనునె ?
రాకామలజ్యోత్స్నఁ ద్రావుచకోర
మాకాంక్షసేయునే చీఁకటిఁ ద్రావ ?
విరిదమ్మివాసన విహరించుతేఁటి
పరిగొని సుడియునే బబ్బిలివిరుల ?
నెఱఁగునే యలదిగ్గజేంద్రంబుకొదమ
యెఱపంది చను సీక ? నెఱఁగవుగార
యరుదగు లింగసద్భక్తులయిండ్ల
వరవుడ నా కొకసరకై యర్థంబు ?
పుడమీశ ! మీధనంబునకుఁ జేసాఁప ;
నొడయల కిచ్చితి నొడయలధనము ;
పాడిగ దఱిఁగిన భక్తుండఁ గాను ;
గాదేని ముడుపు లెక్కలు సూడు-" మనుచు
దట్టుఁడు బసవనదండనాయకుఁడు
పెట్టెలు ముందటఁ బెట్టి తాళములు
పుచ్చెడు మాడ లుప్పొంగుచుఁ జూడ
నచ్చెరు వై లెక్క కగ్గలం బున్న

-: నక్కలు గుఱ్ఱము లైన కథ :-

'మధుర పాండ్యుఁడు దనమంత్రిచే నిట్టు
లధికమర్థం బిచ్చి హయముల విలువఁ
బనుచుడు నతఁడు సద్భక్తి పెక్కువను
జని చని జంగమార్చన సేయఁజేయ
నర్థమంతయుఁ బోవ హయముల విలువ
నర్థంబు లేకున్న ననుమాన ముడిగి
పొలమునక్కలనెల్లఁ బిలిచి తెప్పించి
నలిఁ బాండ్యభూనాథునకుఁ బొడసూపఁ
జొక్కనైనారుల మిక్కిలికరుణ
నక్కజం బంద నానక్కలన్నియును
నిలఁ గంకణములతేజులు నయ్యెఁ గాదె?
మలహరుభక్తులమహిమ దలంప
నిది చోద్యమే" యంచు నెల్లభక్తులును
నమలచిత్తులై సంతసం బంద
నతివిస్మయాక్రాంతుఁడై బిజ్జలుండు
"ఇతఁ డీశ్వరుఁడకాక యితరుండె?" యనుచు
పటవస్త్రభూషణావళి సమర్పించి,
పరమానురాగుఁడై నరులెల్ల వినఁగ
"బండారిమీఁద నెవ్వండేని యింకఁ
గొండెంబు సెప్పునాకుక్కలఁ జెండి
నాలుక ల్గోసి సున్నము సాలఁ బూసి
పోల వేఁచినయిస్మ వోయింతు నోళ్ల"
ననుచు నబ్బసవసింహము వీడుకొల్పఁ
జనుదెంచె నగరికి జనులు నుతింప.

-: బసవఁడు తన భార్యచీర విప్పించి యొక జంగమున కిచ్చిన కథ :-

వెండియు నొక్కయ్య వేశ్యాలయమున
నుండి బానిసఁ బిల్చి "బండారినగర

మన నిత్యపడి వేఁడికొని వేగరమ్మ ! ''
అనవుడు ''నట్లకా''కని పోయి యచటఁ
బడఁతి యబ్బసవయ్య పట్టంపుదేవి
బొడగని, కట్టినపుట్టంబు సూచి,
యసలారఁ బడి వేఁడు డంతఁ జాలించి
మసలక బానిస మగిడి యేతెంచి
''యక్క ! యేమందు నీయాన నే నిప్పు
డొక్కచోద్యముఁ గంటి నక్కడి కేఁగి
యట్టి దివ్యాంబరం బఖిలలోకములఁ
బుట్టదు బసవయ్యపట్టంపుదేవి
కట్టిన [1]పటవలిపుట్టంబు సూచి
నెట్టణ వచ్చితి నీ కెఱిఁగింప ;
బావ వేఁడినఁ జాలు బసవయ్య యిపుడ
యావస్త్ర మొసఁగెడు నరగలి గొనఁడు ;
పరగు మహాదేవభక్తులచేత
నరుదరు దనఁగ గణారాధనములఁ
గొనివచ్చి జంగమకోటి సస్నేహ
మున నిచ్చినట్టి యమూల్యవస్త్రములు
వెంజావళియు జయరంజియు మంచు
పుంజంబు మణిపట్టు భూతిలకంబు
శ్రీవన్నియయు మహాచీని చీనియును
భావజతిలకంబు పచ్చనిపట్టు
రాయశేఖరమును రాజవల్లభము
వాయుమేఘము గజవాళంబు గండ
వడము గావులు సరిపట్టును హంస
పడియు వీణావళి పల్లడదట్టి
వారణాసియు జీకు వాయుఁ గెందొగరు
గొరిగనయమును క్షీరోదకంబు

1. మేలిజాతివస్త్రము.

పట్టును రత్నంబుపట్టును సంకు
పట్టును మరకతపట్టు పొంబట్టు
నెఱపట్టు వెలిపట్టు నేత్రింబుపట్టు
మఱి తవరాజంబు మాందోళిరవియుఁ
జంద్రాతపంబును సాంధ్యరాగంబు
నింద్రనీలంబు మహేంద్రభూషణము
సన్ననడంచును శరధియు మేఘ
వన్నెయు రుద్రాక్షవన్నె కాంభోజి
పులిగోరుపట్టును భూపతి రుద్ర
తిలకంబు సరిపట్టు మలియజసిరియు
గొలనిమేఘము గజావళి హయావళియు
వలిపంబు సరి గమ్మతెలుపు దివ్యాంబ
రంబును నుదయరాగంబు దేవాంబ
రంబు పొత్తియు గుజరాష్ట్రంబుపట్టు
మొదలుగా నెఱుఁగమే మును దరతరమ
పదపడి మనవారు వడసినయట్టి
మానితవస్త్రవితానముల్ గలవు
గాని యావస్త్రసమానముల్ గావు :
తథ్య మిట్టిద" యని దాసి సెప్పుడును
మిథ్యసేయక వేశ్య మిండనిఁ జూచి
నలి దలిర్పఁగ "నీవు నా తోడివలపు
గలవేని బసవయ్య కాంత గంగాంబ
కట్టినపుట్టంబుఁ గ్రక్కునఁ దెచ్చి
నెట్టణ నా కిమ్ము నేర్పు దలిర్ప"
ననవుడు "నట్లకా" కనుచు మిండండు
సని కాంచి "బసవ ! నీవంత గంగాంబ
కట్టినపటవలిపుట్టంబు మాకు
వి ట్టున్న భంగిన యిప్పింపవలయు."
ననవుడుఁ దనసతి నాస్థానసదన

మునకుఁ బిల్వఁగ బంచి ముద్దియఁ గదిసి
"పుట్టు సా వెఱుఁగని యట్టిమహాత్ముఁ
డిట్టలంబుగ నీదుపుట్ట మడ్గెడిని ;
పుట్ట మీవేగ ; మీపుట్ట మిచ్చినను
బుట్టము మన" మని యట్టిచందమున
లజ్జయు సిగ్గు దలంపక బసవఁ
డ జ్జలజాక్షివ ల్వఱిముఱిఁ బట్టి
యొలువంగ నొలువంగ నొక్కవస్త్రంబు
దళితాంబుజాననమొలఁ బాయకున్నఁ
గనుఁగొని యద్భుతాక్రాంతాత్మ లైన
జనములఁ గనుఁగొని జంగమం బనియె :
"గహనమే చూడ జగద్ధితసూత్ర
సహజవాహను లగు శంభుభక్తులకు ?
నలి నిడిగుడినయనా రను భక్తుఁ
డిల నాలిచీర లొల్చఁడె భక్తులకుఁ ?
బంద్రెండువర్షముల్ వాయక నేసి
పంద్రెండుమూరల పసిఁడిపుట్టంబు
విపరీతగతిఁ దన్ను వేఁడుడు నొక్క
దససికిఁ దేడరదాసయ్య యీఁడె ?
యది గాక [1]బల్లహుం డఖిలంబు నెఱుఁగ
సదమలచిత్తుఁడై సతిని మున్నీఁడె ?
యఱలేక రూపించి యడుగంగఁ దడవ
మఱిమొన్నయధరుండు మాణిక్య మీఁడె ?
నందియై మొన్న యధరుఁ డిమ్మడించి
మిండభక్తునకు నర్మిలి నర్థ మీఁడె ?
మహి నిడుగుడిని బెర్మాణి యన్ [2]గణము
గహనంపుదుర్భిక్ష కాలంబునందుఁ

1. బళ్ళాణరాజు (ఈ పదము సాధారణముగా ప్రభువు (రాజు) అను నర్థమున నే పూర్వవాఙ్మయమున నుదాహృతమయినది). 2. భక్తుఁడు.

జాటించి సకలార్థ సంపదల్ సంప్ర
జూటుభక్తుల కిలు చూఱవెట్టండె ?
తనయపెండిలి సేయు[1]తత్ప్రస్తవమునఁ
జనుదెంచి యొక తపోధనుఁడు వేఁడినను
నక్కాంత వెండ్రుక లప్పుడ కోసి
చక్కన మానకంజారుఁ డీఁడెట్టు ?
లనుచు గీటునఁబుచ్చుచును మిండగీఁడు
కినియునో తడవైనఁ దనవేశ్య యనుచు
బసవని వారించి వసుధఁ బ్రోవైనఁ
బసిఁడిచెఱంగుల పట్టువస్త్రములు
మోపిడి తనమోవనోపి నన్నియును
నేపారఁ గొనివచ్చి యిచ్చె లంజియకు.
“నిక్కంబు బసవని నిజభక్తిమహిమఁ
దక్కవ గాదయ్యెఁ దరుణీమానంబు”
అని భక్తమండలి వినుతింపుచుండ
వనిత యంతర్వాసమున కేఁగె నంత.

—: సూర్యాస్తమయ వర్ణనము :—

బసవనిభక్తి ప్రభాపటలంబు
దెసల వసుంధర దివి దీటుకొనఁగ
దినకరుఁ డాత్మీయతేజంబు దఱుఁగు
డును మది లజ్జించి చని యపరాబ్ధిఁ
బడియెనో యన్నట్లు భానుండు గ్రుంకెఁ ;
జెడి మిత్రుఁ డరుగ రాజీవముల్ మొగిచె ;
భేరులు శంఖముల్ భోరనఁ జెలఁగె ;
మారసంహారు నాగారాంతరముల
నలరుచుఁ బంచమహాశబ్దరావ
ములు మ్రోసె ; భక్తసమూహాలయముల
ఘనధూపధూమసంజనితమేఘములు

1. సందర్భమున.

సెనసి కప్పినమాడ్కిఁ జీకటుల్ వర్వె.
పటముక్తిసతి బసవనికి నాఁటితులు
పరువడినెత్తు దీపంబులో యనఁగ
నక్షత్రచయ మంతరిక్షంబు నిండి
యక్షీణతరకాంతి యసలాఁట వెలిఁగెఁ;
జంద్రునిచేటు దైత్యేంద్రునిపాటు
నింద్రునిభంగంబు నెఱిఁగి యెఱింగి
గొఱియ ప్రమిచ్చిలి శూద్రకుండను రాజు
నఱకు పడుట తొల్లి యెఱిఁగి యెఱింగి
జారులఁ జోరులఁ జర్చించుకవుల
భూరివివేకంబుఁ బొగడంగ నేల ?
యనఁగ సంధ్యావేళయందు సద్భక్త
జనులు లింగార్చనల్ సలుపంగ నంత
మిండజంగమకోటి నిండారుభక్తి
దండనాయకుఁ డంపఁ దండతండములు
ఘనసారతాంబూలగంధప్రసూన
వినుతాభరణవస్త్ర వితతులు గొనుచుఁ
గరమర్థి లంజెఱికంబు సేయంగ
నరిగెద మే మంచు ననురక్తి నరుగ_

—: ముగ్ధ సంగయ్య కథ :—

లింగసర్వేంద్రియలీనుండు ముగ్ధ
సంగయ్య నా నొక్కశరణుఁ డీక్షించి
భక్తి ననుచువాఁడు బసవబండారి
వ్యక్త మిట్లేఁగెడు వా ర్జంగమములు
కొనిపోవునవి గంధకుసుమకర్పూర
వినుత తాంబూలాదివితతు; లట్లయ్యుఁ
జను నిది లింగావసరవేళయున్న
పనులకు నేఁగెడు పగిది గా'' దనుచు
నదియును నొక్కలింగార్చన గాఁగ

మది నిశ్చయించి సమ్మదము దుల్కాడఁ
గల నైన లంజెతికం బనునట్టి
పలు కెఱుంగమిఁ జేసి బసవయ్యఁ జూచి
"యేనును బోదునా యీయయ్యగాంద్ర
తోన లంజెతికంబు మానుగాఁ జేయ?"
ననవుడుఁ గించిత్ప్రహసితాస్యుఁ డగుచుఁ
"జను జియ్య! నాముగ్ధసంగయ్యదేవ!"
యని గారవింపుచు నాయయ్య కపుడుఁ
గనుఁగొన సహజశృంగారంబు సేసి
పరిచారికులఁ బిల్చి పటుభక్తి గల్గు
తరుణియింటికిఁ బంపఁ దత్పతిఁ జూచి
"గణుతింపఁ బ్రమథలోకంబుకన్యకయొ?
గణిక సాక్షాద్రుద్రగణికయో? తలఁపఁ
జిత్తరురూపమో? చెలువయో పసిఁడి
పుత్తడియో!'' నాఁగఁ బొలఁతి యేతెంచి,
ముగ్ధమిండనిపాదములమీఁద బడి, వి
దగ్ధ మిండెత సముద్యద్భక్తి మెఱసి,
పడిగంబు వెట్టించి పాదముల్ గడిగి,
కడువేడ్కఁ బాదోదకంబు సేవించి,
ప్రీతి యెలర్ప విభూతివీడియము
లాతన్వి దాన సమర్పణ సేసి,
యనుపవచ్చినవార లరుగ మిండనికిఁ
దనహస్త మిచ్చి తోడ్కొని పోవునెడను
స్ఫాటికసోపానపంక్తి నొప్పారు
హాటకకుట్టిమహర్మ్యస్థలమునఁ
గలయంగఁ గస్తూరికలయంపి మీఁద
వెలుఁగు ముక్తాఫలంబుల ముగ్గు లమరఁ
గంభకట్లను మేలుకట్లను బొలుచు
గంభీరపుష్పకాగారంబునందు

మహితలంబితరత్న మాలికానిచయ
బహుమణిదీపవిభ్రమకాంతి పర్వ
మించి వెల్గెడుపట్టెమంచంబు పుష్ప
సంచితం బగు నండజముపాన్పు దనర
వివిధసౌరభసుఖాన్విత మగుమంద
పవనంబు జాలకపంక్తిఁ దన్పార
శ్రీరుద్రవరదివ్య సింహాసనంబొ ?
గౌరీమనోహరు చారుపుష్పకమొ ?
గంగావతంసుని శృంగారగృహమొ ?
యంగజవిజయుని యనుఁగుమంటపమొ ?
యన నతిరమణీయ మగు సజ్జపట్టుఁ
గని, మిండఁ డద్భుతాక్రాంతాత్ముఁ డగుచు
నదియును నాతి లింగార్చనసేయు
సదనంబుగాఁ దనమదిలోనఁ దలఁచి,
యుత్తుంగసింహాసనోపమం బైన
యత్తన్విచారు పర్యంకంబు దిగువ
నవనిపైఁ గంబళి యాసనంబుగను
శివసమారాధన సేయఁ గూర్చుండి,
భూతి సర్వాంగముల్ పూయుచో నతఁడు
"భూతిపూయ వదేమి వాలఁతి నీ"వనిన—
''నిచ్చఁ బార్వతి పూయుపచ్చవిభూతి
యిచ్చె నొక్కయ్య నా కీమునిమాపు
పూసితి సర్వాంగములఁ జూడు'' మనుచు
భాసురం బగు మేనిపసుపుఁ జూపుడును ;
వలయుచో రుద్రాక్షములు ధరింపుచును
''అలన ! రుద్రాక్షముల్ దాల్పవే'' మనినఁ—
"గడుఁ గందు లవణసాగరతీరమునను
బొడమిన రుద్రాక్షములు సహింపమిని
దెల్లంబు క్షీరాబ్ధితీరమం దుండు

తెల్లరుద్రాక్షముల్ దెచ్చి నొక్కయ్య
యెప్పుడుఁ దాల్పు నుస్పెక్కిన" వనుచు
నప్పొత్తి ముత్యాలహారముల్ సూప
సక్కజుం దగుచు ముత్యాలసూసకము
ముక్కునఁ దాల్చిన ముత్యంబుఁ జూచి
“యుత్తమాంగంబున నువిద ! రుద్రాక్ష
లుత్తమం బయ్యెఁ బో క్రొత్త మా కిదియు ;
నెక్కడ వినఁబడ దిట్లు రుద్రాక్ష
ముక్కునఁ దాల్చిన ముఖ్యమే ?” మనిన—
“దేవ ! యేమని చెప్ప ? దేవుఁడే యెఱుఁగు
నావిశేషంబు వేదాతీత" మనుఁడు ;
నురుజటావలి విచ్చి యొత్తిచుట్టుచును
“దరళాక్షి ! జడలేల తాల్ప వీ" వనిన—
“సగముప్రసాదపుష్పములకు నునిచి
సగమునఁ దాల్చితి సన్నంపుజడలు ;
సన్నుతతద్భస్మసమ్మిశ్ర మగుచు
వెన్నున నిదె చూడు వ్రేలెడి" ననుచు
పటుగళాభరణసంఘటిత మై యొప్పు
పటవలికుచ్చులు వడఁతి సూపుడును—
“భువి నిట్టిభక్తురాలవు గచ్చడంబు
ధవళాక్షి ! మఱి యేల తాల్ప వీ"వనిన—
లింగవంతులు గాని లెంగుల దృష్టి
భంగిగా నాపయిఁ బాఱకయుండఁ
గట్టితి సర్వాంగకచ్చడం" బనుచుఁ
గట్టిన సమకట్టుఁ గాంత సూపుడును
వనిత యపూర్వలాంఛనధారి గాఁగ
మనమునఁ దలపోసి మహిఁ జాఁగి మ్రొక్కి,
“యిట్టిలాంఛనమున కెవ్వ రాచార్యు ?
లెట్టివి నియమంబు ? లెట్టిది చర్య ?

తరుణి ! మీగురుసంప్రదాయంబు వారు
ధరణి నేతావునఁ దపము సేయుదురు ?
సంతతంబును నేరి సద్గోష్ఠి నుండు
చింతయుఁ జెప్పు మా కేర్పడ." ననిన
"నాగమనిగమోక్తి నవ్వామదేవ
యోగిచే శివదీక్ష యొప్పంగఁ బడసి
కైలాసమునఁ దపోవేళ మెప్పించి
శూలిచేఁ బడసె ము న్నీలాంఛనంబు.
అది గారణముగఁ బూర్వాచార్యులు
సదమలాత్మక హిమశైలతనూజ
శ్రీనందనునిఁ గెల్చి శివుని మెప్పించి
మేన నర్ధము గొన్న మెలఁతవర్గంబు ;
జగములన్నియుఁ దనశక్తిఁ బాలించు
జగదేకసుందరి సంతతి మేము ;
శివరహస్యాదిప్రసిద్ధశాస్త్రములు
శివునిచేఁ బడసిన చెలువశిష్యలము ;
ఆకాంక్షతోడ జన్నావులపాలు
సేకొని యష్టావశేషంబు సేసి
చెఱకుకట్టెలపొడి సేసెఁడు సల్లి
మఱి యిష్టలింగసమర్పణ సేసి
తప్పక యీ ప్రసాదం బింతగొందు
మెప్పాటఁ గలనైన నెఱుఁగ మోగిరము ;
గలిగినే వెండియుఁ గందమూలాది
ఫలపత్రశాకముల్ భక్తు లిచ్చినను
స్వామి కర్పించి ప్రసాదంబు గొందు
మే మని చెప్పుదు మీతపశ్చరణ ?
తనువును మనమును ధనమును విడిచి
మనికులై రసికులై మగ్నులై గోష్ఠి
తవులంబు గలిగినతజ్జంగమాను
భవమందు నెప్పుడుఁ బాయకుండుదుము.

అనఘ ! త్రికాలలింగార్చన మీఁది
పనులు దక్కఁగ లేవు బగళులు రేలు ;
గతి మాకు వేఱొండు గలదె ? జంగమమ
గతి మనోవాక్కాయకర్మంబులందు ;
ఇట్టిది గురుమార్గ మిది నిజవ్రతము;
ఇట్టిది సారిత్ర మిది లాంఛనంబు ;
తలఁప మాగురుసంప్రదాయంబువారు
గలరు శ్రీగిరి యాదిగా నెల్లయెడల ;
నధిప ! సాక్షాజ్జగదంబాసమాన
లధికంబు గలరు దక్షారామమునను"
అని సమంచితవిదగ్ధాలాపములను
వినుపింప, నాయయ్య విస్మితుం డగుచుఁ
జెలువ పర్యంకంబు సింహాసనముగఁ
దలఁచి, గంధద్రవ్యతాంబూలవితతి
యొడఁబడ నంత నొండొండు శోధించి,
"పడఁ దర్ఘ్యపణ్యముల్ వట్టు"నావుడును—
"దనరఁగ నీయయ్య మనసు వచ్చుటయుఁ
గనుఁగొన నానేర్పుకలిమి గా" కనుచు
హసనంబు దళుకొత్త నర్ఘ్యపణ్యములు
పసిఁడిబిందెలఁ బట్టి పడిగము ల్వెట్టి,
గ్రక్కున సకలోపకరణంబు లోలిఁ
జక్కొల్పి యమ్ముగ్ధసంగయ్య కలరఁ
గరమొప్ప గంటలుఁ గాంస్యతాళములు
నరుదొంద మ్రోయ ధూపానంతరంబు
దెఱవ యుదంచిత దృగ్దీధితులను
నటితహారంబుల యంశుజాలములఁ
బొలు పగు కంకణస్ఫురితరోచులను
మిళితమై కన్నులు మిఱుమిట్లు గొనఁగ
వెలుఁగు నీరాజనంబులపళ్లెరముల
నలర నందిచ్చునయ్యవసరంబునను—

—: చంద్రోదయ వర్ణనము :—

"మలసంహరుఁడు జటామకుటంబుమీఁద
నిలిపియు నాకందు నెఱిఁ బుచ్చ లేఁడు
భక్తులపాదసంస్పర్శనంబునను
వ్యక్తిగా నిర్మలత్వంబుఁ బొనదుదును"
అని యాత్మఁ దలపోసి యరుదెంచుమాడ్కి
వనజారిప్రాఙ్ముఖంబున నుదయించె.
బసవనిసితకీర్తి వర్వెనా, శివుని
భసితాంగరాగప్రభలు వర్వె నాఁగ,
నారుద్రునట్టహాసాంశులు దనరె
నా. రజతాచలచారుదీధితులు
విలసిల్లెనా, నభోవీథి నెల్లెడల
నెలకొని యచ్చవెన్నెల వెల్లివిరియ—
సక్కొంత ముగ్ధసంగయ్యకుఁ బ్రీతి
నెక్కొని యాత్మలో నిప్పటిలంగ
ననయంబు లింగపూజనల నటించు
తనదువిలాసినీజనుల రావించి, *
"తాళము ల్వట్టుఁడు దాళగింపుండు
నాళతివేళకు నందఱు" ; ననుచు
నవిరళంబుగ నంత నార్భటం బిచ్చి
జవనిక రప్పించి సరసమై నిలిచి,
షౌలుపగుముఖరసంబును సౌష్ఠవమ్ము
లలియు భావంబు ధూకళియు ఝుంకళియు
మఱియు శేవయు విభ్రమమును రేఖయును
నెఱయుగ నీరీతి నృత్యంబు సలుప
లింగార్చనంబు సల్లీలఁ జేయుచును
మంగళారవములు సంగడి నులియ
వెల్లవేగుడు—స్వచిత్తోల్లాస మమర
సల్లీల నమ్ముగ్ధసంగయ్య కిట్టు

లంగన పరిచర్య లాచరింపంగ
లింగావసరము సెల్లించునంతటను-
నాగిమనోహరుని పాదోదకసేవ
నగణితలీల దివ్యాంగుండ నైతి
నఖిలమాహేశసమగ్రప్రసాద
సుఖసేవ నా కింకఁ జొప్పడునేని
నిలుకాల నిలువంగ నేరక తిరుగు
నలమట వాయఁ బొమ్మని తలవోసి
వచ్చినమాడ్కి దివాకరుం డంతఁ
జెచ్చెర నుదయాద్రిశిఖర మెక్కుడును-
బసవనియాత్మ కిం పెసఁగ మిండండు
వెస నేఁగుదెంచి తా వెండి యి ట్లనియె :
''బసవ ! యే మని చెప్ప భర్గుఁడే యెఱుఁగు
నెసఁగ లంజెఱిక మే నీరాత్రి సేఁత ;
నీవును మాతోడ రావైతి గాని
వేవునంతకు నొక్కవిధమైనసుఖము ;
ఐనను లంజెర్క మచ్చోటఁ జేయు
చో నిన్నుఁ దలఁచితిఁ జుమ్మయ్య బసవ !
పుట్టితిఁగాని ము న్నిట్టి సుఖంబు
నిట్టిలంజెఱికంబు నెఱుఁగ నెన్నఁడును ;
మలహరుకృపలేని మత్తికాండ్రికును
గలుగునే లంజెఱికం బిట్లు సేయఁ ?
బగలు రాత్రియు నెడఁబడక లంజెఱిక
మొగి నెన్నియుగము లి ట్లొప్పఁగఁ జేసి
పడసితి చెప్పుమా బరమేశుచేతఁ
గడునొప్పు లింగజంగమసంపదలను ;
పడిసన్న శివభక్తి సౌభాగ్యమహిమ
లొడఁగూడునే వెండి యొండుమార్గమున ?
నాకును నీకారణమునఁ గాఁజేసి

చేకూరె నిట్టిలంజెటిక మీరాత్రి ;
బండారి ! నీయాన పసిబిడ్డనాఁట
నుండియు శ్రీగిరి నుండుదు ; నచట
ననుపమకదళీవనాంతరబిల్వ
వనముల నేకాంతవాసంబునందుఁ
బన్నుగా నఱకాలఁ గన్నును నొసలఁ
గన్నును గలమహాగణములు గలరు ;
చూతుము గాని యెచ్చోట ము న్నిట్టి
భూతిశాసనధారిఁ బొడగాన మేము ;
పొలుపగు పచ్చవిభూతిపూఁతయును
దెలుపగు రుద్రాక్షములు నెఱ్ఱజడలు
నంతకుఁ దగినసర్వాంగకచ్ఛదము
వింత యై యున్నది యింతివేషంబు ;
నిట్టిలాంఛనధారి నిట్టివిరాగి
నిట్టినిష్ఠాశాలి నే మనవచ్చు ?
నింతి నొక్కతెఁ జెప్పనేల తత్సతికి
సంతతంబును బరిచర్యలు సేయు
లలన లందఱు నట్టిలాంఛనధరులు ;
చెలువలమహిమంబు శివుఁడె యెఱుంగు."
ననుచుఁ దత్సతుల లాంఛనములు నచటి
తనమిండతనమును దప్పక చెప్పఁ—
బలుమాఱు నడుగుచు నలి జంగములు
సెలఁగుచు నొండొరుఁ జేవ్రేసి నవ్వ
బసవం డసమసముల్లసనుఁ డై చెన్న
బసవని దెసఁజూచి బసరింపఁ దొడఁగె.
"నిట్టి నెట్టణభక్తి యిట్టిముగ్ధత్వ
మిట్టిమహత్త్వంబు నెందును గలదె ?
నిక్క మీశ్వరుఁ గాని నిజ మెఱుంగమిని
ముక్కంటిభక్తులు ముగ్ధలు గారె ?"
యని ప్రశంసింపంగ నాచెన్న బసవఁ

డనురక్తి ముకుళితహస్తుఁ మ్రొక్కి
“పరగు నీనూతనప్రాక్తనభక్త
వరగణంబులలోన వచియింప జూప
నిల నిట్టి ముగ్ధలు గలరొకో? యనుచు
నలి దీటుకొనఁగ విన్నపము సేయుడును
బరామానురాగసంపదఁ దేలి సోలి
కరమర్థి మఱిముగ్ధగణముల కథలు
ప్రసరింపఁ దలచి సద్భక్తి బండారి
బసవయ్య యాచెన్న బసవని కనియె:

—: రుద్రపశుపతి కథ :—

వ్యక్తం బెఱుంగవే యయ్యళయూక్ష
భక్తుండు మును రుద్రపశుపతి నాఁగఁ?
ప్రథిత మా నాదిపురాణమం దబ్ధి
మథనావసరి మొక్క కథకుండు సదువఁ
గమలజ కమలాక్షు లమితదైత్యాదు
లమరులు సెడి పాఱ నం దుద్భవించి
ఘోరి నజాండములెల్ల దరికొని కాల్చు
గరళంబు మ్రింగె శ్రీకంఠుఁ డనిన
నారుద్రపశుపతి యాలించి ‘భర్గుఁ
డారగించుట నిక్కమా విషం’? బనుడు
‘ననుమానమా! త్రావె హరుఁడు విషంబు
బనుగొన నటమీఁదిపను లెఱుంగ’ మన
విని యులికిపడి వీఁపువిఱిగి ‘‘హా! చెడితి’’
నని నేలఁ బడి పొర్లి “యక్కటా! నిన్ను
వెఱ్ఱిఁ జేసిరిగాక! విశ్వేశ! యెట్టి
వెఱ్ఱివా రైనను విషముఁ ద్రావుదురె?
బ్రదుకుదురె? విషమ్ముపాలైన వార?
లిది యెట్టు వినవచ్చు! నేమి సేయుదును?
నిక్క మెవ్విధమున నిన్నెకా కెఱుఁగ;

ముక్కంటి ! నా కింక దిక్కెవ్వరయ్య ?
నాకొఱకైనఁ బినాకి ! యివ్విషము
చేకొన కుమియవే నీకు మ్రొక్కెదను ;
గటకటా ! మేన సగంబున నుండి
యెట వోయితవ్వ ! నీ వెఱుఁగవే గౌరి !
ప్రమథగణములార ! పరమాప్తులార !
సమసిన వెండి మీశక్యమే కావ ?
శతరుద్రులార ! యసంఖ్యాతులార !
క్షితిధరకన్యకాపతిఁ గావరయ్య !
వీరభద్రయ్యరో ! విషముఁ బ్రాణేశుఁ
డారగించె నిఁ కెట్లు లవునో కదయ్య !
యోపురాతనులార ! యొడయుండు బ్రదుక
నోపు నొకో ! విషం బొగి నారగించెఁ ;
జావు దప్పింపరే సద్గురునాథు ;
దీవన లీయరే కావరే శివునిఁ ;
దల్లిలేని ప్రజలఁ దలఁతురే యొరులు ?
తల్లి యున్న విషముఁ ద్రావ నేలిచ్చు !
పరమేశుఁ డీబారి బ్రదికెనేనియును
మరణంబు లేదువో మఱి యెన్నఁటికిని."
నని ప్రలాపింపుచుఁ బనపుచు నొండు
వినఁజాలఁ బ్రాణము ల్విడుతు నే ననుచుఁ
దడయక ఘనజలాంతరమున నుఱుకఁ—
బడకుండ నారుద్రపశుపతిఁ బట్టి
పార్వతీసహితుఁడై ప్రమథరుద్రాది
సర్వసురాసురసంఘంబు గొలువ
హరుఁడు ప్రత్యక్షమై "యడుగుము నీకు
వర మిత్తు నెయ్యది వాంఛితం" బనుడుఁ—
గడుసంభ్రమంబున మృడుపదాబ్జములఁ
బడి రుద్రపశుపతిభట్టారకుండు

"ఏమియు నే నొల్ల ; నీవిషసేవ
నేమేమి పుట్టునో యే వినఁజాల ;
గ్రక్కున నమియవే కాలకూటంబు
నిక్కంబు నా కెక్కనీయివి.'' యనిన
దశనకాంతులు దశదిశలఁ బర్వంగఁ
బశుపతి యారుద్రపశుపతి కనియె :
''నిట లోకములలోన నెన్ననే కాక
యట మ్రింగ నమియంగ నది యెంతపెద్ద ?
యణుమాత్ర నాకంఠమందుఁ జిక్కినది ;
గణుతింప నున్నదే కాలకూటంబు
ఇంత సంతాపింప నేల నీ ?'' కనుచు
వింతన వ్వొలయంగ సంతరించుడును—
''నమ్మంగఁ జాలఁ బినాకి ! యివ్విషము
గ్రమ్మన నొక్కింత గడుపు సొచ్చినను
బెద్దయుఁ బుట్టునో పిమ్మటివార్త
దద్దయు విన నోపఁ దా మున్న చత్తు
సమయని మ్మొండేనిఁ జావనీవేని
యుమియు మివ్విషమొండె నొండు సెప్పకుము
తక్కినమాటలు దనకింప" వనుచు
నిక్కంబుతెగువమై నిష్ఠించి పలుక ;
'నమియ కుండినఁ జచ్చునో ముగ్ధ' యనుచు
నుమబోటి యాత్మలో నుత్తలపడఁగ
"నమిసినఁ గొని కాల్చునో తమ్మ" ననుచుఁ
గమలాక్షముఖ్యులు గడగడ వడఁకఁ
బ్రమథు లాతని ముగ్ధభక్తికి మెచ్చి
యమితమహోత్సవు లై చూచుచుండ
నొక్కింత నవ్వుచు నుడురాజధరుఁడు
గ్రక్కున లేనెత్తి కౌఁగిటఁ జేర్చి,
"ప్రమథులయాన నీపాదంబులాన

సమయ నివ్విషమున సత్య మిట్లనిన
నమ్మవే వలపలినాతొడ యెక్కి
నెమ్మిఁ జూచుచునుండు నీలకంఠంబు"
నని యూరుపీఠంబునందు ధరించె.
మును గుఱియున్నదే ముగ్ధత్వమునకు
నదిగాక కుత్తుక హాలాహలంబు
కదలినంతటనె చచ్చెదఁగాక ! యనుచుఁ
దనకరవాలు తొమ్మన దూసి మోపి
కొని కుత్తుకయ చూచుచును తెప్ప లిడక
పశుపతితొడమీఁదఁ బాయక రుద్ర
పశుపతి నేఁడును బాయకున్నాఁడు.*

-: బెజ్జమహాదేవి కథ :-

మఱియును విను బెజ్జమహాదేవి యనఁగఁ
గళకంఠ శ్రీపాదకమలాంతరంగ
''యెల్లనియోగంబు లెల్లబాంధవులు
నెల్ల వారలు గల్గ నిట్లు భర్గునకుఁ
దల్లి లేకుండుట దా విచిత్రంబు !
దల్లి లే కది యెట్లు దా నుదయించె ?
దల్లి సచ్చెనొ కాక త్రైలోక్యపతికిఁ
జెల్లఁబో ! యి ట్లేమి సేయంగవచ్చుఁ ?
దల్లి సచ్చినఁ గాదె తాను డస్సితిని.
యెల్లవారికి దుఃఖ మిట్టిదకాదె !
తల్లి గల్గిన నేల తపసి గానిచ్చుఁ ?
దల్లి గల్గిన నేల తల జడ ల్గట్టుఁ ?
దల్లి యున్న విషంబుఁ ద్రావ నేలిచ్చుఁ ?
దల్లి యుండినఁ దోళ్లు దాల్ప నేలిచ్చుఁ ?
దల్లి పాముల నేల ధరియింప నిచ్చుఁ ?
దల్లి బూడిద యేల తాఁ బూయ నిచ్చుఁ ?
దల్లి వుచ్చునె భువిఁ దనయునిఁ దిరియఁ ?

దల్లి వుచ్చునె సుతు వల్లకాటికిని ?
దల్లి లేకుండినతనయుండు గాన
ప్రల్లదుఁడై యిన్నివాట్లకు వచ్చెఁ ;
జన్నిచ్చి పలుమాఱు వెన్నయుఁ బెట్టి
పన్నుగా నిన్నియుఁ బాలును బోసి
యాఁకొనఁగాఁ గడు పరసి పాలిచ్చి
సాఁకించి పెనుపదే జనని గల్గినను ?
దా నింతవాఁ డయ్యెఁ దల్లి లేకయును
దా నెంత పెరుఁగునో తల్లి గల్గినను ?
బెండ్లిండ్ల నోములఁ బేరంటములను
బండువుదినములఁ బాటిజాతరలఁ
దగినవోఁడిమి సేయుతల్లి లేకున్న
వగవరే మఱి యెట్టి మగబిడ్డ లైన ?
నూర కుపేక్షించి యుండంగఁ దగునె ?
యారంగఁ దల్లి నై హరుని నేనైన
నరసెదఁగాక; యి ట్లఱలేక పెనుచు
తరుణియకా డెట్లు దల్లి దా" ననుచు
నసయంబు బెజ్జమహాదేవి దాన
జనని యై పరమేశుఁ దనయుఁ గావించి
1 తొంగిళ్లపై నిడి లింగమూర్తికిని
సంగన గావించు నభ్యంజనంబు ;
ముక్కొత్తుఁ, జెక్కొత్తు, ముక్కున్నుఁ బులుము,
నక్కొత్తుఁ, గడు పొత్తు నట, వీఁపు నివురుఁ,
బెరుఁగంగవలె నని తరుణి వీడ్వఁడఁగఁ
జరణము ల్కారములఁ జాఁగంగఁ దిగుచు,
నలుఁగులు నలుచు నర్మిలి గట్టిపెట్టి
జలములు వీఁపునఁ జఱచు నంతంత,

1. తల్లులు చంటిపిల్లలకుఁ దలంటునపుడు వారు పరుండుటకయి దగ్గఱకుఁ జేర్చి సాచియుంచెడి తొడల పయిభాగము.

వెగచి బెగడకుండ వెన్ను వ్రేయుచును
నొగి మస్తకమున నీ రొత్తు దోయిటను ;
వదనంబు సొచ్చునో యుదకంబు లనుచు
నదుముఁ బొట్టను నోరి కడ్డంబువట్టుఁ ;
జెన్నుగాఁ బసుపార్చి చేయు మజ్జనము
గన్నులుఁ జెవులును గాఁడంగ నూఁదు ;
సంగిటిము ల్లొత్తు నందంద వ్రేల
దొంగిళ్లఁ గార్నీరు దోనెత్తి మిఁడుచు ;
బడఁతిచే నీరఁ దూపొడిచి బొట్టిడును ;
మడఁది యంగుష్ఠంబుమ న్నింత మెదిచి
కడవ నంటినయట్టి పిడుకవిభూతి
యడరఁ బుత్త్రుని నొసలారంగఁ బూయు ;
నెత్తు గ్రుంగెడు నని యెత్తంగ వెఱచి
యత్తన్వి తొమ్మన నఱ్కున నదుము ;
కాటుక యిడ నింత గన్నగు ననుచుఁ
గాటుక యిడు మూఁడుగన్నులఁ గలయఁ ;
జన్నిచ్చుఁ ; బక్షులఁ జననీదు మీఁద ;
నన్నాతి గొండొక వెన్నయుఁ బెట్టుఁ ;
జెక్కిలి గీఁటుడుఁ జెలఁగి యేడ్వంగ
నొక్కవే లిడి పోయు నొకకొన్నివాలు
ఉగ్గులువోసియు నువిద సంప్రీతి
నగ్గించు నొగియించు నట బుజ్జగించు
ముద్దాడు నగియించు ముద్దులు వేఁడు ;
నద్దికొన్ వీ రెవ్వ రయ్యరో యనుచుఁ
బన్నుగా నుదరంబుఁ బాన్పుగాఁ జేసి
కున్న జోసఱచుచు సన్నుతిఁ బాడుఁ—"
గొడుకని యిబ్బంగిఁ గొనియాడుచుండఁ
బడఁతి నిశ్చలముగ్ధభావంబునకును
శివుఁడును మెచ్చి తాఁ జేకొనియుండె

నువిద గావించు బాహ్యోపచారములు.
శ్రుతి "యేకయేవ హి రూపేణ" యనియు
స్మృతి "సాధక స్సంస్మరే త్సదా" యనియు
ధర "తస్య తన్మయతాంయాతి" యనియు
హరునివాక్యము గాన యది యేల తప్పు?
భక్తుఁ డెబ్భంగిగా భావించు శివుఁడు
వ్యక్తిగాఁ దద్రూపుఁ డై యుండు టరుదె?
యని భక్తమండలి వినుతింపఁ గొన్ని
దినములు సనఁగ నద్దేవదేవుండు
వెండి యమ్మకుఁ బ్రసన్నుండు గాఁ దలఁచి
దండిరోగం బైన తఱుచంటిక్రియను
జన్నును గుడువక సంధిల్ల నోరు
వెన్నకుఁ దెఱవకయున్న యాక్షణమ
బిట్టుల్కిపడి తల్లి బిమ్మిటి నొందలుఁ
బట్టలే కావద గిట్టి "నాయన్న!
నాకున్న! నాపట్టి! నాచిన్నవడుగ!
నాకుట్టు చన్నేలరా కుడువవైతి?
నీచెమటయుఁ జూచి నెత్తురు నవుదు
నోచెల్ల! యెటు సూడనోపుదునన్న!
తల్లిఁ గదన్న! యింతటి కోర్తునన్న!
యెల్లెడ నొరుల నే నెఱుఁగఁగదన్న!
కలిగితి లేక యొక్కఁడవు గదన్న!
తలరక యే నెట్లు దరియింతునన్న!
నేలపై నాకాళ్లు నిలువవురన్న!
యేల పల్కవు సెప్పవే యన్న! నీకు
నఱిమియో? కోవయో? యంగిటిముల్లొ!
యెఱుఁగను మందుమాఁకేమియు" ననుచుఁ
బసవుఁ బలవరించుఁ, బయిఁ బడి పొరలుఁ,
గనుఁగొను మైవుడుకుఁ, గౌఁగిటఁజేర్చు.

గప్పుఁ, దెఱచుఁ, గప్పుఁ, గ్రమ్మఱఁ దెఱచుఁ,
దప్పక వీక్షించుఁ, దల్లడం బందుఁ
బొంగెడుఁగడుప్రేముప్పునను 'బొప్పనికి
నంగిటిము ల్లయ్యె' నని నరు లనఁగ
నడలుచుఁ గడుశోకజలధిఁ దేలుచును
బడఁతి పుత్త్రుం డున్న భావంబుఁ జూచి—
"కడుపు వెలితి యైన నొడయనంబికిని
నెడవోయి యచ్చటఁ గుడువలేకున్నఁ
గునియుచుఁ గుమ్మరగుండయ్య వాద్య
మున కాడి యచ్చటఁ గొనఁ దిన లేక
వచ్చి చేరమచక్రివర్తి వాయింప
నచ్చెరువుగ నాడి యాఁకట బడలి
'పెడయాట లివియెల్ల వేఁగి యాడినను
గడుపు నిండునె' యని గ్రక్కున వచ్చి,
పిట్టవ్వకై రాచవెట్టికిఁ బోయి
యెట్టకేలకు నింతపి ట్టారగించి,
సామవేదులయింటఁ జచ్చినపెయ్యఁ
బ్రేమంబుతో వండి పెట్టంగఁ గుడిచి,
కామింపఁగాఁ గరికాళవ్వయింట
మామిడిపండులు మఱుఁగున నమలి,
పోయి చెన్నయయింటిఁబులియంబకళముఁ
జేయుఁ దీయక జుట్టి, చిఱుతొండనంబి
కొడుకుమాంసము వేఁడికొని విందుసేసి,
యెడపక నిమ్మవ్వయింట భుజించి,
యారగింపఁగఁ జవి యైనఁ జోడవ్వ
కోరతో నిచ్చినఁ గొని యారగించి,
యాసక్తి సురియచౌడయ్య చేకళ్ల
కాసించి తఁట : వెండి యంతటఁ బోక
నిన్న నింతయు నొక్క నెలఁతుక పెప్పెఁ ;

గున్న : యాఁబడిపుచ్చఁగూడునే నన్ను
మలమల మఱఁగుచు నిల నాడనేల
కొలఁదిదప్పినకుడ్పు గుడువంగ నేల ?
బ్రదుకున్నదే యిట్లు వైకుడ్పులందు
నది యేల కడుపూఁదదయ్యెడుఁ జెపుమ.
చన్నిత్తుఁ బలుమాఱు వెన్నయుఁ బాలు
నెన్నండు దప్పింప నెందైనఁ దెత్తుఁ
గుడుపు నీకెయిదదే కొడుక యిట్లేల ?
యడిగి కుడువఁబోయి తాదట లేక
యిన్ని దినంబులు నేరీతిఁ జాలె ?
నిన్న నీకడు పేల నిండదు సెపుమ ?
యేయెడ వంచింప రేయును బగలుఁ
జేయి దిగం డిట్టి [1]సితగుండు గలఁడె ?''
యని యొందు వేసర నాసరఁ గన్న
జనినగదా యని చనవున బలుకఁ
దెల్ల ఘప్పుడు మీఁదఁ దొల్లి నాయట్టి
తల్లులు గలరె యీముల్లోకములను ?
బనుగొన నీవు నాప్రాణంబు గాఁగ
ననురక్తి గొనియాట కది నీవె సాక్షి ;
యెట్టేని మాయుంచినట్టుల యుండి
పెట్టినంత గుడిచి యట్టుండితేని
యెప్పాట నినుఁ బొందునే తెవు ల్పొప్పి ?
నిప్పునఁ జెద లంటునే ? నీకు నీవ
చేసికొనఁగఁ దెవు ల్సిద్ధించెఁ గాక
యీసంకటంబు నీ కేల తావచ్చుఁ ?
బనియేమి ? మాటలఁ బాయునే తెవులు
నిన్నుఁ గొంత పీఱఁడితన మడ్గ నేల?
చాలఁ జూడంగ నీసంకటం బింక

1. మంకుబిడ్డఁడు.

బాలుండ ! నీమీఁదఁ బ్రాణము లిడుదు.”
నని తనశిరమున కలుగ నున్నంతఁ
దనతల్లి కడుపు ప్రత్యక్షమై నిలిచి,
“యడుగు మిచ్చెద నీకు నభిమతం” బనుడుఁ
“గొడుక ! నాకొకకోర్కె కొఱఁతయుఁ గలదె ?
నీవు నిరోగివై నిత్యుండవై సు
ఖావాప్తి నుండు నా కంతియె చాలు;
కన్న మోహంబునకంటె నగ్గలము
ఎన్నఁ బెంచినమోహ మెందు నటంద్రు.
అటుగాన నినుఁ గన్నులారఁ జూచుచును
నిట యుండుటయె నాకు నీప్సితం’’ బనిన
మందస్మితముఖారవిందుఁడై తల్లి
నందంద కౌఁగిట నప్పళింపుచును
‘ముల్లోకములకెల్ల ముత్తవ ! నాకుఁ
దల్లివి గాన నాతల్లి ! నీయట్టి
తల్లివి గలుగంగఁ దనకు రోగంబు
లెల్లెడఁ బొందఁగ నెట్లుండవచ్చు ?’
ననుచు నిత్యత్వ మాయమ్మకు నొసఁగె.
ననుపమపరమపరానందమూర్తి
యమ్మయై శివుఁ గొనియాడుబఁజేసి
యమ్మవ్వ యనునామ మయ్యె. వెండియును–*

—: ఉడుమూరి కన్నప్ప కథ :—

“శ్రీకాళహస్తిగిరి ప్రదేశమున
శ్రీకంఠభక్తుండు లోకైకనుతుఁడు
ఉడుమూరి కన్నప్పఁ డొక్కనాఁ డర్థి
నడవికి వేఁటమై నరిగి యొక్కెడను
దోడెలుకులఁ దాను దోఁపున నుండి
యాడ నొక్కింత నిద్రావస్థ దోఁపఁ
గలయఁగ రుద్రచిహ్నలతోడ నీశుఁ

డలరుచుఁ దపసి యై యరుదెంచి తన్ను
జవుకమం దునిచి నొసల భూతి వెట్టి
శివతీర్థకలశాభిషిక్తుఁ గావించి,
"చనఁజన ముందట ఘనలింగమూర్తిఁ
గనియెదు; ప్రాణలింగంబు నీ కదియు"
నని యుపదేశించినట్లు స్వప్నమునఁ
గని, మేలుకాంచి నల్గడలు వీక్షింప
మును లేనిదొక త్రోవ ముందట నున్నఁ
'బొనర[1] నిక్కాల యయ్యెఁబో కల' యనుచు
దనతోడి యెఱుకుల నునిచి యొక్కండ
చనఁ జన ముందట ఘనలింగమూర్తి
యున్న సంతోషించి కన్నప్పదేవుఁ
డున్నత భక్తి సంయుక్తుఁడై మ్రొక్కి
"కలగన్న చోటికి గంపఁ గొంపోవ
ఫలసిద్ధి యగుటెల్ల భాగ్యంబు గాదె ?
మును దపోమూర్తి సెప్పిన లింగ మిదియ
తన ప్రాణనాథుఁ డౌ" నని నిశ్చయించి,
"బాసగా దింక నీ ప్రాణలింగంబుఁ
బాసి పోఁ దగదు మా పల్లియ ; కితని
గ్రక్కునఁ గొనిపోయి కట్టుదుఁ బాక ;
నిక్కడ నునుపరా దెండఁ గాలంగ ;
బుద్ధులు సెప్పియు బుజ్జగించియును
దద్దయుఁ గీడ్పడఁ దగ[2] వెడ్డు వెట్టి
వలసిన వస్తువు లిలఁ దెచ్చి యిచ్చి
వలపించి కొనిపోవ వలె" నని తలఁచి
పరమహర్షమున విస్ఫారాంగుఁ డగుచు
వరముగ్ధభావన హరున కి ట్లనియె :
"అక్కటా! యిది యేమి హరుఁడ యొక్కరుఁడ

1. వెంటనే యనుభవమునకు వచ్చు కల. 2. ఆశపెట్టి, వంచించి.

విక్కడ నుండుట యేమి గారణమొ ?
తల సూప కేయూరి తమ్ముళ్ళ తోడ
నలిగి వచ్చితి సెప్పు మఱక డిచ్చెదను ;
1గాంరగ ఉమ్మెత్తపత్తిరిఁ బూజసేయ
మరులెత్తి వచ్చితో యురుతరాటవికి ;
పరసలత్రొక్కనఁ బడ జాల కీవు
సిరిగిరి నుండక సురిఁగి వచ్చితివా ?
జటలకు నొడలికి సవతులు వోర
నుడుపఁ జాలక వచ్చి యడవిఁ జొచ్చితివా ?
చెన్నయ్య గలసినఁ జెడెఁ గులం బనుచు
నిన్ను లోకులు వెలి యన్న వచ్చితివా ?
పలుమాఱు నంబికిఁ బడిపను ల్సేయ
సొలసి వచ్చితివా యిచ్చోట డాఁగంగ ?
నాఁటి బ్రహ్మము నేఁడు నాయంబు దప్ప
వేఁటాడ వచ్చితో ? వేయును నేల
నాతోడి మోహంబునన నన్నుఁ బ్రోవ
నేతెంచితో వేడ్క యెసఁగ నిచ్చటికి !
నెట యుండి వేంచేసి తెట్లు ? నీబ్రదుకు ?
ఇట యుండఁ జొచ్చి తీ వెంతగాలంబు ?
ఎక్కడుగోద ని న్నిక్కడ వైచి
యెక్కడ వోయె నే నేఁగెదఁ జెపుమ ?
ఒడల నర్ధము గొన్న యుమబోటి యెద్ది ?
యెడ నైన నవ్వరే యెక్కడివారు ?
కట్టిన గోచి యెక్కడ నొల్వ్వవడితి ?
వట్టెల వచ్చితి వడవి కొక్కఁడవ ?
చంక బొక్కసమును సడలియున్నదియు
శంకింప కొం బెట్టు సరియించెదయ్య !
కొండలలోన నొక్కండ వీ విట్టు

1. భక్తులు.

యుండంగ వెఱవవా ఖండేందుమౌళి ?
మృగములు నురగము ల్మితి మేరలేవు.
పగవు గా దిచట నున్నను బ్రమాదంబు ;
ఎఱుకుఁ బన్నలు గన్న నేఁతురు నిన్నుఁ ;
గఱకంఠ ! మాపల్లెఁ గల దెల్ల సుఖము.
అడవుల పసుబిళ్ళ కడు మంచిపాలు
నొడిపిలి పాసెంబు నుడుప నేతులను
నిప్పపూవును దేనె లెల్ల ఫలాదు
లొవ్వెడు వెదురు బ్రాలోగిరంబులును,
మఱి యట్లుఁ గాక నీ మనసు వచ్చినను
నెఱచులుఁ గఱకుట్టు లెన్నైనిఁ గలవు ;
రావయ్య ! మ్రొక్కెద దేవదేవుండ !
ప్రేవులు మాడంగఁ జావఁ దప్పినదె ?"
యనుచుఁ బాదాక్రాంతుఁ డైన నీశ్వరుఁడు
దనతోడఁ బలుకమి మనసులోపలను
"నింత గాలమునుండి యిట గుడువండొ ?
కంతునిర్దళనుఁ డాఁకట బల్కఁ లేఁడు ;
చెవులు సిల్లులు వోవఁ జీరంగ నేల ?
శివున కేమేనిఁ దెచ్చెదఁ గాక !" యనుచుఁ
జని కందమూలాదిశాకముల్ మృగము
లును దృష్టి మాత్రలోనన పరీక్షింప
మునుకొని "యంతకుమున్న ధరిత్రిఁ
జనిన జీమూతవాహనుఁడును శిబియుఁ
గీర్తిముఖుండును గీర్తింప నాది
కర్తకు నర్పింపఁగా నెఱుంగమిని
దమ శరీరము లొండుగ్రమమున సమసి
యమితసాహసవంతు లనఁగ నిబ్బువిని
సవిశేషకీర్తిభాజను లైరి గాని
ప్రవిమలమతి లింగభాజను ల్గార"

యనుచు సౌందర్య మహాకాయు లనఁగ
దనుజేశు లతిఘోరతప మాచరింప
నెంతయుఁ బరితోష హృదయుఁ డై భర్గుఁ
డంత దైత్యులకుఁ బ్రత్యక్ష మై నిలిచి
"యాయధోక్షజ కమలాననవాస
వాయతస్వర్గ మోక్షాది భోగములు
చెచ్చెర వేఁడుఁ డిచ్చెద" నని యాన
తిచ్చుడు. సాష్టాంగ మెరఁగి దానవులు
"మాజలంధరుఁ డభిమానంబు గొన్న
యాజనార్దను పద మరిదియే మాకు ?
మాగజాసురునిచే మడిసినయట్టి
వాగీశ్వరత్వంబు వలెనె నిన్నడుగ ?
మాతారకునిచే విధూత మై చెడ్డ
యాతని యింద్రత్వ మది యేలచెప్ప ?
నటుగాక వ్యాఘ్రాంధకాది దానవులు
నిటలాక్ష పగతు లై నీచేతఁ దొల్లి
వడసిన మోక్షంబు భక్తి మైఁ దగిలి
పడయుట సోద్దెమే పాన లొం దేల?
దేవ ! నిత్యానంద ! దివ్యలింగాంగ !
దేవ ! మహాదేవ ! దేవాధిదేవ !
యెల్లదైవత్వంబు లెల్ల భోగంబు
లెల్లవి యెఱుఁగుదు మొల్ల మేమియును,
నీరమ్య మగు మాశరీరము ల్మీకు
నారగింపంగ నాహారము ల్గాఁగఁ
గరుణింపుఁ" డనుడు శ్రీకంఠుఁ డి ట్లనియె :
"ధరఁ గాళహస్తి భూధరసమీపమున
మృగము లై పుట్టుఁడు ; మిమ్ము వధించి
బగుతుఁ డొక్కఁడు పరిపక్వంబు సేసి
యర్పింపనేర్చుఁ గన్నప్పఁ డనంగ ;

నర్పింప నపుడు మి మ్మారగించెదను."
అని యానతిచ్చుడు నసురు లాక్షణమ
చనుదెంచి ప్రజలును వనితలుఁ దారు
మృగము లై లింగసమీపంబునందుఁ
దగిలి జన్మించి యెంతయుఁ బ్రీతిఁ దమ్ము
నొరులకుఁ గానరాకుండ వర్తింప-
వరమృగావలి సేరవచ్చిన నుబ్బి
యొక్కొక్కకోలన యొక్కొక్కమృగము
నుక్కడఁగింపుచు నుత్సవం బలరఁ
జెచ్చెరఁ గోలలు దెచ్చి యాక్షణమ
త్రచ్చి మెల్లన మంట దరికొల్పి కాల్చి
మంచిమాంసముగ శోధించి శోధించి
పంచినమాడ్కి ఖండించి ఖండించి
కాల్చుచుఁ బక్వంబుగాఁ ద్రిప్పి త్రిప్పి
ప్రేల్చుచు వెండియుఁ గ్రియకొల్పి కొల్పి
తవిలి ఖండింపుచుఁ దాఁ జవిసూచి
చవియున్న లెస్స మాంసము దొప్పఁబెట్టి,
చిఱుతయుఁ గఠినంబు ఛిద్రంబు మొఱకు
కఱకును గారాకు గాకుండఁ జూచి,
యింపారి నునుపారి కంపు సొంపారి
పెంపారి చాలనొప్పెడు బిల్వపత్రి
వలి దీటుకొనఁ గోసి తలసజ్జఁ జేసి
యలరు జంజూఱు వెంద్రుకలమీఁదఁ దాల్చి,
చక్కన మొగలేటి సదమలోదకము
లక్కజంబుగ రెండుపుక్కిళ్లఁ బట్టి,
దాపలికరమునఁ జాపంబు శరము
లేపార వలచేత నిట మాంస మున్న
దొప్పయుఁ బట్టి కన్నప్పఁ దేతెంచి,
చెప్పఁగాలను దొంటి శివుమీఁద పూజ

పోనూకి తెచ్చిన పుక్కిటి నీట
మానుగా శివునకు మజ్జనం బార్చి,
పఱికివెండ్రుకలపైఁ బత్తిరి రాల్చి,
మఱి దొప్పఁ దెచ్చిన మాంస మర్పించి
యనయంబు నట్లు గన్నప్పదేవుండు
ననురాగమునఁ గొల్వ, మును గొల్చుతపసి
యేతెంచి యప్పరమేశ్వరు మ్రోల
నీతెఱంగంతయు నేర్పడఁ జూచి
"యెక్కడి మ్లేచ్ఛుఁడో యెన్నఁటిఁగోలె
నిక్కడ నన్యాయ్య మిట్లు సేసెడిని
నేమిసేయుదు" నంచు నేవగింపుచును
నామాంస ఖండంబు లటు వాఱనూకి,
యపవిత్ర మయ్యె శివాగార మనుచుఁ
దపసి పంచామృతస్నపనంబు సేసి
పాదోదకములు దత్ప్రాంతంబునందు
వేదోక్తముగఁ జల్లి వెండి పూజించి,
వేగుండి యాతనివిధ మెల్ల నరసి
వేగినఁ దపసి యుద్వృప్తిమై వచ్చి
"యక్కటా! యెంగిలి యదియు మాంసంబు
పుక్కిటినీరును బూజ్యమే పూజ;
చెప్పఁగాలను నూకు శివభక్తి గలదె?
యెప్పాట వినఁబడునే? యెట్లు సైఁప
వసుధ మృగాదుండు వాఁడు; నేఁ దపసి,
నసమానవిగ్రహం బన నెట్లువచ్చు?
నిచ్చటఁ దొల్లియు నేనుంగుతోడఁ
జెచ్చెరఁ బోరదే చెలఁది! యె ట్లనిన:
హరుఁ డెండఁ గాలెడి ననుచు నచ్చెలఁది
పరువడిఁ దననూలు దెరచీరభాతిఁ
దిరిగివచ్చిన వృక్ష తృణగుల్మలతలఁ

బురికొల్పి మీఁదఁ గపోతముల్ దీర్చి
కరువుఁ బ్రతిష్ఠించి గంటయు వేది
విరచించి శిఖరంబుఁ గర మొప్ప నిలిపి
ద్వారబంధంబులు దగిన వాకిళ్లు
నారంగ గర్భగృహాదులు దీర్చి
యకలంక కరవీరముకుళ ప్రభాతి
ప్రకటించి దేహళీబంధంబునందు
రమణీయ పూజా ప్రబంధానేకరచన
గావించి, చెలఁది త్రికాలంబు భక్తి
భావనమై శివుఁ బాయక కొలువ—
హరుమీఁదఁ జెలఁది మున్నల్లిన నూలు
గరి యంత నేతెంచి కాంచి కోపించి
'పాయక శివుమీఁదఁ [1]బాదొట్టు వెట్టి
పోయెడు నిది యేమి పురువాకో' యనుచు
ఘనకర్ణచలిత సంగత మారుతమునఁ
బొనరిన పాదొట్టుఁబోవంగఁ ద్రోచి,
వెండి తాఁ దెచ్చిన తుండాంతరమున
నిండారుమొగలేటి నిర్మలాంబువుల
సంబికాధవునకు నభిషేకమార్చి,
యింబులఁ గుంభస్థలంబుపైఁ బెట్టి,
తెచ్చినకలువల నచ్చఁ దామరల
నిచ్చలుఁ బూన్చుచు నిటలలోచనునిఁ
గరియును నిట్లు త్రికాలంబు గొలువ—
నరుదెంచి చెలఁది దా నాగ్రహం బంది
'కమనీయలీల నా కట్టినగుడియు
నమరుమదీయ నిత్యార్చనావలియు
నెట్టికర్మియొ చెర్చి యేఁగెడు నింక
నిట్టి శివ ద్రోహ మెట్టు సైరింతు'

1. సాలెగూడు.

ననుచు నొక్కెడఁ బొంచికొనియుండ గజము
ననుదెంచి కోపించుచందంబు సూచి
యంతరాంతర మించు కైనఁ దలంప
కంతఁ 1 బరిచ్ఛేది యై యుపాయమున
దుండాగ్రమునఁ జొచ్చి తొలుచుచుఁ జెలఁది
దండిమదేభంబు తలకెక్కి చంపెఁ."
గాన యిక్కడ నమార్గము నేయుధీర
మానసుఁ డెంతవాఁ డైనఁ గానిమ్ము;
అట్లు నేఁడును వాఁడు నరుదెంచె నేని
యెట్లైనఁ జంపకఁ యేఁ బోవ" ననుచు
వెనుకదిక్కునఁ బొంచికొని సమీపమునఁ
దనపొడసూపక తపసి యున్నెడను-
గన్నప్పదేవుని ఘనముగ్ధతయును
సన్నుతభక్తియు సంస్పృహత్వంబుఁ
దపసికిఁ జూపఁగఁ దలఁచి శంకరుఁడు
విపరీతగతిఁ ద్రినేత్రపరీత మైన
వదనంబు ధరియించి వలపలికంట
నుదకంబు గాఱంగ నున్నయత్తఱిని
అరుదొందఁ దొల్లిటియట్ల కన్నప్పఁ
డరుదెంచి యరుదెంచి హరుకంటినీరు
పొడఁగని, బిట్టుల్కిపడి, భయభ్రాంతిఁ
దొడరుచు నరుదారఁ దొల్లింటిపూజ
గ్రిక్కునఁ దనచెప్పుఁగాలఁ బోనూకి,
పుక్కిటి నీరును బుగులున నుమిసి,
తలవంచి పత్తిరి దులిచి, మాంసంబుఁ
దలరుచు నర్పించి, తదవసరమున
నానేత్రజలపరిహారార్థముగను
దా నీశ్వరునకు నంతర్ధార యెత్తు

1. చంపునది.

భంగి జలంబులఁ బత్తిరి భ్రుంగి
మంగళం బై యొప్పె మఱియట్లఁ గాక
తలగంగ నతనిపాదహతిఁ దొలంకి
యలరి పాదోదకం బై వెల్లివిరియఁ
బొలుపుగఁ గన్నప్ప పుక్కిటనీరు
గలయఁ బ్రసాదోదకం బయి తనర
నాలింగమూర్తి యపాంగోదకముల
పోల లింగోదకపూర మై తనరఁ
ద్రివిధోదకంబులఁ ద్రినయను మేనఁ
బ్రవిమలం బై యిట్లు భ్రాజిల్లె; సంతఁ
దవిలి ప్రసాదికిఁ ద్రివిధోదకములు
ప్రవిమలమతిఁ బొందఁ బాడి యనంగ
సర్వాంగములుగూడ జలములు వర్వ
సర్వేశుభక్తుఁ డాశ్చర్యంబు నొంది
యగ్గలం బయ్యె నపాంగాశ్రు లనుచు
బెగ్గిలి నేత్రమ్ము దగ్గఱి చూచి
"కటకటా! యిదియేమి గర్జంబు వుట్టె?
నిటలాక్ష! నీకంట నీరు గాఱెడిని;
నీనింద విని గౌరి నీఱైన నాఁడు
దా నించు కేనియుఁ దడి గంట లేదు;
జనకునిచేఁ దనయునిఁ దునిమించునపుడు
కనికరంబున గంటఁ గ్రమ్మదు నీరు;
చీర సించుచు విప్రు లాఅడి వైచి
కారించుతఱి నుదకము లేదు గంట;
నాఱాల వాట్లు ఱివ్వనఁ దాఁకునొవ్విఁ
గాఅవు నాఁడును గంటఁ బాష్పములు;
పరసతికై పట్టువడ్డ భంగమునఁ
దొరుగవు నాఁడును దోయముల్ గంట;
వెట్టి కేఁగెడు తట్టఁ బట్టి యెత్తుడును

నట్టిచో వెడల వపాంగోదకములు ;
నేఁడు నీకడకంట నిర్నిమిత్తంబ
పోఁడిగా జలములు పూరించు టేమి ?
ఆలుబిడ్డలఁ బాసి యడవుల గిరుల
పా లైతి నని దుఃఖపడి యేడిచెదవా ?
యేకాకి నైతి నిం కేక్రియఁ బ్రోతు
లోకంబు లని ధృతిలేక యేడ్చెదవా ?
కడుపు గాలంగ నాఁకటి కోర్వలేక
తడ వయ్యె రాఁ డని తలఁచి యేడ్చెదవా ?
యక్కడ దండిమృగాలిచే నాదు
చిక్కుట నూహించి నిక్కమేడ్చెదవా ?
పనిపాటు సేయనోపక యొంటివిడిచి
చనియెనో తమపల్లె కనుచు నేడ్చెదవా ?
అఱిముఱి నొకపువ్వు మఱి మూరుకొన్న
నెఱయఁ బ్రాణమునకు వెఱచి యేడ్చెదవా ?
కారణం బేమి ? గన్గంటఁ బుట్టెండు
నీరు గాఱఁగ నేడ్వ నీ కేమి వలసె ?
చెప్పవే నా" కని చేర్చుఁ గౌఁగిటను
నప్పళింపుచును 'నాయట్టి పుత్త్రుండు
గలుగ నీ కేల యప్పుల బ్రుంగ' ననిన
పొలుపునఁ గంటియప్పులు వాఱఁ దుడిచి,
"పాసియుఁ బాయదు వ్యాసంగ" మనుచు
నీసరిలింగముల్ నిను నగరయ్యా !
ఊరకో నాయన్న ! యూరకో తండ్రి !
యూరకో నాస్వామి ! యూరకిం తేల ?
యుమ్మలికము తగ దుడుగవే' యనుచు
తొమ్మన నేత్రోదకమ్ముల ట్లొత్తు ;
'నెసఁగ నాముగ్ధత కీకంటిలోని
కసువ పో' మ్మన్నట్లు గన్ను శోధించుఁ ;

గరతలాంగుళములఁ గనుఱెప్ప లెత్తి
'నెర సున్న' దని పాఱనిష్ఠించి యూఁదుఁ;
బరగ నాలుక గ్రుడ్డుపైఁ ద్రిప్పి త్రిప్పి
యొరయుచు నొరయుచు నొయ్యనఁ జూచుఁ;
జీరావిఁగొని కంటఁజేర్చి హత్తించి
చీరెల్లఁ దడిసినఁ జిక్కు; వెండియును
నీకడకంట వ్రేలిడి యొత్తనొత్త
నాకడకంట ధారావలి వచ్చె;
నాకడకంట వ్రే లదుమ నట్లదుమ
నీకడకంట నీరెంతయుఁ దొరిగెఁ;
గొలుకులురెండు నంగుళముల నదుమఁ
గలయఁగఁ గన్నెల్లఁ గొలుకులై కాఱె;
నక్కన్నుఁగొలుకులు నరచేతమూయఁ
బిక్కిళ్లఁ బింజించి పాఱంగఁ దొడఁగె;
నెట్టును నేత్రాశ్రు లెడతెగకున్న
నెట్టణ దుఃఖించి బిట్టు వాచఱచు;
నడుగులఁ బడి మ్రొక్కు; నంజలి యొగ్గు;
నడలు; నిల్చును; నిల్వఁబడు; లేచుఁ; జూచుఁ;
'కటకటా!' యనుచు లింగముఁ జుట్టిచుట్టి
యటయిట యేఁగుచునాత్మలోపలను
"నానందబాష్పమ్ము లంద మేనియును
నాననంబునఁ దోఁప దానందచిహ్న;
సారకటాక్ష వీక్షణ జాల మైనఁ
గారుణ్య జలములు గావ యుష్ణములు;
ఘర్మజలంబులక్రమ మందమేని
ఘర్మజలంబులు గన్నులఁ గలవె?
యొండు దుఃఖం బేని యూహించి చూడ
రెండుగన్నులఁ గాఱ కుండునే నీరు?
తా నొక్కకంటనె ధార వచ్చెడిని

గానోపు నక్షిరోగంబ యేమేని
చెప్పఁ జిత్రము ! గోడితెప్ప పెర్గినదొ ?
తప్పవోనోపునో ? తడికంటివిధమొ ?
నొవ్వియో పొఱగప్పెనో ? మాదతెవులొ ?
పువ్వువట్రిల్ల నాపువుకంటి పోటొ ?
మయిలవడ్డదియొ ? దుర్మాంసదోషంబొ ?
అయిఱయో వెండియు నక్షిరోగంబొ ?
కానోపు ని ట్లనుమానంబు లేదు ;
దీనికి మందుమ్రా కే నే మెఱుంగ ;
నాయన్న ! నాతండ్రి ! నాయిష్ట సఖుఁడ !
నాయయ్య ! నాజియ్య ! నాప్రాణనాథ !
సర్వాంగసుందర ! శంకర ! యీ[1] వి
గుర్వణం బెటు దొరకొనెనయ్య ! నీకు ;
ముక్కంటి వాఁడని మూఁడు లోకముల
నిక్కంబు వెఱతురు నిటలలోచనుఁడ !
యెన్నఁడు నీకొక బన్నంబు లేదు ;
గన్నుఁ జూచిన నిట్టు గైకొండ్రె సురలు ;
కంటి చిచ్చున మున్ను గాలిన వారు
కంటివార్తకు నిఁక గనలరే మగుడ ;
విను మెంత గన్ను గానని వలపైన
వనిత లి ట్లంగహీనునకు జిక్కుదురె ?
రూపింప నిట్లు కురూపి వై యున్న
నేపార భక్తు 'లిహీ' యని నగరె ?
నేఁ డెందుఁ బోయెనో నేత్రంబు హరికి
నాఁ డిచ్చి నట్టి యనశ్వరమహిమ ?
పొలమున నాఁబోతు పులి గొన్నయట్టి
పొలు పయ్యె నే నెట్లు నిలువంగనేర్తు ?
నెవ్వరి కెఱిఁగింతు ? నెట్లు ధరింతు ?

1. విగుర్వణము = మితిమీఱిన కష్టము.

నెవ్విధిఁ బోవుదు ? నేమి సేయుదును ?
జెప్పంగ లే దొండు ; సేయ లే దొండు ;
నిప్పాటఁ జూచుచు నే నుండఁ జాల ;
నాకంటఁ బుట్టిన నాఁటను గోలె
శ్రీకంఠు రోగంబు సెంద దెన్నఁడును ;
నొప్పని కన్నుతో నున్నట్లు గాఁగఁ
గప్పెద నాలెస్సకంట నీకన్ను ;
నాకన్నచూ ! మందు నీకంటి" కనుచుఁ
జేకొని శరమున ఛేదించి పుచ్చి
కఱకంఠు కంటిపైఁ గన్నప్ప దేవుఁ
డటిముఱిఁ దననేత్ర మర్పింపఁ దడవ
నక్కంటఁ దొరుగు ధారావళి యడఁగి,
గ్రక్కున డాపలికంట నుబ్బొంగఁ
గించి త్ప్రహాస సంకీలితాననస
మంచితాంభోజాతుఁడై తననేత్ర
కమలంబు శివునేత్ర కమల మై యునికి
కమితమహోత్సాహ మాత్మఁ దుల్కాడఁ
గ్రేకంట లింగంబు డాకన్నుఁ జూచి
'యీకంటి కిని మందు నీకన్నె కాక
యనుమాన మింకేల' యనుచుఁ దన్నేత్ర
జనితవినిర్మలజలధార దొరుగఁ
గందువఁ దనచెప్పుఁ గాలి యుంగుటము
పొందించి డాకన్ను పుచ్చఁ గైకొనుడు–
నంతలోపలన ప్రత్యక్ష మై యప్పు
డంతకసంహారుఁ డనురాగ మెఁసఁగఁ
గన్నప్పదేవర కరయుగ గ్రహణ
సన్నుత హస్తుఁడై చక్కన నిలువఁ–
గలిత సమావలోకనమాత్ర యంద
యలరెఁ గన్నప్పని వలపలి కన్ను

నాతనిచేఁ గొన్న యాకన్ను నిచ్చె
నో తన కన్నిచ్చెనో శివుఁ డనఁగ;
నంతకమున్ను వామాంబకజనిత
సంతతఘనబాష్పజలధార లుడిగి
కన్నప్ప దేవుని కన్నులు శివుని
కన్నులు వోల నొక్కఁ డైన యట్లు
కన్నప్పదేవుని కన్నుల నపుడు
సన్నుతానందబాష్పంబులు దొరిగె;
హరుకంటఁ దొల్లి త్రిపురవీక్షణమునఁ
దొరిగిన జలములు దోడయ్యె ననఁగఁ
గరుణానిరీక్షణ స్ఫురితాంబుధార
విరచింప నానందకర మగు టరుదె!
యంతట నిఖిలసురాసురప్రముఖు
లంతంత మ్రొక్కుచు నభయంబు వేఁడ,
మస్తక విన్యస్తహస్తులై మునులు
ప్రస్తుతం బెఱుఁగుచుఁ బ్రస్తుతుల్ సేయ,
శివదుందుభులు మ్రోయ, భువిఁ బుష్పవృష్టి
ప్రవిమలం బై కుర్యఁ, బ్రమథు లుప్పొంగ,
గన్నప్ప శుద్ధముగ్ధతయు మహాగు
ణోన్నతియును భక్తియోగసంపదయు
నాపరాపరుఁడు ప్రత్యక్షమై యునికిఁ
గోపించి మును పొంచికొనియున్న తపసి
కనుఁగొని సంభ్రమాక్రాంతాత్ముఁ డగుచుఁ
జనుదెంచి భువి జక్కఁ జాఁగిలి మ్రొక్కి
"తలఁప నీసహజ ముగ్ధత్వ మెఱుఁగమిఁ
దలఁచితి నీకహితంబు సేయంగఁ;
దప్పు సైరింపు గన్నప్ప! దయాత్మ!
చెప్ప నున్నదె నీవు శివుఁడవు గాక
యిట్టి ముగ్ధత్వంబు నిట్టి వీరత్వ

ఇట్టి మహత్త్వంబు నెందును గలదె ?
విందుమే యవికలవేదశాస్త్రములఁ
గందుమే మూఁడులోకంబులఁ దొల్లి ?
బాపురే ! కన్నప్ప ! పరమ లింగంబ !
బాపురే ! కన్నప్ప ! ప్రమథవిలాస !
నల్లవో ! కన్నప్ప ! నాలింగముగ్ధ !
నల్లవో ! కన్నప్ప ! నల్లనైనార !''
యనుచు నిట్లాతబోధనుఁ డతిభక్తి
వినుతింప, నుమబోటి విస్మయంబొందఁ
గన్నప్ప శివుఁడు నాకాంక్ష నొండొరులఁ
గన్నులఁ జూచుచు నున్న యత్తఱిని
దవిలి యొండొంటితోఁ దగునన దొరపి
నివిడి యొండొంటితోఁ నిద్దమై బెరసి
చూపులు సూపుల లోపలఁ జొచ్చి
యేపార నేకమై యెంతయు నొప్పి
కన్నప్పదేవుని కన్నుల సఖులో !
యన్నీలకంధరు కన్నుల కవలో ?
తవిలి కన్నప్ప కన్గవ దర్పణములో ?
భవునయనంబుల ప్రతిబింబ యుగమొ ?
నెమ్మిఁ గన్నప్ప నేత్రమ్ములపాయ
గొమ్మలో ? శివునేత్రగుప్తాంకురములో ?
రమణఁ గన్నప్ప నేత్రముల బీజములో ?
యమృతాంశుశేఖరు నక్షిఫలములో ?
యనఁగఁ గన్నప్ప దేవునిలోచనములు
మనసిజహరుని లోచనము లై శివుని
కన్నులు గన్నప్ప కన్ను లై యిట్లు
సన్నుతి గడచి సమున్నతస్ఫురణ
నాల్గుఁ గన్నప్ప నైనారినేత్రములో ?
నాల్గు నీశ్వరునయనంబులో యనఁగ

మృడుని మూఁడవ కంటిక్రింద నిగ్గడల
నడర రెండును రెండు నై మించి వెలుఁగఁ
జూపును జూచు తద్రూప ముదారు
నేపారఁ ద్రివిధంబు నేక మై యునికిఁ
దమ నేత్రములఁ దమ్ము దార వీక్షించు
క్రమ మయ్యె శివునికిఁ గన్నప్పనికిని ;
నెఱి నాల్గు గన్నుల నిజదీప్తి నంత
పఱగప్పి నట్లుండె ఫాలలోచనము ;
'కాలునే యింక నీకంటఁ జూచినను
నోలిఁబురత్రయం బొండు గల్గినను ?
గాలునే యింక నీకంటఁ జూచినను
నాలక్ష్మినందనుం డంగంబు గొన్నఁ ?
గాలునే యింక నీకంటఁ జూచినను
గాలుఁడు వెండియుఁ గ్రమము దప్పినను ?
గాలునే యింక నీకంటఁ జూచినను
నేలోకమును నంత్యకాలంబునాఁడు ?
కన్నప్ప సదయాంబకము మున్న శివుని
కున్న నట్లునుగాక యుగ్రాక్షుఁ డండ్రె ?
నాఁడ యీ కన్నప్ప నయన ముండినను
వేఁడునే సిరియాలు విందారగింప ?
నాఁడ యీ కన్నప్ప నయన ముండినను
బోఁడిగా సైఁచునే భ్రూణహత్యకును ?
ఈచారునేత్రాబ్జ మీశున కున్నఁ
జూచునే నిమ్మవ్వసుతుచావు నాఁడు ?
పంబి యీయమృతాంబకం బున్న శివుఁడు
నంబి కన్నులు సెడ నాఁ డేల చూచు ?
నీ నేత్ర మున్న ము న్నీశుండు బాలుఁ
బోనిచ్చునే పాముపుట్టఁ దొడ్కంగ ?
నితనినేత్రం బున్న నిన్నియు నేల ?

యతిదయాపరుఁ దన నుతికి నెక్కఁడె ?
యితనినేత్రంబు ము న్నీశున కున్న
నతిభూమిసౌందర్యుఁ దన భువిఁ జనఁడె ?
యిట్టి నేత్రంబు ము న్నెప్పుడు నున్న
నెట్టి కాంతల మెచ్చునే హరుఁ ? దనఁగఁ
గన్నప్ప నేత్రంబుకతమున నీశుఁ
డెన్నంగ సర్వసంపన్నుఁ డై నెగడెఁ ;
గన్నప్పపాదరక్షాస్పర్శ శివుఁడు
సన్నుతభక్తవత్సలుఁ డనఁ బరఁగె ;
నీచెప్పు నాఁడు దన్నింత సోఁకుడును ;
నాచంద్రుఁ డభినంద్యుఁ డయ్యె లోకముల ;
నీచెప్పునాఁడు ద న్నింత సోఁకుడును
నేచిన తీర్థ మై యిల నొప్పె గంగ ;
యీచెప్పు దా నయ్యెనేఁ బద్మభవుఁడు
చూచున కాదె యీశునిమస్తకంబు
శ్రీపతి గానని శ్రీమహాదేవు
శ్రీపాదభక్తుల శ్రీపాదరక్ష
పరమేష్ఠి గానని యురులింగమూర్తి
శిరమున నొప్పు విశిష్టభూషణము ;
చెప్పెడి దేమి ? గన్నప్పపాదంబు
చెప్పు మహత్త్వంబు సెప్పఁ జిత్రంబు ;
ఇతని పాదోదకాయత సిద్ధిఁ గాదె
సితకరమౌళి ప్రసిద్ధుఁడై పరఁగె ;
నితని నిర్మాల్యసంగతిఁ జేసి కాదె
రతిపతిహరుఁడు నిర్మలదేహుఁ డయ్యె ;
నితనిగండూషాంబుకృతసేవఁ గాదె
జితపురత్రయదైత్యుఁ డతిలోకుఁ డయ్యె ;
నితనిప్రసాదవిహితభుక్తిఁ గాదె
క్షితిధరకన్యకాపతి నిత్యుఁ డయ్యె ;

నీదేవుఁ డితని ప్రసాదంబుఁ గుడిచి
వేదశాస్త్రముల వివేకంబు గడఁచె.
శివుఁడు గన్నప్పయుచ్ఛిష్టంబుఁ గుడిచి
యవికలవిధి నిషేధాతీతుఁ డయ్యె ;
లింగంబు గన్నప్ప యెంగిలి గాన
యంగ మంతయు నుత్తమాంగ మై యొప్పె ;
గణనాథుచేత లింగసమేతుఁ డయ్యె ;
గణుతింప నంబిచే ఘనభక్తుఁ డయ్యె ;
సన్నుతి కెక్కి మాకన్నప్పచేత
సన్నుతసర్వప్రసాదాంగుఁ డయ్యె ;
ననుచు భక్తానీక మసమానలీల
వినుతింప, జగములు విస్మయం బంద,
నన్నగజాధీశుఁ డంత నందంద
కన్నప్పదేవునిఁ గౌఁగిటఁ జేర్చి
"పరఁగుచతుర్వర్గఫలము లాదిగను
వర మిత్తు నడుగుము వాంఛితార్థమ్ము"
లనవుడు మందస్మితాననుం డగుచు
ననుషక్తి ముకుళితహస్తుఁ డై మ్రొక్కి
"యెఱుఁగ మోక్షములపే రెఱుఁగ వాంఛితము
లెఱుఁగ వేఁడెడుమార్గ మెఱుఁగ నేమియును
ఎఱుఁగుదు నెఱుఁగుదు నెఱుఁగుదు మఱియు
మఱియును మఱియు ముమ్మాటికి నిన్న
కావునఁ గోరికి కడమయుఁ గలదె ?
దేవ ! మూలస్తంభ దివ్యలింగాంగ !
నీయతులితదయాన్వితదృష్టి యిట్లు
నాయందు నాఁటి కొనలు వసరింప
నాదగు సంస్పృహాపాదితదృష్టి
నీదృష్టిలోనన నెక్కొని పొదలఁ
గరుణింపు ; దక్కిన వరము లే నొల్ల

బరమాత్మ !" యని విన్నపం బాచరింప
నభిమతార్థప్రదుఁ డట్ల కన్నప్ప
కభిముఖుఁ డై నిల్వ నంత నిద్దఱును
వెలయఁ దా రన్యోన్యవీక్షణానంద
కలితాత్ము లై తిరుకాళత్తిపురిని
గన్నప్పదేవుఁడు గౌరీశ్వరుండు
సన్నిరీక్షణలీల నున్నవా రిపుడు ;
నిక్కంబు గన్నప్ప పుక్కిటినీరు
ముక్కంటి కభిషేకమున కెల్లప్రొద్దు
నేఁడును గన్నప్ప నిర్మాల్యమందుఁ
బోఁడిగా శివునకుఁ బూజ సేయుదురు ;
మృడుఁడు గన్నప్ప కర్పించినఁగాని
యడరంగ నేఁడును నారగింపండు ;
కన్నర్పితము సేసెఁ గాన లోకములఁ
గన్నప్పఁ డనఁగ మహోన్నతి కెక్కె ;
నచ్చట నేఁడు గన్నప్పండు శివుఁడు
నచ్చెరు వందంగ నట్లున్నవాఁడు.
కావునఁ దొల్లి ముగ్ధస్వభావులకు
దేవుండు కృపసేయుఁ దెల్ల మి" ట్లనుచు
బసవయ్య ముగ్ధగణసమూహికథలు
పసరింప నాచెన్నబసవయ్య వినఁగఁ
"బృథివి నీముగ్ధులకథలు దాఁ జెప్పఁ
గథ లయ్యె" నని కథకథకు నవ్వుచును
నతులితానందసంగతి నున్న భక్త
వితతికి బసవఁ డున్నతలీల మ్రొక్కె,

-: కళియంబనాయనారు కథ :-

'యిప్పురాతనులందు నెఱుఁగరే తొల్లి
యొప్పార నిత్యంబు నొక్కభక్తుండు
నలిరేఁగి కళియంబనయనా రనంగ

నిల మిమ్ము నగియించు నిదియె నేమముగ
మెచ్చించె శివదేవు మీ రొక్కమాట
కిచ్చి నవ్వుట సాలదే నన్ను మనుప!”
ననుచు నవ్వించుచు నవిరళభక్తి
జనితసుఖామృతవనధిఁ దేలుచును.
బసవఁడు జంగమప్రకరంబు నిట్టు
లసలార నోలగంబై యుండి రంత.

—:సకలేశ్వరు మాదిరాజయ్య కథ:—

“పెద్దలతేఁడు, వెన్నుద్దుల మొదలు
బుద్ధులప్రోక, విబుధనిధానంబు,
నమితవచోరాశి, సుమనోనురాగుఁ,
డమలినచిత్తుఁ, డుద్యద్గుణాన్వితుఁడు,
సకలవీణాప్రవీణకళావిదుండు,
నకలంకనాదవిద్యాపండితుండు,
వేదవేదాంతసంపాదితతత్త్వ
వాది, సంసారదుర్వ్యాప్తిసంహారి,
యమనియమాదివర్తితాచారవర్తి,
శమదమసద్గుణాశ్రయచరిత్రుండు,
ధీరమహోదారదిక్పూర్ణకీర్తి,
కారుణ్యమూర్తి, నిర్గతసకలార్తి,
మహితసజ్జనశిఖామణి నాఁగఁ బరఁగు
మహి సకలేశ్వర మాదిరాజయ్య
గారి సద్భక్తి విఖ్యాపితమహిమ
ధారుణి నెట్లన్నఁ దా విస్మయంబు!
నగణితకీర్తిమై నంబె యన్పురము
దగు రాజధానిగా ధరణి యేలుచును
శ్రుతి వీర్య వితరణ రూపవివేక
చతురతరూఢి రాజ్యంబు సేయుచును
జంగమలింగైక్యసద్భక్తియుక్తి

నంగీకరించుచు నర్చ లిచ్చుచును
నొడఁబడ రాజవదుపచారములను
గడియగడియ దప్ప కెడ భజింపుచును
వివిధపుష్పదళ సద్భవనాంతరమున
శివదేవు సంస్తుతిసేయుచు న్నంత.
రమణ బత్తీసాదిరాగంబులకును
నమర నన్నియు దండియలు నియోగించి
యేరాగమున సకలేశున కర్థి
యారాగవీణ దా నలరి ధ్వనింప,
విరచితస్త్రీరాగపురుషరాగములు
సరస మై లక్ష్యలక్షణనిర్వికార
పూరితనాదగంభీరవినూత్న
సారోక్తిగీతంబు లారఁ బాడుచును
దమతమ కఖిలవాద్యంబులు మ్రోయఁ
గ్రమ మొందఁ గేళికగతి నటింపుచును
వారివారికి హర్షపూరము ల్గాఁగఁ
గోరి భక్తాలి కింపార మ్రొక్కుచును
బాయక రేయును బవలు లింగార్చ
నాయతామృతవార్ధియం దోలలాడ
నఖిల సామ్రాజ్య సమంచిత సరస
సుఖముల కెమ్మెయి సొగయ కున్నెడను –
‘మల్లరసను నొక్క మండలేశ్వరుఁడు
దొల్లి యిట్టుల రాజ్య మొల్లక విడిచి
శ్రీగిరి కేఁగి నిశ్చింతాసమాధి
నాగిరి బిల్వవనాభ్యంతరమున
నున్నవా’ రని వారియురుభక్తిగుణము
హోన్నతికయు ధ్యానయోగసంపదయు
శివభక్తితత్త్వానుభవసమగ్రతయు
శివభక్తగణములచే వినఁబడుడు –

నప్పుడు శ్రీగిరి కరుదెంచి రథిఁ
జొప్పారు మల్లరసును జూచువేడ్క :
రయ మందఁగా మాదిరాజయ్యగారు
క్రియ దులుకాడ నగ్గిరి శృంగములను*
దనరి యొప్పెడు బిల్వవనమహత్త్వంబు
గని వినుతింపుచు వనమధ్యమందు
వినయస్థుఁడై తన్ను వెదకుచు వచ్చు
"ననఘుని మాదిరాజయ్య మనంబుఁ
జూచెదఁగాక" యంచును మల్లికార్జు
నాచార్యుఁ డపరిమితాంగంబుఁ దాల్చి
తెరువున కడ్డమై దివియును భువియుఁ
బరిపూర్ణముగఁ జాఁగఁబడి యున్నఁ జూచి
"పరమయోగీంద్రుఁడో ? భసితంపుగిరియొ ?
ధరఁ బడ్డ రుద్రాక్షధరణీరుహంబొ ?
సదమలజ్యోతియో ? శంభురూపంబొ ?
విదితచిదబ్ధిసముదితపూరంబొ ?
యెచ్చోటఁ బోవరా దెట్లొకో" యనుచు
నచ్చెరు వంది మాదాఖ్యుఁ "డీక్రమము
నరయుదు" నని యుత్తమాంగంబు దిక్కు
పరిగొని మూఁడేఁడు లరసికానకయుఁ
బదపద్మములమీదఁ బడ కిటువచ్చు
టిది దప్పు దా నంచుఁ బదపడి మగిడి
యచ్చోటనుండి యయ్యడుగులదిక్కు
గ్రచ్చర వర్షాష్టకమునకు వచ్చి
యంత భయభ్రాంతుఁడై "నీదురూప
మంత సూపక యేలయా యిటు లేఁప ;
నే నెంతవాఁడ నిన్నెఱిఁగెద ననఁగ
నానందమూర్తి ! నీయడుగులు సూపి
రక్షింపవే !" యని ప్రస్తుతింపుచును

బక్షద్వయము సాఁగఁ బడియున్నఁ జూచి
యయ్యవసరమున నమ్మల్లికార్జు
నయ్యగా రంతఁ బ్రహసితాస్యుఁ డగుచుఁ
దనతొంటిభావంబుఁ దాల్చి "నీమనసుఁ
గనుఁగొని నిల్పైతి" ననుచు మాదాఖ్య
"లెమ్మ"ని చెయి సాఁచి లేవంగ నెత్తి,
క్రమ్మఱ నందంద కౌఁగిటఁ జేర్చి
"యిట్టి సాహసి వౌదువే మమ్ముఁ జూడ
నెట్టయా వచ్చితి విచ్చటి?" కనుచుఁ
దననివాసస్థానమునకుఁ దోడ్కొనుచుఁ
జని, యంత లింగావసరము సేయించి
తనప్రసాదము వెట్టి యనుపమతత్త్వ
జనితానుభవసుధావనధిఁ దేల్చుచును
గొంత ప్రొద్దట యుంచుకొని యుండి "యింకఁ
గొంత కాలము గ్రియాభ్రాంతిమై ధరణి
నుండఁగ దగు" నని యురుతరకీర్తి
మండితసద్గుడు మల్లికార్జునుఁడు
నానతి యిచ్చుడు నమ్మాదిరాజు
"తా నెట్లు వోవుదు నానందమూర్తి
తగు నిఱుపేద నిధానంబుఁ గాంచి
దిగవిడ్చి యేఁగునే మగిడి కూలికిని?
కంటి మీశ్రీపాదకమలంబు లేను
మంటి; నింకేటికి మగుడుదు?" ననిన
మెల్లన నవ్వుచు మేలు గా కనుచు
మల్లికార్జునుఁడు సముల్లాసకీర్తి
నిత్యస్వరూపవినిశ్చితం బైన
ప్రత్యయంబుల నొడఁబఱపఁగఁ దలఁచి
"యట్లేని ర'' మ్మని యట యొక్కదుమ్మ
చెట్టు గావించి, "నిశ్చింత సమాధి

నిట యుండు మీ" వని యట యేఁగి, తాను
గుటిలవేషంబున గొల్లనిభాతి
బఱపువ్రేళ్ళను, మొద్దు పాదముల్, గుజ్జు
చిఱుతొడలును, దొప్ప చెవులును, బరడు
ప్రక్కలు, బీరనరములును, జిదక
ముక్కును, ముడిబొమల్, మొగిదోనికడుపుఁ
బొక్కిళ్ళవోయిన చెక్కిళ్ళు, వలుఁద
బొక్కితొమ్మును, బెద్దనిక్కినమెడయుఁ,
బల్లమీసములు, నేర్పడు కాయకన్నుఁ,
బిల్లిగడ్డంబును, నల్లనిమేనుఁ,
బ్రాఁకువట్టినపండ్లు, బ్రద్దచేతులును,
పీఁక కాళ్లను, నడ్డిపీఁపును దనర
ములుగత్తి యుచ్చుఁ గోకలుఁ జూఁడుఁగొడుపు
మొలత్తి నిడి, దొడ్డమొలకచ్చగట్టి,
గాలిదప్ప(బ్బ)ఱ వెంట్రుకల్ దూలియాడ
నీలవెట్టుచు నుఱిఁ మెట్టఁ జూచుచును,
గుక్కలఁ బిలుచుచు, ఱిక్క వెట్టుచును,
నెక్కొన్న నొరగాల నిలుచుచుఁ జనుచు,
గొడ్డలి బరిగమ్మి గూటికుండయును
దుడ్డుగోలయుఁ బట్టి తొడిఁదొడిఁ గొన్ని
మేఁకపిల్లలఁ దనచాఁకిట నిఱికి
పీఁక దబ్బఱవాట్ల విసరిప్రేయుచును
గొన్ని మేఁకల రొప్పికొని వచ్చి తుమ్మ
నున్న కాయలు రాల్చియును, నంతఁ బోక
యిమ్మలఁ దనమీఁదికొమ్మొక్కగొల్ల
గ్రమ్మఱ నఱకంగఁ గలుషించి చూచి
"నామీఁదికొమ్మేల నఱకెద వోరి?
1 గామిడిగొల్ల! యీకాననంబునను

. గామిడి = గడుసరి.

మాకు నీ డై యున్న యీకొమ్మెకాని
చేకొని నఱకంగఁ జెట్టులు లేవె ?
శంకమాలితి క్రొవ్వి చక్క మైమఱచి
యింక నాచేత నీ వెట్లు సాఁగెదవు
పాపపుగొల్ల నిన్ బఱతుఁగా” కనుచుఁ
గోపించి తిట్టుడుగొల్లండు నవ్వి,
“బాపురే నిర్వాణి ! బాపురే తపసి !
బాపురే ! బాపురే కోపపుంజంబ
పాపంబు నొందెడు ; కోపించువాఁడు
పాపిగా కేనేల పాపి నయ్యెదను ?
స్ఖలియించు కోపాగ్నికణములఁ జేసి
కలఁగదే మానసఘనసరోవరము ?
యెసఁగెడు కోపాగ్ని నింకదే చెపుమ
మసలక హృదయాబ్జమకరందధార ?
వెలువడు కోపాగ్ని వేఁడిమిఁజేసి
నలఁగదే సచ్చిదానందపద్మంబు ?
జ్ఞానంబు సొంపొ ? విచారంబు పెంపొ ?
ధ్యానంబుఫలమొ యీతామసగుణము ?
నా కేమి సెప్పెద, వీ కాననమున
లేకున్నవే చెట్లు నీకుఁ గూర్చుండ ?
నిట్టిశాంతాత్మకు లెచ్చోటఁ గలరు !
పుట్టుదురే నిన్నుఁ బోల సంయములు !
వఱదవోవు నెలుఁగు [1] గొఱుపడం బనుచు
నెఱుఁగక యీఁత కాఁదేగి పట్టుడును
వడిఁ బాఱునెలుఁగంత వానిఁబట్టఁ
గడనున్న వాఁ ‘డోరి! విడువిడు’ మనుడు
‘విడిచితి నది దన్ను విడువ’ దన్నట్టి
వడువున విడిచిన విడుచునే మాయ ?

1. కంబళి.

పొంగి చిచ్చుఱుకంగఁ బోవుచుఁ జీర
కొం గోసరించు పెన్వెంగలియట్ల,
చెల్లఁ బో మ్మని సన్న్యసింపఁ బోవుచును
ని ల్లప్పగించు న[1]య్యిబ్బందియట్ల,
పదపడి నూతిలోఁ బడఁబోయి తాప
వెదకుచు మెట్టెడివీఱఁడియట్ల,
జ్ఞానాత్ముఁ డై సర్వసంగముల్ విడిచి
తా నాశ్రమముఁ గోరు తపసిచందమున,
నిల మరు ల్వోయె రోఁకలి గొనిరండు
తలఁ జుట్టుకొనియెదఁ దా నన్నయట్లు,
పానలేల చెఱకుపందెమం దొక్క
యూనె సిక్కిన నోడుటేకాదె తలఁప?
రోసి సంసారంబుఁ బాసి యెక్కింత
యాసించె నేనియు నది పెత్తిగాదె?"
యని తన్ను ముదలించుడును నెట్టయెదురఁ
దనతొంటి భావంబుఁ దాల్చినఁ జూచి
కనుమూసి తలవంచి కలయ లజ్జించి
ఘనతరశోకాశ్రుకలితాస్యుఁ డగుచు
"నెక్కడి భక్తి? నా కెక్కడి ముక్తి?
యెక్కడఁ జూచినఁ దక్కునే మాయ?
గతి మతిచైతన్య కర్మక్రియాదు
లతిశయం బై కల్గ నంతకుఁ దనదు
క్రియ యెట్టు లట్లు వర్తింపక శివుని
దయ వడయంగ నిశ్చయ మెట్లు వచ్చుఁ?
గనుఁగాయఁ ద్రెంచినఁ గా యగుఁగాక
పసనిపండగునయ్య భ్రాంతిఁ బొందినను
సాశ్వత కీర్తి నిశ్చల భక్తియుక్తి
యీశ్వరుకృప లేక యేల సిద్ధించు?

[1] ఇబ్బంది = అజ్ఞాని.

కటకటా ! నాయట్టి కర్మికి నిట్టి
పటునిస్పృహత్వంబు ప్రాప్తవ్య మగునె ?"
యనుచున్న మాదిరాజయ్య గారలను
గనుఁగొని మల్లయ్య గౌఁగిటఁ జేర్చి,
"కర్మవిదూర ! దుఃఖం బింత వలదు
కర్మల కేల మాకడకు రావచ్చు ?
నీవు మర్త్యమునకుఁ బోవుటకొఱకు
నీ వికల్పము లెల్ల నేమె చేసితిమి ;
ఏమిఁగారణ మనియెదవేని వినుమ :
యామహాదేవుని యానతిఁజేసి
వసుధకు సద్భక్తి వర్ధనార్థముగ
బసవండు నా నొక్క భక్తుండు వచ్చి
యున్నవాఁ ; డాతని యుదితగోష్ఠిస
మున్నతసుఖవార్ధి నోలలాడుచును
బరమశివాచారసరణి వట్రిల్లఁ
జరియింపవలయు నిద్ధరణిలో నీవు ;
ఎనయంగ నార్నూఱునేఁబదియేండ్లు
సనియె నీ విట వచ్చి సంయమితిలక !
యెన్న నింకేఁబదియేండ్ల కిక్కడికి
నిన్ను రప్పించికొనెద నిక్కవంబు ;
ఇటుగూడ నేడునూఱేండ్లకుఁగాని
యిట యున్కిగానేర దిప్పు డీప్సితము
నేమేనియును వేఁడు మిచ్చెద." ననుడు
నామల్లికార్జునయ్యకుఁ గేలుమొగిచి
"శ్రీయందమే పరస్త్రీ నిక్కవంబు
నాయువందమె మాయ కది జన్మభూమి
స్వర్గ మందమె యధ్రువం; బింక మోక్ష
వర్గ మందమె మున్న భర్గునిపదము
ఏమియు నొల్ల నీ వెఱుఁగవే దేవ !

స్వామి ! సర్వజ్ఞాన ! సకలేశ !" యనుచు
నంతంత సాష్టాంగుఁ డై మ్రొక్కి నిలుచు
నంత వారికృపఁ గళ్యాణంబునందు
బసవనియెదుటఁ బెంపెసఁగంగ నిలిచె.
నసముండు మాదిరాజయ్య తత్క్షణమ
యిట బసవఁడు సంగమేశ్వరునందు
సటమున్న పొడగాంచి సాష్టాంగ మెఱఁగి
మ్రొక్కునమ్మాత్రన ముందట నున్న
నక్కజం డగుచు సందండ మ్రొక్కుడును
వత్సలత్వంబు నివ్వటిలంగ నతులి
తోత్సవలీలమై నుల్లసిల్లుచును
నంచితలింగసుఖాపారసార
సంచితామృతవార్ధి ముంచి యెత్తుచును
బసవనిచేఁ బూజ వడయుచు నుండె
నసలార మాదిరాజయ్యగా ; రిట్టు
లీజగత్త్రయి సకలేశ్వర మాది
రాజయ్యగారి నిర్మలచరిత్రంబు
విస్తరించినఁ బ్రీతి విన్న వ్రాసినను
బ్రస్తుతభక్తి శుభంబులు పెందు.
ధీమణి ! సుజనచింతామణి ! బుధశి
ఖామణి ! ధర్మరక్షామణి ! శుద్ధ
శరణజనానందకరణ ! సత్పథవి
హరణ ! సంతతదయాభరణచేతస్క !
లలిత నిర్మలయశఃకలితదిగంత !
ఫలిత సద్భక్తి సమ్మిళితాంతరంగ !
రహితషడ్భావ ! విరచితసద్భావ !
మహిత తత్త్వార్థ సన్నిహితావధాన !
విదిత ప్రసాద సంవిత్సౌఖ్యభోగ
ముదితాత్మ ! సంగాఖ్య ! మృదితేంద్రియౌఘ !

ఇది యసంఖ్యాతమాహేశ్వరదివ్య
పదపద్మ సౌరభభ్రమరాయమాణ
జంగమలింగ ప్రసాదోపభోగ
సంగత సుఖసుధాశరధినిమగ్న
సుకృతాత్మ పాలుకురికి సోమనాథ
సుకవిప్రణీత మై శోభిల్లి తనరి
చరలింగ ఘనకరస్థలి విశ్వనాథ
వరకృపాంచితకవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చను బసవపురాణ మను కథయందు
ననుపమంబుగఁ దృతీయాశ్వాస మయ్యె.

చతుర్థాశ్వాసము

శ్రీగురులింగసుస్థిరదయాపాంగ !
యోగాత్మ ! భక్తిమహోత్తుంగ ! సంగ !

—: మడివాలు మాచయ్యగారి కథ :—

మఱియును మడివాలు మాచయ్య నాఁగ
నఱలేని వీరవ్రతాచారయుతుఁడు
శ్రేష్ఠుఁడు జంగమప్రష్ఠుఁడు న్యాయ
నిష్ఠురాలాప మహిష్ఠమండనుఁడు
నిష్ఠితేంద్రియగుణాన్వితుఁడు లింగైక్య
నిష్ఠాపరుఁడు సుప్రతిష్ఠితకీర్తి
భవిజనసంసర్గపథపరిత్యాగి
ప్రవిమలతత్త్వానుభవసుఖాంభోధి
పరగు భాషావ్రతపాలనశాలి
దరితషడ్వర్గుఁ డాస్థానంబుజ్యోతి
రజకజాత్యావృతప్రత్యక్షరుద్రుఁ
డజరామరుం డయోనిజుఁ డవ్యయుండు
శరణపదాంభోజ షట్పదుం డనఁగఁ
బరఁగి, హిప్పరిగె యన్పురవరంబునను
నుండంగ, బసవనియురుభక్తివార్ధి
నిండారి దెసలను నిట్టవొడుచుడుఁ
బొంగి లింగానందపూరితుం డగుచు
జంగమదర్శనాసక్తి నేతెంచి
బసవనిచేఁ బ్రణిపత్తి గైకొనుచు,
నసమజంగమకోటి కర్చ లిచ్చుచును,
బంటింపక వరువుఁబనులు సేయుచును,
గంటి నాచేతులకసివోవ వనుచు

బాస వట్రిల్ల సద్భక్తసంఘంబు
మాసినవస్త్రముల్ మఱి మోసికొనుచు
వేవుజామున నేఁగి వేఱొక్క రేవు
గావించి యుదుకుచు ఘట్టనల్ సేసి
శస్త్రసమేతుఁ డై సద్భక్తవితతి
వస్త్రముల్ రజతపర్వతభాతిఁ దాల్చి
వరిగొనివచ్చుచోఁ బురవీథి "భవులు
శరణులవస్త్రముల్ సంధిల్లి రేని
నోడఁ జాఁ బొడుతుఁ జుండో'' యనిఘంట
నాడాడ వ్రేయుచుఁ గూడఁ జాటుచును
మఠమున కేతెంచి 1 మఱుఁగు లన్నియును
గఠినము ల్గాకుండ ఘట్టించి మడువ
నట్టిచో జంగమం బరుదెంచి యడుగ
నెట్టి 2కట్టం బైన నిచ్చి మ్రొక్కుచును
నావస్త్రముల వార లడుగవచ్చినను
లేవన కందిచ్చు లింగసంపదను.
అంత సద్భుతచిత్తుఁ డై బసవండు
సంతతంబును విని సంస్తుతుల్ సేయ
"నలిభక్తతతివలువ లుదుకుచాకి
విలసితభక్తియు నిలఁ జెప్పఁబడియె
నదిగాక యేకాకి యన్మడివాలు
సదమలభక్తి భాషయు నొప్పెఁ గాని
యిట్టిసద్భక్తియు నిట్టిమహత్త్వ
మిట్టి సామర్థ్యంబు నెఱుఁగ మే'' మనుచు
సల్లీల ననిశంబు సంస్తుతు ల్సేయఁ
దెల్ల గానటు గొన్నిదినములు సనఁగఁ,
బఱతెంచుచో ముట్టుపా టైన నొకని
నఱిముఱిఁ జంపి మాచయ్య యున్నెడను-

1. తెలుపు చేసిన బట్టలు 2. వస్త్రము.

-: మాచయ్య తెరువరుని జంపెనని పౌరులు బల్లహునకుఁ జెప్పుట :—

వీరువారన కెల్ల వారును గూడి
ధారుణీశ్వరు సభాస్థలి కేఁగి మ్రొక్కి
"బల్లహ ! వినుము నీపట్టణంబునను
బ్రల్లదుం డొకచాకి బత్తుండ ననుచు
మొలఁ గఠారము గట్టి తొలఁగండు ద్రోవ
తొలఁగించు నేబల్లిదులఁ [1] బిఱుసనఁడు ;
చాటుఁ "జీరలమూట సంధిల్లి రేని
పోటు ముందఱ" ననిపోటులమాట
నంగళ్ళ నిలిపె బేహారము ల్మాన్చె ;
సంగడి నిటయట సరియింపరాదు ;
పురవీథి నెవ్వరేఁ బోయినఁ జూచి
పరిగొని కనుకనిఁ బాఱంగఁ దోలు ;
నెదురను బసి గుఱ్ఱ మేనుంగు బండి
యదియేమి పోద్దెమో కదియంగ వెఱచు
నల్లంతఁ బొడగని చల్లన నవసి
కల్ల వెల్లై పాఱుఁ గథ లేల ? నేఁడు
వింత వాఁడొకఁడు మున్వినమిఁగాఁ జేసి
సంతకుఁ బోవుచో సంధిల్లి నంతఁ
బొడిచి మీఁదికిఁ జిమ్మెఁ ; బొందియు నచటఁ
బొడలేదు ; మ్రింగెనో ! పోయెనో దివికి !
నట గార్య మెఱుఁగ మే మవనీశ ! వినుము.
ఇట వచ్చితిమి నీకు నెఱిఁగింప"ననిన
బసవనిదెసఁ జూచి పార్థివేశ్వరుఁడు
కసిమసంగుచు మహోగ్రత నిట్టు లనియె :
"నిది యేమివిపరీత మింక నెవ్వరికిఁ
బ్రదుకంగవచ్చు నీభక్తులచేతఁ ?
గోక లుదుకుచాకి గ్రొవ్వి యిప్పురము

1. లెక్క సేయఁడు.

లోకంబునెల్లఁ గల్లోలమాప్చెడిని ;
జాకికి నింతేల [1] ప్రడ్డలు ? జనులఁ
జేకొన కడిచెడుఁ జేరంగనీక ;
యిట్టిచోద్యంబు లేమెఱుఁగ మేనాఁట
పుట్టినఁ జీరలు మునుఁగునే చెపుమ ?
పురజనులకు మున్నె చరియింపరాదు
పరదేశి కింక రాఁబాసె మాపురికి ?
నెంతబల్లిదుఁడో నేఁ డ్వింతవాఁ డొకఁడు
నంత కేఁగఁగఁ జంపె శవమును లేదు
ఆకసంబున కేఁగు నట్టలుఁ గలదె ?
చాకి రక్కసిక్రియ జనుల మ్రింగెడిని.
తిట్టఁడు పలుకఁడు ముట్టినమాత్ర
నిట్టు సంపఁగఁ గూడునే పెఱవాండ్రఁ ?
బాడిఁ దలంపక బత్తుండ ననుచుఁ
బాడుగాఁ జంపు నీపౌరులనెల్ల"
ననుచుఁ బురోహితు లనుమతంబునను
దనయాకులఁ జూచి ధారుణీశ్వరుఁడు
"చాకి నచ్చోటన చంపుండు ; పొండు ;
కాక మ్రింగిన వానిఁ గ్రక్కన రండు !"
అనవుడు బసవఁ డి ట్లనియె నాతనికి :

—: బసవఁడు బల్లహునకు మడివాలు మాచయ్యమహిమఁ జెప్పుట :—

"విను మీఁదెఱుంగక వెడలనాడెదవు
లేకులు లోకుల కాకబులకుఁ
"జాకి చా" కని యేల సందడించెదవు ?
చాకియే యతఁడు ? సాక్షాల్లింగమూర్తి
కాక యేటికిఁ గనుకనిఁ బలికెదవు ?
కులజుండు నతఁడె యకులజుండు నతఁడె ;
కులము లేకయు నన్నికులములు నతఁడె ;

1. ఔద్ధత్యములు.

యానీలగళు నపరావతారంబు
గాన యాతఁడు సర్వగతుఁ డెట్టు లనిన :
సరసిజభవుజడల్ జన్నిదంబులుగఁ
బరఁగ భిక్షించిన బ్రాహ్మణుఁ డతఁడ ;
మహితాపవర్గ సామ్రాజ్యపట్టంబు
సహజంబ పాలించు క్షత్త్రియుఁ డతఁడ ;
కడఁగి దుర్భవకర్మఘటవహిత్రంబు
వడి భవాంబుధిఁ ద్రిప్పు వైశ్యుండు నతఁడ ;
యిల సత్క్రియారంభఫలములు గోసి
సొలవక నూర్చెడు శూద్రుండు నతఁడ ;
యాదిశక్తియ మున్నుపాదానముగను
నాదబిందులు గారణంబుగఁ దగిలి
వేడుక బ్రహ్మాండవివిధభాండములఁ
గూడ వానెడు నాఁటికుమ్మరి యతఁడ ;
హరియెమ్ము దండంబు నహిపతి త్రాడు
నరసింహు పెనుపగునఖరంబు గ్రొంకి
యవనిమోచినవరాహం బెఱ గాఁగ
నవనిఁ గూర్మంబును నల్లమత్స్యంబు
గాలమి ప్లేకోదకంబునఁ దిగిచి
లీల నటించునాజాలరి యతఁడ ;
చటుల సంసృతి జీవఘటచక్రకర్మ
పటుపరివర్తనభ్రమణంబుఁ గూర్చి
కీలు వొందించి యాక్రియ రాటనముల
వాలి యాడించు నావడ్రంగి యతఁడ ;
మును జీవ మను లోహమునకు జ్ఞానాగ్ని
నొనరఁగఁ బదనిచ్చు కనుమరి యతఁడ.
యిచ్చుచో నెఱిఁగి కల్లచ్చుల నూకి
యచ్చుల నొరగొను నగసాలి యతఁడ.
హరిణ మై రమియించు నజునిశిరంబు

శరమునఁ ద్రెంచిన శబరుండు నతఁడ.
హరిముఖ్యకృమికీటకాదిపశువుల
వెరవునఁ బాలించు వ్రేతేఁడు నతఁడ.
ప్రకటితకపటనాటకసూత్రములను
వికృతిప్రకృతు లార్చు వెండీఁడు నతఁడ.
కులనగంబులు నూకి జలధులు సల్లి
పౌలము వోడేర్చు నాబోయయు నతఁడ,
యేకార్ణవం బైనయెడ నజాచ్యుతులఁ
జేకొన కుదికెడుచాకియు నతఁడ.
మహితభక్తాళికి మడుఁగులు సేఁత
మహి నిప్డు మడివాలుమాచయ్య యనఁగ
నిన్నియుఁ దాన యై యిట్లున్న యతని
కెన్నెద వొకగులం బిది నీకుఁ దగునె ?
కారణపురుషావతారుఁ డాయయ్య
చారుచరిత్ర విస్మయ మెట్టు లనిన :
నరసింహశార్దూలకరిదైత్యచర్మ
పరిధానుభక్తులపరిధానవితతి
గాని యొం డుదుకఁడు, వానిని నంటఁ
గానీఁడు నితరుల ఘట్టించునెడను
భక్తుల చీరల భక్తుల కిచ్చు ;
యుక్తసద్భక్తినియుక్తి వట్రిల్ల
జంగమం బడిగిన సమకట్టు నిచ్చు ;
భంగిగా లింగసంపద దులుకాడఁ
జీరలువైచినవా రడిగినను
వారికిఁ దమతమవస్త్రంబు లిచ్చు ;
నటమీఁద నతని మహత్త్వంబు వినఁగఁ
గుటిలాత్ములకు సమకూడదు ; మఱియు
జీర లంటినమాత్రఁ గారించుభక్తుఁ
డూరకుండునె చంప కీరు వోయినను ?

వల దభిమానంబు వొలివుచ్చుకొనకు ;
మిల నొరులేల నీ వెత్తిపోయినను
జుట్టవ్రేలను జక్కఁ జూపఁగఁగలవె ?
యట్టేల ? వల." దన్నఁ గట్టుగ్రుఁ డగుచుఁ
"గారణంబులుఁ గథల్ గల్పింప కిచట
నూరక చూచుచు నుండు మీ" వనుచు
బసవని వారించి పాపాత్ముఁ డంత
వెస యామికులఁ జూచి "వే ఉపాయమునఁ

—: బిజ్జలుఁడు మాచయ్యను జంప నేనుఁగుఁ బంపుట :—

దొలఁగ కాతఁడు వచ్చుత్రోవన మీరు
తలఁగ కాతనిఁ దలతలమని నిలిచి
సమదాంధగంధగజంబుఁ బైకొలిపి
సమయింపుఁ" డనవుడు జను లుత్సహింప
మావంతు లేఁగి సామజముఁ బైకొలిపి
యావీరవరురాక కరికట్టి నిలువ_
నల్లంతఁ బొడగని యార్చి బొబ్బిడుచుఁ
"గల్లినాథుని భద్రగజమొక్కనరుని

—: మడివాలు మాచయ్య యేనుఁగును జంపుట :—

యేనికదున్నకు నేల వంకించు
మానవు ల్చావక మగుడుఁడో" యనుచు
గంటయుఁ గొడుపును గదియింపఁ దడవఁ
బంటించె నేనుఁగు బలమెల్ల నవిసె.
నంతటఁ బోక మానవంతులు నూక
నంతంత డగ్గఱ నంతకుమున్న
వెన్నున నెలకొని యున్నవస్త్రములు
ననభోమార్గంబునం దిఱియించి
చేతిగంటయు నంద చేర్చి మైవెంచి
చేతులు సమరుచు నేతెంచి చూచి
దండి యై మాంవంతుతండంబుఁ జంపి.

తుండంబుఁ జేపట్టి త్రోచి రాఁదిగిచి
యంజలిగుంజలి యల్లార్చి పేర్చి
భంజింపుచును వీరభద్రుండు దివిరి
వడి నృసింహునివైచువడువున వైచుఁ;
బడనీక లోచేతఁ బెడచేత వేయు;
నచ్చుగా నార్చుచు హరుఁ డిభదైత్యు
వ్రచ్చినగతి వ్రచ్చి వందఱలాడుఁ;
గోపించి విష్ణునికోలెమ్ము రుద్రుఁ
దేవునఁ దునిమిన ట్లిల నెమ్ము లేఱు;
మాలకు మాంసంబు మఱి గోడారికిని
దోలును గాకుండఁ దొలఁగంగ వైచి
త్రోవ నేతెంచుచోఁ దొలఁగనిబాస
గావున నతులవీరావతారుండు
నిమ్మార్గమున భక్తులెల్ల నుప్పొంగ
నమ్మదకరి పొడవడంచి యాక్షణమ
"యెవ్వండు నామీఁద నేనుంగుఁ గొలిపె
నవ్వసుధేశుక్రొవ్వడఁతుఁ బో" మ్మనిన
నింతవృత్తాంతంబు నెఱిఁగి బిజ్జలుఁడు
నంతకమున్న మో మల్లన వంచి
బసవనిదెసఁ జూడఁ బరమహర్షమున
వసుధేశునకు బసవనమంత్రి యనియె:
"వల దని వారింపవారింప వినక
చలమునఁ బంచితి జనులమాటలను;
నేనుంగుఁ గోల్పడె; మానంబు వొలిసెఁ;
దూనిక చెడె; శివద్రోహంబుఁ దగిలె;*
పెరవఱి మార్కొన్నఁ బొరిగొంద్రు, వెఱచి
శరణన్నఁ బ్రోతురు హర భక్తవరులు
గాన యిన్నియుఁ జెప్పఁగాఁ బనిలేదు
ఘూనాథ! మనవలతేని, లే, పొదము;

కలియుగరుద్రుఁడుగాక మాచయ్య
తలఁపఁగ మర్త్యుఁడే ధరణీశ ! యిదియ
కజ్జంబు" నాపుడు బిజ్జలుఁ డంత
లజ్జయు సిగ్గును బుజ్జగింపంగ

-: బసవన్న బిజ్జలుని మాచయ్యకడకుఁ బిలుచుకొనిపోవుట :-

'నవ్వుఁగాక' యని వచ్చి యఖిలంబు నెఱుఁగ
భువి సమాస్తాంగము ల్వ్రాండ నల్లంతఁ
బడియున్న, బండారి బసవయ్య వచ్చి
మడివాలుమాచయ్యయడుగుల కెరఁగె ;
ననమానలీలఁ బెం పెసఁగఁ గీర్తించి
బసవఁ డి ట్లని విన్నపముసేయఁ దొడఁగె :
"వల దని వారింపఁ జలమున ముక్కు
వాలియించుకొన్నట్టు [1] వురులు వోనాడి
యిక్కడ రానోడి యెప్పటఁగోలె
నక్కడ సాష్టాంగుఁ డై యున్నవాఁడు ;
పక్షికిఁ దొడ నేల పాశుపతంబు ?
ఈక్షితీశ్వరుఁ డన నెంతటివాఁడు ?
ఎదురు నీ కెవ్వఁ డీరేడులోకముల ?
సదయాత్మ ! యీతప్పు సైరింపవలయు."

-: మాచయ్య బిజ్జలుని యేనుఁగును బ్రదికించుట :-

నని విన్నంచిన నట్ల కా కనుచు
జననాథు లెమ్మనఁ బనిచి తత్క్షణమ
యట్టయుఁ బొట్టయు నస్థులుఁ గూడఁ
బెట్టించి జనులు విభీతు లై చూడ
భసితంబు దునియలపైఁ జల్ల, యతని
యసమగజేంద్రంబు నొసఁగి తొల్నాఁడు
పొడిచివైచినపీనుఁ గుడుపీథిఁ దాఁకి
పడ, నపు సభ భయభ్రాంతు లై బెదర

1. ఔద్ధత్యముదక్కి.

బొందికిఁ బ్రాణంబుఁ బోసి మాచయ్య
యందఱుఁ జూడంగ నంతరిక్షమున
నున్నవస్త్రముఁకు వెన్నొగ్గి జనులు
సన్నుతిసేయఁగఁ జనియెఁ జాటుచును.
బసవఁడు మాచయ్య పాదము ల్గొలిచి
యసమాను మఠమున కనిచి యేతెంచి
సకలనియోగంబు జనపాలకుండు
ముకుళితహస్తులై మ్రొక్కుచు నుండ;

—: మాచయ్య బసవనిగీతమును విని కోపించుట :—

నంత మాచయ దొంటియట్ల సద్భక్తి
సంతతసత్క్రియాస్పదలీల నడవ
మఱికొన్ని దినముల కఱ లేక బసవఁ
డఱిముఱి నొకగీత మానతిచ్చుడును
భక్తులు దనయొద్దఁ బాడఁగఁ దడవ
"యుక్తియే" యనుచు మహోగ్రతతోడ
'శివశివ' యని కేలు సెవులఁ జేర్చుచును
'నవినీతుఁ డిట్టుండె హా కల్లినాథ!
చెల్లబో? దీనులఁ జేసి శరణుల
కెల్లను దా నొక యిచ్చువాఁ డయ్యె;
నెన్నఁడు గ్రోతి యయ్యెను? వెక్కిరింప;
నెన్నఁడు గఱచె? నిం కెక్కడిభక్తి?
దోసంబు గాదె! భక్తులు దీని వింద్రె?
బాసలు గీసలు వాట వాడకుఁడు
మాయొద్ద" ననుచును మాచయ్య గినిసి
కాయకంబున కరుకంగ నిక్కడను

—: బసవన్న మాచయ్యకడ కేఁగి మన్నింప వేఁడుట :—

నంత నంతయు విని యాత్మలోఁ గలఁగి
యంతంత ధరణి సాష్టాంగంబు లిడుచు
బసవఁడు భక్తజనసహాయుఁ డగుచు

వెస నేఁగుదెంచి భయసమగ్రవృత్తి
మడివాలుమాచయ్య యడుగులపొంతఁ
బడమి సర్వాంగముల్ వొందంగ మ్రొక్కి
"యాక్రాంత సంతతాహం కార నిరతు
నక్రమాలాపు నిర్వక్రాపరాధు
నూర్జితక్రోధు వివర్జితసత్యు
దుర్జనాచారు ననిర్జితకాము
నజ్ఞానపుంజంబు నపగతశౌచు
విజ్ఞానహీను వివేకవిదూరు
నిర్భాగ్యచూడామణిని భక్తిరహితు
దుర్భావకు నవినీతుని నన్ను నింకఁ
గాచి రక్షింపవే కారుణ్యపాత్ర !
యేచినమద్గర్వ మెల్ల మాయించి
లాలితంబుగ నాల్గు లక్షలమీఁద
నోలి నిర్వదినాల్గువేలగీతములు
గావించు టది యెగ్గు గని యేవగించు
భావన నా కయ్యె నీవు గైకొనమి ;
నాయతప్రీతి నో యనకున్న నింకఁ
జా ! యనవయ్య నాసంగయ్య దేవ !"
యనుచు నిట్లాత్మనిందాతిదీనోక్తు
లను విన్నవించుడు విననట్ల వినియు
జంగమపరతంత్రుఁ డంగావిగారి
లింగదమాచఁ డాలీఢశౌర్యుండు
"నధముఁడా ! క్రొవ్వితే ? హరభక్తు లరయ
నధములే ? నీ వొకయర్థాధిపతివె ?
యడిగెడువారు లేకయ్య ! నీ వింత
బడగ వైతివి; మజ ! బాపురే !" యనుచు
"నట్టియాచకుల నే నటు గందుఁగాని
యిట్టిత్యాగులఁ గాన మేలోకములను ;
బాన లిన్నియు నేల ? బసవ ! నీయిచ్చు

నేనికదున్నలు నిలఁ బచ్చమన్న
గుఱ్ఱపుగాడిదల్ గుటిలంపుసతులు
నెఱ్ఱకోకలు ప్రాఁతియే శఠులకు ;
నీదిక్కుఁ జూడుమా నాదుజంగమము
పేదఱికములేని పెల్లు సూపెదను
నది గొ” మ్మనుచుఁ జల్ల నందంద నెగయు
సదమలోదకకణజాలమంతయును
మరకత నీలనిర్మల పుష్యరాగ
వరవజ్ర విద్రుమ వైడూర్యముఖ్య
వినుతరత్నాచలవితతి యై వెలుఁగ
నినుఁడు ఖద్యోతమ ట్లటివిరిఁ దోఁప
నట పౌరు లత్యద్భుతాక్రాంతు లగుచు
నిట బిజ్జలుఁడుఁ దారు నేతెంచి చూడ
నమరి మాచయ యుండెఁ బ్రమథప్రసాద
విమలపుష్పాంచితవృష్టి పైఁ గురియ
బసవని నభిమతఫలములఁ దనుప
నసమాక్షుఁ డర్చితుఁడై యున్నయట్లు
జంగమం బొప్పె నాలింగావతార
సంగతి మాచయ్య సద్భక్తిమహిమ
మెఱుఁగఁగఁ జాలక యిన్నిరూపములు
వఱలఁగఁ దాల్చినతెఱఁగునుబోలె
నట్టిజంగమసభాభ్యంతరాళమున
నొట్టిన రత్నంపుఁదిట్టలకఱుత
భక్తుల కేనసూ బండారి నన్న
యుక్తి నబ్బసవరా జుండె ; వెండియును
వారక యా మడివాలుమాచయ్య
గారల శ్రీపాదకంజంబులకును
మున్ను సాష్టాంగుఁడై మ్రొక్కుచుఁ జేరి
సన్నుతి సేయుచు శరణు వేఁడుచును

"నీమహత్త్వముఁ జూడ నే నెంతవాఁడ?
ధీమణీ! సంగయ్య! దేవ! సర్వజ్ఞ!
నీవు శంకరుఁడవు నేను గింకరుఁడ;
నీవు నిర్మలుఁడవు నేను దుర్మలుఁడ;
నీవు విజ్ఞానివి నే నవిజ్ఞాని;
నీ వమృతాంగుండ వే విషాంగుండ;
నీవు మహాదాత వేఁ గృపణుండ;
నీవు పశుపతివి నేఁ బశుజీవి;
స్వామి! త్రైలోక్యచూడామణి వీవు
భూమి నిర్భాగ్యచూడామణి నేను;
బోరి నిట్టి దుర్గుణంబుల ప్రోఁకలోన
నరయంగఁ గలదె నాయందు సద్గుణము?
రక్షింపు మిట్టిగర్వప్రాప్తు నన్ను;
శిక్షింపవే యయ్య! జియ్య! నాదైన
యపరాధశతసహస్రావలి సైఁచి
విపరీతమహిమాఢ్య! వేయును నేల?"
యనుచున్న బసవన్న నందంద కౌఁగి
టను జేర్చి కారుణ్యవనధి నోలార్చి
"కలుగునే కాదె లింగంబునందైనఁ
దలఁపఁ గోపప్రసాదంబులు రెండు
చేరింటికైనఁ జెచ్చెరఁ గడవఁగొను
వారు సేపట్టరు వాయించికాని
ధర నంతకంటెను దమభృత్యవితతి
నొరయక చేపట్టుదురె యట్లు గాక
యందులమాలిన్య మడఁపఁగఁ గాక
యెందుఁ జీరల కల్గునే రజకుండు?
అట్టిద బసవయ్యఁ బట్టి మాచయ్య
ధట్టించి నిర్మలత్వంబు నొందించె;
నెన్నంగ వేమాఱు నెంతగాఁచినను

వన్నెక్కఁగాదె సువర్ణంబు మిగుల ।
నింతింతగాఁ జేయ నిక్షుఖండంబు
నంతకంతకుఁ దీపు లధిక మౌఁగాదె ।
అంపానిఁ గోసిన ఉాచిన నెఱయఁ
గంపెక్కఁగాదె శ్రీగంధంబునకును ।
ఉాచిన మడివాలుమాచయ్య యొరసి
చూచుడు బసవయ్య శుద్ధసద్భక్తి
తనరంగ నేఁడుగదా । తుదముట్టె. ”
ననుచు భక్తాళి కీర్తన సేయుచుండ
ముకుళీకృత వికంపితకరాబ్జుఁ డైన
సుకుమారు బసవయ్యఁ జూచి మాచయ్య
“విను మహంకారించినను భక్తి యగునె ?
విని యెఱుంగవె పురాతనులలోపలను—*

—: మాచయ్య బసవన్నకు నిమ్మవ్వకథఁ జెప్పుట :—

“[అదియునుగాక] నిమ్మవ్వ యనంగ
సదమలసత్క్రియాస్పదభక్తి నిరత
యకుటిల వీరవ్రతాచారయుక్త
ప్రకటజంగమలింగ పరతంత్రచిత్త
సంసారరహిత నిష్కళ మహిమావ
తంస సజ్జనసముద్యద్గుణోపేత
పూరభక్తులిండ్లకు నర్ఘ్యపణ్యములు
కరమర్థి మోచుచుఁ గాయకం బలర
గొడుకు భక్తులయిండ్లఁ గోవులఁ గావ
నుడుగక కాయకోద్యోగలబ్ధమున
జంగమాసక్తి లసద్భక్తియుక్తి
సంగతి దినములు జరపు చున్నెడను

—: సిరియాలుని కథ :—

నంచితమతి సిరియాలుండు నాఁగఁ
గంచిలో నిత్య జంగమము లేవురకు

నిష్టాన్నపానాదు లీప్సితార్థములు
దుష్టిగా నందిచ్చుశిష్టవ్రతమునఁ
జరియించు చుండంగ, సర్వేశ్వరుండు
సిరియాలు భక్తిలోఁ దరయఁగఁ దలఁచి
కృతక తపోధనాకృతి నేఁగుదేర
హితజంగ మార్థమై యేతెంచి సెట్టి
మస్తకవిన్యస్తహస్తుఁడై తపసిఁ
బ్రస్తుతింపుచుఁ బదాబ్జంబుల కెరఁగి
"స్వామి ! వే వేంచేయవే ! మహాపురుష !
నీమనుమనినిత్యనేమంబుసలుప"
నని విన్నవించుడు న త్తపోధనుఁడు
"ననఘ ! మాయిచ్చ సేయఁగ నోపుదేని
నింతకంటెను సుఖం బెద్ది మా" కనుచు
సంతసంబందుచు సదయుఁడ పోలె
సిరియాలుఁ గరుణాభిషిక్తుఁ జేయుచును
నరమాంస మొక్కొక్క వెరవున నడుగ
"సర్వజ్ఞ ! మీమనోజ్ఞంబై నయట్టి
సర్వలక్షణగుణ సంపూర్ణుఁ డొక్క
వరపుత్త్రుఁ డున్నాఁడు, నరమాంస మింకఁ
బొరుగింటికిని విల్వఁ బోయెదనయ్య ?
యరుదైన మీవ్రతోద్యాపన నేఁడు
కరమర్థి జెల్లింతు [1]క్షణముగో" మ్మనుచు
నడుగులఁ బడి సిరియాలుండు దపసి
నొడఁబర్చి యింటికి వడి నేఁగుదెంచి
తన సాధ్వి కొయ్యన తత్కార్యధార
వినిపింప "నీ వేల వెఱచెద'' వనుచు
సంగళవ్వయు నప్డు చదివెడుపుత్త్రు
మంగళం బలరఁ గ్రమ్మనఁ దోడితెచ్చి

1. భోజనార్థమై చేసిన ప్రార్థనము.

"మనయింటఁ బండువుదినము నేఁ" డనుచుఁ
గనుఁగొని వధ్యశృంగారంబు సేసి
బాలుని ముక్తివిలోలు సిరాలు
లీలయుఁబోలెఁ దల్లియును దండ్రియును
నిండారుమనమున లిహతుఁ గావించి
ఖండించి నానాప్రకారము ల్గాఁగ
శాకంబు లొడఁగూర్చి జను లెర్గకుండ
శ్రీకంఠమూర్తిఁ జెచ్చెరఁ బిల్చి తెచ్చి
శ్రీపాదయుగళాభిషేకంబు సేసి
యాపాదజలము లత్యర్థిఁ బ్రాశించి
సంచితోన్నతసుఖాసనమున నునిచి
మించి యర్చించి పూజించి వడ్డించి
యంగనయును సెట్టి సాష్టాంగ మెరఁగఁ,
బొంగి తాపసి శాకములు వేఱువేఱ
పరికించి చూచి యేర్పడ శిరోమాంస
మరపి యెయ్యెడఁ గాన కంత ని ట్లనియె.:
"తలసూచియైనను దనయునిమీఁది
వలపు దక్కింపంగ వచ్చుఁబో మ్మనియొ
తల దాఁచుకొన్నారు; తగవయ్య! బాలు
తల గొని యిఁక మీరు ధన్యులు గారు;
ఏమియు లేదు శిరోమాంస; మిట్లు
నేమంబునకుఁ జెల్లునే? యాగమోక్తి
దాన "సర్వస్య గాత్రస్య శిరః ప్ర
ధానం" బనెడుమాట గానేర దింక"
ననవుడుఁ బతియును సతియు బెదరి
"యనఘ! మహాత్మ! యి ట్లానతిఁ దగునె?
యుపమింపఁ గేశదుష్టపరీతశాక
ముపహతం బనఁబడునో యని వెఱచి
పుచ్చితి; మదియు నిప్పుడు చందనంగ
పెచ్చెరఁ బాకంబు సేసెఁ దా" ననుచు

మఱితెచ్చి యాశిరోమాంస మర్పింపఁ
గఱకంఠమూర్తి గన్గొంట వీక్షించి
"యిల నెట్టియన్నదాతలు నిన్నుఁ బోలఁ
గలరయ్య! యింతయుఁ గడుసొంగ మయ్యె;
నేనాఁటఁ బ్రతి వోల్పులేని యభీష్ట
దానంబు సేసితి; దీనికిఁ దగఁగ
నీవలపట మేము నీవు దాపటను
దేవతార్చనములు దీర్చి సపంక్తిఁ
గడుఁ బ్రీతితోడ లింగప్రసాదంబు
గుడువనినాఁడు నా కొడఁబాటు గాదు;
కంటి మంటి నని యాకాంక్ష నిదేమి
కొంటిమో తింటిమో కొడుకుమాంసంబు
నిచ్చ సేయంగ ము న్నిచ్చినక్షణము
పుచ్చుకో నీవ యేఁ బోయెద నింక."
ననవుడు సెట్టి భయభ్రాంతిఁ బొంది
వనితఁ జూచుడు "నింక ననుమాన మేల?
ర" మ్మంచు లింగార్చనమ్ము సేయించి
క్రమ్మన వడ్డింపఁగాఁ దపోధనుఁడు
"నతిథిపూజలు సేయునవసరంబునను
సుతులును దారు నుత్సుకలీలతోడఁ
బొత్తునఁ గుడుతు ర ట్లుత్తమపురుష;
లిత్తఱి నీకైన నెట్లు సేయాడు;
నిప్పుడు గానరాఁ దేఁడ మీసుతుఁడు
చెప్పమే యిప్పుడు సిరియాల! నీకు
నెన్నఁబుత్త్రులు లేనియింట మా కెట్టు
లన్నదానముఁ గొన నర్హమౌ చెపుమ!
ధృతి 'నపుత్త్రస్య గతి ర్నాస్తి' యనఁగ
గతిహీనులిండ్లఁ గుడుతురె సంయములు?
కాన పుత్త్రుఁడు గలఁడేని పిల్పింపు;

లేనినాఁ దొల్లము పాన లే?" లనినఁ
జకితదేహుఁ డగుచుఁ జయ్యన మ్రొక్కి
"యకలంక! మీ రప్పు డన్నారు; నేను
విన్నాఁడఁ; బుత్త్రుఁడు నున్నాఁడు; సదువు
చున్నాఁడొ! యాడుచునున్నాఁడొ! పిదపఁ
జనుదెంచి మఱి మీప్రసాదంబు వాఁడు
గొనియెడుఁగాక; భోజన మాచరించి
రక్షింపవే యోగిరములు శాకములు
అక్షయాత్మక! చల్లనారకయుండ"
ననుచు మ్రొక్కుడును దదంగనఁ జూచి
"పనిచిన 'నౌఁగాక' యని పిల్వరాదె?
తల్లి పిల్చిన రాని తనములు గలరె?
తెల్లంబుగా నాల్గుదిక్కుల నిలిచి
యెలుఁగెత్తి పిలువుమా యేము వినంగ
నలరుచు రాకేమి యట్లయుండెడినొ?"
యనవుడు "నుత్తరం బాడంగ నేల"
యనుచు నేతెంచి తూర్పాదిగా నిలిచి
చెలఁగుచుఁ దాపసి చెప్పినయట్లు
లెలుఁగెత్తి సుతుఁ దల్లి పిలువఁగఁ దొడఁగెఁ:

—: సంగళవ్వ కొడుకును బిలుచుట :—

"పూర్వజన్మార్జితభూరికర్మముల
గుర్వణఁగించు నాకొడుక! రావయ్య!
దక్షిణాధీశ్వరుదర్ప మడంచు
దక్షత గల్గు నాత్మజుఁడ! రావయ్య!
విరసపశ్చాజ్జన్మ మరణదుఃఖములు
పొరిమాల్పఁ జాలు నాపుత్త్ర! రావయ్య!
యుత్తరం బేలు నుదాత్తయోగీంద్రు
చిత్తంబునకు వచ్చుశిశువ! రావయ్య!
యలరు నాకోపభోగాతీతపదము

లలవడె నేఁడు నాయయ్య ! రావయ్య !
దండధరోద్దండ దండప్రశక్తి
ఖండింపనోపు పుత్త్రిండ ! రావన్న !
పాయనివ్యామోహపాశబంధములు
కోయంగఁజాలు నాకుఱ్ఱ ! రావన్న !
ద్రవిణాదికేషణత్రయ విజృంభణము
తవులనఁ బడనినాతండ్రి ! రావన్న !
సురరాజనుతుఁడు విశ్రుతతపోవేషి
వరదుఁడైనాఁడు నావడుగ ! రావన్న !
యంతకాంతకమూర్తి యగు[1] తవరాజు
సంతసంబంద నాసామి ! రావన్న !
ఘోరనిస్సార సంసారవారాశి
పార మీఁదించుపాపండ ! రావన్న !
యంచితాగణ్య పుణ్యప్రాప్తి నమరు
కాంచీవిలాసు నగ్రజుఁడ ! రావన్న !
దివిజకన్యకలతో దివి ముక్తికన్య
కవయనున్నది భక్తికాంతుండ ! రావె !
దండడి మీయయ్య దక్షిణభుజము
నందంద యదరెడి నన్న ! రావన్న !
ఖానుఁ డెంతేనియుఁ బడుమట వ్రాలె
శ్రీనిలయుండ ! నాసీరాల ! రావే !
స్వాదొంద నర్థేశసఖునిసన్నిధిఁ బ్ర
సాదంబుఁ గొనఁగ నాగాదిలి ! రావె !"
యనుచు నాలుగుదిక్కులందు నందంద
తనయునిఁ బిల్చుశబ్దంబులోపలను
జనిత మై దిక్కులసంజ్ఞలు దోఁప
వనితాలలామ విల్వంగ, నంతటను
గుండలంబులు గ్రాలఁ గూఁకటి వ్రేల

1. తాపసి.

మండనం బొలయ సౌమ్యపుఘంట లులియ
రావిరేకయుఁ దూల ఖావంబు వోల
నావిధియు నదల హర్షంబు వొదల
నందెలు మ్రోయ మోక్షాంగన డాయ
సందేహ ముడుగ నాశ్చర్యంబు దొడుగఁ
జూపఱు గీర్తింప సురలు శంకింపఁ
దాపసి వీక్షింపఁ దండ్రి మైవెంపఁ
దల్లి గౌఁగిలి సాఁపఁ ద్వరితంబు దోఁప
ముల్లోకములుఁ జూడ ముద్దు దుల్కాడఁ
బఱతెంచె సుతుఁడు; నప్పాట నీశ్వరుఁడు
కఱకంఠుఁ డజుఁ డుమాకాంతుఁ డుగ్రాక్షుఁ
డక్షరుం డాసిరియాలుకట్టెదుర
నాక్షణంబునన ప్రత్యక్షమై నిలువ,
నంతలో సిరియాలుఁ డతివయు సుతుఁడు
నంతంత ధరణి సాష్టాంగులై మ్రొక్కి
కలగని మేల్కన్నకరణి నద్భుతము
దళుకొత్తఁ జెలఁగి కీర్తనలు సేయఁగను
"శ్రీశ వాణీశ సురేశ సన్మునిగ
ణేశ దిశాధీశు లెలమి నంకింప
నారుద్రగణములు నాపురాతనులు
వీరభద్రాదులు సేరి కొల్వంగ
సద్భక్తు లతులితోత్సవలీలఁ దనర
నద్భుతాక్రాంతాత్ము లై నరు ల్వొగడ
నలరి చందనసంగ నాష్టవర్గంబు
నల తిరువెంగాణినంగఁ దత్సఖుల
నంచితమతి సిరియాలు నీరాలుఁ
గంచేడువాడలుఁ గైలాసమునకుఁ
బ్రవిమలకనకదివ్యవిమానపంక్తి
దివిఁ దేజరిల్ల నద్దేవదేవుండు

గొనిపోయెఁ, గైలాసమున సిరియాలుఁ
డనుపమప్రమథగణాస్థానమందు
భవుఁ జూచి తనుఁ జూచి ప్రమథులఁ జూచి
భువిఁ దనపెట్టిన పుత్త్రినిఁ జూచి
"పుడమిఁ బుత్త్రినిఁ జంపి మృడునిచే మగుడఁ
బడసి కైలాస మేర్పడఁ జూఱ గొనిన
యిటువంటివాఁ డెవ్వఁడేఁ దొల్లి యిపుడు
నట యిట గలఁడె నాయట్టి భక్తుండు
ఏన కా" కని మది నెంతయుఁ గ్రొవ్వి
తా నహంకారించి తలఁపంగఁ దడవఁ
జిఱునవ్వు నవ్వుచు శివుఁ డది యెఱిఁగి
'చిఱుతొండ ర'మ్మని చెయివట్టికొనుచు
నిమ్మహీతలమున కేతెంచి యపుడ
క్రమ్మఱ నిమ్మవ్వకడ నిల్వఁబడుడుఁ—

—: నిమ్మవ్వ కథ :—

బడఁతియు బిట్టుల్కిపడి సంభ్రమమున
నడుగుల కెరఁగి పాదాబ్జముల్ గడిగి
యంగన ప్రచ్ఛన్నలింగమూర్తులకు
సాంగోచితక్రియాభ్యర్చనల్ సేసి
పంచభక్ష్యంబులుఁ బాయసాన్నాదు
లంచితప్రీతిఁ గావించునయ్యెడను,
భువిఁ బథశ్రాంతులుఁబోలె సెట్టియును
శివుఁడును వెడ నిద్ర సేయుచున్నెడను
నిమ్మవ్వ యర్ఘ్యపణ్యమ్ముల కేఁగఁ
గ్రమ్మన గోవులఁ గాచి బాలుండు
నలసి యాఁకొని వచ్చి "యమ్మమ్మ!" యనుచు
దలుపుగట్టను నూకి తల్లి లే కున్న
నటయిట వరికించి యం దొక్కఁబూవె

కుటిలాత్ముఁ డై పుచ్చికొని నమలంగ,
నంతటిలోన నిమ్మవ్వ యే తెంచి
యంతంతఁ 'జీ ! కుక్క !' యని యిల్లు సొచ్చి
"పడుచు పాపముచేసె మృడునోగిరములు
దొడికిలి తినె శివద్రోహి వీఁ" డనుచుఁ
బచ్చిచెక్కలఁ దలఁ బగులంగ నడిచి
చచ్చినపీనుఁగు జఱజఱ నీడ్చె
నన నేల ? పుత్త్రమోహంబు సీమంత
యును లేక కొడుకు చా వొరు లెర్గకుండ
గాడిలోపల వైచి కసువు పై డిగిచి
వేడుక మదిఁ దులుకాడంగ మఱియుఁ
బాకయత్నము సేయ, బాలునిచావు
నేకాంతమున శివుఁ డెఱిఁగింపఁ దలఁచి
"చిఱుతొండ ! చూచితే ! చిత్ర మివ్వనిత
తఱుసంటి యాఁకలి ధరియింపలేక
క్రమ మెర్గఁ డొకబూరె గ్రక్కున డిగిచి
నమలెనో నమలఁడో నాతి వీక్షించి
'పాకమింతయు వృథాపాకంబు సేసె
యీకుక్క ద్రోహి వీఁ డేల నా' కనుచు
నఱిముఱిఁ బట్టి నిజాత్మజుఁ జంపి
జఱజఱ నీడ్చి యాచక్కటి వైచె
నదె చూడు" మనుచుఁ బాదాంగుష్ఠమునను
బొదివిన కసువెల్ల బోవనూకుడును
జూచి శిరఃకంప మాచరించుచును
నాచిఱుతొండఁ డత్యాశ్చర్య మందె.
నంగన పాకప్రయత్నాంతమందు
జంగమములకు మైజలకంబు సేసి
యతులలింగోపచర్యల నర్చ లిచ్చి
యతివ వడ్డించు నయ్యవసరంబునను

నింతి పుత్త్రునిఁ జంపు టెఱుఁగనియట్ల
యంతకాంతకమూర్తి యప్పు డి ట్లనియె :
"నింతి ! నీపుత్త్రుఁడా యింతకమున్న
నెంతయు నాఁకొని యిట సీరిచీరి
యెక్కడ వోయెనో ? యె ట్లున్న వాఁడొ ?
యక్కటా ! డస్సెఁ గదమ్మ ! బాలుండు
కరుణమాలినయట్టి కాంతవు గదవె ?
హరహర ! చెయ్యాడ దారగింపంగఁ ;
బెంపమే కానమే బిడ్డలఁ దొల్లి ?
యింపౌనె కీడు మే లింట నేమేని
వండినఁ దిన ; నెట్టివారైన శిశువు
లుండంగఁ దార కై కొందురే యిట్లు ?
కనికరం బింతయు మనసున లేక
వనిత ! మా కేటికి వడ్డించి తవ్వ !
పసిబిడ్డ లుండంగఁ బాడిగా దిట్లు
మసలక సుతుఁ బిల్వుమా యోల నివల."
ననవుడు "న ట్లగు నగు నాఁటదాన
ననియె చూచెదవయ్య ! యయ్య నీమాయ
లెఱుఁగుదు నెఱుఁగుదు నే బేలఁ గాను ;
కఱకంఠ ! యిది యేల కథలు వన్నెదవు ?
ననుఁ జూచి సిరియాలుఁ డని తలంచితివా ?
పనియులే దారగింపక పోవరాదు ;
ప్రామిఁడియై మేడుపడియెడు దానఁ
గామి నీవెఱుఁగవే [1] కడయింటిపొడువ
కామించి సుతుఁ జంపి క్రమ్మఱఁ బిలువఁ
గామారి ! నీయిచ్చు కైలాస మొల్లఁ ;
దనద్రోహమునఁ జేసి తాఁ బోయెఁ బొలిసి ;

1. వ్యామోహముగల సంసారి. (ఇట సిరియాలునకు విశేషణముగా నన్వయింపఁ దగును.)

గొనకొని యాద్రోహిఁ గూడునే తలఁప?''
నన సిరియాలుండు విని యంత శోక
వనధిఁ దేలుచుఁ దలవంచి లజ్జించి
యడఁకుచు నిశ్చేష్టితాత్ముఁడై యుండఁ,
బడఁతి నిర్మలభక్తి భాతికి మెచ్చి
యంతకుమున్న నిజాకృతిఁ దాల్చి
యంతకాంతకుఁడు ప్రత్యక్షమై నిలువ
"నోహో! యిదేమయ్య! యుచితమె యిట్టు
లాహా! మహాత్మ! మహాత్ములగుణమె?
యఱిముఱిఁ జన్నుఁబా లర్థించి యేడ్చు
చిఱుతచే నొకపిండికఱు డిచ్చి తల్లి
తనచన్ను మఱపించి కొనిపోయినట్లు
చనరాదు నిమ్మిచే సందేహపడకు;
మొదలికిఁ బ్రాణంబు నొడలు ప్రాణమున
కొడఁబడియున్నట్టు లుభయనామములు
నమరెడు లింగజంగమమూర్తి విడిచి
భ్రమకు హేతువులగు భావము ల్దాల్ప
నవ్వరే నిన్నును నన్నును భక్తు
లివ్వేడబంబులకెల్ల లోనైన
నేల యీబాహ్యరూపులే నేమి నిన్ను
పోల వెల్తిగ మున్న సూచితినయ్య!
ముక్కంటి వై మఱి మూఁడునుగన్న
లక్కజంబుగ నున్న నవియు లేకున్న
హరరూప మైయున్న నరరూప మైన
గురురూప కాదె సద్గురుసన్నిహితులు!
కఱకంఠ! యి ట్లేల కళవళించెదవు?
వెఱవకు వెఱవకు వేఱకాఁదలఁప
వేయేల గుండయ్య ప్రాయంబు వడయ
నేయజ్ఞుకప్పుతో నేఁగితి చెపుమ?

భోగయ్య యింటికిఁ బోయిననాఁడు
ఏగౌరిసహితమై యేఁగితి చెపుమ ?
దాసయ్యచే వస్త్రదానంబు గొనఁగ
నేసోమకళఁ దాల్చి యేఁగితి చెపుమ ?
మానకంజారుని మందిరంబునకు
నేనంది నెక్కి నీ వేఁగితి చెపుమ ?
యీచిఱుతొండని యింటికి నీవు
నేచతుర్భుజముల నేఁగితో చెపుమ ?
కావున నీచమత్కారము ల్మాను ;
మీవేడబము లెల్ల నే మెఱుంగుదుము ;
ఎట్టైన నుండు మీ విట్టారగింపఁ
బెట్టుదు ; నీయాన ప్రిదిలితినేని." ;
యనుచు నిష్ఠించి నిమ్మవ్వ వల్కంగ
మనసిజాంతకుఁడు మెల్లన నవ్వు దనర
"నట్టైన నవుఁగాక" యని యారగింపఁ
బెట్ట నాసిరియాలసెట్టి కి ట్లనియెఁ :
గడుభక్తిఁ జందేశ కాటకోటాదు
లడరంగఁ దండ్రుల నాప్తులఁ దప్ప
నడచినఁ జంపరే ? నఱకరే మగుడఁ
బడయరే ? వేఁడరే ప్రత్యక్షమైన ?
విను మట్లుఁగాక ద్రావిడదేశమందుఁ
జనినపురాతన శరణులలోన

—: నరసింగనయనారుని కథ :—

నరసింగ మొన్నయనారనురాజు
ధరణి మద్భక్తుఁ డాతని యగ్రమహిషి
కరమర్థి నాయూరిపరమేశుఁ గొలువ
నరుగుచోఁ బూజార్హమగుపుష్ప మొకటి
పుచ్చి మూర్కొనుడును 1 బువ్వులవడుగు

1. పూజారి బాలుఁడు.

నచ్చెల్వనాసికం బప్పుడ కోయ
నచ్చోటి కప్పుడ యచ్చోడనృపతి
వచ్చుడు సతితోడ వనితలు మ్రొక్కి
"దేవ ! తప్పేమియుఁ గావింప దిచట
దేవి వోవుచు నొకపూవు మూర్కొన్న
లింగార్థమై యున్న చెంగల్వపూవు
నంగన మూర్కొనె నని ముక్కుఁ గోసి
వైచె నీపూజారివడు'' గని చెప్ప
"నోచెల్ల ! తగ దిట్టు లుచితమే నీకు"
ననుచుఁ బూవులవడ్డు నప్పుడ పిల్వఁ
బనిచి "నీ కిది భక్తిపాటియే వడుగ !
యెట్టివివేకి వై తిటమున్న పువ్వు
ముట్టినచెయి మొట్టమొదటికిఁ గోసి
మఱికదా కోయుట మగువ నాసికము ?
ఎఱుఁగవు నిన్ను నా కేమనఁ గలదు ?''
అనుచు నిజాంగన నచటికిఁ బిలువఁ
బనిచి భూపతి వాఁడి బాడిత యెత్తి
''నిన్ను నీ వెఱుఁగక యన్నెక్కి కొవ్వి
మున్నీశ్వరార్థమై యున్న పూవునకుఁ
జాఁచిన చెయ్యేది సక్కన నపుడు
చాఁచినట్లే చాఁపు చాఁపు ర'' మ్మనుచు
ముట్టిన యంగుళుల్ మొదలికి నఱికి
పట్టఁ జూచిన మణికట్టు ఖండించి
తివిచినమోచెయ్యిఁ ద్రెవ్వంగ నడిచి
యవిచారమున మొదలంట వదల్ప
నత్తఱి నేము ప్రత్యక్షమై నిలిచి
తుత్తునకలై యున్నయత్తన్వి చేయి
మును గోసివైచినముక్కును నొసఁగి
జననాథునకు నంత సామీప్యముక్తి

యిచ్చినఁ గైకోఁడె యీజనవ్రాత
మచ్చెరువందుచు నర్థిఁ గీర్తింప !

—: కొట్టరువు చోడని కథ :—

నట్టునుగాక మున్ పట్టంబుదేవి
కొట్టరువందు మాకొల్చుఁ గుడ్చుడును
గర్భిణినాక తద్గర్భంబులోని
యర్భకు సహితంబ హరియింపఁ దడవఁ
గోరి మోక్షము వేఁడికొనఁడె మెచ్చినను
నారచోడఁడు ! మఱి యట్లనే మెచ్చి
భంగిగా నభిమతఫల మడుగు మనఁ
గింగాణమును జేయ దంగనఁ జూడు !
తప్పుసేసిన మహోద్ధతభక్తియుక్తిఁ
దప్పేమి నంపెఁ బో తన్వి దనూజు
నడుగంగవలదె ప్రత్యక్షమైయున్న
యెడ ? నింతిమాహాత్మ్య మే మనవచ్చు ?
నడిగినఁ జంపితి ; వడుగఁ దనూజు
మడియించి పిల్చితి ; మఱి పిల్వ దతివ ;
యిట్టిట్టిభక్తు లనేకు లుండంగ
నెట్టయా సిరియాల ! యేనకా కంటి
భక్తితో గర్వించి పలుకుటయెల్ల
యుక్తియే ?" యనుచుఁ దద్భక్తవత్సలుఁడు
బాలుని నంత సప్రాణుఁ గావించి
కైలాసమున కన్చెఁ గమనీయలీల.
"జంగమలింగ పూజనము వీక్షింప
భంగిఁ జతుర్వర్గ ఫలములకంటె
నుత్కృష్ట" మని ధర నుండె నిమ్మవ్వ.
సత్క్రియలందెల్లఁ జనునె గర్వోక్తి ?
యట్టిదకాక యహంకరించినను
బట్టిచ్చునే భక్తి బసవకుమార !" *

యని యిట్లు మాచయ్య యతిభక్తియుక్తిఁ
జనిన సద్భక్తులచరితము ల్దెలిపి
బుద్ధులు నీతులుఁ బోలంగఁ జెప్పి
పెద్దైనగర్వంబు పెల్లు మాయించి
మెఱుఁగులఁ గన్నులు మిఱుమిట్లువోవ
వఱలెడు రత్నపర్వతము లర్థి
నాజంగమంబున కర్పించి బసవ
రాజు వీడ్కొలుప నిరంతరభక్తి
నబ్బసవండు వాదాక్రాంతుఁ డగుచు
నుబ్బుచు భక్తాలియును దాను నరిగె.
నప్పౌరు లెల్ల సాష్టాంగులై మ్రొక్కి
"తప్పదు దేవర దా నీతఁ" డనుచుఁ
గరములు నిజమస్తకంబులఁ దాల్చి
యరిగిరి ధారుణీశ్వరుఁడును దారు.
మహిఁ దొంటియట్టుల మాచయ్య భక్తి
మహిమమైఁ ద్రిభువనమాన్యుఁ డై యుండె.
మడివాలుమాచయ్య మహనీయచరిత
మడరంగఁ జదివిన నర్థి మై విన్న
హరుభక్తి బుద్ధి దృష్టాదృష్టసిద్ధి
సరసవచశ్శుద్ధిసంపద లొందు.
గురుభక్తివిస్తార ! గురుభక్తిసార !
గురుభక్తిపరతంత్ర ! గురుభక్తితంత్ర !
జంగమసుఖకృత్య ! జంగమభృత్య !
జంగమహితచర్య ! జంగమధుర్య !
లింగార్చనాసక్త ! లింగసద్భక్త
లింగలీన ! ప్రాణలింగధురీణ !
సత్ప్రసాదోపాంగ ; సత్ప్రసాదాంగ
సత్ప్రసాదపరీక్ష ! సత్ప్రసాదాక్ష
సర్వస్థలైకభాస్వద్భక్తిసౌఖ్య !

సర్వస్థలైకభాస్వర సంగనాఖ్య ।
ఇది యసంఖ్యాత మాహేశ్వరదివ్య
పదపద్మసౌరభభ్రమరాయమాణ
జంగమలింగ ప్రసాదోపభోగ
సంగత సుఖసుధాశరధినిమగ్న
సుకృతాత్మ పాలకురికి సోమనాథ
సుకవిప్రణీత మైశోభిల్లి తనరి
చరలింగ ఘనకరస్థలి విశ్వనాథ
వర కృపాంచింత కవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చనుబసవపురాణ మనుకథయందు
ననుపమంబుగఁ జతుర్థాశ్వాస మయ్యె.

పంచమాశ్వాసము

శ్రీకర ! భక్తిరత్నాకర ! దోష
భీకర ! విమలగుణాకర ! సంగ !

-: కిన్నరబ్రహ్మయ్య కథ :-

ఇమ్మహి వెండియు నీశ్వరభక్తుఁ
డిమ్ములఁ గిన్నర బమ్మయ నాఁగ
వీరవ్రతైకనిష్ఠారమణుండు
సార శివాచార పారాయణుండు
లోకైకపూజ్యుఁ డలోకానుసారి
యేకాంతభక్తిమహిష్ఠ మండనుఁడు
నఘటితనాద విద్యాపండితుండు
నఘవినాశనకారణావతారుండు
విదితకారుణ్య సముదితానురాగ
హృదయుండు, సర్వజీవదయాపరుండు
సల్లలితుం డన శరణమార్గమున
కెల్లయై భక్తిమహిష్ఠతఁ బరఁగి
భక్తులకును వర్వుఁబనులు సేయుచును
వ్యక్తిగాఁ బొండూర యుక్తిపెంపునను
గాయకంబులు పెక్కు గఱచుటఁజేసి
వేయువిధంబుల విత్త మార్జించి,
నిర్వంచకస్థితి శర్వభక్తులకు
సర్వధనంబులు సమయంగ నంతఁ
గ్రీడార్థమై మఱి కిన్నరవీణ
వేడుక నొకనాఁడు వివిపింపఁ దడవఁ
గిన్నరేశ్వరవంద్యుఁ డన్నారదాది
సన్నుతనాదానుషక్తుండు మెచ్చి

పరఁగంగఁ గిన్నరబ్రహ్మయ్య నాఁగ
ధరణిఁ బేరిచ్చి నిత్యముఁ బడిగాఁగ
నొక్కమాడయురూకయునుబాతికయును
మక్కువఁ గరుణింప మహి నరు ల్వొగడఁ
జేకొని జంగమానీకంబునకు స
దాకాలముజను సర్పితము సేయుచుండ,

:- కిన్నరబ్రహ్మయ్య బసవనియొద్దకుఁ బోవుట :-

బసవనియసమ సద్భక్తిసౌరభము
వసుధపై వెల్లివిరిసి దెస ల్గప్ప
రాగిల్లి కిన్నరబ్రహ్మయ్య సనియె
వేగంబె బసవని వీక్షించువేడ్క ;
బసవఁడు గిన్నరబ్రహ్మయ్యరాక
యొసకంబుతో సంగమేశ్వరునంద
కని యెదురేఁగి చక్కన చాఁగి మ్రొక్కి
యనునయోచితసత్క్రియాదులఁ దనిపెఁ ;
గరమొగ్గి పాదోదక ప్రసాదములు
నిరతిశయప్రీతి నిత్యంబుఁ గొనుచు
సవిశేషతత్త్వానుభవభవ్యగోష్ఠిఁ
దవులుచు బసవఁ డుత్సవలీల నింద
నంత వినోదార్థమై యొక్కనాఁడు
సంతోషచిత్తుఁ డై చని కిన్నరయ్య
యాపురంబునఁ ద్రిపురాంతకదేవు
గోపురాంతరమునఁ గూర్చున్న యెడను-

—: గొఱియ కథ :—

వారాంగనార్థమై వధియింప విలిచి
కోరి మిండం డొకగొఱియఁ జేపట్టి
యవ్వీథిఁ జనఁ జనఁ ద్రివ్వంగఁ ద్రాడు
ద్రెవ్వడు గొఱియ దద్దేవాలయంబు

పఱతెంచి సొచ్చెడుఁ బైపడి వాఁడుఁ
బఱతేరఁ గిన్నరబ్రహ్మయ్య గాంచి
"పోవక నిలునిలు బొప్ప ! యీగొఱియ
దేవాలయముఁ జొచ్చెఁ జావున కోడి ;
యింకఁ జంపుట దోస ; మిట్లు గాదేని
కొంకక వెలసెప్పి కొనుము రెట్టైన ;
మృడుభక్తు లొప్పింతురే శరణన్న
జడనరులైనను జంపంగనీరు ;
చరజీవులకు నెల్లఁ జావును నొప్పి
సరియకాదే యెందుఁ జర్చించి చూడ ;
నీకు దీనిని జంప నేమమే ! చెపుమ ;
యాకాంత దీనినే యచ్చొత్తినదియె ?
పడయరానిది భువిఁ బసిఁడియ కాదె ?
కడుఁగాక మాడైన నడిగిన నిత్తు
నడెకొమ్మ" నావుడు "నక్కటా ! యిట్టి
చదురుండుఁ గలఁడయ్య జగతిలోపలను ;
గుడి సొచ్చి మడి సొచ్చి గుండంబు సొచ్చి
విడుతురే గొఱియల విలిచినవారు ?
త్రోవ నడెట్టులు దొలఁగకవచ్చు ?
నీవకా కిబ్భువి నీతిమంతుఁడవు—
ఏఱుఁగ మే మెన్నఁడు నిటువంటి వెందుఁ ;
గొఱగాదు దడసినఁ గోపించు లంజె ;
'పెట్టెద వెల' యని బిగిసెడుఁ బెద్ద ;
యిట్టి దయాపరుఁ డెచ్చోటఁ గలఁడు ?
చరజీవులకునెల్ల జావును నొప్పి
సరియె తా ననియెడుఁ జర్చింప నట్ల
మనుజులప్రాణంబు మఱి వేయుమూడ
లననేల యిన్నియు నతఁడు బొంకెడినె ?
వేయిచ్చియైనను విడిపించు గొఱియ

యీయయ్యసంపఁగఁనీఁడు వా" మ్మనుచుఁ
బోవవచ్చిన "బొప్పః పోవకు"మనుచు
వేవేగఁ దెప్పించి వేయుమాడలను
నిచ్చి "బొంకినఁ బోవనీఁజుమ్మురోరి ;
యచ్చొత్తి విడుతు నే నటమీఁ దెఱుంగ"
ననవుడు 'నౌఁగాక' యని మాడ లెన్ని
కొని లంజెయింటికిఁ జనిచని మగిడి
"గొఱియలేకున్నఁ బెద్దఱిక మేః" యనుచు
మఱియొక్కగొఱియఁ గ్రమ్మఱవిల్చికొనుచు
బోయినఁ జొరనీక పొలఁతి గోపించి
"చాః యెట్టిమిండఁడ చనుసను మింక ;
సరివిటుల్ నవ్వంగఁ జక్క నాయిల్లు
చొర సిగ్గుగా దెట్లు శూన్యంపుగొల్ల ;
చదివెదు వెక్కులు శ్లాఘ్యమే ? పసిఁడి
వెదవెట్టఁ బంతు నే వీథులనెల్ల ;
నిప్పిరో ! లంజెర్కమే యిట్లు నీకు
దుప్పి కట్టుదుగాక దొంతరలెల్ల
బ్రతుకంగనోపునే పడఁతి యీసారె
నెదిరి నేమనఁ జాలు నే లింకఁ బదువు
బొజుఁగులు గొఱియలఁ బోకార్పఁగలరు ;
ప్రజలకుఁ దనకును బట్టుగ్రాసంబు
మజ ! బాపురే ! లంజె మనెడుఁ బొ మ్మనఁగ
గుజగుజలకు నెల్ల గుఱియైతి నింక ;
నగుబాటు వట్రిల్లె నాతులలోన
మొగమెత్తనేర్తునే ? ము న్నెఱుఁగవాకొ !
యభిమానకత్తె దా నగుట నీ" వనుచు
నభిమాన మెడలంగ నతివ సల్కుడును
"బాయఁ జూపెనుఁబెనుఁబండువులందు
వేయేల గొఱియల వేయుమాడలకు
విలిపించి మఱి కదుపులభంగిఁ దెత్తు ;

వలసినంతర్థంబు వ్యయమున కిత్తుఁ ;
జిన్న వోనిత్తునే చెలువలలోనఁ
జెన్నుగాఁ బండువుసేయు మీ" వనిన
"వేల్పుల కని మున్ను విలిచినగౌఱియఁ
బొల్పడి తేకున్నఁ బండువుసేయ
వెఱతుము సంపునో వేల్పు ద"మ్మనిన
నఱిముఱి 'నట్లగా' కనుచుఁ దత్ క్షణమ
కామాంధునకు నొక్కగార్యంబుఁ గాన
రామి దెల్లముగాన రయమున వచ్చి
గౌఱియఁ బట్టుడుఁ దద్ద గోపించి చూచి
పరువడిఁ గిన్నరబ్రహ్మయ్య యెదిరి
"పట్టుకుపట్టకు బసవరాజాన
పట్టినఁ దలఁ దెగఁగొట్టుదు నింక ;
1 నంజుదురే శరణాగతవజ్ర
పంజరం బిదియె మా భక్తులబిరుద"
మనుచు డగ్గఱుడు వాఁ డలుగు వెర్కినను
గినిసి రౌద్రోద్రేకమునఁ బొంగి వ్రేసి
నిశితఖడ్గాయుధనిహతుఁ గావింపఁ
బశుపతిగుడి వెలిఁ బడియె శిరంబు
'బాస హీనునిబొంది వాడియే శివు ని
వాసంబునం దుండ దోస' మన్నట్టు.
లట్టయు నీడ్పించి యగడ్త వైపించెఁ
గట్టలు గట్టి మూఁకలు సూచుచుండ.
నంత నావృత్తాంత మక్కర్మిబంధు
లెంతయు విని తమయిచ్చలో వగచి
తగువారుఁ దామును ధరణీశుఁ జేరి
వగచుచు నేడ్చుచు జగతీశు కనిరి :
''త ప్పేమియును లేదు దమవాఁడు గౌఱియ
చొప్పునఁ జని గుడినొచ్చి పట్టుడును

1. వెనుకాడుదురే.

భక్తుఁడు గిన్నరబ్రహ్మయ్య నాఁగ
శక్తిమంతుఁడుగాన చంపె" నావుడును
సర్వేశ్వరుండు గోపోద్రేకవహ్ని
పర్వ ని ట్లని పల్కె బసవయ్యఁ జూచి.
"హరుభక్తు లధికదయాపరు లండ్రు ;
నిరపరాధులఁ జంప నీతియే మీకు ?
మనుజులఁ బ్రోలిలో మననీరు గాక
పనియేమి గొఱియలకును మీకుఁ జెపుఁడ
'మామీఁద నొకరాజు మఱి చెప్పఁగలఁడె ?
భూమిలో' న న్నట్లు వాడిచి వైచెదరు ;
రాజులకు నిరపరాధులఁ జంపు
టోజయే? భక్తుల కుచితంబు గలదె ?
కాలఁ దన్నుట మాంసఖండంబు లిడుట
బాలునిఁ జంపుట తాలవైచుటయుఁ
గులములు సెడిపోయి కుడుచుట దండ్రి
తలఁ దెగఁగొట్టుట దవ్వి నిచ్చుటయుఁ
దమ్ము దొరలఁ జాల ధర్మంబు లండ్రు ;
ఎమ్మెయిఁ దగదండు రెదిరి దొరలిన
మీర యేలుదురు గా కీరాష్ట్రమెల్ల ;
ధారుణి యేలంగఁ దమ కింకఁ బాసె ?
నప్పటి కప్పటి కది యేల వెఱవ
నొప్పుకో రాజ్యంబు ద ప్పేమి?" యనుఁడు
"గజ్జంబు మీఁదెఱుంగక పల్కెల్ల
బిజ్జలక్షోణీశ ! పెద్దఱికంబె ?
ధర్మము ల్కర్మలు దప్పుదు ; రెందు
ధర్మముల్ భక్తులు దప్పరు ; వినుము :
కిన్నరబ్రహ్మయ్య సన్నుతకీర్తి
పిన్నవాఁడే యూర కున్నను జంప ?
నట్టేల ? యె ద్దినె ననుటయు గొందిఁ

గట్టుద మనువారు గల రెట్లు సెపుమ ;
యేర్పడఁ గార్యాంశ మెఱుఁగుము ; మాట
లార్పుము ; తగువారి నరయఁగఁ బంపు ;
మఱి యెందుఁబోయెడు మర్యాద లెల్ల
నెఱుఁగుదు గా కేమి యింతయు." ననినఁ
దన ప్రధానుంఁ జూచి ధారుణీశ్వరుఁడు
పనిచినఁ ద్రిపురాంతకునిగుడి కేఁగి
కిన్నరబ్రహ్మయ్యఁ గన్నంత మ్రొక్కి—
"యన్నన్న ! తగునె ? నీయట్టిభక్తుండు
హింసకు లోనౌట కేమి కారణము ?
సంసారి నేటికి సరిచేసికొంటి
విగ మెడ దుఱిమెద విది యేమి వుట్టె ?
జగములలో రిత్తసడి వచ్చె నీకుఁ ;
గొఱగాని జఱభుల కొయ్యనగాండ్ర
గొఱియల వార్తలు గూడునే త్రవ్వ ?
భూమీశ్వరుఁడు మమ్ముఁ బుత్తెంచె నరయ ;
నే మని చెప్పుదు మింక ?" నావుడును
"నివియేల పెడమాట లిన్నియు వాఁడు
తివియఁ దివియఁ ద్రాడు ద్రెవ్వదు గొఱియ
గుడిసొచ్చుడును— 'బట్టఁగూడదు దీని
విడువుము ; కాదేని వెలచెప్పి కొనుము
ఇమ్మడి ముమ్మడి యిచ్చెద' ననిన
నెమ్మెయి నొల్లక 'యిట్టిభక్తుండు
వేయిచ్చియైవను విడిపించుఁ గాని
యీయయ్య గొనిపోవనిచ్చునే ?' యనిన
'విండ్రె యీ మామాటలు వేయుమాడలకుఁ
గొండ్రె యెచ్చటను గొఱియ' నన్నట్టు
వెక్కసం బందంగ వేయుమాడను
జక్కఁగ నెన్నితిఁ జౌకంబు ద్రోచి
'యెప్పాట మడిగిన నీఁజుమ్ము' రనుచుఁ

జెప్పి యచ్చొత్తితి శివలాంఛనంబు ;
కాంత ద న్నెంతయుఁ గడవఁ బల్కినను
నెంతయుఁ గొన్నాఁడ నే ధనం బనక
కొండొక ప్రొద్దుండి వెండి యేతెంచి
మిండండు బసవనిమెడఁ ద్రాడు వెట్ట,
వల దని వారింప నలుగు వెఱికినఁ
దలఁ ద్రుంచివైచితిఁ ; ద ప్పెవ్వరిదియొ ?
యట్టొట కీ త్రిపురారియె సాక్షి :
పట్టినఁ బలికింతు నిట్టని చెప్పఁడ"
యనవుడు నతివిస్మయాక్రాంతు లగుచు
జననాథునకు నిట్లు వినుపింపఁ దడవ
"నద్దిరా ! భక్తుని 1 యఱగొడ్డెతనము
విద్దె లాడెడుఁగాక విందుమే తొల్లి ?
విపరీత మిందఱు వినఁ 'బలికింతుఁ
ద్రిపురారి' ననుటెల్లఁ గపటమో నిజమొ
చూతముకాక !" యంచును బిజ్జలుండు
నేతెంచె నధికవిభూతి భాతిగను
బసవఁడుఁ గిన్నరబ్రహ్మయ్య పాద
బిసరుహాక్రాంతుఁ డై ప్రీతి యెలర్ప
'శృంగారములకీలు శివుకరవాలు
మంగళత్వ మునికి మానంబు మనికి
విజయంబుత్రుళ్ళు వివేకంబుపెల్లు
నిజగుణస్తుతి యూఁత నిష్ఠలచేఁత
సత్యంబుభాతి యాస్థానంబుజ్యోతి
ప్రత్యయంబులరాజు భావుక మోజు
యాగంబుతునియ విరాగంబుగనియ
యాగమంబుల తెల్ల హర్షంపుటెల్ల
శాంతంబుప్రోగు సజ్జనభక్తిబాగు
దాంతత పెంపు ప్రతాపంబుసొంపు'

1. బింకము ; ధైర్యము.

నని యసమానసమంచితార్థముల
వినయపూర్వకముగా వినుతి సేయుచును
నుండంగ, నఖిలనియోగంబు గొలువఁ
దండతండముల భక్తవ్రాజ మలర
గుడివడు గటమున్న కుంచియకోల
పొడసూప కేఁగినయెడఁ గిన్నరయ్య
దరహసితాస్యుఁడై తలుపులదిక్కు
నరగంట నొక్కింత యఱలేక చూడ
నఱిముఱి నటమున్న యప్పురాంతకుఁడు
వెఱచి తల్పులు వాఱఁదెఱచెఁ జోద్యముగ ;
“దాసికిఁ దెఱచె మున్ దలుపు లనంగ
నాసకలము విందు మది గానఁ బడియెఁ ;
దనరుచుఁ ద్రిరాంతకునికవాటములు
గనుఁగొన నంతలోనన పాసి పడియె ;
బాపురే ! కిన్నరబ్రహ్మయ్య యింక
నోపుఁబోఁ బలికింప నీపురాంతకుని’’
ననుచుఁ జూపఱు గనుఁగొని ప్రస్తుతింపఁ
జనుదెంచి బ్రహ్మయ్య సంతోష మలర

—: కిన్నరబ్రహ్మయ్య పిలువ శివుఁ డో యని పల్కుట :—

“మనసిజక్రీడాంతమునఁ జెయివ్రేసి
వనితపాలిండ్లు నీ వని నిశ్చయించి
యడరఁగ నాతఁ ‘డయ్యా !’ యని పిలువ
నొడయనంబన్నకు నోయన్న శివుఁడ !
వెలయఁగ దాసమయ్యలవాదులోన
నిలఁ బిపీలికయందుఁ బలికిన శివుఁడ !
మున్ను బాపూరిబ్రహ్మన్నకుఁ బలికి
జొన్నలు నీవ యై యున్న శంకరుఁడ !
పలుకవే నాబారిఁ బాఱి’’ తన్నట్టు

అలుఁగు[1] మోహణమున హస్తంబు దొడిగి
కిన్నరబ్రహ్మయ్య పెన్నుదుల్కాఁడఁ
పన్నగధరుమహాభక్తులఁ దలఁచి
యాయతి నభిముఖుం డై "త్రిపురాంత
కా" యని పిలుచుడు "నో" యనుచుండె.
బిట్టులిక్కి మూర్ఛిల్లి[2] బిమ్మిటిఁ బొంది
నెట్టోడి లింగసన్నిహితులు దక్క
ఖగమృగోరగ నరకరితురగాదు
లగు సమస్తచరాచరాది జంతువులు
నుక్కఱి ప్రగ్గి యట్లున్నవి యున్న
చక్కటిఁ బ్రాణము ల్గ్రక్కున విడిచె;
నాకటకం బిట యట కానఁబడియె;
లోకంబులెల్లఁ గల్లోలంబు నొందె;
నీక్షితి గంపించె; నినుఁ డస్తమించె;
నక్షత్రములు డుల్లె; నగములు ద్రెళ్ళె;
నంబుధు లింకెఁ; గూర్మంబుఁ దలంకె;
నంబరం బిల మ్రొగ్గె; నహిపతి స్రగ్గె;
ననిలుండు దొలఁగె; స్వాహాపతి మలఁగె;
వనజనాభుఁ డులికె; వనజజుఁ డలికె;
సమసుప్తిఁ బొందించి జగములఁ ద్రుంచి
ప్రమథులు లోకముల్ దమమయంబుగను
నాడుచుఁ బాడుచు నసమానలీలఁ
గ్రీడింప మఱియు సత్క్రియ దులుకాడ
నవికలానేకభక్తావళి వేర్చి
సవిశేషగతి మహోత్సవములు సలుప
బాయక రేయును బగలును గూడ
మ్రోయంగ నేడ్దినంబులు సన్నపిదప
భువనోపకారార్థబుద్ధిమై బసవఁ

1. పిడి. 2. స్పృహతప్పుట.

దవిరళగతిఁ గిన్నరన్నకు మ్రొక్కి,
'సజ్జనశృంగార ! సత్యగంభీర !
యిజ్జగదాధార ! యీశ్వరాకార !
మంగళగుణధామ ! మహిమాభిరామ !
లింగాభిరూప ! యభంగప్రతాప !
నిర్జితాహంకార ! నిఖిలోపకార !
దుర్జనదూర ! విధూతసంసార !
కారుణ్యపాత్ర ! యకల్మషగాత్ర !
వీరవ్రతాచార్య ! విపరీతశౌర్య !
యంచితాగణ్య ! నిరంతరపుణ్య !
సంచితసుఖలీల ! శరణవిలోల !
సన్నుతకీర్తి ! సాక్షాద్రుద్రమూర్తి !
కిన్నరబ్రహ్మయ్య ! కృపసేయు" మనిన
బసవయ్య చేవ్రేసి ప్రహసితుం డగుచు
నసమాక్షుఁజూచి 'హే' యనుచు వారింపఁ
దొల్లిటియట్ల యద్భుతలీల నడరె ;
నెల్లలోకములు మహిష్ఠతఁ బరఁగెఁ ;
గటకంబు సూడ నెప్పటియట్ల ప్రబలె ;
నిటచరాచరజీవు లెల్లను బ్రదికె.
బిజ్జలు డంతలో బిమ్మటి దెలిసి
యజ్జనౌఘముఁ దాను సాష్టాంగ మెరఁగి
"యభయమే జియ్య ! యత్యద్భుతకీర్తి !
యభయమే దేవ ! మహామహిమాఢ్య !
కిన్నరబ్రహ్మయ్య ! గీర్వాణవంద్య !
కన్నులు గానని కష్టలోకులము ;
అజ్ఞానజీవుల మపగతమతుల ;
మజ్ఞల ; మధికసర్వాపరాధులము ;
కడసన్న నీదువిఖ్యాపితమహిమ
కడ యెఱింగెద మనగా మాతరంబె ?
నీయాజ్ఞఁ దలమోచి నిటలలోచనుఁడు

'నో'యనెఁ బిలిచిన; 'హో'యన్న నుడిగె;
నింతటిలోన నీరేడులోకములు
సంతాపవర్తన సమసుప్తిఁ బొందె;
నిప్పుడు గరుణింప నిట్లులసిల్లెఁ;
జెప్పఁ జిత్రముగాదె యెప్పాటనైనఁ
బరఁగంగ నిహలోకపరలోకములకు
హరుఁడవు నీవ; శంకరుఁడవు నీవ;
భవుఁడవు నీవ; సద్భక్తుండ వీవ;
భువిలోన మఱి సెప్పఁ బోల్పంగఁ గలదె?
నిద్దంబుగా నీట నద్దము వాల
నద్దము మా కింక నన్యథా లేదు;
ఒక్క మాకేల, బ్రహ్మోక్తజీవులకు
నిక్కంబు దెస దిక్కు నీవ కా వెట్లు;
కావున మముఁ గటాక్షప్రేక్షణమున
భావింపవే కృపాభావం బెలర్ప.''
ననుచు మఱియు మ్రొక్కి యభినుతి సేయఁ
గనుఁగొని దరహాసకలితాస్యుఁ డగుచుఁ
''గఱకంఠుభక్తుల కఱగొఱలేక
వెఱచి బ్రదుకు వొమ్ము వేయును నేల!''
యని మును విశిరస్కు డైనమానవునిఁ
జను లెల్లరు నెఱుంగ సప్రాణుఁ జేసి
చనియెఁ గిన్నరబ్రహ్మ శరణుండు భక్త
జనులును బసవఁడు ననురాగమంద;
'నిశ్చయం బీతఁడే నిటలాక్షు' డనుచు
నాశ్చర్యహృదయుఁ డై యరిగె బిజ్జలుఁడు;
అంత నట్టులు గిన్నరయ్య సద్భక్తి
కాంతుఁడై త్రిభువనఖ్యాతి మై నుండెఁ.
బసరింపఁ గిన్నరబ్రహ్మయ్యచరిత
మసలారఁ జదివిన నర్థిమై విన్న

భక్తియు సకలవిరక్తియు సహజ
భుక్తియు నభిమతభోగము ల్గలుగు *

—: మోళిగమారయ్య కథ :—

మఱియును మోళిగమారయ్య యనఁగఁ
గఱకంఠు సద్భక్తగణ విలాసంబు
ప్రచ్ఛన్నరుద్రుఁ డవిచ్ఛిన్నకీర్తి
స్వచ్ఛసదాచారసంపత్ప్రపూర్తి
విజితకామక్రోధవిమలమానసుఁడు
నిజగతి లింగైక్యనిష్ఠాపరుండు
మంగళచరితుఁడు లింగసందర్భుఁ
డంగవికారదూరైకవర్తనుఁడు
సవిశేషజంగమార్చనపరతంత్రుఁ
డవికలవిధినిషేధవివర్జితుండు
ప్రవిమలాంగుఁడు నిష్ప్రపంచగుణాఢ్యుఁ
డవిరళతత్త్వానుభవసుఖాంభోధి
కర్మాపహరుఁడు లింగప్రాణమథన
మర్మజ్ఞుఁ డన లసన్మహిమఁ బెంపారి,
యనయంబు నతులఘోరాటవి కేఁగి
ఘనతరంబుగ మోచి కట్టెలు దెచ్చి
యంగడి విక్రయం బార్చి తెప్పించి
జంగమారాధన సలుపుచు నుండు ;
రసరసాయనములు బసవని నగర
నసలాస భోగించి యాదటఁబోక
జంగమకోటి నిచ్చలు నొక్కమాటు
భంగిగా నారగింపఁగఁ బెట్ట వచ్చి
"బసవ ; మారని యట్టిభక్తులు గలరె ?
వసుధలో నీయింటిరసరసాయనము
లతనినగరఁ గాంచు నంబకళంబు

ప్రతివచ్చునే యెన్ని భంగులనైన ?
ననిశంబు నతని కాయకలబ్ధి యెంత
యన నేల ? నేఁడు నాఁ డనక తూమెండు
సంతతంబును గూడు జంగమకోటి
సంతుష్టి సేయు టాశ్చర్యంబు గాదె ?
బాపు ! మోళిగమార ! భక్తివిస్తార !
బాపురే" యని మ్రోలఁ బ్రస్తుతి సేయ
నసలార విస్మితుం డగుచు నేతెంచి
బసవఁడు ప్రచ్ఛన్నభావంబు నొంది
మోళిగమారయ్య ముద్దియఁ గాంచి
లాలితోద్యత్సముల్లాస మెలర్ప
'శరణార్థి' యని చక్కఁ జాఁగి మ్రొక్కుడును
దరుణియు నటమున్న 'శరణార్థి' యనుచు
నడుగుల కర్ఘ్యపణ్యంబులు దేర
నొడఁబడ కెఱిఁగెదరో యనుమతిని
"అమ్మమ్మ ! మాలింగ మాకొన్నవాఁడు
క్రమ్మన వడ్డింపు రమ్మ లె" మ్మనుచు
సరసర లింగావసరము సెల్లించి
పరికించి యం దొక్కవడిగంబు క్రింద
విడియలతో రెండువేలమాడలును
[1]నడకి యమ్మకు శరణార్థి సేయుచును
సదమలలింగప్రసాదంబు గొనుచు
విదితముత్పులకసముదితాత్ముఁ డగుచు
ధర నిఱుపేద నిధానంబుఁ గన్న
కరణిని హర్షాశ్రుకణములు దొరుగ
"ఇదిగదా భవదుఃఖగదము నౌషధము ;
యిదిగదా భక్తిమహిష్ఠతపంట ;
ఇదికదా నాపుట్టినింటి కల్పకము !

1. ఇఱికించి.

ఇదిగదా ముక్తికి నిక్కఁ దా" ననుచుఁ
బొంగి ప్రసాదైకభోగియై తద్గృ
హాంగణంబున నిల్చి యాత్మలోపలను
"నీసదనం బింత నింతఁ గన్గొంత
దోసంబులెల్ల విధూతము ల్గావె ;
యీనగరద్వార మిఱియ నేతెంచు
నానరుఁ డపుడ కృతార్థుండు గాఁడె ;
యీసీమలోఁ జరియించు జంతువులు
చేసినభాగ్యంబు సెప్పంగఁ దరమె ?
యీగృహాంతరరేణు విసుమంత నొసల
బాగొందు నతనికి భక్తి వర్ధిలదె ?
కడిఁదిపాతకము లిక్కడఁ బ్రసాదంబు
గుడిచినఁ జెడు సమకూఱ దేనియును
నొడఁబడ నిచ్చటి 1 కడువునీరైనఁ
బుడిసెఁడు ద్రావినఁ బొలియుఁ బాపములు"
నని తలపోయుచుఁ జనియె నాబసవఁ
డనురాగచిత్తుఁడై ; యంత నిక్కడను
మధ్యాహ్న మగుటయు మారయ్య లింగ
తద్ధ్యానసుఖనిరంతరవర్తి యగుచు
వాకిటఁ గట్టెలు వైచి యేతేర
నాకాంత యెదురేఁగి యడుగులు గడుగ
భంగిగా జంగమప్రణిపత్తి దీర్చి
లింగార్చనంబు సల్లిలఁ జేయుచును
బడిగంబు క్రిందట బసవఁడు మున్న
యడకిన మాడల విడియలు గాంచి
"యెక్కడి విడియ లిం ? దెవ్వరు వచ్చి
రిక్కడ ?" కని తనయింతి నడ్గుడును
"దేవ ! యొక్కయ్య యేతెం చారగించె

1. బియ్యము కడిగిన నీరు.

భావింప నటమీఁది పను లే నెఱుంగ
నప్పుడ విచ్చేసె" నని విన్నవింపఁ
"దప్పదు బసవఁడు దాన కానోఁపు
గడు నర్థసంపద గల భక్తు లరసి
బడుగుభక్తులఁ బ్రోవఁ బాడియ కాదె ?
దాత గాఁడే యిట్లు దాఁ బ్రోవ కెవడు
ప్రోతురు ? మేలయ్యెఁ బో ; బ్రదికితిమి
తనబిడ్డఁ డని మమ్ముఁ దలఁచి యిచ్చుటకిఁ
జనుదెంచె నింతయు చాలదే మాకు ?
నిమ్మల మాలింగ మిచ్చిన కాయ
కమ్మ యీపూఁటకుఁ గలిగున్న" దనుచుఁ
జక్కన నిద్దఱు జంగమంబులకు
నొక్కొక్క విడియ నియోగించి మ్రొక్క
సదమలస్థితి నున్న జంగమకోటి
పదపద్మములు గడ్గి భక్తితో వారి
శ్రీపాదజలములు సిలికింపఁ గట్టె
మోపు గడానియై యేపారి వెలుఁగ
వేడుక మదిఁ దులుకాడ వేయేసి
మాడలయెత్తు గాఁ గూడ ఖండించి
యున్న జంగమకోటి కొక్కొక్క నక్కు
చెన్నుగా నర్పణ సేసి మ్రొక్కుడును,
నక్కజం బందుచు నాజంగమములు
గ్రక్కున బసవనికడఁ బ్రసరించి
"మిక్కిలి భక్తికి నిక్కంబు నియతి
కెక్కుడుచేఁతకు నెల్లయై పరఁగు
మోళిగమారయ్యఁ బోలంగ భక్తు
లేలోకమునఁ గలరే !" యని పొగడ
బసవఁడు బిట్టుల్కిపడి యేఁదెంచి
"యసదృశ కావవే" యని సాఁగిమ్రొక్క

"నన్నన్న ! యిట్లేల యానతిచ్చెదవు ?
నిన్నన్న దేమేని మున్నొండు గలదె ?
బడుగు భక్తులకెల్లఁ బ్రాణంబు నిన్నుఁ
గడ సన్న భక్తులు గలరె యిబ్భువిని
మాబోటిభక్తులమనికియు నునికి
నీబయిసియె కాదె నిఖిలోపకార !
విని యెఱుఁగము దొల్లి విడియ లనంగఁ
గనుఁగొనఁబడియె నీకారణంబునను
బాపు ! భాగ్యప్రాణి ! బాపు ! కృపాత్మ !
బాపురే ! ధనవంత ! బాపు ! కీర్తీశ !
నల్లవో బసవయ్య నా కిచ్చినట్టు
లెల్ల భక్తాళికి నిత్తయ్య ! తొల్లి
మడివాలుమాచయ్య మనుమల మమ్ము
విడువక నడుపుకో వేయును నేల ?''
యని పెక్కుభంగుల నాలి సేయంగ
ఘనతరశోకాంబుకలితాస్యుఁ డగుచుఁ
''గనకాద్రి యరయునే కాకిగుణంబు ?
నినుముగుణ మరయునే పరుసంబు ?
గుణనిధి వీవు : దుర్గుణనిధి నేను ;
గణుతింపఁ గలదె సద్గుణము నాయందు ?
వెలివాడఁ గలుగునే వేదఘోషంబు ?
విల నావమునఁ గల్గునే రాగిముంత ?
తలఁపఁ గుంపటిలోనఁ దామరదుంప
మొలుచునే ? యిన్నియు ముదలింప నేల ?
తగవివేకునిఁ గావఁగాఁ దగు నీవ
గతి దయాభావ ! సంగయదేవ !" యనుచు
మారయ్య పాదపద్మంబుల కెరఁగి
సారాంచితోక్తుల సంస్తుతింపుచును
నభయంబు వేఁడుచు నడుగులమీఁద

సభయాత్ముఁడై యున్నఁ జయ్యన నెత్తి
యసలారఁ గౌఁగిట నందంద చేర్చి
బసవనిఁ గారుణ్యర వార్ధిఁ దేల్చి.
యలరంగ మృదుమధురాంచితాలాప
ములఁ బ్రబోధించుడు నలి దులుకాడ
మారయ్యగారికి మఱియును మ్రొక్కి
యారఁగ బసవరా జరిగె; నంతటను
మోళిగమారయ్య ముందటియట్ల
లాలితభక్తిసల్లీలమై నుండె;
నారఁగ మోళిగమారయ్యగారి
చారుచరిత్రంబు సదివిన విన్న
నిత్యప్రసాదవినిర్మలాత్మీయ
సత్యసుఖంబులు సల్లీలఁ గలుగు.

-: కన్నద బ్రహ్మయ్యగారి కథ :-

పరగంగఁ గన్నదబ్రహ్మయ్య నాఁగ
ధర నొప్పు సద్భక్తిపరుఁడు వెండియును
దర్పితసంసారదశనుండు జంగ
మార్పితప్రాణదేహార్థాభిమాని
యద్భుతచరితుఁ డుద్యద్భక్తియుక్తి
సద్భావనోపేత చరలింగమూర్తి
సారవీరవ్రతాచారుండు జంగ
మారాధకులలోన నగ్రగణ్యుండు
సంచితబాహ్యపూజాపరతంత్రుఁ
డంచితాంతస్సపర్యాపరాయణుఁడు
నిరవద్యహృద్య వినిర్మలభక్తి
పరతంత్రుఁడన లసచ్చరితఁ బెంపారి
కత్తియు బలపంబుఁ గావిచీరయును
గత్తెర యినుము నక్షతలును ముండ్ల
బంతియు నీలికప్పడమును ద్రిండు

మంతరకాటుక మఱి చండవేది
సెలగోల యొంటట్టుచెప్పులుఁ బీఁకె
మొలుకులబూడిదయును వాటుతాలుఁ
గుక్కలవాకట్టుఁ గొంకినారసము
గ్రక్కునఁ గంకటిరజ్జువు నమర
సూచీముఖం బైనఁ జొనుపంగ రాని
యేచినచీకటి నిండ్లపంచలకుఁ
జిడిముడిపలుకులఁ జేరి యుల్వరసి
గడియకన్నంబును గడపకన్నంబు
గోడకన్నంబును గుఱినేలకన్న
మోడక త్రవ్వి యిల్లొయ్యనఁ జొచ్చి
పరికించుచో భక్త భవనంబు లైన
సరసర దీపంబు సంధించి వారి
పాదాబ్జములమీఁదఁ బడి మేలుకొలిపి
పాదోదకంబు ప్రసాదంబుఁ గొనుచు
"శరణనియెడి సత్యశరణులయింట్ల
వరువుఁడ బ్రహ్మఁ డన్వాఁడ నే" ననుచు
నెడనెడ నేఁగుచు నితరు లిండ్లైనఁ
దడయక పదపదార్థంబులు దేవి
కొనివచ్చి జంగమకోటికి వరువుఁ
బను లాచరించు చిప్పాట వర్తింప—
జంగమ మొకనాఁడు చాల నేతేర
భంగిగా నిది పట్టపగ లని యనక
"నేఁకన్నంబిడి నిఖిలేశునగరఁ
జాలనర్థముఁ దెత్తుఁ జక్కన" ననుచు
నరుగుచో బసవఁడు పురవీథిఁ గాంచి
యరుదొంద భువిని సాష్టాంగుఁ డై మ్రొక్కఁ
"బట్టుము గత్తియు బలపంబుఁ గన్న
పెట్టఁ బోవలయు నా కిట్టున్న భంగి

నొండెడ ధనములే దొనఁ బిజ్జలుని
బండారములు సూప బసవ! ర" మ్మనినఁ
బ్రత్యుత్తరం బీనిబాస గావునను
నత్యనుచిత మన 'కట్లకా' కనుచుఁ
గన్నద బ్రహ్మయ్య గారిఁ దోడ్కొనుచుఁ
గన్నంపుము ల్లెల్లఁ గరమర్థిఁ గొనుచు
[1] నునుపరియునుబోలె నోడక నగరు
చనఁజొచ్చి బండారుసదనంబుఁ జూప
గడియకన్నం బిడఁగాఁ బదవెల్లఁ
గడసన్న పసిఁడి యై పుడమి వెలుంగఁ
జొచ్చి పెట్టెలలోనిసొమ్మెల్లఁ గొనుచు
విచ్చేసె బ్రహ్మయ్య; యచ్చెరువంద
నంగరక్షకులెల్ల నరిగి య ట్లున్న
భంగిన యవ్వార్తఁ బతి కెఱిఁగింప
'బసవఁడు నాబారిఁ బాఱెఁ బో' మ్మనుచుఁ
గసిమసంగుచు మహోగ్రమున రేఁగుచును
నవుళులు గీఁటుచు "నక్కటా! నన్ను
శివభక్తుఁ డని విశ్వసించుటయెల్ల
వఱితిపాలుగఁ జేసెఁ; జిఱుతవాఁ డనక
యఱలేక మన్నించునంతయుఁ గంటిఁ;
బట్టపగలు గన్న పెట్టించె బసవఁ
డెట్టొకో ప్రాణంబుఁ బట్టియున్నాఁడు;
అడిగిన వలసినంతర్థ మీనెట్టు?
లడరఁగ విశ్వాసి యయ్యె; నిట్లింత
కెత్తికొన్నాఁ; డింక నిటమీఁద నెంత
కెత్తికో నున్నాఁడొ యెఱుఁగరా" దనుచుఁ
గన్నులమంటలు గ్రమ్మ నేతెంచి
కన్నంబువాకిటికనకంబుఁ జూచి

1. సహాయుఁడు.

యతివిస్మయాక్రాంతమతిఁ జిట్టమిడిచి
గతకోపుఁ డై క్షితిపతి యిట్టు లనియె
"నెక్కడిపసిఁడిప్రో వెక్కడి దొంగ
యెక్కడికన్న మి దేమి వన్నితివి?
బసవనమంత్రి! యేర్పడఁ జెప్పు"మనిన
వసుధేశునకు బసవనమంత్రి యనియె :
"భక్తుండు గన్నదబ్రహ్మయ్య నాఁగ
వ్యక్తలింగం బనియుక్తప్రతాపి ;
కన్నదబ్రహ్మయ్యగారిమహత్త్వ
మెన్నఁగ శక్యమే యీశునకైన ?
నాతని శ్రీచరణాంగుష్ఠయుగము
ఖ్యాతిగాఁ గల్పవృక్షములకు నూఁత ;
యామహాత్మునియమృతావలోకనము
కామధేనువులసంఘముపుట్టినిల్లు ;
చింతింప నాతనిచిత్తంబుచిగురు
చింతామణులకు నిరంతరాశ్రయము ;
అరయంగ నతనిహస్తాంగుళస్పర్శ
విరచింపఁగాఁ బర్సవేదులగనులు ;
నతనిశ్రీపాదసంగతి ముక్తిభూమి ;
యతనిప్రసాదంబు నమృతంబుతేట ;
యతనికోపంబు సంహారకారణము ;
నతనికారుణ్యంబ యపవర్గ మింత ;
నణిమాదిసిద్ధులు నాతనిబంట్లు ;
గణుతింప నింత లింగసదర్థుఁ డయ్యుఁ
బట్టిననియమంబుఁ బాయక కన్న
పెట్టినర్థమెకాని ముట్టఁడు సేత ;
'నిది గుమార్గము ; భక్తియే ?' యన వలదు ;
ఇదియె తా సన్మార్గ ; మెట్లు లంటేని
యిలఁ జూదమునఁ బాండవులు భ్రష్టులైరి,

నలిజూదమునమూర్ఖు నగజేశుఁ గూడె ;
వేఁటాడి రాముండు వేలఁది గోల్పడియె ;
వేఁటాడి యెఱుకు దా విశ్వేశుఁ గలసెఁ ;
బరసతీపశ్యు లై నరపతుల్ ద్రుంగ
బరసతీవశ్యుఁ డై హరుఁ గూడె నంబి ;
చంపి మాండవ్యుండు సరిఁ గొర్తఁబడియెఁ ;
జంపి చండుండు ప్రసాదంబుఁ గనియె ;
బొంకినబ్రహ్మకు భువిఁ బుట్టుమాలె ;
బొంకి చిర్తొండండు బొందితోఁ జనియె ;
గొఱియమ్రుచ్చని శూద్రకుఁడు నఱకువడెఁ ;
గఱకంఠుగణనంది గలసెఁ దెర్వడిచి
రమణ "రాజ్యాంతే నరక" మన ముక్తి
విమలతఁ గనిరి చేరమయుఁ జోడండుఁ ;
గాన యెట్లును నమార్గం బనరాదు.
తా నీశ్వరార్థ మన్తలఁపునఁ జేసి
ధర "నధర్మో ధర్మతాం వ్రజే" త్తనఁగ
హరునివాక్యము గాన యట్టిద పథము ;
నిన్నియు నన నేల ? యిందఱకంటెఁ
గన్నద బ్రహ్మయ్య గతి యెట్టి దనిన :
నెప్పుడు జంగమం బేతెంచు నింటి
కప్పుడకాని పోఁ డసహాయలీల ;
నిది పగ లిది రాత్రి యెట్లొకో యనుచు
మదిలోన లే దణుమాత్రంబు భయము ;
నదియును శివభక్త సదనంబ యేని
ముదమునఁ బేర్చెప్పి మ్రొక్కుచువచ్చు ;
నిల్లిల్లుఁ దప్పక యితరాలయముల
నెల్ల యర్థము దెచ్చు నిహపరంబులకు ;
దూరమైనట్టి బుద్ధులయిండ్లు సొచ్చి
వారలఁ జరితార్థవంతులఁ జేయ

జనియించినట్టి ప్రాక్తనపురుషుండు
నన నేల కడువిస్మయము గాదె ? తలఁప
ముట్టిన త్రవ్విన మెట్టిన తావు
పట్టినకైదువు ల్వసిఁడిమయంబు ;
ప్రాకటంబుగ నిన్ను రక్షింపఁ దలఁచి
కాక బ్రహ్మయ్యకు శ్లాఘ్యమె పదార్థంబు
లెక్కకు మిక్కిలి లేకున్నఁ దప్పు ;
తక్కిన బండరు లెక్కలు సూడు,"
మనుచు నబ్బసవఁ డత్యనురాగలీలఁ
గనుఁగొని బండరు కవిలియ సదువ
నక్కజం బందుచు నవనీశుఁ డుండె.
నిక్కడ బ్రహ్మయ్య యింటి కేతేర
సుదతియుఁ బతికి నుత్సుకత దుల్కాడ
నెదురేఁగి యడుగుల కెరఁగి కన్నంపు
ముట్టులుఁ జేతిసొమ్మును నందుకొనుడుఁ
జట్టన బ్రహ్మయ్య జంగమావలికి
ముదమంది ధరఁ జాఁగి మ్రొక్కెఁ దత్క్షణమ.
ముదితయుఁ దాను సముదితసద్భక్తి
మించి వెలుంగంగఁ బంచభక్ష్యములు
నంచితంబైన దివ్యాన్నపానములు
గావించినట్టి పక్వంబులు జంగ
మావలి కంత సమర్పణసేసి
వారిప్రసాదసుధారసవార్ధి
నారంగఁ దేలుచు నాదట మఱియు
ధనధాన్యవస్త్రవాహనభూషణములఁ
దనిపి జంగమలసత్కరుణాభివృద్ధిఁ
గన్నదబ్రహ్మయ్య మున్నెట్టు లట్ల
సన్నుతభక్తిమహోన్నతి నుండెఁ.
గన్నదబ్రహ్మయ్య ఘనచరిత్రంబు

విన్నను జదివిన విస్తరించినను
మృదుదయామృతరస మిళితేక్షణమున
నొడఁగూడు వారి కిష్టోపభోగములు.

—: ముసిఁడి చౌడయ్య కథ :—

ఆసదృశలీలఁ బెంపారి పెండియును
ముసిఁడిచౌడయ్య నా ముక్కంటిగణము
నిఖిలసజ్జనభక్తముఖముకురంబు,
సుఖశీలసంబంధ సుపథప్రచారి,
అఫలార్థకృతసత్క్రియాసమన్వితుఁడు,
సఫలీకృతామోఘ సత్యప్రతాపి,
తజ్జ్ఞుఁడు, సంసారతలగుండుగండఁ,
డజ్ఞానజనదూరుఁ, డపగతభయుఁడు,
నీరరసాంభోధి గారణపురుషుఁ,
డారూఢదివ్యామృతావలోకనుఁడు,
నధికశాపానుగ్రహసమర్థుఁ, డఖిల
విధినిషేధక్రియా విరహితాత్మకుఁడు.
అక్షయకీర్తిదృష్టాదృష్టలోక
సాక్షికప్రత్యయచరలింగమూర్తి
స్వసమయభూతి శాసనజనాధారుఁ,
డసమానవీరభద్రసమానుఁ డనఁగఁ
బరఁగుచు నాఁబోతు భక్తుఁడు దవసి
మరణంబు నొందిన మగిడించు బాస,
నడచుచో నంబుధి నది యడ్డ మైన,
నడఁగించి త్రోవన యరిగెడుబాస,
భక్తి సత్క్రియలు దప్పక చేయుబాస,
వ్యక్తిగా భక్తినియుక్తిఁ బెంపారి
భువి నొప్పి ముసిఁడి యన్పురవరంబునను
సవిశేషభక్తిమైఁ జౌడయ్య యుండ—
బసవనిభక్తిసౌభాగ్యమహత్త్వ

మసలార విని దర్శనాసక్తిఁ జేసి
భక్తులుఁ దానును బరమానురాగ
యుక్తులై చనుదెంచుచుండ నొక్కెడను
జాలదోయిట నెత్తి చల్లిన నిసుము
రాలనియట్టి యరణ్యాంతరమున
ముసిఁడివృక్షంబు లొప్పెసఁగ నెల్లెడలఁ
బసిఁడికొండలభాతిఁ బండి వెలుంగ
"నసలార ముసిఁడివం డ్లారగింపంగ
నెసఁగ లింగములకు నిష్టమైనయది"
యనుచు భక్తానీక మానతిచ్చుడును
వినిసంస్మితాననవిలసితుం డగుచుఁ
జనిచని ముసిఁడివృక్షంబులమొదలఁ
దనకరవా లూని దట్టుఁ డై నిలిచి
'యారగింపవె దేవ !' యని విన్నవింప
వారివారిక గణవ్రాత మేతెంచి
నమృతాంశుధరునకు నర్పించి వేడ్క
నమృతాంశుధరుభక్తు లారగించుచును
"ముసిఁడిచౌడయ యనుముందటిపేర
యెసఁగుఁబో జగముల నెట్లును నింక"
ననుచుఁ బ్రస్తర లాడుచును సంతసమునఁ
జనుదేరఁ గల్యాణమునకు సంప్రీతి
యెసక మెక్కఁగ సంగమేశ్వరునంద
బసవన్న చౌడయ్య భావంబు గాంచి
చక్కన నెదురేఁగి జగతీతలమునఁ
జక్కఁ జాఁగిలఁబడి మ్రొక్కి తోడ్తెచ్చి
యుచితోపచారనియుక్తిఁ గావించి
యచలాత్మ ముసిఁడిచౌడయ్య నేప్రొద్దు
సంగమేశ్వరునంద సద్భక్తిక్రియలు
భంగిగాఁ గొలుచుచు బసవయ్య సలుప

నసమానలీలఁ కళ్యాణంబునందు
ముసిఁడిచౌడయమహోల్లసనప్రయుక్తి
నెడపక సద్భక్తి కెల్లయై యిట్లు
నడచుచు, మఱియొక్కనాఁ డుత్సవమున
నార్యులు దీవించి యనుప వివాహ
కార్యార్థమై యరుగంగఁ గట్టెదురఁ
గటకంబు రాజమార్గంబునఁ జెలఁగి
నటియించు భక్తగణంబులనడుమ
ఘనవిమానస్థుఁ డై గగనమార్గమునఁ
జనుదెంచు తవరాజుశవము వీక్షించి
"వావిరి తవరాజవల్లభుచేత
దీవెన లందక పోవంగఁ దగునె ?
పరిణయింబున కిత్తపస్వి యేతేర
కరిగెడువాఁడఁ గా నటు నిలుఁ" డనుచు
నలుఁగుమోహణమున హస్తంబు దొడిగి
జళిపించి మొనసూపి నలిరేఁగి యార్చి
యరుదెంచి డగ్గఱి ''యయ్యగారలకు
శరణార్థి శరణార్థి శరణార్థి" యనుడు
"శివమస్తు శివమస్తు శివమ" స్తటంచుఁ
దవిలి తోడ్తోడన తపసి దీవింప
"డిగు డిగు గొరగ ! నా కిగవడి తింక
నగవు గా దిచట నున్నను సయిరింప ;
నందివాహన ! నీకు నరవాహనంబు
పొందగునే చూచి భువి నరు ల్నగఁగ" ?
ననుచుఁ బాదము వట్టి యల్లార్చి తివియఁ
గనుఁగొని దరహాసకలితాస్యుఁ డగుచు
ధర డిగ్గి ముసిఁడిచౌడరసు నందంద
కర మభిలాషమైఁ గౌఁగిటఁ జేర్ప,
సత్యస్వరూపుఁడు సౌడరాయండు

నత్యద్భుతాక్రాంతులై నరుల్వొగడఁ
దోడ్తొన తవరాజుఁ దోడ్కొని పెండ్లి
కేడ్తెఱ దళుకొత్త నేఁగంగ-నవలఁ
బొలమేర వటవృక్షములసమీపమున
నలిరేఁగి గోపాలకులు నటింపుచును
గములేర్చి యుద్ధించి కాల్గన్నవారిఁ
దమలోనఁ గేలివాదంబు వుట్టుటయు
"గోకులపతియాన గుఱియది మీకు
మాకును బసవనిమఱ్ఱియ'' యనుడు
న్యగ్రోధములయత్ర నడచుచు సజ్జ
నాగ్రగణ్యుండు సౌడయ్య యాలించి
పసులవాండ్రను గూడఁ "బద రిదియేమి
బసవనిమఱ్ఱి యన్పలు కయ్యె" ననినఁ
బ్రెబ్బొంతపెయ్యలపెద్ద యందొకఁడు
"నిబ్బసవనివార్త యెఱుఁగుదుఁ గొంత ;
యట తాతచే వింటి నని తమతాత
చిటిపొటివాండ్రకుఁ జెప్పె మాకెల్ల ;
నలుక రెట్టింప లెండాఁబోతు లిచట
మలయుచు నేడ్దినంబులు వోరఁబోర
నెత్తురు వఱదలై నేలయంతయును
జొత్తిల్ల నొకవోతు సొలసి చచ్చుడును
నచ్చోన పాతినఁ జెచ్చెర మొలచె
నచ్చుగా నీమఱ్ఱి ; యట్లు గావునను
బసవనిమఱ్ఱి యన్పలుకయ్యెనందు
రసలార మఱియుఁ జోద్యం బట్లుఁగాక
కఱచిన మాంసంబు గతి నుండుఁ బండ్లు ;
విఱిచినరక్తంబువిధి నీరుగాఱు ;
నేనాఁట మఱ్ఱిపా లెట్టినై యున్నె ?
తానమ్మరే చూడఁ దథ్య" మి ట్లనుడు

వారించి "యిది వ్రాఁతవా" ర్తని యొద్ది
వారెల్ల నుడువ నవారితవృత్తిఁ
బసరింపఁ "గ్రొత్తేమి ప్రాఁతేమి యింక
బసవనిమ్మృతి సెవిఁ బడ్డపిమ్మట ?
మురియుచు బసవఁడు ముందఱఁ జనక
పరిణయంబున కేఁగఁ బంతమే నాకుఁ
బడయక పోయెడుపలుకులే ?" లనుచుఁ
బెడబొబ్బ లిడుచు సంప్రీతి నార్చుచును
"వెడలుము వెడలుము వృషభేంద్ర !" యనుచు
వడి నెద్దియలుఁగున వటమూఁది నిలువ
నటమున్న నందిపాఁ తదరి యద్దరణి
పటపటఁ బగులంగ వటవిటపంబు
చట్టన వ్రేళ్ళతోఁ జటచట మనఁగఁ
గట్టెగస ల్లంత మిట్టిపడంగ
నందఱు నతివిస్మయాక్రాంతులగను
నందుండి యూఁకించి యవనికి నుఱికి
నిలిచి నిట్రించి ఘణిల్లుణి ల్లనఁగ
నలరుచు అంకె లందంద వైచుచును
వాల మల్లార్చుచుఁ గాలఁ ద్రవ్వుచును
నేలఁ గోరాడుచు నీడ కుర్కుచును
నుడువీథి కెగయుచు నొడలు వెంపుచును
వడిగొని పఱచుచు నిడుజంగ లిడుచుఁ
దగిలి గద్దించుచుఁ దలఁకుచు మూతి
యిగిలించుకొని మొగంబెత్తిచూచుచును
జిఱుపెండవెట్టుచుఁ జిఱలు వొడ్చుచును
గుఱుజంగ లిడుచు దిక్కులు సూచికొనుచు
గెలఁకులఁ దన్నుచుఁ గ్రేళ్ళువాఱుచును
బులుగఱ చుమియుచుఁ మలఁగి నాకుచును
బోరన నెగయుచుఁ బొంగుచుఁ గొమ్ము

లోరగించుచు మలయుచు వంగికొనుచు
నూఁకర ల్వెట్టుచు నురవడింపుచును
మూఁకకు నెగయుచు ముస్సుముస్సనుచుఁ
జవుడయ్యఁ జూచుచు సంతసిల్లుచును
దవులంబు సేయుచుఁ దపసి వెన్కొనుచు
బాసికంబును నాఁటి పసపుటక్షతలు
నాసమంచితసుగంధానులేపనము
లొనరంగ వింతచె న్నొలయంగ గంట
లును మువ్వలును గజ్జెలును మ్రోయుచుండ
నంతంతఁ దనరారి యాలజేఁ డుండ
సంతోషమున ముస్డిచౌడరాయండు
బడిసివైచుచుఁ జేరి మెడఁ గౌఁగిలించి
యడుగులు గడిగి పుష్పాంజలు లిచ్చి
యాయతధూపదీపాదు లొనర్చి
నేయుఁ బాలును బొట్టనిండ వడ్డించి
"నడువుము నడువుము నందెన్న ! నీవు
నడవ కేఁబెండ్లికి నడవ నిక్కంబు"
అనవుడు లోకంబు లచ్చెరువంది
వినుతింపఁ దద్భక్తజను లుత్సహింప
నందఱు ముందఱ నరుగ న త్తపసి
ముందఱ నాఁబోతు మురియుచు నడవ
నరుగఁగ నరుగఁగ నంత ముందఱను
నురవడి నుబ్బొంగి యుడువీథి దాఁకి
హిద్దొర యనునది యిల నిండిపాఱఁ
దద్దయు నుద్వృత్తి ధరఁ దన్ని నిలిచి
"యెఱుఁగవే వారాసు లెల్ల నొక్కయ్య
యఱచేతిలోనన యణఁగుట మఱియు
భవి పుట్టి యొల్లక భువి ముదలింప
సవిశేషభక్తప్రసాది దాసయ్య

కాదె నిన్ బోకార్చి కాల్నడయంద
యీదేశమంతయు నెఱుఁగంగ దాఁటె;
మఱియు గజ్జేశ్వరుమసణయ్య దన్ను
మఱచి శివార్చనామగ్నుఁ డై నడుమ
నుండఁ బై రానోడి రెండుదిక్కులను
ఖండితంబై నీవ కావె పాఱితివి?
వెడవాఁగ యే మని వెల్లి నూపెదవు?
అడఁగుము త్రోవ యి"మ్మనుచుఁ జౌడయ్య
యలుఁగుమోహాణమున హస్తంబు దొడిగి
జళిపింప నీ రెల్లఁ జల్లనఁ బాసి
సిరిపర్వత మన నింగి నుప్పొంగి
తారాపథంబునఁ దా నిట్టవొడిచె
నాకాశ గంగచే హరు భక్తమహిమ
నేకాంతమున విన నేఁగినయట్లు;
అయ్యేఱు ముసిఁడిచౌడయ్యకు వెఱచి
చయ్యన నేఁగె రసాతలంబునకు
నన్నట్లు త్రోవనీ రఱిముఱిఁ బఱవ
మిన్నక నడు మెల్లఁ దిన్నెలై యుండ
''రండురం డిపుడు నీరము నడు మడువ
రెండుగా వనుమాట రిత్తయ్యె'' ననుచు
ముసిఁడి చౌడయగారు ముందఱ నడవ
నసమభక్తానీక మానందలీల
నంతంత నిలుచుచు నార్చుచుఁ గప్పి
గంతులువైచుచు గతికి నిల్చుచును
నెడనెడ నార్చుచుఁ బెడబొబ్బ లిడుచు
వడిఁ బిల్ల మొఱములు వైచుచు లేచి
పరువులు వెట్టుచు నరుగ ముందఱను
నరుదారఁ దపసియు నాఁబోతు నడవ
దరహాసితోల్లాసవరవక్త్రుఁ డగుచు

నరిగెఁ జౌడయ్య దా నద్దరి నిలిచి
"పెల్లున లోకంబు లెల్లను ముంప
గొల్లన నడచు నీ త్రుళ్లెల్ల నడఁగె."
ననుచు నమ్మసిఁడి చౌడయ్య సద్భక్త
జనసహితంబుగా ననురాగలీల
నరిగి యొప్పారఁ దత్పరిణయ క్రియలు
పరితోషమతి సమాప్తంబు గావించి
బగుతు లెదుర్కొన మగిడి కల్యాణ
నగరంబు వీథుల నడతెంచుచుండ
దపసియు నాఁబోతుఁ దనతోడ నడవ
విపరీత మతినరు ల్విభ్రాంతిఁ బొంద
జయజయధ్వను లాకసము నిండి చెలఁగ-
రయమునఁ బఱతెంచి రమణి యొకర్తు
భావించి చౌడయ్యపాదము ల్నొసలు
మోవంగ ధరఁ జాఁగి మ్రొక్కినఁ జూచి
యనునయం బొదవ "శతాయుష్య" మనుచుఁ
జనుదెంచి తమ నిజస్థాన దేశమున
దొల్లింటియట్ల యద్భుతలీల నుండ,
నల్లకన్యక మృతయైన మర్నాఁడు
జనకాదు లేడ్చుచుఁ గొని వచ్చివచ్చి
కనుఁగొని చౌడయ్యగారికి మ్రొక్కి-
"నిన్న మీపాదముల్ నెన్నుదు రిఱియ
సన్నుతిమ్రొక్కిన సతి నేఁడు సచ్చె
నీదీవనయుఁ దప్పనే" యని వారు
పాదము ల్విడువక పలవరింపంగఁ
'దొలదొలఁ' డనుచును 'ద్రోవ కడ్డంబు
నిలిచి వాచర్వక నిలునిలుఁ' డనుచుఁ
గంపరం బవనిపై దింపించి మహిమ
వొంపిరిగొన నోరవోవఁ దట్టుచును

‘నెనయ దీవించువా రేండ్లేల యిత్తు’
రనువలు కప్పుడ 1 యాలంబు గాఁగ
నిశితఖడ్గం బార్చి నిఖిలంబు నెఱుఁగ
‘శిశువ ! లెమ్మని పేరఁ జీరఁగఁ దడవఁ
గట్టులు వటు కనఁగాఁ దెగి నిద్ర
బిట్టులిక్కి తెప్పిఱినట్టును బోలె
నతిసంభ్రమాక్రాంతమతిఁ దేఱిచూచి
యతివ సౌడయ్యకు సాష్టాంగ మెరఁగెఁ ;
దల్లియుఁ దండ్రియుఁ దమపుత్రితోన
యుల్లంబు దళుకొత్త నొగిఁ జాల మ్రొక్కి
“ముసిఁడిచౌడాచార్య ! యసమానశౌర్య !
వసమె నీగరిమంబు వర్ణింపఁ దలఁపఁ !
ప్రాణోపకారికిఁ బ్రత్యుపకార
మేణాంకధమూర్తి ! యిలఁ జేయఁ గలదె ?
దాసులఁగా మమ్ము దయ నుద్ధరింపు
మీసంసరణవార్ధి యింకఁ దోఁపంగ”
నంచు విన్నప మాచరించుడు మువుర
నంచితప్రాణలింగాంగులఁ జేసి
గతవత్సరంబులు గాక మూవురకు
శతవత్సరాయు వాయతిఁ గరుణింపఁ
“ప్రాణదానము సేయఁ బరులవశంబె ?
యేణాంకధరునకు నిల నరుదన్న
జా నొందఁగ ముసిఁడిచౌడయ్య ప్రాణ
దానంబు సేసెఁ జిత్రము సిత్ర” మనుచు
మ్రొక్కుచు లోకంబు వెక్కసపడఁగ
నెక్కుడుకీర్తికి నెల్లయై యంత
మహనీయసద్భక్తిమహిమ దుల్కాడ
సహజైకలింగి యాచౌడయ్య నడవ

1. అబద్ధము.

నతనిమహాద్భుతోన్నతిఁ జూడఁజాల
కలిమతిహీను లై యన్యదర్శనులు
"తొడఁగూడుపోతుల జడలతమ్మళ్లఁ
బడయుఁ దానటె చూ సబంబులఁ గన్నఁ
జవుడయ్యగారలచందంబు సూత
మవుగాఁక తప్పేమి ?" యనుచు దుర్బుద్ధి
గొనెగర్వం బిడి మానిసి రూపు
దానిల్పి బూడిది దళముగాఁ బూసి
యన్నిగందువల రుద్రాక్షము ల్వ్రాన్చి
జన్నిదంబులు వెట్టి జడలను బెట్టి
యడిపొత్తి సించి కచ్చడము సంధించి
కడపట నొకవాడుగుడికడ వైచి
యింతట నంతట నెఱుఁగని యట్ల
సంతల నిలిచి దూషకులు సెలంగ
"నక్కటా ! గుడికడ నది యొక్కదపసి
దిక్కుమాలినపీన్గ ద్రెళ్ళియున్నదియు
కుడువఁ గట్ట విడువ ముడువ లే దనియొ !
బడుగుఁబీనుఁగుగాన భక్తులు రారు ;
ఎల్లవారికిఁ బ్రాణ మేమి నిత్యంబు ?
చెల్లఁబో ! యెవ్వరుఁ జేర రియ్యెడకు
నెట్టు సూడఁగవచ్చు నింక ధర్మంపుఁ
గట్టియయైనను బెట్టుదం" డనుచు
దమ్మళ్లఁ గొందఱఁ దపసులఁ బిలిచి
గ్రమ్మన నొక విమానమ్ముఁ గల్పించి
"గుడికడ నెన్నటఁగోలె నున్నదియొ ?
పడికి వచ్చెడుఁ జేరి పట్టరా" దనుచుఁ
దార యాకృతకంపుఁదపసిశవంబుఁ
జేరి విమానంబుఁ జేర్చి సంధించి
జగదభినుతుఁ డగు చౌడయ్యగారి

నగరిపొంతను విమానంబు రాఁ బనిచి
యల్లంత నల్లంత నపహసింపుచును
గల్లరిలోకులగము లేఁగుదేర
నడతెంచు నవ్విమానంబులో శవముఁ
బొడఁగని చౌడయ్య గడుదూరమంద
కృతకంపుశవముగా మతిలోన నెఱిఁగి
యతిదరహసితాస్యుఁ డగుచు నుప్పొంగి
"యవికలాజాండంబు లలిగినఁ జెఱుపఁ
దవిలి కూర్చినఁ గావ దక్షులైనట్టి
మదనారి భక్తులమహిమఁ దలంప
నిది యెంతవెద్ద దానీరూపమునకుఁ
బడయుదు నొడలును బ్రాణంబు" ననుచు
మృడభక్తమండలియడుగులు దలఁచి
వడిగొని దగ్గఱి వాలార్చి చూచి
నిడిసేసి గాయంబు గడుమొనసూపి
యందుండి లంఘించి యావిమానంబు
నందున్న కృతకాంగు హస్తంబు వట్టి
గ్రమ్మనఁ "దపసి లే లె"మ్మని పిలువ,
నమ్మాత్రలోన జీవాంగుఁడై లేచి
ముసిఁడిచౌడయకంటె ముందఱ నిలిచి
వసుధపైఁ దజ్జనావలి సోద్యమందఁ
జవుడయ్యగారి శ్రీచరణాబ్జములకుఁ
దవిలి సాష్టాంగుఁడై తా మ్రొక్కి నిలిచి
"హరుఁడవు నీవ; సద్గురుఁడవు నీవ;
కరుణింపు మీపాదుకాతతి మోవ;
ఖ్యాతిగా భవదీయకారుణ్యగర్భ
జాతుండ; నన్యథా నీతు లెఱుంగ"
నంచుఁ బ్రార్థనసేయు నాతని నపుడ
సంచితగురులింగ సంగతుఁ జేసి

యతుల కోపోద్రిక్తుఁడై కసిమసఁగి
కృతకులఁ దునుమంగ మతిఁ దలంచుడును
బరవాదు లలి భయభ్రాంతాత్ము లగుచు
నరుదెంచి యంతంత ధరఁ జాఁగి మ్రొక్కి
"యసమాన ముసిఁడిచౌడాచార్యవర్య!
దెసయును దిక్కును దేవ! యేడ్గడయు
నీవ; మా కన్యథాభావంబు లేదు;
కావవే! యజ్ఞానజీవుల శఠుల
సకలాపరాధుల సైరించి మమ్ము;
సుకృతవంతులఁ జేయు సుజనాగ్రగణ్య!"
యని విన్నవించుచు నభయంబు వేఁడ
ఘనకృపామతి నార్తజనశరణ్యుండు
సజ్జనశ్రేష్ఠుండు సౌడరాయండు
నజ్జనానీక మత్యర్థిఁ గీర్తింప
గతపూర్వలాంఛనాకృతులఁ గావించి
యతులితశివసమయస్థులఁ జేసి
యసదృశలీల నమ్ముసిఁడిచౌడయ్య
వసుధ నెప్పటియట్ల వర్తించుచుండె.
ముసిఁడిచౌడయగారి యసదృశచరిత
మసలార వినిన నత్యర్థి వ్రాసినను
జదివిన సద్భక్తిసంపద లొందు;
మదనారికరుణఁ బ్రమథలీల దనరు. *
సారజంగమపాదసరసిజయుగ్మ
ధారాళమకరందధౌతశిరస్క!
సారదనీరదహారనీహార
తారామరాహారధౌతయశస్క!
యంచితకర్ణరసాయనకల్ప
సంచితపరిపాకసత్యవచస్క!
మహనీయరుద్రాక్షమాలికాభూతి

షష్ఠాశ్వాసము

శ్రీమన్మహాభక్త చిరతరవరద
యామృతపూరవిహారసంగాఖ్య !

—: ఏకాంత రామయ్యగారి కథ :—

మఱియు నేకాంత రామయ్య నా నొక్క
నెఱవాది భక్తుండు కఱకంఠమూర్తి
శమదమస్ఫురణానుషక్తుండు జైన
సమయకోలాహలుఁ డమితప్రతాపి
యతులితశివసమయప్రతిపాలుఁ
డతిశయవీరభద్రావతారుండు
నిస్పృహేంద్రియ గుణాన్వితచేతనుఁడు
నస్పృశ్యభవిజనుఁ డపగతభయుఁడు
లింగ సమ్యగ్జ్ఞాని లింగావధాని
లింగగంభీరుఁ డభంగురకీర్తి
యేకాంతభక్తి సుశ్లోకుఁడు మర్త్య
లోకపావనుఁడు త్రిలోకవంద్యుండు
ధీరమహోదారశూరగంభీర
సారగుణస్తోమధౌరేయుఁ డనఁగ
నెగడి నిత్యక్రియానియంతప్రయుక్త
దగిలి శివార్చనాంతమున నత్యర్థిఁ
బ్రమథలోకమున కుద్యమలీల నరిగి
విమలాత్మవీరక వీరభద్రాది
గణనికాయములకుఁ బ్రణమిల్లి వారి
గుణకీర్తనలు సేసి కోర్కి దైవాఱ
శివభక్తి తత్వానుభవ సదేకాంత

సవిశేషసుఖసుధాశరధి నోలాడి
యెప్పటియట్ల కెలమి నేతెంచి
ముప్పొఁట నిమ్మార్గమునఁ జరింపంగ
బసవనిభక్తి సంపత్సముద్రంబు
దెసల ధరాస్థలి దివి నిట్టవొడువ
స్వచ్ఛుండు సందర్శనేచ్ఛ నేతెంచి
ప్రచ్ఛన్నయుక్తి నబ్బసవనిఁ జూచి
"యాకటకమునందు నేకాంతరాముఁ
డేకాకి యై చరియించుచు నుండ
నొక్క జైనుఁడు సెప్పు లూడ్వక వచ్చి
చక్కన శివనివాసంబు జొచ్చుడును
లోపల రామయ్య గోపించి చూచి
''యీపాపమున కింక నేగుఱి గలదు
రోరి ! జైనుఁడ ! తగ దుడురాజధరు న
గారాంతరముఁ జెప్పుఁగాళ్ళఁ జొరంగఁ ;
గడవఁ జొచ్చితి నని మృడునకుఁ జాఁగఁ
బడి మ్రొక్కి చెప్పులు వాఱంగ వైచి
యటుగాక తక్కిన నంతకోద్దండ
పటుదండ బాధలపా లైతి పొమ్ము
ఇంకఁ జెప్పులతోన యి ట్లుంటివేని
శంకింప కిప్పుడ సందుసందులకు
నఱకుదు" ననవుడుఁ బిఱుసన కతఁడు
"నఱిముఱి నింతేల యాగ్రహించెదవు ?
ముక్కంటిగుళ్ళకు దిక్కు గల్గితివి
నిక్కపుభక్తుండ ! నీ కేల వెఱతు ?
గుడి వసదియ ; వేల్పులొడయండు జినుఁడు ;
నుడువకు; కాదేనిఁ బడయుమా మగిడి
దల దగ్గి యిప్పుడ మలహరుచేత ;
నిల నీవె భక్తుండ వితఁడె వే"ల్పనిన

"నితనిఁ జంపుట యిది యెంత దలంపఁ?
బ్రతినఁ జూపమి భక్తి పతంబుగాదు;
శిరమిత్తుఁ బడయుదు జినసమయంబు;
శిరము ద్రుంపుదు బాసఁ జెల్లింతు.'' ననుచు
శ్రీకంఠుభక్తికిఁ జేవ యెక్కంగ
నేకాంతరామయ్య యిట్లని పలికె;
"శిర మిచ్చి పడయుట యరిది యంటేనిఁ
బరవాది! వినుర మాభక్తులమహిమ:
యొక్కభక్తుండు జంబూర్మహాకాళుఁ
డక్కజంబుగ శిర మభవున కిచ్చి
యిలయెల్ల నెఱుఁగంగ నెలమితోఁ బడసెఁ
దల నట్టతోఁ గీలుకొలిపి ప్రాణంబు;
అట వార్తగలిగి యీ కటకంబునందుఁ
బటుమతి గోవిందభట్టారకుండు
శివునినిర్మాల్య మిచ్చిన మస్తకంబు
తవిలిచికొను టిది దప్పు దప్పనుచుఁ
గళకంఠునకుఁ దలదఱిగి పూజించి
నెఱయ మూన్నాళ్ళకు మఱియొండు శిరము
వడసె; వెండియు నొక్కభక్తుఁ డిట్టిదియుఁ
గడు నపహాస్యంబుగాఁ బ్రతిష్ఠించి
మూఁడుదినంబులు ముక్కంటి యచట
లేఁడొ తా. జచ్చినవాఁడొ కా కనుచు
మొఱటద వంకయ్య యఱిముఱి శిరము
తఱుగంగ మొలవఁగఁ దఱుగఁగ మొలవఁ
దఱిగెడు తలలును దఱుఁగని భక్తిఁ
దఱుఁగమిగాఁ జేసి తదవసరమునఁ
బూన్చెడి శిరమును బూన్పనిశిరముఁ
బూన్చినపిమ్మటఁ బుచ్చెడు శిరము
మొలచెడు శిరమును మొలచిన శిరము

మొలవఁగ లోలోన నలిఁ దోఁచుశిరము
తఱిగెడు శిరముమ దఱుగని శిరము
తఱుగక తనుదాన యొఱఁగెడు శిరము
సరసర హరుమీఁద సంధిల్లుశిరముఁ
బొరి నొయ్యనొయ్యన పొడవగుశిరము
కన్నులార్చుశిరముఁ గాదనుశిరము
మిన్నక శివుమ్రోల మెలఁగెడిశిరము
నున్నతి మీఁదన యుండెడుశిరము
సన్న సేయుశిరము జరిగెడుశిరము
నారుచుశిరము నొనొ ననుశిరముఁ
గేరెడుశిరమును దారెడుశిరముఁ
బారుతెంచుశిరంబుఁ బైపడుశిరము
గారవంబున శివుఁ గలసెడిశిరము
ననలంబుమీఁదను నలరెడుశిరము
ననలంబు మ్రింగుచు నట యుండుశిరము
బొబ్బిడుశిరమును నుబ్బెడుశిరము
గుబ్బనఁబడి తద్ద గునిసెడుశిరము
నాలుక ల్గ్రోయుచు నలి గొనుశిరము
శూలిని వెక్కిరించుచు నుండుశిరము
నుఱికుర్కిపడుశిర మొఱగెడుశిరము
మఱియు సంధిల్లుచు మఱపడుశిరము
పొగడెడుశిరమును నగియెడుశిరముఁ
దెగడెడుశిరమును దీవించుశిరము
శర ణనుశిరమును జయవెట్టుశిరము
సరసమాడుశిరముఁ జదివెడుశిరము
మలరెడుశిరమును మార్కొనుశిరము
దలఁక కీశ్వరుతోడఁ దాఁకెడుశిరము
'బా' పనుశిరమును బాడెడుశిరముఁ
'జాపంద' యని శివు జంకించుశిరము

లప్పురి మెఱసి యేకాంతరామయ్య
వచ్చి యప్పరు గుడివాఁకిట నిలిచి
"వచ్చెనా బాస శ్రవణులార!" యనుచు
నేకాంగవీరుఁ డలోకానుసారుఁ
డేకాంతరాముఁ డపాకృతకర్మి
చక్కన శిర మట్ట సంధింపఁ దడవ
నొక్కింత కొకదెస కోరవో యుండె;
'హరుఁడు వేల్పగుట కేకాంతరామయ్య
శిరములోకులకెల్ల గుఱి' యన్న యట్టు
లేకాంతరామయ్య శ్రీకరమహిమ
లోకాంత మయ్యెఁ ద్రిలోకంబులందుఁ;
బ్రత్యక్ష మీతఁడే పరమేశుఁ డనుచు
నత్యద్భుతాక్రాంతు లై జను ల్పొగడఁ
'గడుదురాత్ములఁ జూడఁ గా దని తమకుఁ
బెడమొగం బిడె' నని భీతిల్లినట్లు
జనపాలకునిచేత జయపత్ర మిచ్చి
జినసమయులువచ్చి శివభక్త వితతి
ముందటిదెసఁ మ్రొక్కఁగఁబడిన
యందఱిమొగములయం దచ్చులొత్తి
యారిచి పెడబొబ్బ లందంద యిడుచు
వీరమాహేశ్వరవితతి యుప్పొంగి
వెనుకొని వసదుల విఱుగఁ గొట్టుచును
జినప్రతిమలతల ల్చిదిమివైచుచును
నసమానలీలఁ గల్యాణంబునందు
వసదియు జినుఁ డనువార్త లేకుండఁ
గసిమసంగుచుఁ జంపి గాసిపెట్టుచును
వసుధలో జిను లనువారి నందరను
నేలపాలుగఁ జేసి నిఖిలంబు నెఱుఁగఁ
గాలకంధరభక్తగణసమూహంబు

అనుపమశౌర్య నేకాంతరామయ్య
ననురాగలీలమైఁ గొనియాడుచుండ
ననయంబు బసవఁడు దనసంగ మేళుఁ
డని భక్తిఁ గొల్వ నేకాంతరామయ్య
వరకీర్తిమై నిట్లు వర్తింపుచుండె.
ధర లసద్భక్తివిస్ఫురణమై మఱియుఁ
బ్రథితుఁ డీయేకాంతరామయ్య దివ్య
కథ విన్న వ్రాసిన గారవించినను
జలహాలహాలవహ్ని శస్త్రారిత్రు బాధ
నలి నాగ మృగరోగములభయం బణఁగు
విపులదృష్టాదృష్ట వివిధ సౌఖ్యములు
నపవర్గములు గల్గు హరుకృపఁజేసి.

—: షొడ్డలదేవు బాచయ్యగారి కథ :—

ధీరుండు షొడ్డలదేవు బాచయ్య
గారు నా వెండియుఁ గలకంఠమూర్తి
నిర్గతేంద్రియ వైరివర్గదుర్గుణుఁడు,
భర్గనిరర్గళాంతర్గతధ్యాని,
యుగ్రాక్షభక్తగణాగ్రగణ్యుండు,
నిగ్రహానుగ్రహోదగ్రశౌర్యుండు*,
పరదైవ పర్వతప్రథితదంభోళి,
పరదైవసందోహతరుకుఠారంబు,
పరదైవశుండాలపంచాననుండు,
పరదైవవార్ధిశుంభత్కుంభజుండు ;
"త్రినయనునతులితోద్రిక్తశౌర్యంబు
చను నందికేశ్వరు సర్వజ్ఞతయును
భృంగినాథుని యేకలింగనిష్ఠయును
భంగిగా నవ్వీరభద్రురౌద్రంబు
భృగుదధీచ్యాదులపృథుశాపశక్తి
తగు గౌతమాదుల తర్కప్రయుక్తి

గురునాథుఁ డిన్నియుఁ గూడ బాచాంక
వరదివ్యమూర్తిగా విరచించెనొక్కొ ;
కానినాఁ డిటువంటి కలియుగరుద్ర
మానితపృథుదివ్యమహిమ యెట్లొనరు ;''
ననుచు లోకంబు లత్యర్థిఁ గీర్తింప
ననురాగలీల నూనిన భక్తియుక్తి
'సిద్ధాంతముల శ్రుతిస్మృతిమూలములను
బద్ధవేదాంతసంపాదితోక్తులను
న్యాయవైశేషికాద్యఖిలశాస్త్రముల
నాయతబహుపురాణాగమార్థముల
సహజానుమానాదిసర్వప్రమాణ
బహుతర్కవాదజల్పవితండములను
వెలయు నుత్పత్తిస్థితిలయ కారణుఁడు
నలరు నిత్యానందు' డంబికాధవుఁడు
పశుపతి దాఁ గర్త పలువేల్పు లెల్లఁ
బశువులే' యని ప్రతిపాలన సేసి,
జినసమయస్థుల శిరములు దునిమి,
మును విష్ణుసమయులముక్కులు గోసి,
యద్వైతులను హతాహతముగాఁ దోలి,
విద్వేషవాదుల విటతాట మార్చి,
చార్వాకవాదుల గర్వం బడంచి,
సర్వేశభక్తియే యుర్వి నిష్ఠించి,
దిట్టయౌ సొడ్డలదేవు బాచయ్య
యిట్టి సద్భక్తిమహిష్ఠుఁడై నడవ
నెడనెడ సౌరాష్ట్రి మేఁగి యేఁటేఁటఁ
గడునర్థితోడ జాగరము సెల్లించు
దిన మేఁగుదెంచుఁడు 'దివుట సౌరాష్ట్రి
మున జాగరము సేయఁ జనియెద' ననుచు
బిజ్జలునకు వినిపింపఁగ నతఁడు

"కజ్జ మెంతేనియుఁ గలదు వోరాదు ;
కొట్టరువునఁ బళ్ళు గొలువఁగవలయు ;
నిట్టేల చెల్లు నీ కిరుదెస కొలువు ?
బాలెంతలంజియపడుపట్ల రాచ
యూళిగంబును భక్తియునుగూర్చి నడవ
సౌరాష్ట్రమున కీవు సనుము ; గాదేని
సౌరాష్ట్రనాథుఁడు సనుదేర నిమ్ము ;
శివరాత్రి గివరాత్రి సేయుట మాను ;
తవిలి యీయుళిగంబు దప్పింపరాదు"
అనుచు నప్పరవాదు లనుమతంబునను
జనపతి వారించుడును బోక నిలిచి
"మొదలించి పలుకులు మూర్ఖుఁడై పోక
యదియుఁ గష్టముగాదె యతఁడన్నయట్లు
వచ్చు నిచ్చటికొండె వరదుఁడు నాకు
నచ్చటి కేఁగునట్లయ్యెడు నొండె
దీనఁ దప్పినదేమి నానిజవ్రతము
తా నెట్లు శివునకుఁ దప్పింపవచ్చు ?"
ననుచు నిశ్చింతాత్ముఁడై యున్నయెడను
ఘనుఁడు సోమేశుఁ డాదినము దొల్నాఁడు
మడఁపు లేఖయు నందిపడగయుఁ గొనుచుఁ
బడిహారిక్రియఁ బట్టపగలె యేతెంచి
కొట్టురువునఁ బళ్ళు గొలిపించుచుండ
నట్టిచో బాచయ్య కాతఁడి ట్లనియె :
"సౌరాష్ట్ర నాథుండు సనుదెంచుచుండి
భోరన ముందఱఁ బుత్తెంచె నన్ను
శంకరు నానతిఁ జదువుకో లేఖ
యింకిటపూఁటకు నేఁగుదెంచెడిని ;
నాసక్తిమై నింక ననిశంబు మీని
వాసంబునన యుండవలయుఁ గావునను

నీపెద్దగాదియలోపలఁ గొలుచు
వేపోయబనుపుము వెడలి ; సోమేశుఁ
డచ్చోటఁ బ్రత్యక్ష మయ్యెడి'' ననుచు
నచ్చుగాఁ జెప్పుచు నతఁ డదృశ్యముగఁ
"జనుదెంచు నిచటికి సౌరాష్ట్రనాథుఁ
డనుమాన ముడుగుఁడీ ; యది యెట్టు లనిన :
వచ్చెనే మున్ను రావణుని మన్నించి
యచ్చోన చిక్కఁగా కని పల్కవలదు ;
భక్తుఁడే యతఁడు దపఃఫలోన్నతిని
శక్తిమంతుఁడు గాక చర్చించిచూడ
భక్తులచేఁ బట్టువడుఁగాక శివుఁడు
భక్తిహీనుల కేల పట్టిచ్చు శివుఁడు ?
విలసితభక్తి సద్విధి మెచ్చికాదె
యెలమి గుడ్డవ్వకు నెదురుగా వచ్చి
కదల కట్టుల చిక్కఁగాదె సోమేశుఁ ;
డదియేల నావిందె గనుపురంబునను
గావునఁ జూడంగఁ గందు మివ్వురిని
దేవునిరాకకు దృష్ట మిచ్చుటికిఁ
బడిహారి భావనఁ బఱతెంతె నతఁడు
నడర సౌరాష్ట్రనాయకుఁడ కానోపు
సకళనిష్కళభావ సన్నుతశక్తి
నిక మెట్టి పడిహారులకు నున్న దెట్లు
వచ్చె నిట్లానతి యిచ్చె ? లోకులకు
నచ్చెరువుగ నెల్లి యరుదెంచుఁజుండి !
యిట యదృశ్యుం డయ్యె నీశుండ" యనుచుఁ
గటకంబునరులు విఖ్యాతిసేయంగఁ
దవిలి సమ్మదసముద్భవవారి గ్రమ్మ
శివునియానతి లేఖ శిరమునఁ దాల్చి
పుర మప్డు శుభముగా విరచింపఁ బంపి

కర మనురక్తి బాచరుసు వెండియును
బసవయ్య మొదలుగా భక్తులు దాను
నసమమొడ్డోలగంబై యున్నయెడను
వింతచే నానందవిభ్రమం బెసఁగ
నంతంతఁ బాడంగ నంతంత నాడ
నదె వచ్చె వచ్చె వియన్మండలమున
నదె వచ్చె వచ్చె సోమేశుం డనంగ
నీరధు లేడు ఘూర్ణిల్లినభాతి
సారగంభీరవాద్యారవం బెసఁగ
భోరన మ్రోయుచప్పుడు వినఁబడఁగ
సౌరాష్ట్రనాథుఁ డాశ్చర్యం బెలర్పఁ
దివిరి కొట్టరువు గాదియ వచ్చికొనుచు
భువిఁ బ్రతిష్ఠం డయ్యె నవని గంపింప ;
'సిద్ధరామయ్య దా శ్రీగిరి కేఁగి
శుద్ధాత్మ మల్లికార్జునునిఁ బ్రార్థించి
కొనుచు నాపొన్నలికను పురంబునకుఁ
దా నెట్లు రప్పింపఁగా నేరఁడయ్యె ?
నిప్పు డిచ్చటనుండి యీబాచతండె
రప్పించుకొనియెఁ జేరఁగ సోమనాథు
నిట్టిధన్యుఁడు గల్గునే' యని భక్తు
లిట్టలంబుగ నుతియించుచు నుండ
నచ్చెరువందుచు నాబిజ్జలుండు
వచ్చి సాష్టాంగుఁడై వడిఁ బ్రణమిల్లి
సకలనియోగంబు జయవెట్ట బసవఁ
డకలంకలీల బాచయ్య నంకింప
1 వలివేగమున గాదియలు వడఁద్రోచి
నెలకట్టుకట్టించి నిమిషమాత్రమున
వరరత్న ఖచితసువర్ణాలయంబు

---

1. వాయువేగమున.

విరచించి కోటగోపురము లెత్తించి
ప్రవిమలోద్యద్భక్తి బాచిరాజయ్య
శివరాత్రి నియమంబు సెల్లించె నంత :
నలిఁగొట్టరువు సోమనాథుఁ డనంగ
వెలసె లోకావలి విమతింపుచుండఁ
దెల్లఁగా షౌడ్డలదేవు బాచయ్య
సల్లీల సద్భక్తి కెల్లయై పరఁగ.
లలి నన్యసమయ కోలాహలమహిమ
కిల బిజ్జలుండు సహింపక మఱియుఁ
గుమతియై యప్పురిసమయులుఁ దాను
రమణఁ బ్రతాపనారాయణపురిని
గోవింద ప్రతిమ సద్భావం బెలర్పఁ
గావించి యొకగుడిఁ గట్టించి మంచి
దినమున నతనిఁ బ్రతిష్ఠగావించి
యనురాగలీలమై నంతఁ గొల్వుచ్చి
యున్నెడ నఖిలనియోగంబు గొలువ
నన్నరేంద్రుండు దా నందఱఁ జూచి
''బాచిరా జటయేమి భక్తుండ ననియొ
యేచియో యీకార్య మెఱుఁగఁడో యెఱిఁగి
తా లెక్కసేయక తమకొలు వొల్లఁ
డో ? లీల నిట్టి యొడ్డోలగంబులకుఁ
జను దేరకుండు ఁడే'' మని యాగ్రహింప
మనుజేశునకు బసవనమంత్రి యనియెఁ :
దవిలి నీయుడిగంబుఁ దప్పించెనేని
బవరంబు ముట్టినఁ బాఱెనేనియును
దప్పవి దండింపఁ దగ వగుఁ గాక
యిప్పరదైవంబు లిండ్లిండ్లకడకు
నేల రా వనవచ్చునే పతి నీవు ?

1 జోళవాళిక కాక 2 వేళవాళికినె
వత్తురే ? యన్యదైవంబులయిండ్లు
చొత్తురే ? భక్తులు సూతురే ? వింద్రె ?
లింగైకనిష్ఠావిలీనుండు భృంగి
యంగజారాతికి నతివ యైనట్టి
యర్ధనారికి మ్రొక్క కభవునిదక్షి
ణార్ధ మేర్పఱిచియు నట మ్రొక్కె ననిన
నిట వేయు నేల మాహేశ్వరవితతి
చిటిపొటివేల్పులఁ జీరికిఁ గొంద్రె ?*
కావున మాభక్తగణములమహిమ
నీ వేమి యెఱుఁగుదు నిఖిలేశ్వరుండ ?
యన నేలవేయు నల్లైన బాచరసు
ఘనమహత్త్వము సూతుగాదె తొల్లియును
నణఁకించి పలుకఁ దత్ క్షణమాత్ర నీవ
ప్రణుతింప సోమేశు రప్పించుకొనఁడె ?
కొట్టరువునఁ బళ్లు గోటానకోట్లు
పెట్టియు మనుజులపేళ్ళు వ్రాయండు ;
కదియఁ బంచాక్షరి కవిలియ వ్రాసి
చదువు లెక్కలు వెర సది దప్పకుండ ;
నెఱుఁగుదుగాదె మున్నేఁ జెప్ప నేల ?
యెఱుఁగుదుగా కేమి యిటమీఁదిపనులు ?"
నంచును వృత్తాంత మంతయు బసవఁ
డంచితమతి విన్నవించి పుచ్చుడును
"వాద మన్నను బోవవలయుట తగవు
గాదె" యంచును సముద్ధతకోపుఁ డగుచుఁ
జనుదెంచి భక్తులఁ గని మ్రొక్కి నిలువ
జననాథుఁ డాగ్రహంబున నిట్టు లనియె ;

1. చోళ్ళ (జీవన భృతి) పరిపాటిగాఁ గలది; ఐహిక జీవనము. 2. జీవితావసాన వేళకు వాళియైనది; ఆముష్మికజీవనము.

“నరుదగు నఖిలలోకాదీశుఁ డైన
హరిప్రతిష్ఠకు నమాత్యవ్రాతమెల్లఁ
జనుదేర నీ వేల చనుదేర విచటి?”
కనుడుఁ గోపోద్దీపితాంగుఁ డై పొంగి
“పుట్టఁ బుట్టువుమాలి చుట్టుముట్టాడు
నిట్టిట్టివేలుపు లెట్టు నరేంద్ర !
కర్త లనియెదవు కర్తలిం దెవరు ?
కర్తల కర్త మత్కర్తయ కాదె !
కర్తవ్య మింతయుఁ గర్త శంభుండు
కర్తవ్య మెందును గర్తకు సరియె !
కర్త ప్రధానుండు గాక తక్కెల్లఁ
గర్తయు హర్తయుఁ గలఁడె వేఱొకఁడు ?
హరియును గిరియును నజుఁడును గిజుఁడు
సురలును గిరలును హరునిసమంబె ?
యిల ‘మమ కర్తా మహేశ్వర’ యనుచుఁ
బలికెడు విష్ణుఁడు పరమేశుఁ డగునె ?
యటుగాక స్థితికర్త యందమే విష్ణుఁ
డిట పుత్త్రి రక్షింప నెలొకో లేఁడు ?
నలువ దైవం బనుపలుకులు మున్నె
పొలిసెఁగాదే ! తలవ్రాలిసినయపుడు ;
కాఁడువో యుత్పత్తికర్తయు నజుఁడు
పోఁడిగాఁ దనతలఁ బుట్టించుకొనఁడె?
ధర జినబౌద్ధులు దైవంబులేని
నరరూపు లై యుండుదురె మహత్తణఁగి ?
పశుకర్మలగు వేదబాహ్యులువారు
పశుపతు లగుదురె ? ప్రత్యక్ష మిదియు
నన నేల ‘హస్తినాహన్యమానోఽపి’
యన నిరీశ్వరుని విశ్వాలయుఁ దనఁగ
నేనుఁగు వెన్కొని యెగిది మట్టాడు

చోనైన వసదులు సొరరెట్టివారు
మాయ దైవం బనుమాట లేమిటికి ?
మాయ దా నట పేరు మఱి దైవ మగునె ?
హరునధికారులు నజుఁడును హరియు ;
నరయంగ శ్రుతిబాహ్యు లాయున్న ముగురు ;
నెవ్వండు గర్త యీయేవురియందు
నెవ్వి దర్శనము లి ట్లెన్నఁగ నాఱు
శ్రుతి "ఏకఏవ రుద్రో" యన్నయట్టు
లితరదైవంబుల నెన్న నేమిటికి ?
వేదంబు దైవమే వేయును నేల ?
నాదిసోమకుచేత నపహృతం బగునె ?
తలరునే పృథివియు దైవమేనియును
నిలయమై యుండునే మలమూత్రములకు ?
నెఱయ దైవమె నీరు నిట్టపాటులను
వఱలునె యణఁగునె యఱచేతియందు ?
ననలుఁడు దైవ మే నటు భంగపడునె
మును సర్వభక్షుఁడై చనునె లోకముల ?
నక్కరువలి దైవ మంద్రేని నొక్క
దిక్కున నుండునే దిక్పాలుఁ డనఁగఁ ?
దలఁప నాకాశంబు దైవ మంద్రేనిఁ
బ్రళయంబుఁ బొందునే ప్రమథులచేత ?
నిలుకాల నిలువఁగ నేరక తిరుగు
నిల దినేశుండు సర్వేశ్వరుం డగునె?
యానిశాపతి దైవ మన నెట్లువచ్చు ?
నానాఁటికిని గళానష్టతఁ బొందు ;
నఖిలంబునకుఁ గర్త యాత్మ యేనియును
సుఖదుఃఖములఁ బొంది సొగయుచు నున్నె ?
కావున మున్ని ట్లొకం డొకొక్కటికి
దైవంబు లేనియుఁ దారు పుట్టుదురె ?

కర్మంబ యంతకుఁ గర్త యంటేనిఁ
గర్మం బచిత్తు దత్కర్తయు జడుఁడు ;
నెట్టన్న నన్యాయ మేమేని జేయ
నట్టివానిఁ బఱుప నధికారి గలఁడొ ?
తనకుఁదాఁ బఱుపునో తత్కర్మఫలము ?
తనకుఁ దాఁ బంధించుకొనునొ తత్కర్త ?
కావునఁ బఱుప నొక్కఁడు గర్త గలఁడు
భావనఁ దత్కర్మఫలములు గుడుప
నిలను గర్మాధీశుఁ డీశుండు గర్మ
ఫలదాత ; మాయుమాపతియె దైవంబు ;
కర్మంబు గర్తయేఁ గ్రతువునఁ బుణ్య
కర్మి యంచును దక్షుఁ గడతేర్పవలదె ?
పితృవధ సేసిన యతికర్మఫలము
నతని బొందఁగనీక యఖిలంబు కెఱుఁగ
మేటికర్మము గర్త మృడుఁడు గాఁడేనిఁ
గాటకోటని కేల కైలాస మిచ్చె ?
నటు 'కృతం కర్మ శుభాశుభం' బనెడి
చిటిపొటివాదము లెల్ల పెయ్యేడను
కోయని శ్రుతియు 'నేకో రుద్ర ఉచ్య
తే' యనుఁ గాన మాదేవుండె కర్త ;
హరిముఖ్యులీశుఁ బంచావరణములఁ
బరిచరులై కొల్చుపశువులు గాక
కర్తలే ? యొక్కొక్క కార్యకారణవి
వర్తనమాత్రన వా ; రెట్టు లనినఁ :
బనిసేయు బంట్లెల్ల మును దమచేయు
పనికె కర్తలుగాక ఫలకర్త లెట్లు ?
కాన కర్తలకర్త మానీలగళుఁడు ;
దీనికి నింకొండు దృష్టంబు లేల ?
పరమేశు చుట్టును ధర నూర నూరఁ

బరిచరులై హరిప్రముఖులు గొలువ
నప్రతిమాకారుఁ డగులింగమూర్తి
కిప్రతిమాకారు లే సమానంబు ?
నిర్మలనిత్యనిష్కర్మ దేహునకు
దుర్మల దుష్ట దుష్కర్మలు సరియె ?
శుద్ధ ప్రసిద్ధానిరుద్ధ దేహునక
సిద్ధ బౌద్ధాశుద్ధ జీవులు సరియె ?
చావుఁ బుట్టువులేని దేవదేవునకు
చావుఁబుట్టువుగల దేవత ల్సరియె ?
బ్రహ్మమాయాకారపశుపాశపతికి
బ్రహ్మేంద్రహరిముఖ్యపశువులు సరియె ?
శంకరునకు ధృతకంకాళునకును
శంకితు లగుచున్న కింకరు ల్సరియె ?
ప్రళయంబుఁ బొందించు ప్రళయరుద్రునకుఁ
బ్రళయంబుఁ బొందెడు పలువేల్పు లెనయె ?
మునిగణార్చిత పాదవనజాతునకును
మునిశాపదగ్ధు లౌ పినుఁగులు సరియె ?
పూజితుం డగు లింగపుంగవునకును
బూజించి కొలిచెడి పూజరు ల్సరియె ?
సిరిమహాదేవుఁ డౌ సిరిగిరిపతికి
సిరివాసుదేవాదిసురలు సమంబె ?
నలిమూఁడుగన్నులుగల త్రినేత్రునకు
నలరెండుగన్నులయతగులు సరియె ?
హాలాహలాగ్ని సంహారశౌర్యునకు
హాలాహలాగ్నిహతాంగులు సరియె ?
త్రిపురదైత్యాంత కోద్రిక్త వీర్యునకుఁ
ద్రిపురదైత్యోపద్రవపతితు ల్సరియె ?
యంధకాద్యసురదర్పాపహారునకు
నంధకాద్యసురభయభ్రాంతు లెనయె ?

హరికమలజకపాలాస్థి ధారునకు
హరికమలజసురాసురతతి సరియె ?
యావిర్భవింపని యభవున కరయ
దేవకీపుత్త్రాది దేవత ల్సరియె ?
లింగమూర్తికి జగత్సంగతాత్మునకు
లింగమధ్యములోని లెంగులు సరియె ?
సర్వజ్ఞుతోడ నసర్వజ్ఞు లెనయె ?
సర్వేశుతోడ నసర్వేశు లెనయె ?
షోడ్డలదేవుతో సోమేశుతోడ
సడ్డలదైవము ల్సరిచ్చింప సరియె ?
హరుఁడు సర్వేశ్వరుం డభవుండు శివుఁడు
పరముఁడు పశుపతి పరమేశ్వరుండు
శ్రీమహాదేవుఁ డన్నామంబు లున్న
వే మహి నిటువంటి యితర వేల్పులకు ?
రమణఁ 'దద్విష్ణోః పరం పద' మనఁగ
నమర విష్ణునకుఁ బరమమైనపదము
శ్రుతి "సదా పశ్యంతి సూరయో" యనఁగ
గతకర్మ లీశుండకాఁ గనియుండఁ
గుమతు లై కర్మశాస్త్రముల వెంబడిని
భ్రమసియో యిలఁ గుక్కపాలు ద్రాగుటనో
మఱి నాము మేసియో మతిమాలినట్టి
యఱవపాఱులమాట లవనీశ ! వినకు ;
మపునర్భవత్వంబు నచ్యుతత్వంబు
నుపమింప విష్ణున కున్నదే యెందు ?
పూని మాభృగుశాపమున నచ్యుతుండు
తా నుదయింపఁడే దశజన్మములను ?
సామ మా 'విష్ణుః పితామహో' త్తనఁ బి
తామహునకు హరి దాఁ బుట్టెఁ గాదె ?
యజునిగుదంబున హరి పుట్టుటకును

నిజనామ మది యథోక్షజుఁ డయ్యెఁ గాదె ?
యదిగాక యదితి కింద్రానుజుఁ డనఁగ
నుదయించెఁ గాదె పయోజనాభుండు ?
ఆదట ద్వాపరమందు విష్ణుండు
బాదరాయణుఁ డనఁ బ్రభవించెఁగాదె ?
యయ్యుగంబునను ము న్నచ్యుతుం డుదయ
మయ్యెనుగాదె కృష్ణాఖ్యుండు నాఁగ ?
విష్ణుఁ డొక్కొక్కెడ విలయంబుఁ బొంద
విష్ణుత్వ మర్థించి విశ్వేశుఁ గొలిచి
యొక్కొక్కఁ డుదయించె నొగి విష్ణుఁ డనఁగ
నెక్కడఁ బట్టి యింకెన్నిజన్మములు
నతనిబాములు విను మవనిపాలుండ !
శ్రుతిమూలముగఁ జూడు బ్రతివాద మనక ;
తగిలి దూర్వాసుండు దన్నినఁగాదె
నగధరువక్షంబునను మచ్చ యయ్యె ?
హరిని రుక్మిణిఁ గూడ నట్లును గాక
కరమర్థితో బండిగట్టి తోలండె
యమృతాబ్ధి సేవన నయ్యుపమన్యుఁ
డుమియఁడే కుత్తుక నున్న కేశవుని ?
హరిని జలంధరుం డనునొక్క యసుర
పొరిమాల్చెఁగాదె నభోమార్గమునను ?
జలమఱి యొక జరాసంధున కోడి
యిలదుర్గమును బన్నఁడే కేశవుండు ?
నవ్విష్ణునిభదానవాదిరాక్షసులు
మువ్వురు నలపట్టు టెవ్వరు వినరె ?
యేచి విష్ణుండు దధీచిఁ జక్రమున
వైచుడు వీఁపొగ్గి యాచక్ర మపుడ
తునియలుగాఁ గొట్టుచును నతం డెగుడఁ
గనుకని దలవీడఁగాఁ బాఱెఁ గాదె ?

మును మృగచండాల మను గార్దభంబు
వనజాక్షు ప్రాణంబు సనఁ గాచెఁగాదె ?
హరుఁడు విసము ద్రాగి యమృతంబుఁ బనుప
హరి మగఁటిమి విడ్చి యాఁటదిగాఁడె ?
బలిఁ గిట్టి భువిఁ గొన్నపాపంబుకతన
నిలగోలుపడి హరి జలధి సొరండె ?
యాలిఁ గోల్పడి రాముఁ డట బ్రహ్మహత్య
పాలయి ధర చుట్టు భ్రమరించెఁ గాదె ?
పోటరి విష్ణుండు బోయచేఁ గాల
నేటువ డీల్గఁడే యిల యెల్ల నెఱుఁగ ?
వేయేల ప్రేవాడ వెన్న ముచ్చిలుచుఁ
బోయి అంకాడఁడే పొలఁతులతోడ
నోలి నందీశ్వరు నూర్పులఁ దగిలి
పోలేక వచ్చుచుఁ బోవుచుండండె ?
హరి దాన దైవంబ నని జగం బెఱుఁగ
నురులింగమూర్తిచే నుబ్బణంగండె ?
మృడుఁ బెక్కుయుగములు మేఘరూపమునఁ
గొడుకు నర్థించి దాఁ గొలువఁడే శార్ఙ్గి ?
మత్స్యావతారంబు మడియించికాదె
మత్స్యకేతనవైరి మఱి తలఁ జుట్టెఁ ?
బరఁగఁ దత్కూర్మకపాలంబు గాదె
హరుహారమధ్యంబునం దున్నయదియు ?
బ్రాఁతిగా నాదివరాహదంష్ట్రంబు
ఖ్యాత మీశ్వరుచేతఁ గాదె యున్నదియు ?
శరభరూపము దాల్చి పొరిమాల్చికాదె
నరసింహుతోలు శంకరుఁడు దాఁగట్టె ?
పొట్టి త్రివిక్రము నెట్టెమ్ముగాదె
పట్టె ఖట్వాంగము భాతి శంకరుఁడు ?
నగ్రజుఁ డగు విష్ణు నక్కళేబరము

నుగ్రాక్షమూఁపున నున్నదే కాదె ?
మాదేవదేవుని పాదపీఠమునఁ
గాదె లక్ష్మీశ్వరుక న్నున్నయదియు ?
మృడుఁడు విష్వక్సేనుఁ బొడిచి యెత్తుడును
గడఁగి శూలంబునఁగాదె యున్నాఁడు ?
అత్తఱిఁ గలికేతుఁడై కేశవుండు
నెత్తురు వఱపఁడే నిటలాక్షుమోల ?
సంతతంబును శ్రుతి సన "హరిగ్ంహ
రంతం" బనుచు మ్రోయు రౌద్రభావమున
హరిని హరించుట హరిహరుం డయ్యె ;
హరుఁడు సేతోజాతహరుఁ డఘహరుఁడు
శ్రుతులు "యజ్ఞస్య శిరోభిన్న" మనఁగఁ
గ్రతుపురుషునిం జంపఁ గడుఁగోపమునను
వెనుకొని తునుమఁడే వీరభద్రుండు ?
చని కేశవునితల జన్నంబులోన
నవలేపమునఁ బొంది దివిజాధ్వరమునఁ
దివిరి విష్ణుఁడు దలఁదెగఁ గొట్టువడఁడె ?
యతఁ డేల ? యెవ్వఁ డహంకరించినను
రతిపతిహరునిచే బ్రతుకఁగఁగలఁడె ?
వసిగొని హరియు దేవతలు నెత్తంగ
వెస నోపిరే యక్షవినిహితతృణము ?
మించి మున్ బ్రహ్మ గర్వించిన శివుఁడు
త్రుంచివైవఁడె వానిపంచమశిరము
హరిణమై కూఁతురి వరియింప నజుని
హరియింపఁడే మృగవ్యాధ రుద్రుండు ?
అతని పుత్రుండు నహంకారి యగుడు
క్షితి నుష్ట్రమైయుండఁ జేయఁడే హరుఁడు ?
వాసుదేవుండు దైవం బని యెత్తు
వ్యాసునిచేయి నిహత మయ్యెఁగాదె ?

యదిగాక గర్వించినట్టి రావణుని
నదుమఁడే శివుఁడు పాదాంగుష్ఠ మంద ?
మలహరుతో మాఱుమలసి కాముండు
నిలయెల్ల నెఱుఁగ నేఁచేఁటఁ గాలండె ?
కాలుని శ్వేతునికై చంపెఁ గాదె
శూలంబునను బొడ్చి సురలెల్ల నదర ?
దక్షుండు గర్వించి తనఁ గోలుపడుట
సాక్షిగా దెట్లు మేషంబుశిరంబు ?
ఆదిఁ దా నఖిలలోకాధ్యక్షుఁ డన్నఁ
గాదె భగాదిత్యు కన్నులు వెఱికె ?
దూషించి పలుక రుద్రుం డనుగణము
పూషునిపం డ్లూడఁ బొడిచెను గాదె ?
తానచూ యీ జగత్ప్రాణుఁడ నన్నఁ
బూని త్రుంపఁడె పవమానుని కాళ్ళు
ద్రోహిచే నాఁ డాహుతుల్ గొని కుడిచి
బాహుజిహ్వలు గోలుపడియెఁ బావకుఁడు ;
అనిమిషాధిపుచేయి యదితినాసికము
దునుమఁడే వీరభద్రుండు రౌద్రమున ?
నమృతాంశుమేను పాదాంగుష్ఠమునను
జమరఁడే యతఁడు యజ్ఞమున కేతేరఁ
జయ్యన మును సరస్వతి ముక్కుఁ గోసి
1 వయ్యఁడే నాఁటియధ్వరములోపలను
వెండియుఁ గ్రొవ్వినవేల్పుల నెల్ల
దండించుచును జగద్రక్షణార్థముగ
ముల్లోకములఁ గూడ ముంచినగంగ
మల్లికాదళభాతి మౌళిఁ దాల్పండె ?
త్రిపురంబు లతిదుర్నిరీక్ష్య మై తిరుగఁ
ద్రిపురారి వోడేర్చుతివుటఁ గాల్పండె ?

1. వైవఁడె.

నే లెల్ల మోవఁగఁ జాలిన శేషు
వ్రేలిముద్రికగాఁగ దాలిచెఁగాదె ?
సంగతి విషవహ్ని జంబూఫలంబు
మ్రింగినభావన మ్రింగఁడే హరుఁడు ?
అంధక సింధుర వ్యాఘ్రలాలాజ
లంధ రాదుల నిర్దళనము సేయండె ?
యింతింతవనులకు నీశ్వరుం డేల ?
కంతుసంహరు నొక్కగణము సాలండె ?
యొక శివగణముచే సకలలోకములు
ప్రకటంబుగాఁ జెడుఁ బ్రభవించు మించు
నన మహాదేవు మహత్త్వంబునకును
నెన యున్నదే ? యింక నిన్నియునేల
నిత్యుండ నేన యనిత్యు లందఱును
సత్య మిట్లనుచు సజ్జనసాక్షికముగ
నిత్యస్వరూప వినిశ్చితదృష్ట
ప్రత్యయంబుగఁ దాల్పఁబడియున్న యట్టి
హరివిరించుల కపాలాస్థిమాలికలు
కరి గాదె యీశుండు కర్త యౌటకును ?
నదిగాక యుపమన్యుఁ డను మునిచేతఁ
బదపడి శివదీక్షఁ బడసి విష్ణుండు
సొంపున నింద్రనీలంపులింగంబు
నింపార సజ్జయం దిడి కొల్చెఁ గాదె ?
వెన్నుండు దా నిత్య వేయుఁదామరల
నున్నతిఁ బూన్పఁ నం దొకటి లేకున్నఁ
గన్నప్డు వుచ్చి శ్రీకంఠుఁ బూజించి
కన్నను నాఁటి చక్రముఁ బడయండె ?
మత్స్యావతారుఁడై మఱి లంకలోన
మత్స్యకేశ్వరు నిల్పి మఱి కొల్చెఁగాదె ?
మున్ను దోరసముద్రమునఁ గూర్మనాథుఁ

బన్నుగాఁ గూర్మండు భక్తిఁగొల్వండె ?
శ్రీరాముఁడును నట్ల సేతువు నిల్పి
శ్రీరామనాథు నర్చించుట వినమె ?
యాది క్షీరారామ మందు విష్ణుండు
గాదె రామేశ్వరుఁ గడు నర్థిఁ గొలిచె ?
ద్వారావతిని నిల్పి తాఁ గొల్చెఁ గాదె
కోరి గోవిందేశు గోవిందుఁ డర్థి ?
బ్రహ్మ యలంపూర భక్తితో నిల్పి
బ్రహ్మేశ్వరునిఁగాదె పాయక కొల్చె ?
నింద్రుండు పుష్పగిరీంద్రంబుమీద
నింద్రేశు నిడికాదె యెప్పుడుఁ **గొలుచు** ?
వారణాసిని నిల్పి వ్యాసుఁడు గాదె
కోరి వ్యాసేశ్వరుఁ గొల్చు సంతతము ?
ననయంబు వారణాసిని మునీంద్రులును
దనుజామరాదులు దమతమపేళ్ళ
నొక్కొక్క లింగంబు నక్కడ నిలిపి
యక్కజంబుగఁ గొల్చుటది దెల్లగాదె ?
యభవుఁ డక్షయుఁడు మహాదాని దక్క
నభిమతార్థము లిచ్చు నధిపు లున్నారె ?
యవ్విష్ణుఁ డాబ్రహ్మ యజ్జినముఖ్యు
లెవ్వరే నెవరికే నిచ్చిరే పదము ?
నరగరుడోరగవరమునీంద్రులకు
నీశ్వరుఁ డొసఁగినయీప్సితార్థముల
శాశ్వతలీల సజ్జనసాక్షికముగ
నిచ్చిన సకలలోకేశ్వరుమహిమఁ
గ్రచ్చఱఁ బడిసినగణముల వినుము :
చేతులు రెండు సంప్రీతిఁ బూజింప
ఖాతిగాఁ జేతులు బాణున కిచ్చెఁ ;
గన్నులు రెండు సమున్నతిఁ బూన్పఁ

గన్నుల ద్రోవిడెఁ గాళిదాసునకు ?
నాసక్తి శివనాగుమయ్యకుఁ గన్ను
లేసోమవారంబు నెడపక యీఁడె ?
భానునిచేఁ బోని లోనికు ష్ఠడఁచి
పూని మయూరుని పే నిచ్చెఁగాదె ?
హరిచేతఁబోని దుర్భరమైన కుష్ఠ
హరియింపఁడే దండి యర్థిఁగీర్తింప ?
భువిజనులెల్లను బొగడుచు నుండఁ
దవనిధి దేడరదాసయ్య కీఁడె ?
ధూపవేళను ఘంటతోఁ గొనిపోఁడె
మేపార మెచ్చి యోహిళుఁ దనపురికిఁ ?
గరికాల చోడుకుఁ గనకవర్షంబు
నరులెల్ల నెఱుఁగంగఁ గురియించెఁ గాదె ?
మిగిలినబానకు మెచ్చి ప్రాయంబు
మగుడఁక నీఁడె కుమ్మరగుండయకును ?
అక్కడఁ బ్రమథులు నక్కజం బంద
నెక్కిన గద్దియ యీఁడె చేరమకు ?
నిమ్మవ్వకై యేడ్దినమ్ములు నూఱు
యిమ్ములఁ బ్రమథలోకమ్మున విడఁడె ?
చెనసి బొమ్మయ్య చంపినమృగంబులను
ననయంబుఁ గైలాసమునకుఁ గొంపోఁడె ?
పూని యేడ్థినములపీనుఁగు బ్రదుకు
మానుగాఁ గదిరె రేమయ కిచ్చెఁగాదె ?
మలయరాజయ్య నిర్మల విమానమున
నలిగొన బొందితోనన కొనిపోఁడె ?
నిర్జితసంసారునిఁ గుమారపాల
ఘూర్జరుఁ దంత్రంబుఁ గొనిపోయెఁగాదె ?
లలి నూరివారిఁ బిళ్లయనయనారు
వెలయఁగఁ దనలోనఁ గలపికొనండె ?

వరగొండ పెరుమాణి నరులెల్ల నెఱుఁగఁ
గర మర్థిఁ గొనిపోఁడె కైలాసమునకు?
మ్రోలఁ బాడఁగఁ దాళములతోడ నంబిఁ
గైలాసమునకు శంకరుఁడు గొంపోఁడె?
యెలమి షోడశగణముల నిరతముగ
వెలయఁ బీఠంబుల నిలుపఁడే? మఱియు
తేరసగణముల వీరసద్భక్తి
గారవించుచు మెచ్చి కరుణించెఁగాదె?
పొంచి మృగార్థియై పోరి నిద్రవోని
చెంచున కొసఁగఁడే శివరాత్రిఫలము?
చన్నసద్భక్తులచరిత లనంత
మెన్న నే? లిపుడు నీ వెఱుఁగంగ శివుఁడు
వసుధఁ బేర్కొను మడివాలుమాచయ్య
యసదృశుఁడగు కిన్నరయ్య యాదిగను
నచ్చుగా భక్తుల కభిమతఫలము
లిచ్చుచు నున్నవాఁ డిట్లు గావునను
గంతుసంహారు కెన గలదనుచదువు
లింతయు శివుఁ డను నేకాత్మమతము
విను "యథాశివమయోవిష్ణు" వన్మాట
లును, త్రిమూర్తులు నొక్క టనుదురుక్తులను
అష్టమూర్తులు రుద్రుఁ డనుకుయుక్తులును,
దుష్టమానవుల భక్తుల కెన సేసి
పలుకుటయు వినంగఁ బాతకంబొందుఁ;
గలదేని పనిసెప్పు పిలిపించి" తనుదు
భూములు సూచుచు మోములు వాంచి
గామడ్చినట్టు లంగంబులు మఱచి
యుక్కఱి స్రుక్కి యయ్యూరువు లుడిగి
నక్కళ్లు వడి గ్రక్కుమిక్కన లేక
యున్నవారలఁ జూచి యుత్తరం బడిగి
యన్నరేంద్రాధముఁ డట్లు లజ్జింపఁ

గ్రొవ్వడంగిరి దార్కికులు గూసి కుక్క
దువ్వఁ దెచ్చికొనిన యవ్విధంబయ్యె ;
నీక్షితి బాచయ్య యితరమర్త్యుండె !
సాక్షాత్త్రినేత్రుండు సత్య ; మి ట్లనుచుఁ
గొలువు దిగ్గనలేచి బిలిబిలి తార్కి
కులుఁ దాను నేఁగె బిజ్జలుఁడు దక్షణమ
బాచిరాజయ్యయు బసవయ్యముఖ్య
మైచను నిఖిలభక్తావళి యంతఁ
జనుశీలసద్భక్తి సౌభాగ్యమహిమ
దనరార జనులెల్ల ఘనకీర్తి సేయ
రాచిన సద్భక్తిగోచరుం డగుచు
బాచిరాజయ్య యెప్పటియట్ల యుండె.
బాచిరాజయ్య విభ్రాజితచరిత
మేచినవీరమాహేశ్వరసభలఁ
జదివిన విన్నను సంస్తుతించినను
సదమలసద్భక్తిసౌఖ్యసారంబు
సహజైకలింగనిష్ఠాపరత్వంబు
మహితశివాచారమహిమయుఁ బొందు.

నాతతసకలపురాతనచరిత
గీతానుభవసుఖకేలీవిలోల !
విహితశాస్త్రపురాణవేదవేదాంత
మహితరహస్యార్థమార్గానుపాల !
తనుమనోధన నివేదనభక్తివినయ
జనితానురాగాత్మసద్భక్తిజాల !
విదితప్రసాదసవినయసౌఖ్యప్ర
ముదితాంతరంగసమున్నతలీల !
హృన్మందిరాంతర్నిహితగురుధ్యాన !
మన్మిత్ర ! సంగనామాత్య ! సుశీల !
ఇది యసంఖ్యాతమాహేశ్వరదివ్య

పదపద్మసౌరభ భ్రమరాయమాణ
జంగమలింగప్రసాదోపభోగ
సంగతసుఖసుధాశరధినిమగ్న
సుకృతాత్మ పాలకురికిసోమనాథ
సుకవిప్రణీతమై శోభిల్లి తనరి
చరలింగ ఘనకరస్థలి విశ్వనాథ
వరకృపాంచిత కవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చను బసవపురాణ మనుకథయందు
ననుపమంబుగను షష్ఠాశ్వాస మయ్యె. 810

సప్తమాశ్వాసము

శ్రీ శ్రితకంధర శ్రీపాదయుగ స
మాశ్రిత సంగనామాత్య ! సత్కృత్య !

-: శివనాగుమయ్య కథ :-

మఱియును భక్తధీమణి లసత్కీర్తి
కలకంఠభక్తాగ్రగణ్యుఁ డుత్తముఁడు
అసలార శివనాగుమయ్య సంప్రీతి
బసవనిచేఁ బ్రణిపత్తిఁ గైకొనుచు
ననయంబు భక్తిసుధామృతాపార
వనధి నిమగ్నుఁడై వర్తింపుచుండ
బుడిబుళ్ళువోవుచు భూసురులెల్లఁ
బుడమీశుకొలువుకుఁ బోయి యిట్లనిరి ;
"వ్యక్తిగా విను పెద్దభక్తులు పెద్ద
భక్తు లంచును మన బసవయ్య వారిఁ
గడుఁగడుఁగొనియాడుఁ, బడుఁ గాళ్ళమీఁద,
గుడిచి డించినయది గుడుచు, వెండియును
వెఱవక సభ్యనివిధి మిమ్ముఁ గదియుఁ,
దఱియంగఁజొచ్చు నంతర్నివాసములు.
వారును బురవీథి వచ్చుచోఁ దమ్ముఁ
జీరికిఁ గైకోరు నెంబలివారు ;
కథ లేల కళ్యాణకటక మంతయును
బ్రథితంబు మాలలపాలయ్యె నింక ;
నెక్కడివర్ణంబు ? లెక్కడినీతు ?
లెక్కడిధర్మంబు ? లి ట్లేల చెల్లు ?
రాజులఁ బొరయుఁ దద్రాష్ట్రంబుపాప
మోజమాలినవారి నొగిఁ బర్వకున్న ;

వినఁ జెప్పుకున్నఁ దజ్జననాథు పాప
మనఘ ! పురోహితులను సవశ్యమును
బొందుఁ; గావునఁ జెప్ప భూమీశ ! వలసె;
నెందుఁ బాపం బింకఁ బొందదు మమ్ము ;
ధ్రువము "రాజానుమతో ధర్మ" యనుట
యవనీశ ! యెఱుఁగవే" యనుడుఁ గోపించి
వసుధేశ్వరుఁడు బసవనఁ బిల్వఁబనుప
నసమాను నందలం బర్థి నెక్కించి
శివనాగుమయ్యకుఁ జేయిచ్చికొనుచుఁ
దివిరి యేతేరఁ దద్ద్విజులు వీక్షించి
"యదిగో మహారాజ ! యంతటఁ బోక
కదియవచ్చెడు మాలఁగలప నిచ్చటికి ;
డెందంబునను భయం బందమి సూడు !
మందలం బెక్కించి యతనిఁ దెచ్చెడిని ;
ఇంక నేరి కితండు శంకించు ?" ననినఁ
గింకతో నగరివాకిలి సొరకుండ
వెలుపలికొల్వున విభుఁ డున్న యెడను–
నులుకక బసవయ్య యున్నతంబుగను
శివనాగుమయ్యకు సింహాసనముగ
భువిఁ దనపైచీర వుచ్చి పెట్టుచును
"బిరిచినపని యేమి పృథివీశ" యనినఁ
గలుషంబు గ్రమ్మ బిజ్జలుఁ డిట్టు లనియె :
"నాదిఁ దలంప వర్ణాష్టాదశముల
భేదంబు ; లవి నేఁడు వేరొక్కన్న యవియె ?
కులసంకరము సేయఁగూడునే మాలఁ ?
గలపితి కళ్యాణకటక మంతయును ;
నీతలఁ బుట్టెనే నిటలాక్షుభక్తి ?
నీతిహీనుఁడ ! కుర్యునే వర్ష మింకఁ ?
బండునే యింక మీ రుండినభూమి ?
యొం డేల ? మీకు మే మోడుదు" మనుడు

వసుధేశ్వరునకు నవాఖ్యవీర్యుండు
బసవఁడు సద్భక్తిపండితుం డనియె :
"మనుజేశ ! గొడగర మాచలదేవిఁ
జెనసి యుత్తమవంశ్యఁ జేసెద మనుచు
స్వర్ణధేనువులోన సతి నుంచి మునుఁగ
నిర్ణిమిత్తమ పాలు నిండఁగఁ బోసి
యా పోయెఁ బూర్వాశ్రయం బని తార
యాపడఁతికి మ్రొక్కి యంతటఁ బోక
యంగద నట్టిగ్రామాంత్యజురాలి
యెంగిలిపాల్ద్రావి రేకంబు లేక ;
యది యేల వేయును నసఁ ? గథ లందు
1 గదుగదుకేమి యక్కనకధేనువును
వండఁ దగ్గినమాడ్కి ఖండము ల్గాఁగఁ
జెండుచుఁ దమలోనఁ జేవ్రేసికొనుచు
బనత సోమాదుల బలగంబుపాలు
వెనుకచట్టలు సతుర్వేదులపాలు
కోలెమ్ము దా నుపాద్దేలయ్య పాలు
వాలమ్ము బ్రహ్మవిద్వాంసులపాలు
బరులు షడంగులపాలు మున్నడుక
లురము సైతము ప్రభాకరభట్లపాలు
సమపొట్ట సన్నపుటెముకలుఁ బ్రక్క
టెముకలు వ్యాకరణమువారిపాలు
తోలఁకుజల్లియుఁ ద్రివేదులవారిపాలు
బలుదెక్క సిఱుదెక్క వాళ్ల మిక్కిళ్ల
పరదేశి విద్యార్థిపాలంచు నిట్లు
చెరలుచు గోహత్య సేసినయూర
మాలల యీ త్రాటిమాలల వచ్చి
మాలలమాటలు వోలునే వినఁగ ?

1. సందేహము, జంకు.

వేదంబు లాదియో ; విధికల్పితంబు
లాదియో జాతుల కది యెట్టు లనినఁ :
జనువేదచోదితజాతులు రెండు ;
వినుము ప్రవర్తకంబును నివర్తకము ;
భవకర్మసంస్కారి భువిఁ బ్రవర్తకుఁడు ;
శివకర్మ సంస్కారి భువి నివర్తకుఁడు ;
సన్నుత వేదార్థచరితంబు లుండ
మొన్నఁ బుట్టిన కులమ్ములమాట లేల ?
స్రష్టృక్తమగునట్టి జాతులు గావె
యష్టదశంబులు నవి యేల చెప్ప ?
మిక్కిలి పదునెనిమిది వర్ణములకు
నిక్క మారయ భక్తినిచయంబు కులము ;
భాగ్యహీనుండు దాఁ బసిఁడిఁబట్టిన న
యోగ్యంపులోష్టమై యున్నట్లు శివుని
ప్రతిబింబమూర్తి యౌ భక్తుండు భువికి
మతిఁ జూడ మానవాకృతి నుండు ధరణిఁ ;
గావున శివభక్తగణములమహిమ
భావింపఁ దలఁప నీప్రాప్తియే చెపుమ !
కరివైరితోడఁ గుక్కలు వోల్ప సరియె ?
కరితోడ గ్రామసూకరములు సరియె ?
జడధితో నిలఁ జౌటిపడియలు సరియె ?
వడి గంగతో వెడవ్రంతులు సరియె ?
తపనుతో ఖద్యోతతతు లెల్ల సరియె ?
యుపమింపఁ జంద్రుతో నుడుపంక్తి సరియె ?
మేరువుతోఁ బెరమెట్టలు సరియె ?
పారిజాతంబుతోఁ బ్రబ్బిళ్ళు సరియె ?
శివనాగుమయ్యతోఁ జెనఁటు లీద్విజులు
అవనీశ ! సరియుఁ గా ; రది యెట్టు లనిన :
భంక్తుడు శ్రీపతిపండితుం డీశు

భక్తుని కిలఁ గోటిబ్రాహ్మణులైన
నెన యన్ననాలుక నేఁ గోసివైతు
ననచు ననంతపాలుని సభాస్థలిని
నెక్కొనఁగాఁ జంద్రనిప్పులు గాదె
చక్కన పొత్తి పచ్చడమున ముడిచెఁ;
దా నేమి చెప్ప భక్తానీక మిండ్ల
శ్యానంబులకు ద్విజు ల్సరిరామి వినవె?*
నటుగాన కులహీను లన నెట్లువచ్చు
నిటలాక్షుభక్తుల నిఖిలేశ్వరుండ!
కని ప్రతిష్ఠాపూర్వకం బైన పిదపఁ
జెనసి లింగము కాక శిల యనఁ జనునె?
యతిశయలింగదీక్షితుఁ డైనయట్టి
ప్రతి నంత్యజుం డని మతిఁ జూడనగునె?
హరసన్నిహితుపూర్వ మరయుటయెల్ల
హరు శిలయన్నయ ట్లధికపాతకము;
మేదినీవల్లభ! మేరువు సోఁకి
కాదె తచ్ఛాయన కాకి వట్రిల్లు!
భృంగసంస్పర్శఁ బతంగంబుదొంటి
యంగంబునకుఁ బాయు టది దెల్ల గాదె!
వారిధిఁ దటినీప్రవాహముల్ గలయఁ
బేరున్నదే వేఱె? పెక్కు లేమిటికి
సిద్ధరసస్పర్శఁ జేసి యోఁగాదె
శుద్ధసువర్ణంబు శుద్ధతామ్రంబు!
గురుకరస్పర్శచేఁ గులమొక్కఁ డౌట
యరిదియే యట్ల యంత్యజుఁడు నగ్రజుఁడు?
ధర "నుమా మాతా పితా రుద్ర" యనఁగ
పరినొక్కదల్లి ప్రజలకు వేఱెద్ది?
యొప్పెడుమాణిక్య మొక మసికోక
నెప్పాటఁ బొదివిన నిలఁ గాంతి సెడునె?

హరభక్తుఁ డధమజాత్యావృతుఁ డయ్యె
ధర నున్న నేమి? యాతనిప్రాప్తి సెడునె?
రాజీవ మరయఁ బంకేజంబు గాదె?
పూజకు నది యెట్లు పూజ్యమై పరగెఁ?
గాష్ఠోద్భవం బయ్యుఁ గాదె పవిత్ర
నిష్ఠితం బై పొల్పె నెఱి ననలంబు?
ఎట్టిదుర్జాతిని బుట్టిన నేమి
యెట్టును శివభక్తుఁ డిలఁ బవిత్రుండు;
ఈయగ్రజన్మల కెల్లను గురువు
బోయెతకును గాదె పుట్టె వ్యాసుండు:
పూర్వద్విజాచార్యుఁ డుర్వి వసిష్ఠుఁ
డూర్వశి యనులంజె కుదయించెఁ గాదె:
మాతంగుఁ డనఁగ బ్రహ్మర్షియొకండు
మాతంగికిని గాదె మహిఁ బ్రభవించె:
శునకగార్దభ మచ్ఛశుకదర్దురాది
జనితమునీంద్రాదిజాతము లెల్ల
శివభక్తిఁ గాదె విశిష్టమై పరఁగె:
నవనీశ! యెఱుఁగవే యందఱ" ననిన
విని బిజ్జలుఁడు రోషవిహ్వలుఁ డగుచుఁ
గనుఁగొని బసవరాజునకు ని ట్లనియెఁ:
"బనిలేనిమాటలుఁ బాటలుఁ గథలు
విన విరుద్ధము; లాడ వేసర వీవు;
బత్తులఁ జిదిమినఁ బాలు గాఱెడినె?
నెత్తురు గాఱెడినే యొడ్లఁ జిదుమ?
నిట్టిమార్గములు మున్నెఱుఁగ మే" మనిన
దట్టుఁడు బసవయ దా నంత లేచి
"భర్గునిఁ గా దని పలుద్రోవ లేఁగు
దుర్గుణు లగు శివద్రోహులతోడ
నడరంగ వేదబరాఁకాంతు లనఁగఁ

బడిన బ్రహ్మణ గార్దభంబులతోడ
మహిత ప్రణవదివ్య మంత్రోపదేశ
రహితులై చనువ్రత భ్రష్టులతోడఁ
జాల దధీచ్యాదిశాపాగ్నిశిఖలఁ
గాలినకర్మచండాలురతోడఁ
బట్టి ప్రాణముతోడఁ బశువు వధించు
కట్టిఁడు రగు పశుకర్ములతోడ
జన్ననితోరలినఁ జాగఁగఁబెట్టు
మన్నట్టి యధికపాపాత్ములతోడ
పీసానకై యెట్టి దోసానకైనఁ
జేసాఁచికొను కర్మజీవులతోడ
మానుగా సురపాటిగా నర్థి సోమ
పానంబు గావించు పాఱులతోడ
నిన్నియుఁ జెప్పంగ నేల తాఁ జంపి
జన్నిసంపె నను దుర్జాతులతోడఁ
బ్రతిచేసి యాడినఁ బాపంబు వచ్చుఁ
బ్రతిన సూపమి భక్తిసంతంబు గాదు.
శివనాగుమయగారి శ్రీ హస్తమంద
నివిడి చూపెదఁ బాలు నీవన్నయట్టు ;
లీమహీసురులలో నెన్నఁగఁబడ్డ
సోమయాజులఁ దర్గి చూపుఁడా నీళ్లు ;
అటుగాక తక్కినఁ గటకంబుచుట్టుఁ
గుటిలాత్ములను దొడుగులఁ బఱపింపు"
మనుచు బిజ్జలభూసురానుమతమునఁ
జని సదాసిద్ధ బసవచక్రవర్తి
శివనాగుమయగారి శ్రీపాదములకు
భువి సమస్తాంగము ల్వొందంగ మ్రొక్కి
సన్నుతలింగపసాయితశస్త్ర
సన్నద్ధుడై మదిఁ జెన్ను దుల్కాఁడ

సరస మాడినయట్లు పొరి నాగుమయ్య
కరతలాంభోజంబు గరములఁ బట్టి
యొత్తుడుఁ బింజించి యుడువీథిఁ దాఁకి
యత్తటి క్షీరధారావలి వర్వె
శివభక్తి కామధేనువు బసవనికిఁ
దవిలి చన్నవిసియిబ్బువిఁ గాఱునట్లు ;
కరుణించి శంభుండు గనకవర్షంబు
కరికాలచోడుకుఁ గురియించె నాఁడు ;
అసలార నేఁడు దివ్యామృతవృష్టి
బసవనికిఁ గురిసె భక్తవత్సలుఁడు ;
దుర్మలత్రితయ విధూతమైనట్టి
నిర్మలదేహంబు నిజ మట్ల కాదె
రుధిరమాసాంది నిరూపితం బగునె
యధమదేహులకుఁ గా కని లరు ల్వొగడ
దివ్యామృతాంగ దీధితి దేజరిల్లెఁ ;
బ్రవ్యక్తమై జగత్ప్రత్యయం బమర
నఖిలభక్తౌఘంబు నసదృశలింగ
సుఖసమేతాత్ము లై చూడ బిజ్జలుఁడు
నందంద నాగిదేవయ్యపాదార
విందంబులకుఁ జాఁగి వినమితుఁ డగుచు
సకలలోకంబులు జయ వెట్టుచుండ
నకుటిలభక్తిమై నంతంత మ్రొక్కి
'యజ్ఞానజీవుల మపగతమతుల
మజ్ఞుల మధికగర్వాపరాధులము ;
శరణన్నఁ గాచు మీబిరుదు నేఁడింకఁ
బరమాత్మ ! మఱవంగఁ బాడియే !' యనుచు
శరణు వేఁడుచు నున్న చండివిప్రులను
గరుణఁ జూచుచు వారిఁ గాంచి నవ్వుచును
బసవఁ డుద్యత్సముల్లసనం బెలర్ప

నసమగజంబు నాగయ్య నెక్కించి
తాను బిఱుఁదెక్కి తననివాసమున
కానందలీల నొప్పారంగ నరిగె.
శివనాగుమయగారి ప్రవిమలచరిత
మవిరళప్రీతి దుల్కాడంగ వినినఁ
జదివిన వ్రాసిన సద్భక్తిమహిమ
లొదవు ; చతుర్వర్గపదములు సెందు.

-: బోయల తగవు :-

రుద్రునిమాఱట రూపంబు లనఁగ
భద్రేభసంహారు ప్రతినిధు లనఁగ
కళ్యాణమున నిత్యకళ్యాణభక్తి
లౌల్యనిరర్గళ లాలిత్యముగను*
శివభక్తిసంపదల్ సిరివిరివోవ
సవిశేషభక్తి దృష్టప్రత్యయములఁ
జూపుచు సద్భక్తి సురుచిరమహిమ
నేపారువీర మాహేశ్వరావలికి
భక్తమహత్త్వంబు భక్తాభివృద్ధి
భక్తచరిత్ర ప్రభావమై భవము
కన్నవారలు సెప్ప విన్నవారలును
నున్నతశివభక్తి యుక్తిమైఁ దగిలి
[1]దేవలకులు మంత్రదీక్షాన్వితులును
శైవపాశుపతాదిశాసనధరులు
వారివారిక లింగవంతులై చూచి
వారివారిక లింగవంతులై కూడి
వీరమాహేశ్వరాచారనిరూఢి
భూరిప్రసాదోపభోగులై నడవ
బోయ లందఱుఁ గూడి భూమీశుకడకుఁ

1. తంబళులు.

బోయి "యుత్పాతము ల్పుట్టె నీపురిని
శ్రీకంఠశివులు గౌరీనాథశివులు
లోకేశశివులు త్రిలోచనశివులు
నీశానశివులు మహేశ్వరశివులు
పాశమోచనశివు ల్వరమాత్మశివులు
శాశ్వతశివులు గణేశ్వరశివులు
విశ్వేశశివులును విమలాత్మశివులు
త్రిపురాంతకశివులు త్రినయనశివులు
ద్వితదైత్యహరిశివు ల్దేవేశశివులు
సురలింగశివులును నుగ్రాక్షశివులు
హరశివులును బరమానందశివులు
ధర్మశివులును విద్యాధరశివులు
నిర్మలశివులును నిష్కలశివులు
మొదలుగాఁగల శైవముఖ్యు లందఱును
నిది యేమి మతములో యెఱుఁగంగరాదు!
బసవయ్యతోయంపు భక్తులఁ జూచి
వసుధఁదారును లింగవంతుల మనుచు
దొడఁగి ప్రసాదంబుఁ గుడుచుచున్నారు;
నడరఁగ మా కించు కైనను నిడరు.
నియ్యూరిలో మల్లజియ్యము బొల్ల
జియ్యయు నిత్తురే? చెల్లునే యిట్లు?
విను మహారాజ! మావృత్తి నిర్మాల్య;
మొనరఁగ మాకు వచ్చినతొంటి విధము
పసులఁ గావఁగఁ బోయి బాలుఁడు దొల్లి
యిసుకలింగముసేసి యేలమిఁ బైఁ బిదుక
నేలరా! మొదవుల పాలెల్ల నేల
పాలు సేసెద వంచుఁ గాలఁ దన్నుఁడును
గడఁగి తండ్రి యనక గ్రక్కునఁ గాళ్లు
గడికండలుగఁజేసి మృడుని మెప్పించి

మా దేవునిచేతఁ బ్రసాదంబు వడసి
యాదిఁ జండేశ్వరుఁ డట్ల మా కిచ్చెఁ;
నంతటనుండి భోగింతు మిట్టులు ని
రంతరవంశపరంపర మేము;
నిప్పురి వీరమాహేశ్వరు లనఁగ
నిప్పు డేలా చెల్ల నిచ్చెద? మనుచు
బసవయ్య యంత్రము ల్వన్నుటఁజేసి
పొసపరి మాతోడఁ బోరుచున్నారు;
చెల్లింపఁదగు నని చెప్పు! గాదేని
వల్లభ! నీయింటి వాకిట నగ్ని
గుండముల్ ద్రవ్వించికొని కాల్దు" మనిన
నిండుఁగోపముతోడ నిఖిలేశ్వరుండు
బసవయ్యఁ దోడ్తేరఁ బనుచుడు బసవఁ
డసమానలీలమై నరుగుదెంచుడును
"గెడ గూడి బోయలఁ గెడపు టిదేమి?
వడిఁ బ్రసాదము మీరు గుడుచు టిదేమి?
యాదిమార్గమొ బల్మియో దీనిఁ జెపుమ!
కాదేని నాడికో కార్య మేమైన
నూరక కుడుచుట యుచితమే?" యనిన
ధారుణీశ్వరునితోఁ దా నిట్టు లనియె:
"నిచ్చుట గలదు సందేశున కభవుఁ
డిచ్చిన తెఱఁగు మీ రెఱుఁగరే? వినుఁడు:
బాణలింగములందుఁ బటికంబులందుఁ
బ్రాణలింగములందుఁ బౌష్యరాగాది
లింగంబులందును లేదు ప్రసాద
మంగజహరునికి నాగమోక్తముగ;
ధరమానవులు మహేశ్వరప్రసాదంబు
ధరి యించినను గొన్నఁ దారు సూచినను
నరయక దాఁటిన నరకాగ్నిశిఖల

నెరియుదు రని శ్రుతు లెందును వినరె !
శ్రీగురుకరుణానురాగ ప్రసాద
మాగమవిధ్యుక్త మగు ప్రసాదంబు
సుప్రసన్నానంద శుద్ధప్రసాద
మప్రతర్క్యాది లింగప్రసాదంబు
పరమపవిత్ర సంపత్ప్రసాదంబు
స్థిరభవరోగౌషధీప్రసాదంబు
సత్యప్రసాదంబు నిత్యప్రసాద
మత్యుత్తమోత్తమం బగుప్రసాదంబు
గరళకంధరు కృపాకలితప్రసాద
మరుదగుసంగమేశ్వరు ప్రసాదంబు
మలదేహులకు మీకుఁ దలమె భోగింప ?
మలహరుభక్తుల యిలుపుట్టువృత్తి
పూని లింగప్రసాదానూనసుఖము
మానవులకుఁ బొందఁగా నెట్లువచ్చు ?
[1]నేనుఁగుప న్నగునే గాడిదలకు ?
నేనాఁటఁ గన్నులఁ గానరు గాక !
యిచ్చుచోఁ గెడపితిమే ప్రసాదంబు
నిచ్చినకొన్నచో నెన్నఁడుఁ గలదె ?
యిది యేల వెడగథ లిన్నియుఁ బన్న ?
గుదగుదపడక నెమ్మది నుండుఁ''డనిన
"వారాణసి గయఁ గేదారంబునందు
సౌరాష్ట్రమునను దక్షారామమునను
శ్రీగిరియందును సేతుపురోగ
మాగమస్థానంబులం దెల్ల మాకుఁ
జెల్లఁగ మీ రెట్లు చెల్లఁగనీరు ?
బల్లిదమైన మాప్రాణంబులైన
విడుతుముగాక మా[2]మడిగూటివృత్తి
విడుతుమే యిది యేమి విపరీతవృత్తి''

1. ఏనుఁగుపైఁ గట్టు చౌడోలు.
2. ప్రసాదము గొను వ్యాపారము.

యనుచు బోయలు లేచి కనుకనిఁ బలుకఁ
గనుఁగొని బసవయ్య గన్నుల నగుచు
"వట్టియాకులు గాలి వడిఁ దూలుఁగాక
మెట్టలు దూలునే యెట్టిగాడ్పునను ?
బెండ్లు దేలెడిఁగాక పేరేట నైన
గుండ్లు దేలునె మఱి తం డ్లవియేల ?
బలువునఁ గొన హరిబ్రహ్మాదులకును
గొలఁది గా దనిన మీకొలఁదియే తొరల ?
వలదు మీ రెంతటివారు గావునను
చల ముడ్గి తొలగుఁడు తెలివిడిఁ గొనుఁడు !
శైవశివాలయస్థానంబు దక్క
నేవీట నేనాఁట నిలఁ దొల్లి నేఁడు
నెన్నఁడే వీరమాహేశ్వరు లిండ్లఁ
గొన్న చోటులు దెల్పికొనుఁడ ! యిచ్చెదము ;
యారయ మును శైవు లైనను నేమి
వీరమాహేశ్వరాచారు లైరేని
గనుకనిఁ బ్రాణలింగప్రసాదంబుఁ
గొననిత్తురే మీకుఁ ? గుటిలాత్ములార !
కోలాస లేల పైఁ గొసరఁ గుంచంబు
గూలఁబడ్డట్లగుఁ గూడని మ్మనిన
నేదియు నేల మీ కిష్ట మేనియును
మా దేవునకును శ్రీమన్మహేశునకు
బాలచంద్రప్రభాభాసురాంకునకుఁ
గాలకాలునకు మానీలకంఠునకు
సర్పకుండలునకు సంగమేశ్వరున
కర్పింతుఁ గాలకూటాదులు నేడుఁ ;
రండ ! ప్రసాదంబు గొండ యిచ్చెదము ;
పొండ ! యింతకుఁ జాలకుండిన" ననుడు
"నక్కటా బసవయ్య ! యందఱ మమ్మ

నొక్కవెట్టునఁ జంప నొండుపాయమునఁ
జాలక యిదిమేలు మేలు వో శృంగి
కాలకూటంబు మ్రింగంగఁ బంచెదవు!
నలి దీటుకొనఁగఁ బ్రాణంబుఁ గల్గినను
బలుసాకు దిని యైన బ్రదుకంగ వచ్చు;
నద్దిరా తాఁ జచ్చి యది గుఱ్తు రెవరు?
దొడ్డవో బసవయ్యతోడివాదంబు;
వడిఁ గొఱుకున కేఁగి 1 బడిగంటఁ జావఁ
బడిన మూషకములభంగి వట్రిల్లె;
నేచి కొల్లకుఁబోయి యెదురెదురు గాను
బై చీర గోల్పడ్డభావన దోఁచు;
జాలిఁబడి 2 కనకసాములు దమక
వేలిచికొన్న యావిధ మగుఁ దమకుఁ;
బగవారిబిడ్డల నగవులఁ జంపు
పగిదిఁ జేసిన పోదు బసవనమంత్రి!
యీరసం బిదియేల? యే మింతవెఱ్ఱి
వారము గాము వో! వలవ దిన్నియును;
ధర భక్తు లెవ్వరే హరునకుఁ దొల్లి
గరళ మర్పించుట గలదేని యిమ్ము;
తవిలి చెప్పుము! ప్రసాదం బని విషము
నెవరేని మునుగొన్న నేముఁ గొనెదము;
మేలిప్రసాదంబు మ్రింగ మీపాలు
కాలకూటంబు మాపాలె? నేఁ డింక
నె ట్టిచ్చెదయ్య మాకీశుప్రసాద
మట్టవుఁబో విష మనియె యిచ్చెదవో?
సీవకో విషములు దేవుని కిచ్చి

1. బడిగల్లు = పందికొక్కులఁ జంపుట కేర్పడిన జాతిబోను.

2. శత్రువును జంపుటకై యభిచారహోమము చేసి యం దుద్భవించిన మారణశక్తిచే శత్రువునికి మాఱు తాను హతుఁడైనవాఁడు.

చావకున్నను దత్ప్రసాదంబు మీర
చేకొండు ; వేయేల మీకును మాకుఁ
బ్రాకటంబుగ నింక బాస దా నిదియ ;"
యనుడు బిజ్జలుఁ డుభయానుమతమునఁ
జనుదెంచె దేవదేవుని గుడికడకు
బుడిబుళ్లు వోవుచు బోయలు వచ్చి
రడరఁగఁ దమకాకిపడగలు దూల ;

—: బసవన్న విష మారగించుట :—

బసవఁ డసంఖ్యాతభక్తులుఁ దాను
నసమానలీలమై నరిగి యచ్చటను
గాలకూటము శృంగి ఘనవత్సనాభి
హాలాహలంబును నాదిగాఁ గలుగు
విషము లన్నియుఁ గూర్చి వేగ నూఱించి
విషమతరం బగు విషసౌరభంబు
గాలి సోఁకినమాత్ర నోలి జంతువులు
వ్రాలి యచ్చటన జీవంబులు విడువఁ
బై నాకసంబునఁ బాఱువిహగ వి
తానంబు దొప్పున ధరఁబడి చావ
రాగిల్ల నూఱినఁ బ్రేగులు దెగెడిఁ
ద్రాగిన బ్రదుకంగఁ దా నెట్లువచ్చు ?
ననుచు నబ్బోయలు కనుకనిఁ బఱవ
ఘనఘోరగరళంబు లెనయంగఁ గలపి,
పసిఁడికొప్పెరల నిం పెసఁగగ నినిచి,
యసమసద్భక్త సభాభ్యంతరమునఁ
గొప్పెర ల్దియించి కూడ నర్పించి,
యప్పుడు ధూపదీపాదు లొనర్చి
పంచమహావాద్యపటలంబు లులియ
సంచితకీర్తి బసవచక్రవర్తి
యామడివాలు మాచయ్యయాదిగను

గామారిసద్భక్త గణలింగములకు
నతిభక్తి సాష్టాంగుఁడై ప్రణమిల్లి;
చతురత సరసనం స్తుతిపూర్వకముగ
ముద్రవుచ్చుడును విషోద్రేకవహ్ని
రుద్రుమూఁడవకంటి రౌద్రాగ్ని కరణి
భుగులుభుగుల్లనఁ బొగలి కెంబొగలు
నెగయ విషార్చుల గగనంబుఁ గప్పెఁ;
బటువహ్ని గొని చెడిపాఱె భానుండు;
నిటయట పడియె నీరేడు లోకములు;
భూలోకమెల్లఁ గల్లోలంబు నొందె;
వ్రాలి మూర్ఛిల్లెను జీవంబు లన్నియును;
నిల మంగలమునఁ బ్రేలాలు సిట్లుగొన్న
పొలుపున ధరణిఁ జుక్కలు ద్రెళ్ళిపడియెఁ;
పొగగొన్నమాత్రన దిగులు సొచ్చుడును
విగతచేతనులైరి దిగధీశులెల్ల;
నిండె ధూమంబు బ్రహ్మాండమంతయును;
కొండలు గాటుకకొండలై తోఁచె;
బడబానలంబున జడధులు గలఁగె;
నడరెఁ గల్పాంతాగ్ని యని బ్రహ్మ వడఁకెఁ;
నీలవర్ణంబు దా నెక్కొన్ననాఁటి
హాలాహలం బని హరి దల్లడిల్లెఁ;
గుత్తుకవిష మెట్లొకో పోయె వెడలి
నత్తఱి నని రుద్రుఁ డతిభయం బందె;
నెగసె రుద్రునిఫాలనేత్రాగ్ని యనుచు
నొగి గణాడంబరోద్యోగంబు దనరె;
నేలయు నింగియు నెక్కొన నిట్టి
హాలాహలాగ్నిమయం బగు నంత—
"మాయీశభక్తుల మహిమ లిన్నియును
బోయలార ! వినుండు బుడిబుళ్ళు మాని;

కంటిమి కానము వింటిమి వినము
ఉంటిమి లే మను ను క్తులు వలదు ;
అరయంగ నఖిలలోకాలోకములను
బరమేశుభక్తులు పరమపావనులు ;
నద్వితీయుండు వినాకియే కర్త ;
సద్విధి నేమె ప్రసాదయోగ్యులము ;
ఇట్టిద కాదనునట్టి ద్రోహులకుఁ
గట్టితి నెఱిగెల్తుఁ గాలకూటాగ్ని ;
శాపింతు, నఱికింతు, సందుసందులకుఁ
ద్రోపింతు, వాండ్ర నధోగతి" ననుచు
దండియై బసవనదండనాయకుఁడు
చండేశసుతుఁడు శ్రీ సంగమేశునకు
సర్వాంకునకుఁ దద్విషంబు సద్భక్తి
దర్పం బెలర్ప సమర్పణచేసి
పసిగమై నారగింపఁగ నార్చి పేర్చి
వెస ననివారితోద్వృత్తిఁ జెలంగి
యరగలిగొనక కొప్పెరలకు నొరగి
పరమ మాహేశ్వరప్రకర ముప్పొంగి
జుష్టంబు "బహ్వాపి స్తోక మేవాపి
శిష్ట మన్నం విమిశ్రిత" మనుఁ గాన
బసిఁడిగలంతెలఁ బసిఁడిముంతలను
వారక యిటుగూడ వడ్డించికొనుచు
మారారి కర్పించి మహనీయలీలఁ*
శివున కర్పింపుచు శివశివ ! యనుచు
నవధానవంతులై యారగింపుచును
జుఱ్ఱుజుఱ్ఱునఁగొని సొగయుచు, గఱ్ఱు
గఱ్ఱునఁ ద్రేన్చుచుఁ, గాళ్లు సాఁచుచును,
నిక్కుచు నీల్గుచు నక్కిలింపుచును
జొక్కుచు సోలుచుఁ జక్కిలింపుచును

నక్కలిపడి తెప్ప లల్ల మోడ్చుచును
గ్రుక్కిళ్లు మ్రింగుచుఁ, గుత్తుక బంటిఁ
గ్రోలుచు, నలరుచుఁ, గ్రాలుచు, నాత్మ
నోలుచు, సుఖవార్ధిఁ దేలుచు, వేడ్క
వ్రాలుచు, మెఱయుచు వక్షంబులందు
నోలిఁ బళ్ళెరముది క్కొయ్యన మరలి
చూచుచు, నించుకించుక పుచ్చికొనుచు,
లేచుచుఁ, జెలఁగుచు లీలఁ దలిర్ప
నాడుచుఁ, గప్పెర లఱచేత నొలయఁ
బాడుచు, నుఱుకుచుఁ బరువుపెట్టుచును
మురియుచుఁ, గునియుచు, ముఱకటింపుచును
నొరగాల నిలుచుచు, సరసమాడుచును
నేతెంచి మ్రొక్కుచుఁ జేతులు సాఁచి
ప్రీతిఁ బ్రసాదంబుఁ బెట్టించికొనుచుఁ
గర మనురక్తుమైఁ గౌఁగిలింపుచును
నరుదొందఁ బొత్తుల నారగింపుచును,
నొండొరుముందట నున్న పళ్ళెరము
లొండొరు లొడియుచు నుబ్బియార్చుచును,
విషమాక్షసద్భక్త వితతి యుబ్బంగి
విషమవిక్రమలీల విషకేలి సలుప-
దండి యై బసవనదండనాయకుఁడు
చండేశవరద ప్రసాదశేషంబు
గొట్టరువులవారిఁ గుంచెలవారి
గొట్టుబోయల నాలవట్టాలవారి
పట్టపుదేవుల భార్యల హితులఁ
జుట్టాలఁ బక్కాల సుతులఁ బౌత్రులను
బండారులను నడబాళ్ళఁ బ్రెగ్గడల
దండనాయకులను దంత్రపాలకుల
దాసజనులను విశ్వాసుల భట్ల

దాసీజనముల విలాసినీజనులఁ
దతవితతాది వాద్యవిశారదులను
జతురగాయక నిజస్తవపాఠకులను
బండిత నర్తక పరిహాసకులను
మండితసత్కవి మండలి నెల్లఁ
బంతులు సాగఁగఁ బంచి, వారలకు
వింతవేడుక వుట్ట విషము వోయింపఁ
గాలకూటము వారిపాలికి నెయ్యి
పాలునై యుండఁగ బసవన్న మఱియుఁ*
కూడ నేనుఁగులకు గుఱ్ఱంబులకును
వేడుకఁ బోయించె విషమెల్ల సమయ;
నడలుచుబోయలు గడగడ వడఁక
మృదుభక్తమండలి మెచ్చి కీర్తింపఁ
బ్రమథకారుణ్య విస్ఫారప్రసాద
విమల పుష్పాంచితవృష్టి పైఁ గురియ
గగనస్థులై రుద్రగణములు సూడ
నాగి దివ్యదుందుభు లొక్కట మ్రోయ
బిజ్జలుఁ డద్భుతోపేతుఁడై మ్రొక్క
యజ్జనౌఘంబు వాయక జయవెట్ట
'భవలతాంచితదాత్ర పరమపవిత్ర!
శివగణస్తోత్ర విశిష్టచారిత్ర!
సదమలగాత్ర ప్రసాదైక పాత్ర!
విదితసజ్జనమిత్ర విజ్ఞాననేత్ర!
ప్రోద్గతసూత్ర మహద్గురుపుత్త్ర!
సద్గుణైకచ్ఛత్ర జంగమక్షేత్ర!
యతిదయామాత్ర దుఃఖాబ్ధివహిత్ర!
ప్రతివాదిజైత్ర సద్భక్తికళత్ర!
చన "నరిర్మిత్రం విషం పథ్య" మనఁగఁ
బనుపడుశ్రుత్యుక్తి బసవ! నీ కయ్యెః

బాపురే ! మాతండ్రి భక్తివర్ధనుఁడు !
బాపురే మాయయ్య ఖ్యాపితశౌర్య !
నల్లవో బసవయ్య నందీశమూర్తి !
నల్లవో బసవ యనశ్వరకీర్తి !
గరళంబు దొల్లి జగద్ధితార్థముగ
హరుఁ డారగించుచో నట మ్రింగ వెఱచి
కాదె విషం బుంచెఁ గంఠంబునందు !
నా దేవు మహాత్మ్య మదియెంత పెద్ద ?
కాలకూటముకంటెఁ గడు నుగ్రవిషము
తా లెక్కసేయక దండనాయకుఁడు
అంచితభక్త హితార్థంబుగాఁగ
వంచనలే కారగించెఁ గడ్వార ;
నమృతంబు ద్రావియు నమరసంఘంబు
సమసుప్తిఁ బొందెడు జగ మెల్ల నెఱుఁగ ;
బసవయ్యఁ జూడుఁ డా విసము ద్రావియును
నసమానలీల దివ్యాంగుఁడై నిలిచె ;"
ననుచు లోకము లెల్ల నచ్చెరువంది
వినుతింప బోయలు విభ్రాంతిఁ బొంది
సంతాపచిత్తులై సంస్తుతింపుచును
నంతంత సాష్టాంగులై ప్రణమిల్లి
"యభయమే బసవయ్య ! యతికృపాంభోధి !
యభయమే బసవయ్య యద్భుతచరిత !
యిమ్మెయి పరివారమే బసవయ్య !
తమ్ముఁ బఱుప మీకుఁ దలఁప శౌర్యంబె ?
పోల దుర్జనితోడి పొందునకంటె
జాల మేలండ్రు సజ్జనవిరోధంబు ;
కావున మము నెట్లుఁ గాచి రక్షింపు !
మావికలతఁ ద్రోచి దీవనఁ బొందు !
దేవ ! దెసయు దిక్కు నీవ మా" కనుచు !

వేవిధంబుల నిట్లు విన్నవించుడును
జూచె దయాదృష్టిఁ, గాచె విడ్వడఁగఁ,
ద్రోచె వాదములెల్ల, నేచెఁ బ్రఖ్యాతి,
మాపె బోయల పెంపుఁ జూపెఁ బ్రసాద
మోపి లే దనినూకెఁ, బాపె బోయలను;
నిలిచెఁ జలింపక, తలఁచెఁ బ్రస్తవము,
గెలిచె, సద్భక్తిమైఁ బొలిచె, బీరమునఁ
బేర్చె, భక్తావలిఁ గూర్చె, నాద్యోక్తిఁ
దీర్చె, సన్మార్గంబు నోర్చెఁ దర్కమునఁ
బండించె నిశ్చలభక్తి లోకముల
నిండించె బసవయ్య నిర్మలకీర్తి.

—: జగదేవ దండనాయకుని కథ :—

వెండియు జగదేవ దండనాయకుఁడు
నిండారుసద్భక్తి నిధి కర్మయోగి
యభిమతలీలమై విభవంబు మెఱసి
శుభకార్య మాచరించుచు నొక్కనాఁడు
నేతెంచి "వీరమాహేశ్వర తిలక!
ప్రీతియెలర్ప విభూతిఁ గైకొనుము;
అసలార మా యింట నారగించినను
బసవనమంత్రి! యే బ్రదుకుదు" ననిన
నగుమొగం బలరార జగదేవమంత్రి
నాగిఁ జూచి బసవయ్య "యొండేమి చెప్ప
సర్వజ్ఞునెట్టణ శరణులరాక
కోర్వఁగ నెమ్మెయి నోపుదే" యనిన
నవుగాక యనుచు రయంబున నేఁగి
వివిధపక్వాన్నాది వితతులు గూర్చి
సరసర బసవయ్య ననుదేకమున్న
గర మభిషేకంబుఁ గావింత మనుచు
జానగుప ట్లల్కి సద్భక్తియుక్తిఁ

గానక బాఁపలకాళ్ళు గడుగుటయుఁ
బరిచారకునిచేత బసవయ్య యెఱిఁగి
యరుగుట సాలించి యాగ్రహింపంగ
జగదేవుఁ డంతలోఁ జనుఁదేరఁ గాంచి
భుగభుగకోపాగ్ని యెగయ ముందటను
దెరచీర వట్టించి "చోర నెట్లువచ్చు
నరుగుము ; భక్తజనాళిలో వెడలి
కులదైవ మిలువేల్పు మలహరుఁ డుండఁ
బలుద్రోవలనుబోవఁ బాడియే నీకుఁ ?
గలకంఠు శుద్ధనిష్కలభక్తియుక్తి
జలభుల కదియేల సమకూడుఁ జెపుమ ;
ముల్లోకనాథుని ముట్టఁ గొల్చియును
గల్లరిలోకుల షణియింపఁ దగునె ?
హరునకు మజ్జనం బార్చుచేతులను
సరవి విప్రులకాళ్ల సరి గడ్గఁ దగునె ?
శివపాదజలములు శిరమునఁ దాల్చి
భవులకాళ్లలనీళ్ల వైనల్కఁదగునె ?
శ్రీమహాదేవుఁ బూజించుచేతులను
నామాలకుక్కల నర్చింపఁ దగునె ?
మురహరార్చితునకు మున్నెత్తుకేలు
ధర నెత్తఁ గూడునే త్రాటిమాలలకు ?
సదమలలింగప్రసాదజీవికిని
విదిత మీశ్వరభక్తి విముఖులైనట్టి
కర్మచండాలురఁ గలసి కుడ్చుటయుఁ
గర్మంబు గుడుచుట గాదె ? యెట్టనిన :
నదియును దివ్యాగమార్థంబులందు
మదనారిసద్భక్త మందిరంబులను
మెలఁగుపుత్రకళత్ర మిత్రగోత్రాది
బలఁగంబు లింగాన్వితులు గాకయున్న

నొండేమి యిలఁ గూడియున్న యంతటను
చండాలమిశ్రదోషంబు వాటిల్లు ;
"దర్శనా దపి పాపదా" యనుఁ గాన
దర్శనాలాప సంస్పర్శన శయన
సంపర్కభోజనాసన దానములకు
నింపారునే భక్తుఁ డితరులయెడను ?*
'వేదజ్ఞు లగు కోటివిప్రుల కన్న
మాదటఁ బెట్టిన యట్టిఫలంబు
త్ర్యక్షభక్తున కొక్క భిక్షంబువెట్టు
నక్షయఫలమున కసమాన మనుట
వ్యక్తమై యుండఁ గుయుక్తుల నడవ
భక్తియుఁ జెడు : దానఫలము నిష్ఫలము'
అని పెక్కుభంగుల నాన తిచ్చుడును
విని శోకజలసమన్వితనేత్రుఁ డగుచు
జగదేవుఁ డాభక్తజననికాయంబు
మొగిఁ బ్రస్తుతింపుచు మోడ్పుఁగే లమరఁ
"గర్మబద్ధుఁడ నైతిఁ గష్టుఁడ: ఖలుఁడ:
దుర్మదోపేతుఁడ, దుష్కృతాలయుఁడఁ,
బ్రజ్ఞావిహీనుఁడ, బరమపాతకుఁడ,
నజ్ఞాని, నధిక సర్వాపరాధుండ,
శంకమాలిన యనాచారుండ ; దీని
కింకఁ బ్రాయశ్చిత్త మేమియు లేదు ;
పాన లేటికి విడ్తుఁ బ్రాణంబు గెలన
మానతి యిండు నా" కని మ్రొక్కి నిలువఁ
గనుఁగొని బసవయ్య ఘనభక్తవితతి
యనుమతంబునఁ గూడ నతని కిట్లనియె:
"గొంకక విను : మఱికొన్ని దినముల
కింక శివద్రోహ మిట పుట్టఁగలదు :
మడియింపు ద్రోహిని మా కెక్కఁ గెలన

మడరఁ బ్రసన్నుఁ డయ్యెడి శివుఁడప్డు ;
ఈ నిర్ణయమునకు నీశానగణ వి
తాన మెంతయు మెచ్చి తత్ప్రస్తవంబు
నిమ్మలఁ గరుణించి యిచ్చిరి నీకు ;
నమ్ము ముమ్మాటికి ; లెమ్ము ! లె !" మ్మనుడు
నంగద మోడ్పుఁగే లలికంబుఁజేర్చి
పొంగుచు వీరతాంబూలంబు గొనుడు
జగదేవశరణుని నగరికి బసవఁ
డగణిత భక్తసహాయుఁ డై యరిగె ;
నసలార సుచితిక్రియాదులఁ దనిసి
బసవన్న యసమసద్భక్తులుఁ దాను
ననయంబు భక్తిసుధామృతాపార
వనధి నిమగ్నుఁడై వర్తింపుచుండె.

—: అల్లయ్య మధుపయ్యల కథ :—

మఱియంత నల్లయ్య మధుపయ్య యనఁగఁ
గఱకంఠుభక్తు లకర్మసంచయులు
లింగైకనిష్ఠావిలీనమానసులు
జంగమారాధనాసక్తచేతసులు
పరమశివాచారపరవర్త్మనిరతు
లురుతరకీర్తి నియుక్తులు నాఁగ
నసమానలీలఁ గళ్యాణంబునందు
బసవఁడు తారు నప్పాట వర్తింప
నంత బిజ్జలుఁడు దాఁ గొంతకాలమున
కంతకుబ్రోలికి నరుగంగఁ దలఁచి
బసవని బహిమయు భక్తిమహత్త్వ
మెసకంబు నెఱిఁగియు నెఱుఁగని యట్లు
పొదలిన యజ్ఞానబోధగాఁ జేసి
మదియించి మల్లయ్య మధుపయ్యగారి
తప్పేమియును లేక చొప్పుగా దనక
రప్పించి కన్నులు పుప్పించె నంత ;

'కాలకాలునిభక్తగణములమహిమ
లేల తా మున్నను నెఱుఁగును గాదె!
యక్కట! చెడఁజూచె నవనీశుఁ డింక
నిక్కటకంబున కెక్కడిబ్రదుకు?
మృడుభక్తు లలిగినఁ జెడఁడె తా' ననుచు
జడిగొని నరులెల్ల బుడిబుళ్ళువోవ
బసవఁడు మొదలుగా నసమాక్షుభక్తు
లసమకోపోద్దీపితాంగులై పొంగి
మసలక మల్లయ్య మధువయ్యగారి
కసలారఁగా గన్ను లప్పుడ పడసి
'యింక నుండఁగఁగూడ దీయూర' ననుచు
శంకరభక్తులు జగదేవమంత్రిఁ
'బనిచిన తొల్లింటి బాస గైకొనుము
తనుము శివద్రోహి' ననుచు బిజ్జలుని
నొసలిరేఖలు గసిబిసిచేసి రాజ్య
మసమాక్షకవిలియ నటు దుడిపించి
బల్లహుకటకంబు వదటిపా ల్సేసి
యెల్లవారును జూడ నీక్షణంబునను
'బాడగుఁ గటకంబు వాడగుఁ గూడఁ
బాడగు' ననుచు శాపంబు లిచ్చుచును
రాచినమడివాలుమాచయ్యగారు
నాచౌడరాయఁ డేకాంతరామయ్య
కిన్నరబ్రహ్మయ్య గేశిరాజయ్య
కన్నదబ్రహ్మయ్య గక్కయ్యగారు
మాదిరాజయ్యయు మసణయ్యగారు
నాదిగా నప్పురి యఖిలభక్తులును
దండిజంగమకోటి దనతోడ నడవ
బండారిబసవనదండనాయకుఁడు
నెసఁగఁ గప్పటిసంగమేశ్వరంబు నకు

వెస నేఁగె బిజ్జలునెసకంబు దలఁగఁ
గటకటా ! కఱకంఠు గణములువోవ
గటకంబుభాగ్యంబు గ్రక్కునఁ దొలఁగె ;
భూకంప మయ్యెను; భువి నర్ధరాత్రిఁ
గాకు లఱచె ; వంటకంబులు వ్రిచ్చె ;
ధరఁ బడె నుల్క ; లత్తఱి ఱాల వాన
గురిసె; భాస్కరచంద్రపరివేష మయ్యె :
దివి దీటుకట్టె ; వేసవి మూఁగె మంచు ;
గవిసెను మధ్యాహ్నకాలంబు నందుఁ
గడు నుగ్రరూపుఁ డై కాలుఁడు గానఁ
బడియెను బట్టణ ప్రాంతదేశమునఁ ;
బొరిఁబొరి గవిసెఁ[1] గావిరి యెల్లయెడల ;
ధరణీశ్వరుఁడు గాంచెఁ దలలేని నీడ ;
రవి యుదయించు తత్ప్రిస్తవంబునను
దివిఁ బ్రతిసూర్యులు దీపించి ; రింక
నెంత గానున్నదో యిటమీఁద ననుచు
సంతాపచిత్తులై జనులు భీతిల్ల
నిక్కడ జగదేవుఁ డింటి కేతేరఁ
జక్కన నామయ్య జనని వీక్షించి
"శివగణద్రోహంబుఁ సెవిఁ బడ్డయపుడు
యవిచారమున వారి హరియింపవలయుఁ ;
జాలరేఁ దారేని సమయంగవలయుఁ ;
గాలకాలుని భక్తగణమార్గ మిధియుఁ
సమయింపఁ జాలక చండి యై తాను
సమయనిప్రాణవంచక కుటిలునకుఁ
గుపితున కజ్ఞున కపజీవితునకు
విపరీతచరితుండు విషమలోచనుఁడు
మెచ్చునే ? వానికి మిక్కిలి భక్తి

1. నల్లనిచాయ.

యిచ్చునే కూర్చునే యిన్నియు నేల ?
క్రీతము నీప్రాణ పరిత్యాగమునకు
మతిమెచ్చి యవసరోచిత మిచ్చి నిన్నుఁ
బంచి యేఁగిరి కాక భక్తు లాద్రోహిఁ
ద్రుంచుట కోడియే తొలఁగిరె చెపుమ !
యందొక్కఁ డలిగిన నవికలాజాండ
సందోహములు గాలి డిందకయున్నె ?
దక్షుఁడు క్రొవ్వి యదక్షుఁ డై తొల్లి
దక్షమఖక్షయదక్షుఁ బల్కుటయు
వినఁగఁజాలక తాన తనకోపవహ్ని
గనలుట వినవె ? యాగౌరి దక్షణము ;
యదిగాక యుపమన్యుఁ డభవునినింద
మది విన కపుడ భస్మం బయ్యెఁ గాదె ?
కావున శివభక్తగణనింద వినియు
నీ వూరకుండుట నీతియే ? వానిఁ
జంపకే కుడువఁగఁ జనుదెంచి తిపుడు
పంపుడుకళ్ళు నీ కింపారు నెట్లు ?
ఛీ ! కుక్క ! చేఁజేత శివప్రసాదంబు
చేకొని కుడువఁగ సిగ్గెట్టు లేదు ?
వచ్చి కదుక్కుదుగాక శ్వానంబునట్లు
నుచ్చుచ్చురే"యని యొగిఁ జిట్ట మిడిచి
వెడలి వాకిటిదెస మృడుప్రసాదంబు
కుడుకతోఁ గొనివచ్చి పుడమిఁబోయుడును
'దగ వగు' ననుచును దాఁ గుక్కభాతి
జగదేవుఁ డిట్లు ప్రసాదంబు గుడువ
మల్లబ్రహ్మయ లన మహి వీరభక్తి
కెల్ల యై వర్తిల్లు నెడ నర్ధరాత్రి
నీవార్త విని జగదేవునికడకు
వేవేగఁ జనుదెంచి వెండి వొత్తునను

దారును నా ప్రసాదం బారగించి
యారాత్రి కొల్వున కరిగి, బిజ్జలుని
నల్లంతఁ బొడగని, యలుఁగులు వెఱికి
జల్లున నలిగి యాసభ దల్లడిల్ల
నొక్కట ముప్వురు నుద్వృత్తి నెగసి
చక్కడిచ్చి, పొడిచ్చి, జర్జరితంబు సేసి,
యలుకమై గెడిగెడి యనుచు బిజ్జలుని
తల గోసి పొట్టలోపలఁ బెట్టి కట్టి,
'తా నసంఖ్యాతుల యానతి యదియు
నీనరాధముఁ బొలియించితి మేము ;
అధికులౌ భక్తుల కహితంబు సేయు
నధము లందఱును నివ్విధిఁ బోదు' రనుచుఁ
గాయముల్ బిగియుచు గతులు ద్రొక్కుచును
తాయము ల్గొనుచు దండల నటింపుచును
బొంగి బొబ్బిడుచుఁ జెలంగి యార్చుచును
లింగభక్తుల కెదుర్లేరు వొం డనుచు
బిండుగాఁ బొరులు 'బిజ్జలునితల
గుండుగండా' ! యని ఘూర్ణిల్లుచుండ
మగిడి యామల్ల బ్రహ్మయగారుఁ దాను
నగరు వెల్వడి తన నగరికి వచ్చి
తల్లికి నందంద ధరఁ జాఁగి మ్రొక్కి
సల్లలితాంగి ప్రసాదంబు వడసి
'పరమపాతకు నట్టి భక్తినిగ్రహునిఁ
బొరిగొన్నయంతన పోవ దాద్రోహి
నప్పుడే చంపక యరుదెంచినట్టి
తప్పున కింకొండు దండ మున్నదియు'
ననుచు నజ్జగదేవుఁ డంతలోపలను
దనశిరంబున కల్గికొని విమానములఁ
బుత్త్రమిత్త్రకళత్త్ర గోత్రాదులను వి

చిత్రంబుగా నప్ట శివలోకమునకుఁ
గొనిపోయెఁ ; గటకంబుజనులెల్ల బెదరి
కనుకనిఁ బఱవంగఁ గ్రందు పుట్టుటయుఁ
గన్నభక్తులు వార్తవిన్నభక్తులును
నున్నభక్తులుఁ బోయి రొక్కొక్క యెడకు ;
నంత రాజ్యార్థమై యనిచేసి యతని
సంతాన మెల్ల నిస్సంతాన మయ్యె ;
వీఁకఁ గొట్టములలో వెలిఁగె గుజ్జములు
తోఁకల నిప్పులు దొరుగ నాక్షణమ ;
కరులును గరులును గన్నంత నెదిరి
పొరిఁబొరిఁ దాఁకి జర్జరితమై పడియె ;
భ్రమసి యమాత్యాది భటవర్గ మెల్లఁ
దమలోనఁ జచ్చిరి సమరంబు సేసి ;
బసవని సత్యశాపమునఁగాఁజేసి
పసచెడి కటకంబు వాడయ్యె నంత ;
వినియె సంతయు నట సనియెఁ గూడలికిఁ
గనియె సద్గురువు సగయదేవు నచట ;
భక్తులుఁ దానును బరమానురాగ
యుక్తి నబ్బసవయ్య యుండె సంప్రీతి ;
నంత నాగురువు సమంచితనాద
సంతతపూజాది సత్క్రియావలుల
ముంచి భజించి కీర్తించి మెప్పించి
మించి విన్నప మాచరించి ప్రార్థించి,
"దేవ ! సద్గురుమూర్తి ! దివ్యలింగాంగ !
దేవ నాసంగయ్య ! దేవ ప్రాణేశ !
నీదుసద్భక్తప్రసాదంబుఁ గుడిచి
యాదట బ్రదికి యింతైతిఁ గావునను
భవభవంబుల వారి పన్నఁగాఁ దగుదు
భువివారి ఋణమునఁ బోవుట గలదు ;

అంతియకాని ని న్నడిగినచోటు
నెంతైన నేమైన నిచ్చినచోటు
గలతప్పు సైరించి కాచినచోటు
గలదేని చెప్పుమా ! కానమీయందుఁ
బుట్టిన మొదలును బోఁకయుఁ బొరయ
వట్టికొల్వున నిన్ను ముట్టఁగొల్చితిని ;
వెట్టిచేసిన నీకు వెయ్యేఁడులైన
నెట్టును మేలకా కెగ్గేమి తలఁప ?
నూరకి ట్లనుచుట యుచితమే నీకు ?
నారంగఁ బ్రమథులయాన నీయాన
వృషభవాహన ! విన్నవించుట వినక
వృషభంబు ని కెట్లు విడువంగ వచ్చు ?
నొల్ల నొండేమియు నోటంబు గాదు ;
వల్లభ ! యడుగను వర మిఁక నిన్నుఁ ;
బరమపరానంద పరవశీభూత !
నిరవధితత్త్వ విస్ఫురణ పెంపునను
గతిమనోవాక్కాయ కర్మచైతన్య
రతులు నీయంద విశ్రాంతంబు నొందఁ
జేయుము; నీయాజ్ఞఁ జేసి యేతెంచి
చేయంగఁ గలపను ల్సేసితి నింక."
ననుడు దయామతి నగ్గురుమూర్తి
తనతొంటి భావంబు దాల్చి యాక్షణమ
సంగయదేవుఁడు సదనాంతరంబు
భంగిగా వెడలుడు బసవయ్య సూచి
సన్నుత తద్గురు చరణాబ్జయుగము
నెన్నుదు రిఱియంగ సన్నుతి మ్రొక్కి
యానందబాష్ప సమంచితవార్ధి
తా నిట్టవొడువ గద్గదకంఠ మమర
ముత్పులకలు మేన మొగి నిండ హర్ష

తత్పరుఁ డై యున్నఁ వనయు లే నెత్తి
చక్కన తనదు ప్రసాదంబు వెట్టి
యక్కున నందంద యప్పళించుచును
గొడుకు లోపలఁ జేర్చికొని గురుమూర్తి
గుడి సొచ్చె ; నిరువురపొడ గానరాదు ;
పసగొని సకలభక్తసమూహి సూడ
బసవయ్య గురువుగర్భంబు సొచ్చుటకు
సంగయదేవుండు సద్గురుభాతి
భంగిగా నేతెంచి బసవయ్య నిట్టు
తనయందు సంధించికొనుటకు సంత
ఘనతరలీల జంగమకోటి యబర
నరుదగు లింగతూర్యంబులు మ్రోయ
ధరఁ బుష్పవృష్టి దాఁ బరిగొని కురియఁ
గో యని భక్తనికాయ మెల్లెడల
గేయని బలుమాఱుఁ గీర్తనసేయ
జయజయారవములు సందడింపంగఁ
గ్రియఁగొని వినుకులుఁ గేళిక ల్దనర
మాదిరాజయ్యయు మాచిదేవుండు
నాదిగాఁ గలభక్తు లనురాగలీలఁ
'గలవె యుత్పత్తిస్థితిలయప్రపంచ
ములు బసవయ్యకుఁ దలఁచిచూడంగ ;
గాలిలోపల సురగాలినాఁ బుట్టి
గాలిలోనన వెండి గలసినయట్లు,
శరనిధిఁ గడలునా జనియించి వెండి
శరనిధిలోనన సమసిన యట్లు,
ఉడువీథియందు విద్యుల్లత వుట్టి
యుడువీథియందుఁ దానడఁగినయట్లు,
జలములయందు వర్షాఫలం బమరి
జలములలోనన సమసినయట్లు,

సద్గురుకారుణ్య సంగతిఁ బుట్టి
సద్గురుకారుణ్య సంపదఁ దనరి
సద్గురుగర్భవిశ్రాంతిమై నిపుడు
తద్గతుఁడై లింగతత్త్వంబుఁ బొందె ;
నట్టిదకాదె గుర్వంఘ్రియుగంబు
ముట్టఁగఁ గొల్చినయట్టి భక్తాళి
హృదయాంబుజంబుల నీబసవయ్య
కదలక పువ్వును గంపునుబోలె
నలి నున్నవాఁడుగా కిలవేరు గలదె ?
మలహరుభక్తులఁ గలకాల మెల్ల
భక్తహితార్థమై ప్రభవించెఁగాక
వ్యక్తిగా నతఁ డీశ్వరాంశంబ కాఁడె' ?
యని నుతింపుచుఁ దొంటియట్ల సద్భక్తి
జనితసుఖామృత వనధిమధ్యమున
నోలలాడుచు నుండి ; రురుతరానంద
లీనమై నటు గొంతగాల మింపారఁ
బ్రస్తుతింపంగ సద్భక్తి విస్ఫురణఁ
బ్రస్తుతి కెక్కిన బసవని చరితఁ
జెప్పితి భక్తులచే విన్నమాడ్కిఁ
దప్పకుండఁగను యథాశక్తిఁ జేసి ;
యిమ్మహి నీశున కెఱుఁగంగ రాని
యమ్మహాబసవని యద్భుతచరిత
వర్ణింప నెంతటివాఁడ ? నట్లయ్యు
వర్ణనచేసితి వారిన కాని
యేయెడ నన్యథా యెఱుఁగ నే ననెడి
యీ యొక్కబలిమి మహిష్ఠతకలిమి ;
నదియునుగాక మహాభక్తవరుల
సదమలదివ్యప్రశంసగాఁజేసి
భావించి నాదు వాక్పావనార్థంబు

గావింప మేటి యీ కథ రచించితిని.
బసవపురాణంబుఁ బాటించి వినిన
నసలారుఁబో ప్రసాదానందసిద్ధి ;
బసవపురాణంబుఁ బాటించి వినిన
వసియించు సద్భక్తి వాసనమహిమ ;
బసవపురాణంబుఁ బాటించి వినినఁ
బసిగమైఁ బ్రాపించు భక్తులకరుణ ;
బసవపురాణంబుఁ బాటించి వినినఁ
బసరించు లింగానుభవ నిత్యసుఖము ;
బసవపురాణంబు బాటించి వినిన
నెసకంబుతోఁ గల్గు నీప్సితార్థములు ;
బసవపురాణంబు భక్తి వ్రాయించి
వసదిగాఁ జదివెడువారల కెల్ల
దురితము లాపదల్ ద్రోహంబులెల్ల
హరియించు నెంతయు హరుకృపఁజేసి ;
యీ పురాణం బెవ్వరేఁ దమయింట
నేపార నిడికొన్న నిహపరసిద్ధి.
శరణోపకార బసవపురాణార్థ
విరచిత త్రిభువన విఖ్యాత చరిత !
శరణోపకార బసవపురాణార్థ
వరభుక్తిముక్తి సంవర్ధనభరిత !
శరణోపకార బసవపురాణార్థ
సరససమంచిత సత్యవాగ్జాల !
గొబ్బూరి మాదన్న కూరిమి శిష్య !
గొబ్బూరిసంగ ! సద్గుణ సముత్తుంగ !
ఇది యసంఖ్యాత మహేశ్వర దివ్య
పదపద్మసౌరభభ్రమరాయమాణ
జంగమలింగ ప్రసాదోపభోగ
సంగతసుఖసుధాశరధినిమగ్న

సుకృతాత్మ పాలుకురికి సోమనాథ
సుకవిప్రణీతమై శోభిల్లి తనరి
చరలింగ ఘనకరస్థలి విశ్వనాథ
వరకృపాంచిత కవిత్వస్ఫూర్తిఁ బేర్చి
చను బసవపురాణ మనుకథయందు
ననుపమంబుగ సప్తమాశ్వాస మయ్యె.